

'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ
జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 258

సోమవారం 9-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL







''పండుటాకులము మిగిలితిమి.. ఇంకెన్ని పండుగలు చూడనుంటిమి'' అని భర్త పదవీ విరమణ రోజు భార్య పాడుతున్నట్టుగా ఓ సినీ గీతిక సాగుతుంది. పాటలోని భావమూ మనకు భారంగా అనిపిస్తుంది, కానీ ప్రస్తుత ప్రపంచ ధోరణికి ఆ వాక్యాలు సరిపోవని అనిపిస్తుంది. వృద్ధులు పండుటాకులు కాదు. అనుభవంతో మన ముందు నిలిచే నిండైన అమృత భాండాలు.

మంచిమాట

మలి సంధ్యా... మరో వసంతమే!

ప్రతి మనిషి జీవిత దశని రెండు ప్రధాన అంగాలుగా విభజించుకోవచ్చు. మొదటిది ఉద్యోగబాధ్యతలు నిర్వర్తిస్తూ భార్యాబిడ్డలతో కాలాన్ని గడపడం. రెండోది.. బాధ్యతలను పూర్తిచేసి, ఉద్యోగవిరమణ తర్వాత లేదా ఆరు పదులు నిండాక గడిపే కాలం. వీటిలో మొదటి దశకే ప్రాధాన్యం ఉందని, రెండో దశ పనికిరానిదని భావించడం ఏమాత్రం సమంజసం కాదు.

ప్రతి జీవన దశలోనూ మనిషికి ప్రత్యేకమైన విషయాలపై శ్రద్ధ కనబరచవలసి ఉంటుంది. అదే విధంగా వృద్ధాప్యంలోనూ కొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరిస్తే, మలిసంజెలో వెల్లివిరిసే కాంతులు వారికి మనోహరంగానే అగుపిస్తాయి.

యవ్వనంలో పటుత్వం, బిగువు జీవులకు సహజ గుణం. వయసు పెరుగుతున్న కొద్దీ బిగువు సడలుతూ ఉంటుంది. అది శరీరానికుండే సహజ లక్షణం. గడచిపోయిన కాలం ఒక అనుభవాల సుమహారంలా పరిమళిస్తూ ఉంటుంది. ఎంతో విలువైన అనుభవాలు, అవి నేర్పిన పాఠాలను యువతరానికి నేర్పడాన్ని మించిన ఆనందం ఏముంటుంది? ప్రతి అనుభవం ఎంతో విలువైనది. ఎన్నో కష్టాలను, దుఃఖాలను దాటుకుని తెచ్చుకున్న విజయాలను పంచుకుని భావితరాలను తీర్చిదిద్దగలిగింది విశ్రాంత జీవనం గడిపే మలి సంజలో కాలం గడిపే అనుభవ సంపన్నులే. వారి అనుభవాల చేవను ఏ వ్యక్తిత్వ వికాస గ్రంథాలూ అందించలేవు. అనుభవైక వేద్యమైన వారి జీవనగమనాన్ని కొడుకులతో, మనవళ్లతో పంచుకుంటూ గడపడం ఆహ్లాదకరమైన విషయం.

> వృద్ధాప్యం శాపం కాదు... ఆస్వాదిస్తే అణువణువూ ఆనందమే! ప్రతి జీవీ తమ జీవితంలో వృద్ధాప్యాన్ని ఎదుర్కొనక తప్పదు. అయితే ఈ వృద్ధాప్యాన్ని శాపంగా కాకుండా వరంగా భావించి ఆస్వాదిస్తే వృద్ధాప్యంలో కూడా హాయిగా సమయాన్ని అనుభవించవచ్చు. వృద్ధాప్యాన్ని బాధామయమని భావించకుండా, మన కోసం మనం జీవించే అద్భుత అవకాశంగా భావించిన నాడు వృద్ధాప్యం ఏమాత్రం బాధించదు. పెద్దవయసులో గుర్తుపెట్టుకోవలసింది మన వయసును కాదు.. గడిపే ప్రతి క్షణం తీసుకువచ్చే ఆనందాన్ని మాత్రమే..!! యవ్వనం కొంగ్రొత్త భోగాల సారం.. వృద్ధాప్యం అనుభవాల మణిహారం..!!

దేశంలోని, ప్రపంచంలోని రకరకాల ప్రదేశాలు చూసే అవకాశం కేవలం విశ్రాంత జీవనంలోనే ఎవరికైనా సాధ్యమవుతుంది. ఉద్యోగంలో లేదా వేరే వ్యాపకంలో ఉండే పని ఒత్తిడివల్ల కొత్త ప్రదేశాలు చూసే సౌలభ్యం తక్కువగానే ఉంటుంది. ఆ విధంగా కొత్త కొత్తవిహారాల్లో సందర్శించే ప్రదేశాలు, అక్కడి వారి ఆహారపు అలవాట్లు, ప్రత్యేకమైన అభిరుచులు తిలకించి ఆనందం పొందడం ద్వారా వృద్ధుల మనసు మరింతగా ఉత్తేజితమవుతుంది. మరింతగా వాళ్ళను చిన్నవాళ్ళను చేసి ఆనంద సంభరితుల్ని చేస్తుందనడం అతిశయోక్తి కాదు.

వయసు అనేది కేవలం ఒక అంకె మాత్రమే. మదిలో మెదిలే భావాలకు అనుగుణంగా మన జీవన నావ సాగుతూ ఉంటుంది. నేను ఎన్నటికీ నవ యువకుడినే అన్న భావం మదిలో నింపుకుంటే ఆనందం సముద్ర తరంగాల్లా ఉరకలు వేస్తూనే ఉంటుంది. మనం సాధించిన విజయాలూ మన జ్ఞాపకాల పందిరిలోంచి పరిమళించే మల్లికల్లా తొంగి చూస్తూ ఉత్సాహానికి ఊపిరులూదుతూనే ఉంటాయి.

వ్యాఖ్యాన విశారద వెంకట్ గరికపాటి

ఆత్మదర్శిని

అహం బ్రహ్మాస్మి




దైవం ఒక నమ్మకం కాదు. సత్యమే, దైవం. నమ్మకాలన్నీ మనస్సుకు సంబంధించినవి. మనస్సు సత్యం కానే కాదు. నమ్మకాలేవీ నిజాలు కావు. నమ్మకాలకు, విషయజ్ఞానానికి అతీతమైనదే సత్యం. దైవాన్ని అనుభవపూర్వకంగా మాత్రమే తెలుసుకోగలవు. సత్యాన్ని నీలోపల అన్వేషించాలి. భౌతికమైన ఆచారాలు, క్రతువులు ఏవీ కూడా నీకు దైవాన్ని తెలియజేయలేవు. అహం అనే అడ్డును తొలగించుకోనంత వరకు దైవాన్ని తెలుసుకోలేవు. నిన్ను దైవం నుండి వేరు చేసేది అహమే. అహం అనే భ్రమ వీడితే మిగిలేది దైవమే... దివ్యచైతన్యమే... అదే అసలైన నీవు... అదే నీ సహజస్థితి.. అదే దైవం. ప్రతిక్షణం చైతన్యంతో ఉండాలి. ఏపని చేస్తున్నా దానితో కలిసిపోకుండా ఒక సాక్షీ చైతన్యంగా ఉండాలి. చేసేవాడివి నీవు కాదు. అనుభవించేవాడివి కూడా నీవు కాదు. వీటిని చూస్తున్న ద్రష్టవే నీవు. అదే ఆత్మ, అదే దైవం, ఆ అద్వైతస్థితే దైవం. మనస్సు 'నేను' కాదు. మనస్సు వెనుక దాన్ని సాక్షిగా చూస్తున్న చైతన్యమే 'నేను'. ఈ 'నేను' కి పుట్టుక లేదు చావు కూడా లేదు ద్వంద్వాలకు అతీతం. దాన్ని ఏదీ కలుషితం చేయలేదు. ఆ ఆత్మస్థితే నీ సహజస్థితి. విషయాలకు అంటని ఆ సాక్షివి కావాలి. అప్పుడే భ్రమలతో పుట్టిన 'నేను' అంతమై అసలైన 'నేను' (ఆత్మ) ప్రజ్వలిస్తుంది. ఆలోచనలన్నీ అంతమై ఆత్మ ప్రకాశిస్తుంది. ఏమి జరుగుతున్నా సరే నీవు ఈ ఆత్మస్థితిలోనే ఉండాలి. నడుస్తున్నా, మాట్లాడుతున్నా, తింటున్నా, వింటున్నా, నిద్రపోతున్నా... నీవు సాక్షిగా ఉండిపోవాలి. మనం ఇప్పుడు అనుకుంటున్నది మెలకువ కానే కాదు. కళ్ళు తెరిచినా నిద్రలోనే ఉంటున్నాం. మన నిజతత్వం పట్ల ఎరుక లేకుండా శరీరమే నేను, మనస్సే నేను అనే భ్రమలో ఉంటూ ఉన్నాం. నేను సాక్షీచైతన్యాన్ని అనే సత్యాన్ని తెలుసుకోలేకుండా ఉన్నాం. అది తెలిసిన క్షణం ఆలోచనలు ఆగిపోతాయి. నీ నిజతత్వాన్ని ప్రతిబింబిస్తావు, నీవే ఆత్మగా ఉండిపోతావు. ఆ స్థితిలో సత్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోవటం జరుగుతుంది. నమ్మవలసిన అవసరమే లేదు. నీవే సత్యం, నీవే దైవం. సత్యం అంటే ఆలోచనలు, నమ్మకాలు, సూత్రాలు, వర్ణనలు, విషయజ్ఞానం మొదలైనవేవీ కావు. సత్యం నీలోనే ఉంది. నీ నిజతత్వమే సత్యం. దైవం గురించిన వర్ణనలు, సిద్ధాంతాలు, పుస్తక జ్ఞానం మొదలైనవేవీ దైవాన్ని అనుభవంలోకి వచ్చేలా చేయలేవు. పైగా ఇంకా అడ్డుపడతాయి. అహాన్ని పెంచుతాయి. మనస్సును బలపరుస్తాయి. ఈ మనస్సు ఖాళీ ఐనపుడే సత్యం అనుభవమౌతుంది. ఈ సమాజమంతా మనస్సుతో నిర్మితమైంది. నీవు చూడాలనుకున్నదే కనబడుతుంది. మనస్సు భ్రమలతోనే నిర్మితం. దైవాన్ని కూడా వివిధ రూపాల్లో ఊహించుకుంటుంది. అసలు మనస్సు, పదార్థం అనేవి కూడా లేవు. స్వచ్ఛమైన చైతన్యమే నీవు. అదే సత్యం... అదే దైవం.



– స్వామి మైత్రేయ

తాత్వికథ

అవసరం



ఆయన ఓ తాత్విక గురువు. జ్ఞాని. ఆయన మానవ అవసరాలకు సంబంధించి, తత్వాల గురించి ఎన్నో అమూల్యమైన విషయాలను తన ప్రసంగాల ద్వారా చెప్పిన వ్యక్తి.

ఓసారి ధనవంతుడొకడు ఆయనను చూడ్డానికి వచ్చాడు.

ఆ గురువుకు దణ్ణంపెట్టి చేతిలో ఉన్న ఓ సంచి ఆయనకు ఇచ్చాడు.

గురువు ఆ సంచీని తీసుకుని దానివంక నవ్వుతూ చూశారు.

''ఏమిటిది'' అని అడిగారు గురువు.

''మీ ఆశ్రమానికి నా వల్ల చేతనైన విరాళం ఇవ్వాలనిపించింది'' అని అన్నాడు ధనవంతుడు.

''ఇందులో ఏముంది'' అన్నారు గురువు.

''వెయ్యి బంగారు నాణాలు స్వామీ!'' చెప్పాడు ధనవంతుడు.

'సంతోషం' అంటూనే ధనవంతుడి వంక చూసి''మీ దగ్గర ఇంతకన్నా ఎక్కువ బంగారు నాణాలు ఉండే ఉంటాయి కదూ...'' అని అడిగారు గురువు.

''అవునండీ ఉన్నాయి'' అన్నాడు ధనవంతుడు.

''అవన్నీ మీకు చాలినంతగానే ఉన్నాయా'' అని గురువు ప్రశ్నించారు.

ధనవంతుడు ఆలోచనలో పడ్డాడు.

కాస్సేపు తర్వాత ధనవంతుడు ''లేదు స్వామీ, ఇంకా కూడా కావలసి వస్తోంది. అందుకే కదండీ రాత్రీ పగలూ అని చూసుకోకుండా శ్రమిస్తున్నానండీ'' అన్నాడు ధనవంతుడు.

గురువు ఆ మాటలు విని తన చేతిలో ఉన్న డబ్బు సంచీని తిరిగి ధనవంతుడికే ఇచ్చేశారు.

''ఈ నాణాల అవసరం నాకన్నా మీకే ఎక్కువగా ఉంది... ఇదిగో ఈ సంచీ మీ దగ్గరే ఉంచుకోండి'' అన్నారు గురువు.

మనిషికి డబ్బు అవసరమే. అది తీరని ఆశ. ఎంతున్నా చాలదు అనుకునే మనస్తత్వం ఉన్న వాళ్ళకు ఎవరికైనా డబ్బు ఇవ్వాల్సి వచ్చినా వారిలో ఇస్తున్నప్పుడు ఆనందముండదు. లోలోపల ఏదో తరిగిపోతున్నట్టే అనిపిస్తుంది. కనుక ఉన్న దానితో తృప్తి పడే మనసున్నప్పుడే ఎవరికైనా సాయం చేయాలనిపిస్తుంది.

– యామిజాల జగదీశ్

ఇంతందం తెలుగు తెరకు మళ్లిందా...



• దీపికా పదుకోన్ • జాన్వీ కపూర్ • భాగ్యశ్రీ బోర్సే

> ఒకరు కాదు... ఇద్దరు కాదు... ముగ్గురు కాదు... నలుగురు కాదు... ఏకంగా పదిహేను మందికి పైగా కొత్త కథానాయికలు ఈ ఏడాది తెలుగు తెరపై మెరిశారు. 'ఇంతందం తెలుగు తెరకు మళ్లిందా..' అన్నట్లు గత ఏడాదితో పోల్చితే 2024లో ఎక్కువమంది తారలు పరిచయం అయ్యారు. ఇక ఈ ఏడాది తెలుగు తెరపై కనిపించిన ఆ నూతన తారల గురించి తెలుసుకుందాం.

ఒకే సినిమాతో దీపిక... అన్నా బెన్

బాలీవుడ్‌లో అగ్ర కథానాయికల్లో ఒకరైన దీపికా పదుకోన్ ఈ ఏడాది తెలుగు తెరకు పరిచయం అయ్యారు. నటిగా కెరీర్ మొదలుపెట్టిన పదిహేడేళ్లకు 'కల్కి 2898 ఏడీ' మూవీతో దీపికా పదుకోన్ తెలుగు తెరపై కనిపించారు. హీరో ప్రభాస్, నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో రూపొందిన ఈ సైన్స్ ఫిక్షన్ అండ్ మైథలాజికల్ మూవీలోని సుమతి పాత్రలో అద్భుతంగా నటించారు దీపికా పదుకోన్. గర్భవతిగా ఓ డిఫరెంట్ రోల్‌తో తెలుగు ఎంట్రీ ఇచ్చారామె. సి. అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇక ఇదే సినిమాతో మలయాళ నటి అన్నా బెన్ కూడా పరిచయమయ్యారు. ఈ సినిమాలో కైరాగా కనిపించింది కాసేపే అయినా ఆకట్టుకున్నారు అన్నా బెన్.

డాటర్ ఆఫ్ శ్రీదేవి

దివంగత ప్రముఖ తార శ్రీదేవి తెలుగు వెండితెర, ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేశారు. శ్రీదేవి పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ 2018లో 'ధడక్' సినిమాతో హిందీలో నటిగా కెరీర్‌ను ప్రారంభించారు. అప్పట్నుంచి జాన్వీ తెలుగులో సినిమా చేస్తే బాగుంటుందని తెలుగు ప్రేక్షకులు అభిలషించారు. వీరి నిరీక్షణ 'దేవర' సినిమాతో ఫలించింది. హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందిన 'దేవర'లో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రంలో తంగమ్ పాత్రలో నటించారామె. కళ్యాణ్‌రామ్ సమర్పణలో కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 27న విడుదలైంది. అలాగే ఇదే సినిమాతో నటి శ్రుతీ మరాఠే కూడా టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు. 'దేవర' సినిమాలో దేవర పాత్రకు జోడీగా శ్రుతి, వర పాత్రకు జోడీగా జాన్వీ కపూర్ నటించారు.

భాగ్యశ్రీ బిజీ బిజీ

పరభాష హీరోయిన్లు తెలుగు ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చినప్పుడు, తొలి సినిమాకే వారి పాత్రకు డబ్బింగ్ చెప్పుకోవడం చాలా అరుదు. కానీ తన తొలి తెలుగు సినిమా 'మిస్టర్ బచ్చన్'లోని తన పాత్ర జిక్కీకి భాగ్యశ్రీ బోర్సే డబ్బింగ్ చెప్పారు. హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన 'మిస్టర్ బచ్చన్' సినిమాను టీ సిరీస్ సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఆగస్టులో విడుదలైన ఈ సినిమాలో ఓ కమర్షియల్ హీరోయిన్ రోల్ భాగ్యశ్రీకి దక్కింది. తెరపై మంచి గ్లామరస్‌గా కనిపించారు. భాగ్యశ్రీ నటన, అందానికి మంచి మార్కులే పడ్డాయి. అందుకే ఆమె దుల్కర్ సల్మాన్, రామ్ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించే అవకాశాలను అందుకున్నారు. ప్రస్తుతం ఈ రెండు చిత్రాలతో భాగ్యశ్రీ బిజీ.

తెలుగు తెరపై మిస్ వరల్డ్

మిస్ వరల్డ్ (2017) మానుషీ చిల్లర్ 'ఆపరేషన్ వాలెంటైన్' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమకు హీరోయిన్‌గా పరిచయం అయ్యారు. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ సినిమాలో వరుణ్ తేజ్ హీరోగా నటించగా, శక్తి ప్రతాప్‌సింగ్ దర్శకుడిగా పరిచయం అయ్యారు. ఈ చిత్రంలో ఓ కమాండర్ రోల్‌లో నటించారు మానుషి. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ సినిమా హీరో వరుణ్ తేజ్‌కు హిందీలో తొలి సినిమా కాగా, మానుషీకి తెలుగులో తొలి సినిమా. సోనీ పిక్చర్స్, సిద్ధు ముద్దా నిర్మించిన ఈ చిత్రం మార్చి 1న విడుదలైంది.

ఎప్పుడో కాదు... ఇప్పుడే!

గత ఏడాది తెలుగులో అనువాదమైన కన్నడ చిత్రాలు 'సప్తసాగరాలు దాటి' ఫ్రాంచైజీలో మంచి నటన కనబరిచి తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారు కన్నడ హీరోయిన్ రుక్మిణీ వసంత్. అప్పట్నుంచి రుక్మిణి వసంత్ ఫలానా తెలుగు సినిమా సైన్ చేశారంటూ రకరకాల వార్తలు వచ్చాయి. అగ్ర హీరోల పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ సడన్‌గా నిఖిల్ 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమాతో రుక్మిణీ వసంత్ టాలీవుడ్ ఎంట్రీ ఈ ఏడాదే జరిగిపోయింది. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 8న విడుదలైంది. కాగా హీరో ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమాలోని హీరోయిన్ పాత్ర రుక్మిణీ వసంత్‌కు దక్కిందని తెలిసింది.

ఒకేసారి మూడు సినిమాలు


ఓ హీరోయిన్ కెరీర్‌లోని తొలి మూడు సినిమాలు ఒకే ఏడాది విడుదల్వడం అనేది చిన్న విషయం కాదు. హీరోయిన్ నయన్ సారికకు ఇది సాధ్యమైంది. ఆనంద్ దేవరకొండ నటించిన 'గంగం గణేషా', నార్నే నితిన్ 'ఆయ్', కిరణ్ అబ్బవరం 'క' సినిమాల్లో నయన్ సారిక హీరోయిన్‌గా నటించగా, ఈ మూడు సినిమాలు 2024లోనే విడుదలయ్యాయి. ఇందులో 'ఆయ్', 'క' సినిమాలు సూపర్‌హిట్స్‌గా నిలవగా, 'గం గం గణేషా' ఫర్వాలేదనిపించుకుంది. ఇక కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన 'క' సినిమాలో నటించారు కన్నడ బ్యూటీ తన్వీ రామ్. తన్వీ ఓ లీడ్ రోల్‌లో నటించిన తొలి తెలుగు సినిమా 'క'. ఈ చిత్రం అక్టోబరులో విడుదలైంది.

ఇటు తెలుగు... అటు తమిళం

తెలుగు, తమిళ భాషల్లో ఈ ఏడాదే హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు ప్రీతీ ముకుందన్. శ్రీవిష్ణు హీరోగా నటించిన 'ఓం భీమ్ బుష్' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం అయ్యారు ప్రీతీ ముకుందన్. హర్ష దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం మార్చిలో విడుదలై, ప్రేక్షకుల మెప్పు పొందింది. ఇక కెవిన్ హీరోగా చేసిన 'స్టార్'తో ఇదే ఏడాది తమిళ పరిశ్రమకు పరిచయం అయ్యారు ప్రీతీ ముకుందన్. అలాగే మంచు విష్ణు 'కన్నప్ప' లోనూ ఆమె హీరోయిన్‌గా చేస్తున్నారు.

ఇంకా నారా రోహిత్ 'ప్రతినిధి 2'తో సిరీ లెల్లా, సత్యదేవ్ 'కృష్ణమ్మ' చిత్రంతో అతిరా రాజీ, నవదీప్ 'లవ్ మౌళి'తో పంఖురి గిద్వానీ, 'వెన్నెల' కిశోర్ 'చారి 111'తో సంయుక్తా విశ్వనాథన్, సాయి రామ్ శంకర్ 'వెయ్ దరువెయ్'తో యషా శివకుమార్, చైతన్యా రావు 'షరతులు వర్తిస్తాయి'తో భూమి శెట్టి, అల్లరి నరేశ్ 'ఆ ఒక్కటి అడక్కు'తో ప్రముఖ నటుడు జానీ లివర్ వారసురాలు జేమీ లివర్ (ఓ కీలక పాత్రతో..) తదితరులు పరిచయం అయ్యారు.

– ముసిమి శివాంజనేయులు



• మానుషీ చిల్లర్ • రుక్మిణీ వసంత్ • నయన్ సారిక • తన్వీ రామ్

సినిమా

అప్పుడు మొదలైంది భయం

'ప్రాంతం, జాతి, భాష అని జనాల్ని ఒకటిగా చేసే పని మేం మొదలుపెట్టినప్పుడు మీరు ఏర్పాటు చేసిన ఈ కులం, మతం, వేర్పాటు వాదం దేనితోను మీరు రాజకీయం చేయలేకపోయారు. అప్పుడు మొదలైంది ఈ భయం. ఆ భయంతోనే మమల్ని వేర్పాటు వాదులుగా ప్రచారం చేస్తున్నారు' అని హీరో విజయ్ సేతుపతి చెప్పే సంభాషణలతో సాగుతుంది 'విడుదల 2' చిత్రం ట్రైలర్. వెనకబడిన ప్రజల కోసం పోరాడే పెరుమాళ్‌గా విజయ్ సేతుపతి నటించిన చిత్రం ఇది. విజయ్ సేతుపతి హీరోగా వెట్రిమారన్ దర్శకత్వంలో రూపొందిన 'విడుదల –1'కి సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందింది. ఈ నెల 20న ఈ చిత్రం విడుదల కానుంది. శ్రీ వేదాక్షర మూవీస్ అధినేత చింతపల్లి రామారావు ఈ చిత్రం తెలుగు హక్కులను దక్కించుకున్నారు. ఆదివారం ఈ చిత్రం తెలుగు ట్రైలర్‌ను విజయ్ సేతుపతి చెన్నయ్‌లో విడుదల చేశారు. ''ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం బలంగా ఉంటుంది. ఎమోషన్స్, యాక్షన్... ఇలా అన్నీ కూడా సహజత్వానికి దగ్గరగా ఉంటాయి. ఇళయరాజా సంగీతం ఈ చిత్రానికి ఓ ప్రధాన ఆకర్షణ '' అని చెప్పారు చింతపల్లి రామారావు.



• విజయ్ సేతుపతి, చింతపల్లి రామారావు

థ్రిల్... లవ్

కన్నడ హీరో శశికుమార్ తనయుడు ఆదిత్య శశికుమార్ హీరోగా నటించిన చిత్రం 'సమిధ'. చాందినీ తమిళరసన్, లావణ్యా సాహుకార హీరోయిన్లుగా నటించారు. 'మర్మం, కనులు కలిశాయి' వంటి ఐదు అవార్డు విన్నింగ్ షార్ట్ ఫిలిమ్స్‌ని రూపొందించిన సతీష్ మాలెంపాటి దర్శకత్వంలో అరుణం ఫిలింస్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఈ చిత్రం ఈ నెల 14న తెలుగు రాష్ట్రాల్లో విడుదల కానుంది. సతీష్ మాలెంపాటి మాట్లాడుతూ – ''రాజస్థాన్‌లో జరిగిన ఒక వాస్తవ సంఘటనని స్ఫూర్తిగా తీసుకుని, మర్డర్ మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించాం. రెండు గంటల నిడివితో ఆసక్తికర మలుపులు, పవర్‌ఫుల్ యాక్షన్ సీన్స్‌తో సాగే ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది''అన్నారు. ''ఈ చిత్రంలో మంచి ప్రేమకథ కూడా ఉంది'' అని ఆదిత్య శశికుమార్ చెప్పారు.



• ఆదిత్య శశికుమార్

ఓ లేడి కళ్ల పిల్ల...

కొండా వెంకట రాజేంద్ర, మనీషా జష్నాని, సుస్మిత అనాలా, సాంచి రాయ్ హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'లోపలికి రా చెప్తా'. వెంకట రాజేంద్ర దర్శకత్వంలో లక్ష్మీ గణేశ్, వెంకట రాజేంద్ర నిర్మించారు. ఈ చిత్రంలో 'ఓ లేడి కళ్ల పిల్ల నన్ను చూస్తే...' అంటూ సాగే తొలి పాటను డెలివరీ బాయ్ జాఫర్‌తో విడుదల చేయించారు. చిత్ర సంగీతదర్శకుడు డేవ్ జాండ్ స్వరపరచిన ఈ పాటను కపిల్ కపిలన్ పాడారు. ''మా సినిమాలో హీరో డెలివరీ బాయ్. అందుకే డెలివరీ బాయ్‌తో ఈ పాటను రిలీజ్ చేయించాం. హారర్, కామెడీతో సాగే ఈ చిత్రాన్ని ఫిబ్రవరిలో రిలీజ్ చేస్తాం'' అన్నారు వెంకట రాజేంద్ర.



• మనీషా, వెంకట రాజేంద్ర

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 258

సోమవారం 9-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'



భారత క్రికెట్‌కు 'బ్యాడ్ సండే'

ఒకే రోజు మూడు వేర్వేరు మ్యాచ్‌ల్లో భారత జట్లకు ఓటమి -14లో



అసద్ పాలన అంతం

తిరుగుబాటుదారుల చేతుల్లోకి సిరియా.. రష్యా పారిపోయిన అధ్యక్షుడు? -6లో



శీతాకాల సమరం

నేటి నుంచి అసెంబ్లీ .. అస్త్రశస్త్రాలతో సిద్ధమైన అధికార, విపక్షాలు

నాలుగు నుంచి వారం రోజుల పాటు సమావేశాలు నిర్వహించే అవకాశం

ఏడాది పాలన ఫలితాలను ప్రజల ముందుంచే యత్నం చేయనున్న అధికార పార్టీ

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపేందుకు సిద్ధమవుతున్న ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ

- హామీలపై నిలదీయాలని బీఆర్ఎస్ఎల్పీ భేటీలో కేసీఆర్ దిశానిర్దేశం
- ప్రభుత్వ వైఫల్యాలే ఎజెండాగా కమల దళం సిద్ధం
- హైదరాబాద్ అభివృద్ధిపై చర్చ కోరనున్న మజ్లిస్
- ఆర్‌వోఆర్–2024, హైడ్రా చట్టాలకు సభ ఆమోదం..
- మహిళా యూనివర్సిటీ, బాసర ట్రిపుల్‌ఐటీ బిల్లులపైనా చర్చ
- కులగణన, రైతు భరోసా, రుణమాఫీపై ప్రభుత్వం ప్రకటన చేసే చాన్స్
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై ప్రకటన చేయనున్న సీఎం రేవంత్
- సమావేశాల ఏర్పాట్లపై స్పీకర్, మండలి చైర్మన్ నేతృత్వంలో భేటీ
- సభ హుందాతనాన్ని కాపాడుతూ చర్చ జరగాలి: స్పీకర్ గడ్డం ప్రసాద్
- సమావేశాల ఎజెండాపై నేడు అసెంబ్లీ, మండలి బీఏసీల భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10:30 గంటలకు శాసనమండలి, శాసనసభ భేటీకానున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన వేళ జరుగుతున్న ఈ సమావేశాలు వాడివేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, బీజేపీ కూడా అస్త్రశస్త్రాలను, వ్యూహాలను సిద్ధం చేసుకున్నాయి. గత ఏడాది కాలంలో రాష్ట్రంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలను ప్రజల ముందుంచేందుకు అధికార కాంగ్రెస్ సిద్ధమైంది. అదే సమయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను ఎత్తిచూపడం, అప్పటి రుణాలను తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేయాల్సి వస్తోందని ప్రజల్లోకి తీసుకెళ్లడం లక్ష్యంగా వ్యూహాలు పన్నుతోంది. మరోవైపు గత ఏడాది కాలంలోని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడం, హామీల అమలుపై నిలదీయడమే ఎజెండాగా ప్రతిపక్షాలు సభకు హాజరుకానున్నాయి. రైతు రుణమాఫీ జరిగిన తీరు, రైతు భరోసా ఇవ్వకపోవడం, ధాన్యం కొనుగోళ్లు, ఆరు గ్యారంటీల అమలు, ఫోన్ ట్యాపింగ్, లగచర్ల ఘటన, గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్ తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ వ్యూహాలు పన్నుతోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం హామీల అమల్లో విఫలమైందంటూ చార్జిషీట్లు ప్రకటించిన బీజేపీ.. ఆయా అంశాలను, ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇక హైదరాబాద్ నగరంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చించాలని కోరాలని ఎంఐఎం భావిస్తోంది.

రెవెన్యూ చట్టం.. మహిళా వర్సిటీ..

శాసనసభ శీతాకాల సమావేశాల్లో రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)–2024 చట్టాన్ని మిగతా 3వ పేజీలో ▶

ఇక నిలదీయడమే!

బీఆర్ఎస్ శాసనసభా పక్ష భేటీలో కేసీఆర్

- కాంగ్రెస్ ప్రభుత్వానికి తగినంత సమయం ఇచ్చాం
- పాలకుల అసమర్థతపై ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు
- ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై మనం గొంతు విప్పాలి
- హామీలు నెరవేర్చడం చేతకాక అణచివేత విధానాలు
- నాపై కక్షతోనే తెలంగాణ తల్లి విగ్రహం రూపు మారుస్తున్నారు
- గురుకుల విద్యా సంస్థల్లో సమస్యలపై త్వరలో కార్యాచరణ
- వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరులో భారీ బహిరంగ సభ



సాక్షి, హైదరాబాద్: పాలకుల అసమర్థతపై ప్రజలు తిరుగుబాటు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్.. ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి తగినంత సమయం ఇచ్చామని, సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై గొంతు విప్పాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతకాక ప్రభుత్వం మిగతా 3వ పేజీలో ▶



ఇప్పటికే తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను మాయం చేసిన రేవంత్. ఆయన గురువు చెప్పినట్లుగా రేపు తెలంగాణను కూడా మాయం చేస్తాడు కాబోలు. తెలంగాణ అస్తిత్వం మీద దాడి ఇది. సీఎం తెలంగాణ తల్లిని బిదరాలిగా ఎందుకు చూడాలనుకుంటున్నారు? తెలుగు తల్లి, భరతమాత తరహా లో తెలంగాణ తల్లికి కిరీటాలు ఉండొద్దా?

రేవంత్ ఇటుకతో కొడితే.. మేం రాయితో బదులిస్తాం

ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రశ్నించడం ఆపేది లేదు

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- అసెంబ్లీ వేదికగా గ్యారంటీలు, హామీల అమలుపై నిలదీస్తాం
- కేసీఆర్‌ను దూషించడాన్ని ప్రజలు జీర్ణించుకోవడం లేదు
- సమాధానం చెప్పే సత్తా లేకనే రేవంత్ దూషణలు
- తెలంగాణ తల్లి విగ్రహం మార్పు అస్తిత్వం మీద దాడి
- అసెంబ్లీకి ఎప్పుడు రావాలో మా అధినేత కేసీఆర్‌కు తెలుసు

2 లో





ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన ఎయిర్‌షోను ఆసక్తిగా తిలకిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరాలు 16లో ▶

ఎక్కడా లేని ఈవీఎంలు మనకెందుకు?

అమెరికా, ఇంగ్లాండ్ వంటి అభివృద్ధి చెందిన దేశాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నారని, మన దగ్గర మాత్రం ఈవీఎంలు ఎందుకని ఎన్సీపీ (శరద్ పవార్) అధ్యక్షుడు శరద్ పవార్ ప్రశ్నించారు. ఈవీఎంలను పక్కనపెట్టి కేవలం బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని దేశ ప్రజలు కోరుకుంటున్నట్లు చెప్పారు.





6 లో

8 నెలల్లో ఇంటింటికీ ఇంటర్నెట్

- రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలకూ హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ తీసుకొస్తాం
- 3 గ్రామాల్లో ఇంటర్నెట్ సేవల ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

- వివరాలు 13లో



మీ-సేవ యాప్‌ను ప్రారంభిస్తున్న శ్రీధర్‌బాబు

'మంచు' కుటుంబంలో

హైడ్రామా

మనోజ్‌పై మోహన్‌బాబు దాడి చేశారంటూ సోషల్ మీడియాలో వైరల్

- వివరాలు 2లో

రేవంత్ ఇటుకతో కొడితే.. మేం రాయితో బదులిస్తాం

ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రశ్నించడం ఆపేది లేదు

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను అసెంబ్లీ వేదికగా ఎండగడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు చెప్పారు. ఆరు గ్యారంటీల ముసుగులో ఇచ్చిన 13 ప్రధాన గ్యారంటీలు, 420 హామీల అమలుపై ప్రభుత్వ తీరును నిలదీస్తామన్నారు. దళితబంధు, రైతు రుణమాఫీ, మహాలక్ష్మి, ఆసరా పింఛన్ల పెంపు తదితర హామీల అమలు కోసం పట్టుబడతామని.. హామీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఎండగడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రశ్నించడం ఆపేదే లేదని, ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయి ఏడాది అవుతున్న నేపథ్యంలో ఆదివారం 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

"24 ఏళ్ల ప్రస్థానంలో గత ఏడాది బీఆర్ఎస్ అనేక సవాళ్లను ఎదుర్కొంది. ఉద్యమ సమయంలో గెలుపోటములతో సంబంధం లేకుండా రాష్ట్ర సాధన కోసం పనిచేశాం. తెలంగాణ సిద్ధించాక పదేళ్ల అధికారంలో కొనసాగినా.. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో అధికారం కోల్పోయాం. ఈ ఏడాది కాలంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి, కవిత అరెస్టు, కేసీఆర్ కాలికి గాయం వంటి అనేక ఒడిదుడుకులు ఎదురయ్యాయి. కానీ మా నాయకుడు ఇచ్చిన స్ఫూర్తి, నాయకులు, కార్యకర్తల పోరాట పటిమతో బీఆర్ఎస్ తిరిగి నిటారుగా నిలబడింది. తిరిగి అధికారంలోకి వచ్చి మరో 25 ఏళ్ల పాటు రాజకీయాల్లో కొనసాగుతుందనే ఆత్మస్థైర్యం వచ్చింది. మాకు పోయింది అధికారమే తప్ప పోరాట పటిమ కాదు.

సమాధానం చెప్పలేకే రేవంత్ దూషణలు

రేవంత్‌రెడ్డికి అనుకోకుండా అవకాశం వచ్చి సీఎం అయ్యారు. ఆయన పట్ల మాకు ఎలాంటి జెలసీ లేదు. ఆయనను ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని కోరితే దూషణలకు దిగుతున్నారు. మమ్మల్ని దూషించినా వయసులో చిన్న వాళ్లం సహిస్తాం. కానీ కేసీఆర్‌ను దూషించడాన్ని ప్రజలు జీర్ణించుకోవడం లేదు. తెలంగాణ సాధించిన మహానాయకుడిని స్థాయికి తగని వ్యక్తి విమర్శించడం సరికాదు. రేవంత్ వైఖరి మారకపోతే మాపై కేసులు పెట్టినా సరే... ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఆయన భాషలోనే స్పందిస్తాం. ఇటుకతో కొడితే రాయితో బదులిస్తాం. రేవంత్ చేస్తున్న పనికి మేం ఎక్కడా అడ్డుపడటం లేదు. బలవంతపు భూసేకరణ, దళితబంధు ఆపేయడం, మూసీ పేరిట లక్షల కోట్ల రూపాయల దోపిడీకి ప్లాన్‌చేయడంపై మేం ప్రశ్నిస్తుంటే.. రేవంత్‌కు జీర్ణం కావడం లేదు. సమాధానం చెప్పే సత్తా లేక దూషణలకు దిగుతున్నారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలంటున్న సీఎం... మొదట తన జూబ్లీహిల్స్ ప్యాలెస్ నుంచి బయటికి వచ్చి లగచర్లకు, తన సొంతూరు కొండారెడ్డిపల్లికి వెళ్లాలి.

ఇప్పుడు బతుకమ్మ మాయం.. రేపు తెలంగాణ మాయం చేస్తారా?

తెలంగాణ తల్లి విగ్రహం మార్పు తెలంగాణ అస్తిత్వం మీద తెలంగాణ ద్రోహులు చేస్తున్న దాడి. ఈ సీఎం తెలంగాణ ఉద్యమంలో లేరు.. ఎన్నడూ జైతెలంగాణ అనలేదు. సమైక్యవాదులు, తెలంగాణ వ్యతిరేకుల పార్టీలో పనిచేసి.. కేసీఆర్ పట్ల వ్యతిరేకత, ద్వేషం పెంచుకున్నారు. కేసీఆర్ చేసిన ప్రతి పనికి ఉల్టా చేయడం రేవంత్ పని. కవులు, కళాకారులు, రచయితలు, సాహితీవేత్తలు, శిల్పుల అభిప్రాయాలు తీసుకుని ఉద్యమ సమయంలో తెలంగాణ తల్లికి రూపకల్పన జరిగింది. 2009లో కేసీఆర్ నిరాహార దీక్ష సమయంలో తెలంగాణ వ్యాప్తంగా వేలాది విగ్రహాలు పెట్టారు. కానీ ఈ మూర్ఖుడు తెలంగాణ తల్లి విగ్రహం మారుస్తున్నాడు. ఇప్పటికే తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను మాయం చేసిన రేవంత్.. ఆయన గురువు చెప్పినట్లుగా రేపు తెలంగాణను కూడా మాయం చేస్తాడు కాబోలు. తెలంగాణ అస్తిత్వం మీద జరుగుతున్న ఈ దాడిపై ప్రజలు నిరసన తెలపాలి. సీఎం తెలంగాణ తల్లిని బీదరాలిగా ఎందుకు చూడాలనుకుంటున్నారు? తెలుగు తల్లి, భరత మాత తరహాలో తెలంగాణ తల్లికి కిరీటాలు ఉండొద్దా?

కేసీఆర్ స్థాయికి రేవంత్ సరిపోడు..

ప్రతిపక్ష నేత ఎలా ఉండాలో రేవంత్ దగ్గర నేర్చుకోవాల్సిన అవసరం లేదు. గతంలో ఎన్టీఆర్, జయలలిత శపథం చేసి అసెంబ్లీకి రాలేదు. కానీ కేసీఆర్ అలా కాదు. రేవంత్ కోరుకున్నప్పుడు కాదు.. ప్రజలు కోరుకున్నపుడు కేసీఆర్ అసెంబ్లీకి వస్తారు. కేసీఆర్ స్థాయికి రేవంత్ సరిపోడు. ప్రజలు కేసీఆర్ ఎక్కడని అడగటం లేదు. హామీల అమలు, ఆరు గ్యారంటీల గురించి ప్రశ్నిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా మా పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గొంతు విప్పుతారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం..

ఉద్యమాల నుంచి వచ్చిన మాకు కేసులు, నిర్బంధాలు, అరెస్టులు కొత్త కాదు. వందల కేసులు పెట్టినా వెనక్కి తగ్గం. ప్రభుత్వం చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు మా కార్యకర్తలను జైలుకు పంపుతోంది. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పార్టీని బలోపేతం చేసుకుంటాం. పోరాటాలకు కేడర్‌ను సిద్ధం చేస్తాం. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం. కేసీఆర్ పర్యవేక్షణలో సమర్థవంతమైన ప్రతిపక్షంగా పనిచేస్తున్నాం.

కేసీఆర్, పార్టీ నిర్ణయం మేరకు పాదయాత్ర

నేను కచ్చితంగా పాదయాత్ర చేస్తా.. కానీ తొందరపడకుండా ప్రజల అవసరాన్ని బట్టి షెడ్యూల్ నిర్ణయిస్తాం. ఎప్పుడు పాదయాత్ర చేయాలో మా అధినేత కేసీఆర్, పార్టీ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయిస్తుంది.

రేవంత్‌కు రక్షణ కవచంలా బీజేపీ ఎంపీలు

బీజేపీ ఎన్ని కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టినా వారు రాష్ట్రంలో 8 అసెంబ్లీ సీట్లు మాత్రమే గెలిచారు. మా ఓటమికి కారకులై కాంగ్రెస్ గెలుపునకు ఉపయోగపడ్డారు. బీజేపీ ఎంపీలు రఘునందన్‌రావు, అర్వింద్, బండి సంజయ్ వంటివారు రేవంత్‌రెడ్డికి రక్షణ కవచంలా నిలబడుతున్నారు. అదానీ విషయంలో రేవంత్ వైఖరిపై ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. అనుముల రేవంత్‌రెడ్డి బ్రదర్స్ అదానీలను మించి పోతున్నా కేంద్రం ఎలాంటి దర్యాప్తులు చేయడం లేదు.." అని కేటీఆర్ పేర్కొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలకు రండి

కేంద్రమంత్రి బండిని ఫోన్‌లో ఆహ్వానించిన మంత్రి పొన్నం

సాక్షి, హైదరాబాద్: సమయాభావంతో స్వయంగా కలిసి ఆహ్వానించలేకపోతున్నానని, ప్రజాప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవాలకు హాజరు కావాలని కేంద్రమంత్రి బండి సంజయ్‌ను.. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మంత్రి పొన్నం ఆదివారం బండి సంజయ్‌కు ఫోన్ చేశారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో తప్పకుండా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఎంఐఎం అధ్యక్షుడు ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఇప్పటివరకు అందుబాటులోకి రాలేదన్నారు. ఇప్పటికే అధికారుల ద్వారా ఆయనకు ఆహ్వానం అందించామన్నారు. అసదుద్దీన్ ఓవైసీ సమయం ఇస్తే.. తప్పకుండా కలిసి ఆహ్వానిస్తానని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

'ఫ్యూచర్ స్టేట్'గా తెలంగాణ

ప్రజా పాలన విజయోత్సవాల్లో జితేందర్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రాన్ని 'ఫ్యూచర్ స్టేట్'గా నిలిపేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆదివారం 'ప్రజా పాలన–ప్రజా విజయోత్సవాలు' ఘనంగా జరిగాయి. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జితేందర్ ముఖ్య అతిథిగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలతో పాటు.. మేనిఫెస్టోలో ఇవ్వని 160 మంచి పనులు చేశామని స్పష్టం చేశారు.

నేడు తెలంగాణతల్లి విగ్రహావిష్కరణ

సచివాలయ ఆవరణలో ఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం సాయంత్రం 6:05 గంటలకు సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొంటారు. రాష్ట్ర నలుమూలల నుంచి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యేందుకు ప్రభుత్వం అన్నిరకాల ఏర్పాట్లు చేసింది. కాగా, విగ్రహావిష్కరణ కార్యక్రమ ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి ఇతర మంత్రులతో కలిసి పరిశీలించారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపశిల్పి రమణారెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ సన్మానించారు. పోరాట స్ఫూర్తిని చాటేలా విగ్రహాన్ని తీర్చిదిద్దారని ఆయన్ను కొనియాడారు..

భారీగా తరలిరండి: మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉందని, ఈ సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్‌లతో ఆయన జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. ఏడాది కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందని, మెజారిటీ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు.



సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు

తెలంగాణ తల్లిపై ప్రేమ ఉన్న ప్రతిఒక్కరూ వస్తారు: మంత్రి కోమటిరెడ్డి

"తెలంగాణపై, తెలంగాణ తల్లిపై ప్రేమ ఉన్న ప్రతీ ఒక్కరూ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వస్తారు. తెలంగాణ అంటే ఇష్టం లేనివారు రారు. నిజమైన తెలంగాణవాదులెవరో తెలిసే వేదిక ఇది." అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. వేదికపై ప్రజా ప్రతినిధులందరూ కూర్చునేలా ఏర్పాట్లు చేయాలని, సభకు వచ్చే ప్రజలందరికీ, ముఖ్యంగా మహిళలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సచివాలయ భద్రతాసిబ్బంది, ఇతర పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణకు రావాలని అన్ని రాజకీయ పక్షాలను ఆహ్వానించామని చెప్పారు.

ఏడాదిలోనే ఎన్నో చేశాం!

మహిళా, రైతు సంక్షేమం.. నిరుద్యోగులకు కొలువులు

- తెలంగాణ ప్రజలందరి నమ్మకానికి కృతజ్ఞతలు
- ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే ఎన్నో అంశాల్లో రికార్డులు నెలకొల్పిందని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ఎక్స్‌లో ఆయన ఆదివారం సుదీర్ఘ ట్వీట్ పెట్టారు. ఏడాది పాలనలో సాధించిన ప్రగతిని వివరించారు. 'మీ సొంత ప్రభుత్వం ప్రజాపాలన మొదటి సంవత్సరం విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా నేను నా ప్రజలతో కొన్ని విషయాలు పంచుకోవాలనుకుంటున్నాను. మొదటి సంవత్సరం వ్యవసాయ రుణాల మాఫీ, పంట బోనస్, ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల్లో మీ ప్రభుత్వం రికార్డు సృష్టించింది. మన మహిళా సంక్షేమ పథకాలు, కుల గణన, పర్యావరణ కేంద్రీకృత పట్టణాభివృద్ధి విధానాలు ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. తెలంగాణ ప్రజలందరి నమ్మకానికి నా కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి తన సందేశంలో పలు అంశాలను ప్రస్తావించారు

మహిళా సంక్షేమం
- ఉచిత బస్సు, గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500లకే వంట గ్యాస్ సిలిండర్.

రైతులు
- 25 లక్షల మంది రైతులకు వ్యవసాయ రుణాల మాఫీ, రూ. 21,000 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ.
- సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్.
- రైతులకు 24/7 ఉచిత విద్యుత్.

హౌసింగ్
- నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు జరుగుతున్నాయి.

యువతకు ఉద్యోగాలు
- ఒక్క ఏడాదిలో యువతకు55,000లకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు. ప్రైవేట్‌లో లక్షల ఉద్యోగాలను సృష్టించాం. గత 12 ఏళ్లలో నిరుద్యోగిత రేటును అత్యల్ప స్థాయికి తెచ్చాం.
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు.
- మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యుద్ధం.
- యంగ్ ఇండియా స్కిల్స్ విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా స్పోర్ట్స్ విశ్వవిద్యాలయం స్థాపన.

ఆర్థిక వృద్ధి / పట్టణాభివృద్ధి
- గత తొమ్మిది నెలల్లో రెట్టింపు ఎఫ్‌డీఐల సాధన. గత 11 నెలల్లో మొత్తం పెట్టుబడులు 200 శాతానికి పైగా పెరిగాయి.
- వాతావరణ మార్పు సవాళ్లను ఎదుర్కొనేందుకు అర్బన్ రీ ఇమాజినేషన్ ప్రోగ్రామ్‌ను చేపట్టేందుకు భారతదేశంలో హైదరాబాద్‌ను మొదటి నగరంగా మార్చడం.
- భారీ వృద్ధితోపాటు అత్యంత నివాసయోగ్యంగా మార్చేందుకు ఫ్యూచర్ సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్, రేడియల్ రోడ్లు, మెట్రో రైల్ రెండో దశ, భారతదేశపు మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీతో సహా అనేక ఇతర ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను చేపట్టాం.

కులాల సర్వే
- దేశంలోనే మొట్టమొదటి సమగ్ర కుల సర్వే ద్వారా తెలంగాణ పౌరుల నుంచి వివరాల సేకరణ

ఇతర అంశాలు
- ట్రాన్స్‌జెండర్ మార్షల్స్ ద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించే భారతదేశపు మొదటి నగరంగా హైదరాబాద్ త్వరలో అవతరించబోతోంది.
- ప్రజాస్వామ్య, ఉదారవాద విలువల పునరుద్ధరణ.
- డిసెంబర్ 9న (సోమవారం) సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నాం.

హైవేల పక్కనే ఈవీ స్టేషన్లు

కొత్తగా 5,833 చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఎన్‌హెచ్ఏఐ ప్రణాళిక

ఏపీలో మొదటి దశలో 230 ఏర్పాటుకు నిర్ణయం / త్వరలో స్థలాల ఎంపిక

దేశంలో ఏర్పాటు చేయనున్న మొత్తం ఈవీ చార్జింగ్ స్టేషన్లు	మొదటి దశలో ఏర్పాటు చేయనున్న స్టేషన్లు	ఏపీలో మొదటి దశలో చెన్నై– కోల్‌కతా జాతీయ రహదారిలో ఏర్పాటు చేసే స్టేషన్లు
7,432	5,833	230



జాతీయ రహదారులను ఆనుకుని ఈవీ చార్జింగ్ స్టేషన్లు నెలకొల్పే ప్రణాళికను వేగవంతం చేయాలని జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ(ఎన్‌హెచ్ఏఐ) నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 'ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్–2024' కార్యక్రమం కింద వాటిని ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం దేశంలో విద్యుత్ వాహనాలను ప్రోత్సహించే దిశగా మౌలిక సదుపాయాల వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు పెట్రోలియం మంత్రిత్వ శాఖతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకోసం రెండు పెట్రోలియం కంపెనీల భాగస్వామ్యంతో ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలన్న ప్రణాళికను ఆమోదించారు. – సాక్షి, అమరావతి

దేశంలో జాతీయ రహదారులను ఆనుకుని మొత్తం 7,432 ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. ఇందుకోసం భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం కంపెనీలతో కలసి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ పెట్రోలియం కంపెనీలకు రూ.800 కోట్లు సబ్సిడీగా ఇచ్చేందుకు ఎన్‌హెచ్ఏఐ ఆమోదం తెలిపింది.

మొదటి దశలో 5,833 ఈవీ స్టేషన్లు ఏర్పాటుకు ఎన్‌హెచ్ఏఐ కార్యాచరణకు ఉపక్రమించింది. రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

ఎంపిక చేసిన జాతీయ రహదారులను ఆనుకుని ప్రతి 50 కి.మీ.కు ఒకటి చొప్పున ఈవీ స్టేషన్లను ఏర్పాటు చేస్తారు.

వచ్చే ఏడాది జూన్ నాటికి ఈవీ స్టేషన్లను ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యం.



ఏ మాత్రం మన ప్రమేయం లేకుండానే జరిగిపోతున్నాయనిపిస్తోంది!!

రూ.2 కోట్ల వార్షిక వేతనం

కొడంగల్ వాసికి జాక్‌పాట్



కొడంగల్: వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల గ్రామానికి చెందిన సయ్యద్ అర్బాజ్ ఖురేషి (26)ను.. ప్రపంచ దిగ్గజ కంపెనీ అమెజాన్.. రూ.2 కోట్ల వార్షిక వేతనంతో అమెరికాలో అప్లయిడ్ సైంటిస్ట్‌గా నియమించింది. సయ్యద్ అర్బాజ్ ఖురేషి 2019లో ఐఐటీ పట్నాలో కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తిచేశాడు. ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ మెషీన్ లెర్నింగ్ కోవిదుడు గయాల్ డయ్యాస్ దగ్గర బీటెక్ ఫైనల్ ఇయర్‌లో మూడు నెలల రీసెర్చ్ అనంతరం.. బెంగుళూరులోని 'మైక్రోసాఫ్ట్ రీసెర్చ్'రెండేళ్లు, యూఎస్ఏలో యూఎంఏఎస్ఎస్ (యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్), 2023లో ఏఐ, మెషీన్ లెర్నింగ్‌లో ఎంఎస్ పట్టా పొందాడు. ఎంఎస్‌లో ఆయన చూపిన ప్రతిభ ఆధారంగా ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్‌లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం ఇచ్చింది. సయ్యద్ అర్బాజ్ ఖురేషి విజయం కొడంగల్ ప్రాంత యువతకు స్ఫూర్తినివ్వాలని.. అతని తండ్రి రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి ఆకాంక్షించారు.

కోటగుళ్లకు మహర్దశ

'సాస్కీ' స్కీమ్‌తో కోటగుళ్లు, గణపసముద్రం అభివృద్ధి



గణపురం: కాకతీయుల కళా వైభవానికి అద్దం పట్టే 800 ఏళ్ల చరిత్ర కలిగిన మరో పుణ్యక్షేత్రం కోటగుళ్లకు ఎట్టకేలకు మహర్దశ పట్టనుంది. శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయం పూర్వవైభవం సంతరించుకొని.. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయం సరసన నిలవనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామప్ప ఆలయంతోపాటు గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్లు, గణపసముద్రం చెరువు, ఇంచర్ల గ్రామాల అభివృద్ధికి స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (సాస్కీ) స్కీమ్ ద్వారా కేంద్రం రూ.73.74 కోట్ల నిధులు కేటాయించింది. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయానికి కేవలం 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోటగుళ్లు, గణప సముద్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కోటగుళ్లలో సాస్కీ స్కీమ్‌లో భాగంగా ఆలయ పునరుద్ధరణ, ఉద్యానవనం, పిల్లలకు ఆట పరికరాలు, పార్కింగ్ ప్రాంతం, మండపం, బెంచీలు, ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నారు. అలాగే గణపసముద్రం చెరువు ప్రాంతాన్ని సుందరీకరించనున్నారు. పార్కింగ్ ప్రాంతం, కార్యాలయం, రెస్టారెంట్, మరుగుదొడ్లు, లేక్‌వ్యూ వాక్‌వే, పిల్లల ఆట స్థలం, లేక్‌వ్యూ కాటేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం, పాదచారుల మార్గం, లేక్‌వ్యూ పాయింట్, ఫ్లోటింగ్ జెట్టి, బోటింగ్ పాయింట్ తదితర పనులు చేయనున్నారు.

'మంచు' కుటుంబంలో హైడ్రామా

మనోజ్‌పై మోహన్‌బాబు దాడి చేశారంటూ సోషల్ మీడియాలో వైరల్

- నడవలేని స్థితిలో ఆస్పత్రిలో చేరిన మనోజ్
- తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదంటున్న పోలీసులు
- తనపై దాడి జరిగిందంటూ మనోజ్ డయల్–100కు కాల్ చేసినట్లు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ నటుడు మంచు మోహన్‌బాబు ఇంట్లో ఆదివారం హైడ్రామా నడిచింది. చిన్న కుమారుడు మనోజ్‌పై మోహన్‌బాబు దాడి చేశారంటూ సోషల్ మీడియాలో వైరల్ కావడం, ఉదయం డయల్–100కు కాల్ చేసిన మనోజ్ తనపై దాడి జరిగిందని చెప్పడం కలకలం సృష్టించింది. ఈ నేపథ్యంలోనే మనోజ్ నడలేని పరిస్థితిలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరడంతో అసలేం జరిగిందనే ఉత్కంఠ నెలకొంది. మనోజ్‌కు వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు, మెడికో లీగల్ కేసుగా పరిగణిస్తూ బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మాత్రం ఈ అంశంపై తమకు ఎలాంటి లిఖిత పూర్వక ఫిర్యాదు అందలేదని, డయల్–100కు కాల్ చేసిన మనోజ్ తనపై దాడి జరిగిందని మాత్రం చెప్పారని తెలిపారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

హోరెత్తిన సోషల్ మీడియా 5

పహడీషరీఫ్ పోలీసుస్టేషన్ పరిధిలోని జల్‌పల్లిలో ఉన్న ఇంట్లో తనతో పాటు తన భార్యపై దాడి జరిగిందంటూ మనోజ్ పంపినట్లుగా ఉన్న ఓ సందేశం ఆదివారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోవైపు డయల్–100 ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు జల్‌పల్లిలోని ఇంటికి వెళ్లారు. అయితే అక్కడ మోహన్‌బాబు, మనోజ్ తదితరులు ఇది తమ ఇంటి విషయమని, కుటుంబ వివాదమని చెప్పారని, దాంతో వెనుతిరిగినట్లు సమాచారం. కొద్దిసేపటికే మోహన్‌బాబు ఆదేశాల మేరకు ఆయన ప్రధాన అనుచరుడు, విద్యా సంస్థల్ని పర్యవేక్షించే వినయ్ దాడి చేసినట్లుగా మనోజ్ పేరుతో ఒక ప్రకటన బయటకు వచ్చింది. ఆ తర్వాత సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని, అలాంటిది ఏం జరగలేదని మంచు కుటుంబం పేరుతో మరో ప్రకటన వచ్చింది. దీంతో మనోజ్‌పై దాడి ఊహాజనితం అయి ఉండచ్చని అంతా భావించారు. కానీ ఆ తర్వాత కొన్ని గంటలకే మనోజ్ తన భార్యతో కలిసి నడవలేని స్థితిలో బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చారు.



బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం భార్యతో కలిసి వస్తున్న మంచు మనోజ్

కాలికి, మెడపై స్వల్ప గాయాలు

భార్య, సహాయకుడి సహకారంతో మనోజ్ కుంటుతూ లోనికి వెళ్లడంతో ఏదో జరిగిందనేది మాత్రం స్పష్టమయ్యింది. భూమా మౌనిక మాత్రం సాధారణంగానే కనిపించారు. మనోజ్ కాలికి గాయమైందని, మెడపై కూడా స్వల్ప గాయాలున్నట్లు గుర్తించిన వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం రాత్రి కొందరు సినీ, రాజకీయ పెద్దలు మంచు కుటుంబ సమస్యల్ని చక్కదిద్దే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ పరిణామాలన్నింటిపై ఎవరి నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడక పోవడం గమనార్హం.

క్లుప్తంగా...

ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టినందుకే విజయోత్సవాలు: జూపల్లి



వనపర్తి టౌన్‌: కేసీఆర్‌ నియంతృత్వ విధానాలు, అప్రజాస్వామిక పాలనకు చరమగీతం పాడి రాష్ట్రంలో మళ్లీ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించినందుకే కాంగ్రెస్‌ ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహిస్తోందని ఎక్సైజ్‌, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కేసీఆర్‌ అమరవీరుల ఆకాంక్షలు నెరవేర్చకుండా ఉద్యమకారులను అణచివేసి, ద్రోహులను అందలం ఎక్కించారని ఆరోపించారు. ఆదివారం వనపర్తిలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలసి మంత్రి జూపల్లి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర పరిపాలన కేంద్రమైన సచివాలయంలోకి ప్రజాప్రతినిధులనే రానివ్వలేదని, అలాంటి పరిస్థితులను రాష్ట్రంలో సమూలంగా తొలగించామని అన్నారు. 65 ఏళ్ల కాంగ్రెస్‌, టీడీపీ పాలనలో రూ.69 వేల కోట్ల అప్పు ఉంటే.. ఏడాదికి అసలు, వడ్డీ కలిపి రూ.6 వేల కోట్లు కట్టేవాళ్లమని, అయితే కేసీఆర్‌ హయాంలో ప్రభుత్వ, విద్యుత్‌ సంస్థల అప్పు కలిపి రూ.8 లక్షల కోట్లు ఉందని, దీంతో ఒక్క నెలకే రూ.6,500 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు వనపర్తిలో మంత్రి రూ.136 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌ ఆదర్శ్‌ సురభి, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు. కాగా.. తన సొంత నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి గైర్హాజరు కావడం పార్టీలో చర్చకు దారితీసింది.

రేపటి నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

సర్వీసును క్రమబద్ధీకరించాలని డిమాండ్‌

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష అభియాన్‌ ఉద్యోగులు ఈనెల 10 నుంచి సమ్మె చేయాలని నిర్ణయించారు. 33 జిల్లాల్లో ఈ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులంతా సమైక్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. తమను రెగ్యులర్‌ చేస్తామని గతేడాది ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి హామీ ఇచ్చారని, కానీ ఇంత వరకు ఇది కార్యాచరణకు నోచుకోలేదని వాపోయారు. అందుకే సమ్మె సైరన్‌ మోగించినట్టు తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్‌ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్‌ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. 20 ఏళ్లుగా అతి తక్కువ వేతనంతో ప్రభుత్వం శ్రమ దోపిడీకి పాల్పడుతోందని వారు ఆరోపించారు. పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడం వల్ల చస్తూ బతుకుతున్నామని వారు ఆవేదన వ్యక్తంచేశారు. తమను రెగ్యులర్‌ చేసే వరకు సమ్మె చేస్తామని ప్రకటించారు. ఉద్యోగుల సమ్మె కారణంగా కేజీబీవీలు, అర్బన్‌ రెసిడెన్షియల్‌ స్కూల్స్‌, భవిత సెంటర్లలో బోధన నిలిచిపోయే అవకాశం ఉందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. సమ్మెలో జిల్లా, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, క్లస్టర్‌ పాఠశాలల సిబ్బంది, ఉన్నత పాఠశాలల్లోని ఒకేషనల్‌ ఇన్‌స్ట్రక్టర్స్‌ పాల్గొనడం వల్ల ఆన్‌లైన్‌ పనులు మందగించే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

ఏడాది పాలన.. ఎడతెగని వంచన

- సీఎం రేవంత్‌ అజ్ఞానంతో దేశం ముందు రాష్ట్రం నవ్వులపాలు
- మూసీ ప్రక్షాళన పేరిట మూటలు వెనకేసుకునే ప్రయత్నాలు
- పెరిగిపోయిన రాజకీయ కక్ష సాధింపు చర్యలు
- బీఆర్‌ఎస్‌ నేత హరీశ్‌రావు.. కాంగ్రెస్‌ ఏడాది పాలనపై చార్జిషీట్‌



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో కాంగ్రెస్‌ ఏడాది పాలన ఎడతెగని వేదనను మిగిల్చిందని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్‌ పాలన అంతా పరపీడన పరాయణత్వంలా మారిందని విమర్శించారు. భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుతామని అధికారంలోకి వచ్చి.. ఏడాదిలోనే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఎరుగని నిర్బంధకాండను రేవంత్‌ ప్రభుత్వం అమలుచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ పాలనపై ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్‌ తరఫున హరీశ్‌రావు చార్జిషీట్‌ విడుదల చేశారు. త్వరలో ప్రభుత్వంలో జరుగుతున్న కుంభకోణాలపై మరో చార్జిషీట్‌ విడుదల చేస్తామని ప్రకటించారు. 'సీఎం సొంత ఊరికి ఎవరైనా వెళ్లాలంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి. బుల్డోజర్లతో పేదల ఇండ్లు కూల్చి ఎమర్జెన్సీని తలపిస్తున్నాడు' అని మండిపడ్డారు.

శ్వేతపత్రాల పేరిట రోత పత్రాలు..

'రేవంత్‌ పాలన ప్రతికూల దృక్పథంతో ప్రారంభం కావడంతో ప్రతికూల ఫలితాలే వస్తున్నాయి. శ్వేతపత్రాల పేరిట రోత పత్రాలు విడుదల చేసి రాష్ట్రం దివాలా తీసిందనే నెగెటివ్‌ ఇమేజ్‌ సృష్టించారు. రేవంత్‌ మార్పు పాలన దేశం ముందు నవ్వుల పాలైంది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేదు. సీఎం నిర్వహిస్తున్న శాఖల్లోనే పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయి. రాజకీయ కక్ష సాధింపు చర్యలు పెచ్చుమీరాయి. కృష్ణా నది ప్రాజెక్టులపై పదేండ్లు కేసీఆర్‌ కాపాడిన హక్కులను.. అధికారంలోకి వచ్చి నెల తిరక్కుండానే కేంద్రానికి కట్టబెట్టారు. కేసీఆర్‌ పాలనలో ఇరిగేషన్‌ పెరిగితే, రేవంత్‌ పాలనలో ఇరిటేషన్‌ పెరిగింది. రైతు సంక్షేమానికి రాహుకాలం.. వ్యవసాయానికి గ్రహణం పట్టింది. బడిలో చదువుకోవాల్సిన పిల్లలు ఆసుపత్రుల్లో కొన ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నారు. హైడ్రా రూపంలో రేవంత్‌ రెడ్డి విధ్వంసం సృష్టించారు. మూసీ ప్రక్షాళన పేరిట మూటలు వెనకేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తిక్క విధానం, తిట్ల పురాణం అవలంబిస్తున్న సీఎంకు దుర్భాష దురంధరుడు అనే బిరుదు ఇవ్వవచ్చు' అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

ఇక నిలదీయడమే!

▶ మొదటి పేజీ తరువాయి

కొనసాగిస్తున్న అణచివేత విధానాలను ఎండగట్టాలని చెప్పారు. ఆదివారం ఎర్రవల్లి నివాసంలో జరిగిన బీఆర్‌ఎస్‌ శాసనసభా పక్షం సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్‌ దిశా నిర్దేశం చేశారు. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ భేటీలో పలు అంశాలను ప్రస్తావించారు.



మాట్లాడుతున్న కేసీఆర్‌. చిత్రంలో కేటీఆర్‌, మధుసూదనాచారి, మహమూద్‌అలీ, హరీశ్‌, సబిత, పద్మారావు

నమ్మి ఓట్లేసిన వాళ్లను వేధిస్తున్నారు..

'త్యాగాలు చేసి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ఆగం చేయాలని కాంగ్రెస్‌ చూస్తోంది. నమ్మి ఓట్లు వేసిన రైతులు, గిరిజనులు, దళితులను వేధిస్తోంది. ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్‌ నేతలు, కార్యకర్తల మీద కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తోంది. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు కాళేశ్వరం అంశాన్ని ముందుకు తెచ్చింది. ఉద్యోగులకు మొండి చేయి చూపుతూ కేవలం ఒకే ఒక్క డీఏను విడుదల చేసి అది కూడా 17 వాయిదాల్లో చెల్లిస్తోంది. దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దిన గురుకుల విద్యాలయాలను కాంగ్రెస్‌ ప్రభుత్వం అస్తవ్యస్తం చేసింది. విషాహారంతో పిల్లలు చనిపోవడాన్ని చూసి సభ్య సమాజం సిగ్గు పడుతోంది. గురుకుల బాట పేరిట బీఆర్‌ఎస్‌ పార్టీ ఏర్పాటు చేసిన కమిటీని ప్రభుత్వం అడ్డుకుంది. గురుకులాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని పార్టీ కమిటీ నివేదిక ఇచ్చింది. గురుకుల విద్యా సంస్థల్లో సమస్యలపై బీఆర్‌ఎస్‌ త్వరలో కార్యాచరణ ప్రకటిస్తుంది. గురుకుల విద్యా సంస్థల్లో వైఫల్యాలను అసెంబ్లీలో ఎండగట్టాలి..' అని కేసీఆర్‌ సూచించారు.

తెలంగాణ అస్తిత్వం మీద సోయి లేదు

'తెలంగాణ అస్తిత్వం, ప్రజల ఆకాంక్షల మీద సోయి లేని సీఎం కేవలం రాజకీయ స్వార్థంతో పాటు నాపై ఉన్న కక్షతో తెలంగాణ విగ్రహం రూపురేఖలు మార్చే పిచ్చి పనులకు పూనుకుంటున్నాడు. తెలంగాణ తల్లి భావన కేవలం నాది మాత్రమే కాదు, మొత్తం తెలంగాణ సమాజానిది. కేసీఆర్‌ ఆనవాళ్లు లేకుండా చేయాలనే మూర్ఖత్వంతో సీఎం వ్యవహరిస్తున్నాడు. ప్రత్యేక ఆంధ్ర ఉద్యమ సమయంలో ఆంధ్రామాత అనే భావన ముందుకు తెచ్చిన అక్కడి నాయకత్వం తర్వాత తెలుగు తల్లిని తెరమీదకు తెచ్చి తెలంగాణ అస్తిత్వాన్ని మరిపించింది. తెలుగు తల్లి విగ్రహం ఒక రకంగా తెలంగాణ ప్రజల్లో అస్తిత్వ భావనకు ఊపిరిపోసింది. ఇక్కడి ప్రజల అస్తిత్వానికి చిహ్నంగా తెలంగాణ తల్లిని భగవత్‌ స్వరూపంలో చేతులెత్తి మొక్కేలా రూపొందించాం. అనేకమంది మేధావులు, కవులు, కళాకారులు వేలాది గంటల పాటు చర్చించి, శ్రమించి తెలంగాణ చారిత్రక సాంస్కృతిక సామాజిక నేపథ్యంలో నుంచి ప్రస్తుత తెలంగాణ తల్లి రూపాన్ని తీర్చిదిద్దారు. సమైక్య పాలనలో మరిచిపోయిన తెలంగాణ ప్రతీకలను ఉద్యమ సమయంలో పునరుజ్జీవింప చేసుకోవడానికే తెలంగాణ తల్లిని నిలుపుకున్నాం. కానీ తెలంగాణ సాంస్కృతిక వారసత్వంపై అవగాహన లేని సీఎం తెలంగాణ అస్తిత్వానికి మచ్చ తెస్తున్నారు. కొత్త రూపంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న తెలంగాణ విగ్రహం ఆవిష్కరణకు నన్ను ఆహ్వానించడం వెనుక ఉన్న కోణం, ఉద్దేశం ఏదైనా ఇంటికి వచ్చిన మంత్రికి తెలంగాణ సాంప్రదాయం ప్రకారం భోజనం పెట్టి సాదరంగా గౌరవించాం..' అని మాజీ సీఎం చెప్పారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి

'కేసీఆర్‌ ఆనవాళ్లు లేకుండా చేస్తానని విర్రవీగుతున్న ముఖ్యమంత్రి నేను చేపట్టిన అనేక పనులు, పథకాలను ప్రారంభిస్తున్నాడు. యాదాద్రి పవర్‌ ప్లాంట్‌ కేసీఆర్‌ ఆనవాలు అనే విషయం తెలియదా. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడంపై అసెంబ్లీలో నిలదీయాలి, రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని స్థిరీకరిచేందుకు దార్శనికతతో వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశాం. ఎలాంటి పరిమితులు విధించకుండా రైతుబంధును అందజేశాం. కానీ ఎన్నికల సమయంలో రైతులకు ఆశపెట్టి ఎగవేస్తున్న ప్రభుత్వ వైఖరిని అసెంబ్లీలో ఎండగట్టాలి. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల హామీల అమలుపై నిలదీయాలి. కేవలం ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడానికే పరిమితం కాకుండా గతంలో బీఆర్‌ఎస్‌ పాలనలో అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను వివరించాలి..' అని కేసీఆర్‌ చెప్పారు.

వచ్చే ఏడాదంతా సంస్థాగత నిర్మాణం

'ప్రజలు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బీఆర్‌ఎస్‌ను మాత్రమే చూస్తున్నారు. ఫిబ్రవరి చివరి వారంలో వరంగల్‌, హైదరాబాద్‌ కాకుండా అందరికీ అందుబాటులో ఉండే చోటును చాటుకుని భారీ జనసమీకరణతో సభ నిర్వహిద్దాం. వచ్చే ఏడాదంతా పూర్తిగా పార్టీ సంస్థాగత నిర్మాణం, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కార్యవర్గాల ఏర్పాటు, సంస్థాగత శిక్షణ కార్యక్రమాలపైనే దృష్టి పెడదాం. జమిలి ఎన్నికలు జరిగే పక్షంలో పెద్దగా సమయం ఉండదు. మళ్లీ అధికారంలోకి వంద శాతం మనమే వస్తాం..' అని బీఆర్‌ఎస్‌ అధినేత భరోసా ఇచ్చారు. ఈ సమావేశం అనంతరం ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ నేతృత్వంలోని పార్టీ కమిటీ కేసీఆర్‌కు 'గురుకుల బాట' నివేదిక అందజేసింది. ఈ సందర్భంగా కమిటీని కేసీఆర్‌ అభినందించారు. ఇలావుండగా హైదరాబాద్‌లో ఈ నెల 11న జరిగే తన పెద్ద కుమార్తె వివాహానికి హాజరు కావాల్సిందిగా బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌ రెడ్డి.. ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌ను, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించారు.

శీతాకాల సమరం



సమావేశంలో మాట్లాడుతున్న మండలి చైర్మన్‌ గుత్తా. చిత్రంలో స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్‌ శాంతికుమారి, చీఫ్‌ విప్‌ మహేందర్‌రెడ్డి తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఆర్‌వోఆర్‌–2020 చట్టానికి పలు సవరణలు చేసి దీనిని రూపొందించింది. 'హైడ్రా'కు చట్టబద్ధత కల్పించనుంది. మహిళా యూనివర్సిటీ, ట్రిపుల్‌ ఐటీ బిల్లులు కూడా సభ ముందుకు రానున్నాయి. ఇక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన అనంతర కార్యాచరణ, స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. రైతు రుణమాఫీ జరిగిన తీరును, రైతు భరోసా విధివిధానాలను అసెంబ్లీ వేదికగానే ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్‌ కొనుగోళ్లు, జెన్‌కో ప్రాజెక్టుల నిర్మాణంపై ఏర్పాటు చేసిన జస్టిస్‌ మదన్‌ బి లోకూర్‌ కమిటీ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించేందుకు కాంగ్రెస్‌ సర్కారు సిద్ధమవుతున్నట్టు సమాచారం. సోమవారం ఉదయం సభ ప్రారంభమైన తర్వాత తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై సీఎం రేవంత్‌ ప్రకటన చేయనున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

ఏర్పాట్లపై సమీక్షించిన మండలి చైర్మన్‌, అసెంబ్లీ స్పీకర్‌

సోమవారం నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో.. ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులతో శాసనమండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ సమీక్ష సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ప్రాంగణంలోని స్పీకర్‌ చాంబర్‌లో జరిగిన ఈ భేటీలో శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మండలి చీఫ్‌ విప్‌ పట్నం మహేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, డీజీపీ జితేందర్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు.

సభ ఔన్నత్యాన్ని కాపాడాలి: స్పీకర్‌

అసెంబ్లీ సమావేశాల్లో ఉభయ సభల హుందాతనం, ఔన్నత్యాన్ని కాపాడుతూ ప్రతి అంశంపై సమగ్రంగా చర్చించాలని స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ కోరారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని, సభకు సమర్పించే సమాధాన పత్రాలను ముందుగానే సభ్యులకు పంపాలని, సమాచారాన్ని తెలుగు, ఉర్దూ, ఇంగ్లిషు భాషల్లో ముద్రించాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని, అసెంబ్లీ సమావేశాల కోసం ప్రతి శాఖ ఓ నోడల్‌ అధికారిని నియమించుకోవాలని ఆదేశించారు. అసెంబ్లీ, మండలి భేటీలు ఎలాంటి ఇబ్బంది లేకుండా శాంతియుత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు.

పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయండి: మండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డి

సమావేశాలు జరుగుతున్న సమయంలో అసెంబ్లీ, మండలి పరిసరాల్లో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పోలీసు శాఖ జాగ్రత్తలు తీసుకోవాలని, గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని మండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదేశించారు. మండలి సభ్యుల ప్రొటోకాల్‌ విషయంలో ఇబ్బందులు వస్తున్నాయని, ఉల్లంఘనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సభ సజావుగా జరగడానికి ప్రభుత్వ పక్షం నుంచి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని చెప్పారు.

ఏయే రోజుల్లో... ఎన్నిరోజులు సమావేశాలు?

అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమైనా... ఎన్నిరోజుల పాటు, ఏయే రోజుల్లో కొనసాగుతాయన్న దానిపై సందిగ్ధత నెలకొంది. దానిపై రెండు అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. సోమవారం సభ వాయిదా పడిన తర్వాత మంగళ, బుధవారాలు మినహాయించి గురువారం నుంచి మళ్లీ సమావేశాలు జరుగుతాయని, వారం పాటు కొనసాగుతాయని చర్చ జరుగుతోంది. మరోవైపు సోమవారం తర్వాత ఈ నెల 16వ తేదీకి అసెంబ్లీ వాయిదా పడుతుందనే అభిప్రాయం వినిపిస్తోంది. గత ఏడాది డిసెంబర్‌ 9న కాంగ్రెస్‌ ప్రభుత్వం నేతృత్వంలో తొలి సమావేశాలు ప్రారంభమైనందున మళ్లీ డిసెంబర్‌ 9న సభ ప్రారంభానికి నోటిఫికేషన్‌ వచ్చిందని... అసెంబ్లీలో పలు కీలక అంశాలకు సంబంధించిన ప్రక్రియ కొంత పూర్తి కావాల్సి ఉండటంతో విరామం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. సంక్రాంతి తర్వాత రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో.. రైతు భరోసా అమలుపై విధివిధానాల రూపకల్పనపై ఏర్పాటు చేసిన సబ్‌కమిటీ మరో రెండు జిల్లాల్లో పర్యటించాల్సి ఉందని, కమిటీ నివేదికకు సమయం అవసరమని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇక సామాజిక, రాజకీయ, ఆర్థిక, కులగణనకు సంబంధించిన రిపోర్టు పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదు. ఈ రెండు అంశాలపై స్పష్టమైన ప్రకటన చేశాకే అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ముగించాలనేది అధికార పక్షం ఉద్దేశమని.. అందుకే సోమవారం తర్వాత వాయిదా వేసి, డిసెంబర్‌ 16 నుంచి తిరిగి కొనసాగించవచ్చని సమాచారం. అయితే సోమవారం జరిగే సభా వ్యవహారాల కమిటీ (బీఏసీ) భేటీలో శీతాకాల అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్‌ను ఖరారు చేయనున్నారు.

నాలుగు ఆర్డినెన్స్‌లను ప్రవేశపెట్టనున్న సీఎం

తొలిరోజు ఎజెండాను విడుదల చేసిన అసెంబ్లీ కార్యదర్శి

సోమవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాక పలు చట్టాలను సవరిస్తూ తెచ్చిన ఆర్డినెన్స్‌లను ప్రభుత్వం సభ ముందుపెట్టనుంది. తెలంగాణ జీతాలు, పింఛన్‌ చెల్లింపు, అనర్హతల తొలగింపు (సవరణ) ఆర్డినెన్స్‌.. తెలంగాణ పురపాలక సంఘాల (సవరణ) ఆర్డినెన్స్‌.. హైదరాబాద్‌ మహానగర పాలక సంస్థ (సవరణ) ఆర్డినెన్స్‌.. తెలంగాణ వస్తువుల, సేవల పన్ను (సవరణ) ఆర్డినెన్స్‌లను సభ ఆమోదం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదించనున్నారు. అనంతరం తెలంగాణ పవర్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ తొమ్మిదో వార్షిక నివేదిక (2022–2023)ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్‌ ఏడో వార్షిక నివేదిక (2021–2022)ను అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అసెంబ్లీలో ప్రవేశపెడతారు. ఆ తర్వాత తెలంగాణ పంచాయతీరాజ్‌ చట్టసవరణకు సంబంధించిన ఆర్డినెన్స్‌ను సంబంధిత మంత్రి సీతక్క ప్రవేశపెడతారు. చివరగా తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయనున్నారు. శాసనమండలిలో కూడా తొలిరోజున ఇదే ఎజెండా అమలు కానుంది. ప్రభుత్వం తరఫున ప్రకటనను మండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేస్తారు. ఈ మేరకు అసెంబ్లీ, కౌన్సిల్‌ షెడ్యూల్‌ను అసెంబ్లీ కార్యదర్శి వి నర్సింహాచార్యులు ఆదివారం విడుదల చేశారు.

అది చార్జిషీట్‌ కాదు..

పదేళ్ల పాలన డిశ్చార్జ్‌ రిపోర్ట్‌



బీఆర్‌ఎస్‌ చార్జిషీట్‌పై మంత్రి పొంగులేటి ఫైర్‌

- రాష్ట్రాన్ని గాడిన పెట్టడంలో ప్రజా ప్రభుత్వం విజయం సాధించింది
- అధికారాన్ని కోల్పోయిన నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారు

సాక్షి, హైదరాబాద్‌: పదేళ్ల పాటు బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టడంలో ప్రజా ప్రభుత్వం విజయం సాధించిందని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం, సమాచార.. పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. అధికారాన్ని కోల్పోయిన బీఆర్‌ఎస్‌ నాయకులు ఉక్కిరిబిక్కిరవుతూ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చార్జిషీట్‌ అంటూ ఆ పార్టీ నివేదిక విడుదల చేసిందని, కానీ అది పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలన డిశ్చార్జ్‌ రిపోర్ట్‌ అని ఎద్దేవా చేశారు. ఆదివారం సచివాలయంలో రెవెన్యూ, హౌసింగ్‌, సమాచార..పౌరసంబంధాల శాఖల ప్రగతి నివేదికల విడుదల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ పదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ ధ్వంసం చేశారని, మొత్తంగా తుగ్లక్‌ పాలనను తలపించి ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేశారని పొంగులేటి ఆరోపించారు. ప్రజల స్వేచ్ఛను హరించారని, పోలీసులను కార్యకర్తల్లా వాడుకున్నారని ధ్వజమెత్తారు. ధర్నాచౌక్‌ను ఎత్తివేసి ప్రజాస్వామ్యానికే తలవంపులు తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావుకు ఇంకా జ్ఞానం రాలేదన్నారు.

ధరణి దరఖాస్తులన్నీ పరిష్కారమయ్యేలా చూస్తాం

'ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంటనే ధరణిని ప్రక్షాళన చేసే ప్రక్రియను వేగవంతం చేశాం. పోర్టల్‌ నిర్వహణను గతంలో ఓ అంతర్జాతీయ సంస్థకు అప్పగించారు. దాన్ని ఈ ఏడాది డిసెంబర్‌ 1నుంచి కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్‌ఐసీకి అప్పగించాం. ధరణి మాడ్యూల్స్‌ తగ్గిస్తున్నాం. పహాణీలో ఇదివరకు 33 కాలమ్స్‌ ఉండేవి. వాటిని 11 నుంచి 13 వరకే పరిమితం చేస్తున్నాం. ఇకపై ఆన్‌లైన్‌లో దరఖాస్తు పెట్టుకున్న ప్రతి అర్జీదారు సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం. ధరణి సమస్యల పరిష్కారానికి ఈ ఏడాది మార్చి 1 నుంచి 15 వరకు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించాం. గతంలో పెండింగ్‌లో ఉన్న 2.46 లక్షల దరఖాస్తులతో పాటు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించగా వచ్చిన 1.38 లక్షల దరఖాస్తుల్లో చాలావరకు పరిష్కరించాం. కొత్తగా ఆర్వోఆర్‌–2024 చట్టం సిద్ధమైంది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఉభయ సభల్లో ఈ బిల్లును ఆమోదింపజేసి అమలు చేస్తాం.

పాత వీఆర్వో, వీఆర్‌ఏలకు పరీక్ష పెడతాం

'గ్రామాల్లో రెవెన్యూ పాలనకు అధికారులుండేవారు. గత ప్రభుత్వం వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో పెద్ద సంఖ్యలో రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామానికీ ఓ రెవెన్యూ అధికారిని నియమిస్తున్నాం. రాష్ట్రంలో 10,954 రెవెన్యూ గ్రామాలున్నాయి. సంక్రాంతి తర్వాత ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి ఉంటారు. ఇదివరకు పనిచేసిన వీఆర్వో, వీఆర్‌ఏలకు ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించి గ్రామాలకు తిరిగి పంపిస్తాం. ప్రజాపాలనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తొలివిడత 4.5లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బీఆర్‌ఎస్‌ పాలనలో పూర్తికాకుండా పెండింగ్‌లో ఉన్న డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లను ప్రజా ప్రభుత్వం పూర్తి చేస్తుంది..' అని మంత్రి చెప్పారు. ప్రజాపాలన విజయోత్సవాల తర్వాత జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి చర్చిస్తామని, ఆ తర్వాత సీఎంతో జరిగే మరో సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

నేను జనం మనిషిని

- నాడు విప్లవోద్యమంలో.. నేడు ప్రజాక్షేత్రంలో: సీతక్క



మహబూబాబాద్‌ రూరల్‌: 'నేను జనం మనిషిని. నాడు విప్లవోద్యమంలో పనిచేశాను. నేడు ప్రజాక్షేత్రంలో ప్రజలకు సేవ చేస్తున్నా' అని పంచాయతీ రాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ఆదివారం మహబూబాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కాంగ్రెస్‌ ప్రభుత్వాన్ని పడగొట్టాలని కుట్రలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర కేబినెట్‌లో అర్బన్‌ నక్సలైట్లు ఉన్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ అన్న వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు మంత్రి తెలిపారు. 'నేను మాత్రమే నక్సల్‌ ఉద్యమంలో పాల్గొన్నాను. వరంగల్‌ కోర్టులో న్యాయవాదిగా పనిచేశాను. మూడు సార్లు ప్రజా ప్రతినిధిగా ఎన్నికయ్యాను' అని గుర్తు చేశారు. బీజేపీలో ఉన్న ఈటల రాజేందర్‌, బొడిగె శోభ ఏ భావజాలం కలిగినవారో బండి సంజయ్‌ తెలుసుకోవాలని హితవు పలికారు. తాను దొడ్డిదారిన రాలేదని, ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచానని, నేరుగా బండి సంజయ్‌ తనను కామెంట్‌ చేయాలి తప్ప కేబినెట్‌ మొత్తాన్ని అనడం సరికాదని అన్నారు. తెలంగాణలో ఎంతో మంది మావోయిస్టులను బీజేపీలో చేర్చుకోలేదా? అని నిలదీశారు. ఈ సమావేశంలో మహబూబాబాద్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ భూక్య మురళీనాయక్‌ పాల్గొన్నారు.



గొప్ప మనిషి ఎప్పుడూ ఒదిగి ఉండటానికి సిద్ధంగా ఉంటాడు.
- రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 9 డిసెంబర్ 2024

లెక్కలు, చిక్కులు

లెక్కల్లో ఎంత పండితుడైనా ఓడిపోయే చిక్కులెక్కలు ఉంటూనే ఉంటాయి; లెక్క తప్పే సందర్భాలు మనిషికి ఎదురవుతూనే ఉంటాయి. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి 'వడ్లగింజలు' కథే చూడండి; అందులో శంకరప్ప అనే చదరంగ నిపుణుడు అంతే ప్రవీణుడైన 'శ్రీ వత్సవాయి చతుర్భుజ తిమ్మజగపతి మహారాజులుంగారి' ఆట కట్టిస్తాడు. అప్పుడా మహారాజు, తన పెద్దాపురం రాజ్యంలో ఉన్నదేదైనా సమర్పించుకుంటాను, సెలవివ్వండని అడుగుతాడు. ఒక వడ్లగింజతో మొదలుపెట్టి చదరంగంలోని అరవై నాలుగు గడుల్లోనూ గింజల్ని రెట్టింపు చేస్తూపోతే ఎన్ని గింజలవుతాయో అన్ని ఇప్పించండని శంకరప్ప అడుగుతాడు. ఓస్, అంతేకదా అనుకున్న రాజుగారు లెక్క కట్టమని షరాబును ఆదేశిస్తాడు. పెద్దాపురం రాజ్యంలోనే కాదు, త్రిలింగదేశం మొత్తంలో నూరేళ్లపాటు పండించిన ధాన్యం కూడా ఆయనకు ఇవ్వడానికి సరిపోదని అతను సెలవిస్తాడు.

మన లెక్కలనూ, అంచనాలనూ చిత్తు చేస్తున్నవాటిలో జనాభా సమస్య ఒకటి. ఆ లెక్క కూడా దాదాపు ఇలాగే మనల్ని చిక్కుల కీకారణ్యంలోకి తీసుకెళ్ళి విడిచిపెడుతుంది. ప్రపంచం మహాజన సాగరంగా మారుతున్న వైనాన్ని గమనించి దానిని ఎలా ఈదాలో ప్రణాళికలు వేయడం డెబ్బై ఏళ్ల క్రితం మొదలుపెట్టాం. ఏవో కొండ గుర్తులు పెట్టుకుని, సంకల్పాలు చెప్పుకుని ఈదడమైతే ప్రారంభించాం కానీ, జనసముద్రం విస్తరిస్తూనే ఉంది. ఒక జంటకు ఇద్దరనే నినాదంతో ప్రారంభించి చివరికి ఒక్కరే చాలనుకోవడానికి అలవాటుపడ్డాం.

ఇంతలోనే ఈ లెక్క మారిపోతోంది; ఒకరూ, ఇద్దరితో సరిపెడితే ప్రమాదంలో పడతాం, ముగ్గురు, నలుగురిని కని తీరాలన్న నినాదం మన దగ్గర ఇప్పుడిప్పుడే శ్రుతి పెంచుకుంటోంది. దీనికి ఎవరి కారణాలు వారికే ఉన్నాయి. ఉదాహరణకు, ఒకరూ, ఇద్దరితో సరిపెడితే క్రమంగా వృద్ధుల సంఖ్య పెరిగి, యువకుల సంఖ్య తగ్గి అభివృద్ధికి తోడ్పడే విలువైన మానవ వనరుకు కొరత వస్తుందన్నది ఒక కారణం. పెరిగిన జనాభాను బట్టి లోక్ సభ, శాసన సభల్లోని స్థానాల సంఖ్యను పెంచుకోవలసి ఉంటుంది కనుక, అందువల్ల జననాలను నియంత్రించని ఉత్తరాది రాష్ట్రాలలో స్థానాల సంఖ్య పెరిగి, అన్నింటిలోనూ వారిదే పై చేయిగా మారుతుందనీ; దానితో జననాలను నియంత్రించిన రాష్ట్రాలకు అన్యాయం జరిగి, ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలుగుతుందన్నది మరో కారణం. నియంత్రణను పాటించిన అధిక సంఖ్యాక మతస్థులను మించి నియంత్రణను పాటించని అల్పసంఖ్యాక మతస్థుల సంఖ్య పెరిగిపోతుందన్నది మరికొందరు ముందుకు తెచ్చే కారణం. కారణమేదైనా నినాదం మారుతుండడం నిజం.

రెండు లక్షల సంవత్సరాల క్రితం ఆఫ్రికాలో 'హోమో సేపియన్స్' అనే ఆధునిక మానవుడు అవతరించడంతో మొదలుపెట్టి ఇప్పటివరకూ వస్తే జనాభా గణాంకాలు చిక్కులెక్కలుగానే కాదు చిత్రవిచిత్రాలుగానూ రూపుకడతాయి. హోమోసేపియన్స్ తొలి వృద్ధి రేటు కేవలం 0. 011 శాతం అయితే, ఆ శాతం ఏ కొంచెమైనా పెరుగుతూ 19వ శతాబ్ది ప్రారంభానికి వందకోట్లకు చేరడానికి వేల సంవత్సరాలు పట్టింది. అప్పటి నుంచి అది పెరుగుతూనే ఉండి, అతి స్వల్ప కాలంలోనే ఏడు వందల కోట్లకు చేరింది. మరో ఇరవయ్యేళ్లలో తొమ్మిది వందల కోట్లకు చేరుతుందని అంచనా. సమస్యను ఐక్యరాజ్యసమితి తన చేతుల్లోకి తీసుకుని పరిష్కరించడానికి ఎన్ని ప్రణాళికలు వేసి, ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా సమస్య ఎందుకు విషమిస్తూనే ఉందంటే, అభివృద్ధిలో దేశాల మధ్య తేడాలు, పేద, ధనిక వ్యత్యాసాలు మొదలైనవి కారణం.

పారిశ్రామిక విప్లవానికి లానే జనాభావృద్ధికీ, క్షీణతకూ కూడా యూరప్ తొలి ప్రయోగశాల అయింది. శాస్త్ర, సాంకేతిక అభివృద్ధీ, దానితోపాటే ఆహార పుష్కలత్వం, చదువూ సంధ్యా పెరగడంతోనే యూరప్ లో జనాభా పెరిగి క్రమంగా క్షీణిస్తూనూ వచ్చింది. సరిగ్గా ఇవే కారణాలతో వర్ధమానదేశాలలో కూడా జనాభా పెరగడం, ఆ తర్వాత క్షీణించడం మొదలైంది కానీ వృద్ధి రేటుకు ఆ క్షీణత రేటు తులతూగడం లేదు. యూరప్ తర్వాత ఆసియాదేశాలు జనాభావృద్ధిలో అగ్రస్థానానికి వస్తే, ఇప్పుడా ఘనతను ఆఫ్రికా దేశాలు చేజిక్కించుకోబోతున్నాయి. ఇక్కడొక ఆసక్తికర వివరం ఏమిటంటే, 1950లలో మొత్తం ఆసియా దేశాల జనాభా 140 కోట్లు అయితే ఇప్పుడు దానిని కూడా మించిన జనాభా ఒక్క మన దేశంలోనే ఉంది.

అభివృద్ధికీ, ఆహార పుష్కలత్వానికీ, జనాభా వృద్ధికీ ఉన్న పీటముడిని మన ప్రాచీనులు సైతం గుర్తించారనడానికి మహాభారతమే సాక్ష్యం. పెరిగిన జనాభా భారాన్ని మోయలేకపోతున్నానని భూదేవి మొరపెట్టుకున్నప్పుడు, ఆహార లభ్యత వల్ల జనాభా పెరిగిందని, త్వరలోనే కురుపాండవుల మధ్య యుద్ధమొచ్చి పెద్ద ఎత్తున జననష్టం జరిగి నీ భారం తగ్గుతుందని చెప్పి బ్రహ్మ ఆమెను ఊరడిస్తాడు. విశేషమేమిటంటే, 18వ శతాబ్ది చివరినాటికి యూరప్ అనుభవాన్ని గమనించిన థామస్ రాబర్ట్ మాల్తస్ అనే ఆర్థికవేత్త కూడా ఆహార లభ్యతకూ జనాభావృద్ధికీ ఉన్న సంబంధాన్ని నొక్కి చెప్పి, రోగాలు, కరవు కాటకాలు, యుద్ధాలే దానిని నియంత్రిస్తాయంటాడు. అలాంటి విధ్వంసక మార్గంలో కాకుండా విద్యా, విజ్ఞానాల ఊతతో జనమహాసాగరాన్ని ఈదడానికి మనం ఉపక్రమించి ఇంకా అందులోనే మునిగితేలుతున్నాం. ఇంతలోనే నినాదం మారిపోయి సమస్యను మళ్ళీ మొదటికి తెస్తోంది; అదీ సంగతి!

ఈ దేశానికి ఏమైంది?

విశ్లేషణ



కరణ్ థాపర్


దేశంలో చాలా ఘటనలు జరుగుతుంటాయి. కానీ రెండు మాత్రం జరగకూడనివి జరిగాయి. 800 ఏళ్ల నాటి ప్రశస్త చరిత్ర గల అజ్మీర్ షరీఫ్ దర్గా మీద హిందూ సేన కోర్టులో కేసు వేయడం మొదటిది. ఈ దర్గాను లక్షలాదిమంది సందర్శిస్తారు. ఇందులో ముస్లింలే కాదు, హిందువులు కూడా ఉంటారు. దాని కింద శివాలయం ఉందన్నది అభియోగం. నిజంగా ఆలయాన్ని వెలికితీయాలని దీని ఉద్దేశం అనుకోను. కేవలం ముస్లింలను పీడించడం మాత్రమే దీని వెనుక ఉన్న కారణం. ఇక రెండో ఘటనలో బంగ్లాదేశీయులకు వైద్యం చేయరాదని రెండు ఆసుపత్రులు తీర్మానించడం! కులమతాలు, జాతులకు అతీతంగా వైద్యం చేయాలన్న నైతికతకు ఇది విరుద్ధం. ఈ దేశానికి ఏమయ్యింది?

నిజాయితీగా చెప్పాలంటే.. సరైన పదం కోసం వెతుక్కుంటాను నేనిప్పుడు. ఈ మధ్య కాలంలో జరిగిన రెండు పరిణామాలు నన్నీ స్థితికి చేర్చాయి. అర్థం చేసుకోలేనిది అందామా? దూషించదగ్గది అని కూడా అనలేను. బహుశా విచిత్రమైంది అనవచ్చునేమో! ఎందుకంటే ఆ రెండు పరిణామాలు ఆశ్చర్యం కలిగించేవి మాత్రమే కాదు.... అసాధారణమైనవి కూడా! ఇంతకీ ఏమిటా సంఘటనలు?

నిజానికి ఇలాంటివి చాలానే చోటుచేసుకుంటున్నాయి ఈమధ్య. మొదటి ఘటన... 800 ఏళ్ల పురాతనమైన అజ్మీర్ షరీఫ్ దర్గాపై కోర్టులో వేసిన వ్యాజ్యం. శివాలయం ఒకదాన్ని ధ్వంసం చేసి దర్గా కట్టారన్నది పిటిషనర్ల ఆరోపణ. దేని ఆధారంగా ఈ కేసు వేశారంటే... 1910లో హర్ బిలాస్ సర్దా రాసిన పుస్తకం!

ఇది విన్న వెంటనే ''అయితే ఏంటి?'' అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ఢిల్లీలోని నేనుండే వసంత్ విహార్ కింద పృథ్వీరాజ్ చౌహాన్ కాలం నాటి రాజదర్బార్ ఉంటే ఉండవచ్చు. హిందూసేన లాంటివి ఏవో కోర్టులో కేసు వేసి... నా ఇల్లు తవ్వి చూస్తానంటే మాత్రం నేను కేకలు పెట్టాల్సి వస్తుంది. ఎప్పుడో 800 సంవత్సరాల క్రితం జరిగిందంటున్న ఘటన అది. నిజమో కాదో, కేవలం నమ్మకమో తెలియదు. ఉంటే చారిత్రక ప్రాసంగికత ఉంటుంది తప్ప, వందల మంది పూజించే దర్గాను కూల్చేసేందుకు ఇవేవీ కారణాలు కారాదు. దేశవిదేశాల్లోని హిందూ, ముస్లింలు లక్షలు, కోట్ల మంది అజ్మీర్ దర్గాను సందర్శిస్తుంటారు. ప్రార్థనలు చేస్తుంటారు.

పోనీ... హిందూ సేన అనేది నిజంగానే ఎప్పుడో కనిపించకుండా పోయిన శివాలయాన్ని వెతికే పనిలో ఉందా? నాకు డౌటే! ముస్లింలను హింసించాలనీ, దర్గాను నాశనం చేయాలనీ తద్వారా ముస్లింలకు వారి స్థాయి ఏమిటో చూపాలన్నదే లక్ష్యమన్నది నా అభిప్రాయం. చరిత్ర గతిలో జరిగిన తప్పులను సరిచేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పడం ప్రతీకారం తీర్చుకోవడమే అవుతుంది కానీ న్యాయం కోసం చేస్తున్న పనిలా అనిపించదు. ఇది ఫక్తు ముస్లిం వ్యతిరేకత. వారి చరిత్ర, సంస్కృతి, వారికి స్ఫూర్తినిచ్చే మతంపై వ్యతిరేకత



అజ్మీర్ షరీఫ్ దర్గా

మాత్రమే.

నేను ఓ హిందువును. అందుకు గర్విస్తా. అయినంత మాత్రాన ఇలాంటి పిటిషన్లకు ఏమాత్రం మద్దతివ్వను. హిందువుల పేరు చెప్పి బలవంతంగా ఈ అకృత్యం చేయవద్దని విస్పష్టంగా, గట్టిగా అరుస్తా. కానీ ఇలా చేస్తే ఒక ప్రశ్న వస్తుంది. ఇలా అరిచి గీపెట్టే కదా కొంతమంది తమ ఇమేజీని పెంచుకుంటున్నదీ అని! ఇలాంటి చేష్టలపై న్యాయస్థానాలు కొంచెం సీరియస్‌గా ఆలోచించి చర్యలు తీసుకోవాలి కదా? కానీ అలా ఎందుకు చేయడం లేదు? దేశం రెండు ముక్కలవుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం విచిత్రమే!

రెండో ఘటన... మొదటిదాని కంటే ఎక్కువ బాధపెట్టేది. కోల్‌కతా, త్రిపురల్లోని కొన్ని ఆసుపత్రుల వైద్యులు తాము బంగ్లాదేశీయులకు చికిత్స చేయమని భీష్మించుకున్నారు. ఎంత చిల్లరతనం? అపోహలతో కూడిన ద్వేషం? బంగ్లాదేశ్‌లో ఎవరో భారతీయ జాతీయ పతాకాన్ని అగౌరవ పరిచారన్న వార్తలు చదివి వీరు ఇలా తీర్మానించారట! కోల్‌కతాలో ప్రఖ్యాతి గాంచిన జే.ఎస్.రే ఆసుపత్రి, అగర్తలలోని ఐఎల్ఎస్ ఆసుపత్రులు వీటిల్లో ఉండటం విచారకరం. జే.ఎస్.రే ఆసుపత్రి డైరెక్టర్ శుభ్రాంశు భక్త తమ నిర్ణయంపై ఇచ్చిన వివరణ ఏమిటంటే... ''దేశం అన్నింటి కంటే గొప్పది. దేశాన్ని కాదని ఏ పనీ జరగదు. వైద్యవృత్తి చాలా పవిత్రమైంది. కానీ దేశం పరువు మర్యాదలు అంతకంటే పెద్దవి. మిగిలిన ఆసుపత్రులు కూడా ఇదే పని చేయాలి'' అంటూ సమర్థించుకున్నారు.

బాగానే ఉంది కానీ... వైద్యవృత్తిలోకి అడుగుపెట్టేటప్పుడు చేసిన హిపొక్రటిక్ ప్రమాణం మాటేమిటి? రోగులందరికీ వైద్యం అందించాల్సిన నైతిక బాధ్యత మాటేమిటి? కులమతాలు, జాతులకు అతీతంగా స్త్రీ, పురుష భేదం లేకుండా వైద్యం అందించాలని కదా హిపొక్రటిక్ ఓత్ చెప్పేది? వైద్యులు అందరూ గర్వంగా చెప్పుకునే వృత్తి గౌరవం మాటేమిటి? ఎక్కడో... ఎవరో కొందరు అనామక బంగ్లాదేశీయులు త్రివర్ణ పతాకాన్ని తొక్కి ఉండవచ్చునన్న వార్తకే వీటన్నింటినీ పక్కన పెట్టేయాలా? వదిలేసుకోవాలా?

నిజంగానే విచిత్రమైంది ఇది. అవసరమైన సమయంలో వైద్యం చేయనని భీష్మించిన వైద్యుడు నా జీవితంలో ఇప్పటివరకూ ఒక్కరూ తగల్లేదు. బ్రిటన్‌లో ఓ పర్యాటకుడు ఫుట్‌పాత్ మీద కుప్పకూలిపోతే అక్కడి ప్రభుత్వ నేషనల్ హెల్త్ సర్వీసెస్ అత్యవసర వైద్యం అందిస్తుంది. విదేశీయుడా? అని చూడదు. నిజానికి ఇలా చేయడం నైతిక ధర్మం మాత్రమే కాదు... గౌరవ మన్ననలకు పాత్రమైనవి. రోగులు కూడా సాటి మనుషులేగా? కోల్‌కతాలోని కొంతమంది డాక్టర్లకు మాత్రం బంగ్లాదేశీయులైతే మనుషులుగా కనిపించడం లేదేమో!

సరైన పదం కోసం వెతుక్కుంటున్నానని చెప్పాను కదా... ఇందుకే! ఈ పనులు చేసిన వారి తప్పు ఒప్పులు ఎన్నాలన్నది నా ఉద్దేశం కాదు. కానీ... ఎందుకు తప్పుపట్టకూడదో తెలియక నేను పడుతున్న ఇబ్బందిని వాళ్లకు చెప్పాలని మాత్రం ఉంది. విచిత్రం అని అందామంటే... సాదాసీదాగా ఉంటుంది. ఒకరకంగా మనకు సంబంధం లేనిదన్నట్టుగా అవుతుంది. అసాధారణం, అనూహ్యం కావచ్చు. అనవసరం కూడా కావచ్చు. ఈ రెండు ఘటనలనూ వివరించేందుకు మీకు ఇంకా ఏదైనా మంచి పదం తోస్తే చెప్పండి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇష్టానికి వ్యతిరేకంగా...

వర్తమాన సంవత్సరం మరికొద్ది రోజుల్లో ముగుస్తున్నది. దయచేసి మీరు సాధించని వాటిపై దృష్టి పెట్టడం మానేసి, ఇంతవరకు ఏం చేశారో అవి చూడండి. ముఖ్యంగా మీరు వ్యతిరేకించేవి. అది చాలా పెద్ద విషయం.

- అస్మా , సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్



వెళ్తూనే ఉండాలా?

చిన్నప్పుడు నా ఫైనల్ రిపోర్ట్ కార్డ్‌ను తీసుకోవడానికి సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే నాన్న పాఠశాలకు వచ్చేవాడు. లేదా తల్లితండ్రులను స్కూలుకు పిలిపించారంటే ఏదైనా క్రమశిక్షణా సమస్య ఉండేది. కానీ ఇప్పుడు తల్లితండ్రులు గేట్ డ్యూటీ, లంచ్ డ్యూటీ, సౌత్ ఆఫ్రికా డే, మొక్కలు నాటే రోజు అంటూ పాఠశాల చుట్టే తిరగాల్సి వస్తోంది.

- నయోమి దత్తా, మీడియా పర్సనాలిటీ



మరెందుకు ఫిర్యాదు?

తల్లితండ్రులుగా ఉండటం గురించి తల్లితండ్రులు ఫిర్యాదు చేయడం పట్ల నేను విసిగిపోయాను. పిల్లల పెంపకం కష్టమైన పని అని అందరికీ తెలుసు. కానీ మీరు తెలిసీగా అందులోకి దిగారు, అది పిల్లల తప్పు కాదు కదా!

- ఇంతియాజ్ మహమూద్, వ్యాఖ్యాత



జీవితపు దశలు

తల్లితండ్రులుగా, మనం మన పిల్లల మొదటి వేడుకలను జరుపుకొంటాం. మొదటి నవ్వు, మొదటి అడుగులు, మొదటి మాటలు. అదే పిల్లలుగా మనం మన తల్లితండ్రుల చివరి వాటి గురించి దుఃఖిస్తాం. చివరి నవ్వు, చివరి అడుగులు, చివరి మాటలు.

- డేనియల్ హాఖీఖత్‌జో, రచయిత



స్వదేశ ఎడబాటు

బోస్నియాను విడిచి వెళ్తున్నప్పుడు– నేను డిసెంబరులో తిరిగి వస్తాను, ఆపై ఫిబ్రవరిలో వస్తాను, ఆపై వేసవి కాలం వస్తాను అని తెలుసు. అయినా ఎడబాటు భావన ప్రతిసారీ నన్ను కుప్ప కూలుస్తుంది. ప్రతి వీడ్కోలూ నా ఆత్మలోని ఒక చిన్న భాగాన్ని తీసుకున్నట్లుగా అనిపిస్తుంటుంది.

- అర్నేసియా బుల్బుస్మిక్ కుస్తూరా, పరిశోధకురాలు



నిలబడవా?

మా ఫ్రెండ్ సర్కిల్‌లో యాభై శాతం జంటలు విడాకులు తీసుకున్నాయి. చాలా మంది విడిగా జీవిస్తున్నారు. కొందరు ఒప్పుకున్న పనుల వల్ల ఇల్లు మారడం లేదు. ఏదోలా నెట్టుకొస్తున్నవారికి కూడా తమవైన సమస్యలు ఉండనే ఉన్నాయి. పవిత్ర వివాహాలకు ఏం జరుగుతోంది?

- ఎ.అనామిక, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్



అన్నీ జరగవా?

మీరు విదేశాలకు వెళ్తేగనక, రోడ్లు, సంస్థల విషయంలో ఇండియా ఎంత సాధారణంగా ఉందో తెలిసొస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విమానాశ్రయాలు, టెలికామ్ సేవల లాంటివి అచ్చెరువు గొలువుతాయి నిజమే. కానీ అదే రోడ్లు, గాలి, నీరు, విద్య, వైద్యం విషయాల్లో ఎందుకు జరగదు?

- హసిత్ సేఠ్, వ్యాఖ్యాత

ఎన్ని అడ్డంకులు ఎదురైనా...

సందర్భం



బి. మహేశ్ కుమార్ గౌడ్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి రెండు పండుగలను జరుపుకుంటున్నాం. గడీలపాలన, ఫామ్ హౌస్ పాలన, అవినీతి పాలనకు చరమగీతం పాడిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా 'ప్రజా పాలన విజయోత్సవాల' పండుగను ఒకవైపు; తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ జన్మదిన ఉత్సవాలను మరోవైపు ఘనంగా నిర్వహించుకుంటున్నాం.

ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను గుర్తించిన సోనియాగాంధీ దానిని నెరవేర్చడానికి 2000 నుండి 2014 వరకు ఎన్నో కష్టనష్టాలను భరిస్తూనే వ్యూహాత్మకంగా అడుగులేశారు. కేసీఆర్ 2001లో టీఆర్ఎస్ స్థాపించక ముందే కాంగ్రెస్ తరఫున రాష్ట్ర ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ఉమ్మడి ఏపీలో 2000లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు తెలంగాణకు చెందిన 41 మంది ఎమ్మెల్యేలు రాష్ట్ర ఏర్పాటును కోరుతూ సోనియా గాంధీకి వినతిపత్రం ఇచ్చినప్పుడు ఆమె స్పందిస్తూ 'మీ సమస్యలు నాకు తెలుసు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి ఆలోచిస్తాను' అని సానుకూలంగా చెప్పడంతో తెలంగాణ ఏర్పాటుకు తొలి అడుగు పడింది. మాట ఇచ్చినట్టే ఆమె ఏఐసీసీ తరఫున అప్పటి వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి లేఖ రాస్తూ తెలంగాణ రాష్ట్రం కోసం రెండవ రాష్ట్ర పునర్విభజన సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరగా ఆనాటి హోం మంత్రి అద్వానీ దాన్ని తిరస్కరించారు.

2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. కాంగ్రెస్‌కు సొంతంగా మెజార్టీ రాకపోవడంతో ఇతర పార్టీలపై ఆధారపడి ప్రభుత్వాన్ని నడిపించాల్సిన పరిస్థితుల్లో ఆమె భాగస్వామ్య పక్షాలను ఎంతో చాకచక్యంగా రాష్ట్ర ఏర్పాటుకు ఒప్పించారు. ఉమ్మడి ఏపీలో పార్టీలకు అతీతంగా కొందరు సీనియర్ నేతలు కూడా తెలంగాణ ఏర్పాటుకు అయిష్టంగా ఉండడంతో ఎదురైన ఆటంకాలను తొలగించడానికి ఆమె ప్రణబ్‌ముఖర్జీ, చిదంబరం వంటి సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న 'కామన్ మినిమమ్ ప్రోగ్రాం'లో తెలంగాణ అంశం చేర్చడం, రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ గురించి ప్రస్తావించేలా చర్యలు తీసుకున్నారు.

ఎవరూ ఊహించని రీతిలో 2009 డిసెంబర్ 9న అప్పటి కేంద్ర హోం మంత్రి చిదంబరం చేత తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు ప్రకటన ఇప్పించారు. ఈ ప్రకటనతో రాష్ట్ర ఏర్పాటు షురూ అయిన దశలో తెలంగాణకు బేషరతు మద్దతిస్తామని చెప్పిన బీజేపీతోపాటు మరికొన్ని పార్టీలు గోడ మీద పిల్లిలా వ్యవహరించాయి.

యూపీఏ ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో భాగంగా 'శ్రీకృష్ణ కమిటీ'ని ఏర్పాటు చేసింది. సీడబ్ల్యూసీ తెలంగాణ రాష్ట్ర తీర్మానం చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపచేసి, బిల్లును ఉమ్మడి ఏపీ అసెంబ్లీకి



పంపారు. అసెంబ్లీలో తెలంగాణ సభ్యులు తక్కువగా ఉండడంతో దురదృష్టవశాత్తు బిల్లు మూజువాణి ఓటుతో వీగిపోయింది. అయినా సోనియాగాంధీ చలించకుండా రాజ్యాంగ పరిధిలో, చట్టప్రకారమే చర్యలు తీసుకొని తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు.

రాష్ట్ర విభజనతో రాజకీయంగా ఒక ప్రాంతంలో నష్టం జరుగుతుందని తెలిసినా, అవకాశవాద రాజకీయాలకు పాల్పడకుండా తెలంగాణ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చడానికి ఇచ్చిన మాటకు కట్టుబడిన త్యాగశీలి సోనియా గాంధీ. దీనికి భిన్నంగా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ పార్టీగా చెప్పుకున్న బీఆర్ఎస్ అధినేత రాష్ట్ర ఏర్పాటుకు ముందు, తర్వాత కూడా అడుగడుగునా వంచనకు పాల్పడ్డారు.

తెలంగాణ ఏర్పాటు చేస్తే తమ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తామని, తాము సోనియా గాంధీకి ఎంతో రుణపడి ఉన్నామని కుటుంబ సమేతంగా సోనియా గాంధీని కలిసి చెప్పిన కేసీఆర్ మోసం చేశారు. అనంతరం తెలంగాణకు తొలుత దళిత ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి చివరికి తానే సింహాసనం ఎక్కారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో గద్దెనెక్కి గడీలపాలన చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను మరచి ఆ కుటుంబాలను తీవ్రంగా నిర్లక్ష్యం చేశారు. కవులు, రచయితలు, కళాకారులు, విద్యావేత్తలు, మేధావులు ఇలా అన్ని రంగాల వారు తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించినా... కేసీఆర్ అధికారంలోకి వచ్చాక అంతా తన వల్లే అయ్యిందనే అహంకార ధోరణితో వారిని కనీసం కలుసుకోవడానికి కూడా ఇష్టపడలేదు. రూ. 16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని రూ. 7 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారు.

తెలంగాణ ఏర్పాటులో మా పాత్ర కూడా ఉందని రాష్ట్ర బీజేపీ నేతలు ఒకవైపు చెబుతుంటే, మరోవైపు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాత్రం తెలంగాణ ఏర్పాటుపై 'తల్లిని చంపి బిడ్డను తీశారు' అంటూ అవమానకరమైన రీతిలో వ్యాఖ్యానించారు. మనస్ఫూర్తిగా కాకుండా తప్పని పరిస్థితుల్లో మాత్రమే బీజేపీ నాడు తెలంగాణ ఏర్పాటుకు మద్దతిచ్చిందని ఈ వ్యాఖ్యలే నిరూపిస్తున్నాయి.

సెంటిమెంట్‌తో రెండు సార్లు అధికారం చేపట్టిన కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అధోగతి పాలయ్యిందని ప్రజలు గుర్తించారు. తెలంగాణ కోసం కొట్లాడింది సబ్బండ వర్గాలైతే, రాష్ట్రాన్ని ఇచ్చింది సోనియా గాంధీ అని భావించిన రాష్ట్ర ప్రజలు మరోమారు కేసీఆర్ సెంటిమెంట్‌కు మోసపోకుండా కాంగ్రెస్‌ను గద్దెనెక్కించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారెంటీలను, మహాలక్ష్మి పథకాన్ని, రైతు రుణమాఫీని అమలు చేసి, 50 వేలకు పైగా ఉద్యోగాలిచ్చి తమది మహిళా పక్షపాత ప్రభుత్వమనీ, రైతు ప్రభుత్వమనీ నిరూపించుకుంది.

వ్యాసకర్త ఎమ్మెల్సీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు

తెలంగాణ తల్లికి సాధికారికత

అభిప్రాయం



బి.ఎస్. రాములు

ఇప్పుడు 'తెలంగాణ తల్లి'పై చర్చ జరుగుతోంది. అయితే దశాబ్దాల క్రితమే తొలి ప్రయత్నంగా 'తెలంగాణ తల్లి ఎరుక' అనే పుస్తకంలో రెండు వేల ఏళ్ళ తెలంగాణ చరిత్ర అస్తిత్వాన్ని ముందుకు తెచ్చాను. 1969 'జై తెలంగాణ' ఉద్యమాల స్ఫూర్తిని రికార్డు చేశాను. 1986 నుండి సాగుతున్న మలి తెలంగాణ ప్రారంభ ఉద్యమాలను నిక్షిప్తం చేశాను. అలా 'తెలంగాణ తల్లి ఎరుక' పుస్తకం అనేక నినాదాలను పొందుపరిచింది. పాఠ్యపుస్తకాలు తెలంగాణ భాషలో రావాలి. తెలంగాణ భాష కోసం అవసరమైతే హిందీ దేవనాగరి లిపిలోకి తెలంగాణ పుస్తకాలను, తెలంగాణ లిపిని మార్చుకోవాలి. మరాఠీ, భోజ్‌పురి, హిందీ తదితర భాషలు దేవనాగరి లిపిని స్వీకరించాయి. మనం ఈ ఆధిపత్యవాదాన్ని నిర్మూలించడానికి దేవనాగరి లిపిని స్వీకరించాలి. ఇది ఆవేశం కాదు. ఆలోచన. ఆ తాత్విక చింతనతో ఊరూరా తెలంగాణ తల్లి విగ్రహాలు నెలకొల్పాలి.


నాది కృష్ణా, గోదావరి, మానేరు నదుల పరీవాహక ప్రాంత భాష. మెట్ట ప్రాంతాల గుట్టల భాష. గొలుసుకట్టు చెరువులను నిర్మించుకున్న భాష. శాతవాహనుల నుండి చాళుక్యుల నుండి, కాకతీయుల దాకా నిరంతరాయ చరిత్రను నిర్మించిన భాష. ఒక శకాన్నే సృష్టించిన శాతవాహన సామ్రాజ్య చరిత్రకు అస్తిత్వం లేకుండా పోతుందా? అలా తాత్విక చింతన, చారిత్రక చింతన, సాంస్కృతిక చింతన నుండి రూపొందినదే తెలంగాణ తల్లి ఊహాచిత్రం. నా ఊహలకు రూపం కావాలి. అనేక మందిని సంప్రదించాను. పెద్దగా పట్టించుకోలేదు. ఎవరో ఒకరు దొరికితే వారితో అనేక విధాలుగా చెప్పి చెప్పి చివరకు ఏదో ఒక రూపాన్ని నా ఊహలకు అనుకూలంగా కొంతైనా చేరువైందని తెలంగాణ తల్లిగా నామకరణం చేసి సమాజానికి అంకితం చేశాను. తొలుత 'వార్త' పత్రికలో నామకరణం లేకుండా అచ్చయింది. తర్వాత ప్రజాతంత్ర వారపత్రికలో ముఖచిత్రంగా తెలంగాణ తల్లిగా పేరుతో సహా అచ్చయింది. నా తెలంగాణ తల్లి సిరీస్ పుస్తకాల్లో ముఖచిత్రంగా, లోపలి చిత్రాలుగా ప్రింట్ వేశాను. తెలంగాణ తల్లికి బతుకమ్మ కూడా ఉంటే బాగుంటుంది అని అన్నారు. మరు దశలో తెలంగాణ తల్లికి బతుకమ్మను కూడా చేర్చాను. బతుకమ్మను చేర్చిన తెలంగాణ తల్లి ముఖచిత్రంతో వెలువడిన పుస్తకాన్ని నిజామాబాద్ 'తెలంగాణ ధూం ధాం'లో మధు యాష్కీ గౌడ్ ఆవిష్కరించారు.



చాలాకాలానికి అందెశ్రీ తన పాటలో నిక్షిప్తం చేశాడు. అది రాష్ట్ర గీతమై అలరారుతున్నది. తెలంగాణ తల్లి తొలి రూపు పోస్టర్లకు ఎక్కింది. ఫ్లెక్సీ బ్యానర్లకు ఎక్కింది. విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లింది. తర్వాత తెలంగాణ తల్లి బతుకమ్మను ఎత్తుకుంది. ఇప్పుడు ఆ తెలంగాణ తల్లి తొలి రూపం సాధికారికత సంతరించుకున్నది. ఆకుపచ్చ చీర తెలంగాణ తల్లి 18 యేళ్ళ క్రితం నేను వేయించి పుస్తకాలపై ముద్రించినది. తెలంగాణ తల్లి భావన 1935 నుండే కొనసాగుతోంది. నైజాం రాజ్యంలో నిజామాంధ్ర మహాసభలు, గ్రంథాలయోద్యమం, సామాజిక చైతన్యం కోసం మహోన్నతంగా కృషి చేశాయి. ఆ కోణంలో, ఆ క్రమంలో తెలంగాణ తల్లి గురించి ప్రజల్లో ఒక భావన రూపుదిద్దుకుంది. తెలంగాణ తల్లిని ప్రశంసిస్తూ, ఆరాధిస్తూ, ఆహ్వానిస్తూ కొన్ని పాటలు వెలువడ్డాయి. రావెల్ల వెంకట రామారావు 1940ల్లో 'తెలంగాణ తల్లి'ని కీర్తిస్తూ పాట రాశారు. 1935లో వెలువడిన 'గోలకొండ కవుల' సంచికలో హైదరాబాద్ మాత పేరుతో కొన్ని పద్యాలు చూడవచ్చు. దాశరథి కృష్ణమాచార్య 'నా తెలంగాణ తల్లి కంజాతవల్లి' అని రాశారు. నేటి 'తెలంగాణ తల్లి' రూపకల్పనలో ఎందరో పాల్గొన్నారు. తెలంగాణ తల్లి అస్తిత్వం, ప్రాధాన్యం, చరిత్ర గురించి వ్యాసాలు రాశారు. ఆ క్రమంలో తెలంగాణ తల్లికి రూపకల్పన చేయాల్సిన చారిత్రక అనివార్యత ఏర్పడింది. చరిత్ర పలు మలుపులు తిరిగి తెలంగాణ తల్లి తొలి రూపం సాధికారికంగా సచివాలయంలో కొలువు తీరుతున్నది. తెలంగాణ తల్లి కష్టజీవి. కొంగు నడుముకు చుట్టిన కష్టజీవికి స్వాగతం. తెలంగాణ తల్లికి ఎన్నో రూపాలు ఒకే రూపం అనుకోవడం పొరపాటు. అన్ని రూపాలూ తెలంగాణ తల్లివే!

వ్యాసకర్త సామాజిక తత్వవేత్త । 83319 66987

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు. మార్గశిరమాసం, **తిథి:** శు.నవమి రా.3.24 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర ప.1.15 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** రా.10.15 నుండి 1.44 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.13 నుండి 12.57 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.11 వరకు, **అమృతఘడియలు:** లేవు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.22, **సూర్యాస్తమయం:** 5.22.


Government of Haryana
"भारत ने नारा नहीं, निष्ठा के साथ women led development की ओर कदम बढ़ाए हैं और महिला सशक्तिकरण का लाभ आज हर क्षेत्र में दिख रहा है जो भारत की विकास यात्रा में योगदान दे रहा है।"
- नरेन्द्र मोदी
Sashakt Nari Shakti, Viksit Bharat
Prime Minister
Sh. Narendra Modi
to Launch
Bima Sakhi Yojana
of L.I.C.
And
Lay Foundation Stone of
Main Campus, Uchani of
Maharana Pratap Horticulture University
Presided over by
Sh. Nayab Singh Saini
Chief Minister, Haryana
Empowerment by Bima Sakhi Yojana
Women having minimum 18 years of age and 10th Pass Certificate can join Bima Sakhi Yojana by visiting the nearest LIC branch or portal of www.licindia.in
Women will get a monthly salary of Rs. 7,000 in the first year, Rs. 6,000 in the second year and Rs. 5000 in the third year
DD NEWS
Live telecast on DD News
Date - 9 December, 2024 | Time - 2 pm
Venue - Panipat
डबल इंजन सरकार, विकास को रफ्तार
Information, Public Relations & Languages Department, Haryana
www.prharyana.gov.in | @diprharyana



డమాస్కస్‌లో ఆనందంతో గాల్లోకి కాల్పులు జరుపుతున్న తిరుగుబాటుదారులు



డమాస్కస్‌లోని అధ్యక్షభవనంలో కుర్చీలో కూర్చొని విజయసంకేతం చూపిస్తున్న సిరియా పౌరుడు

అసద్ పాలన అంతం

తిరుగుబాటుదారుల చేతుల్లోకి సిరియా

- విదేశం పారిపోయిన నిరంకుశ పాలకుడు బషర్ అల్ అసద్
- దేశానికి స్వేచ్ఛ ప్రసాదించినట్లు ప్రకటించిన రెబల్స్
- రాజధాని డమాస్కస్‌లో సంబరాలు చేసుకున్న ప్రజలు
- అధికార మార్పిడికి సిద్ధమన్న ప్రధాని ఘాజీ జలానీ

డమాస్కస్/బీరూట్: అర్ధ శతాబ్దానికిపైగా అసద్ కుటుంబ అరాచక, నిరంకుశ పాలనలో, అంతర్యుద్ధంతో అణచివేతకు, వెనకబాటుకు గురైన పశ్చిమాసియా దేశం సిరియా చరిత్రలో కీలక పరిణామం సంభవించింది. ఒక్కో నగరాన్ని, ప్రాంతాన్ని ఆక్రమించుకుంటూ వస్తున్న తిరుగుబాటుదారులు ఆదివారం దేశ రాజధాని డమాస్కస్‌లో కాలుమోపి అసద్ పాలనకు తెరదించారు. అధ్యక్షుడుసహా భద్రతా బలగాలు దేశాన్ని విడిచి పారిపోవడంతో ఇక సిరియాకు స్వేచ్ఛ లభించిందని తిరుగుబాటుదారులు ప్రకటించారు. అధ్యక్షుడు బషర్ అల్ అసద్ ఉక్కుపిడికిలి కింద నలిగిపోయిన ప్రజలు ఆయన పాలన అంతమైందని తెల్సి వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. భద్రతా బలగాలు వదిలివెళ్లిన తుపాకులు టీనేజర్లు తీసుకుని గాల్లోకి కాల్పులు జరిపి హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. అన్యాయంగా ఏళ్ల తరబడి కారాగారాల్లో చీకటి కొట్టాల్లో మగ్గిపోయిన అమాయకులందరినీ సయ్యద్‌నాయా జైలు నుంచి విడిపించినట్లు తిరుగుబాటుదారులు ప్రభుత్వ టెలివిజన్ ఛానెల్‌లో అధికారికంగా ప్రకటించారు. రక్షణశాఖ కార్యాలయం ఉన్న ప్రఖ్యాత ఉమాయద్ స్క్వేర్ వద్దకు చేరుకుని జనం మూడు నక్షత్రాలు, త్రివర్ణ సిరియా విప్లవ జెండాలను ఎగరేశారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. '' ఇడ్లిబ్ నుంచి మొదలెట్టి డమాస్కస్ సిటీదాకా రావడానికి తిరుగుబాటు సింహాలకు ఎంతోకాలం పట్టలేదు. మా ఆనందాన్ని మాటల్లో వర్ణించలేం'' అని స్థానికులు ఆనందంతో చెప్పారు. దేశాధ్యక్షుడు, సైనిక కాపలాలేని అధ్యక్ష కార్యాలయం, అసద్ కుటుంబ నివాసాల్లోకి జనం చొరబడి అక్కడి విలువైన వస్తువులు, నిత్యావసర సరకులు ఎత్తుకెళ్లారు. దేశం రెబెల్స్ చేతుల్లోకి వెళ్లడంపై దేశ ప్రధాని మొహమ్మద్ ఘాజీ అల్ జలానీ స్పందించారు. '' అధ్యక్షుడు పారిపోయారు. నేనెక్కడికీ పారిపోలేదు. నా సొంతింట్లోనే ఉన్నా. అధికారంలోకి రాబోతున్న విపక్షాలు, తిరుగుబాటుదారులకు ఇదే నా ఆహ్వానం. అధికార మార్పిడికి సిద్ధం. ప్రజలు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసంచేయడం, లూటీచేయడం మానుకోవాలి'' అని ప్రధాని ఘాజీ జలానీ వీడియో సందేశంలో ప్రకటించారు. నిరంకుశ పాలన ముగిందని తెలిసి గత 14 ఏళ్లుగా తుర్కియే, జోర్డాన్, లెబనాన్ దేశాల్లో తలదాచుకుంటున్న సిరియన్లు చాలా మంది మళ్లీ స్వదేశానికి తిరుగు పయనమయ్యారు. ఇడ్లిబ్ వద్ద జాతీయరహదారి వద్ద క్యూ కట్టిన కార్లతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. లెబనాన్‌లోని మస్నా బోర్డర్ గుండా సిరియన్లు లోపలికి వస్తున్నారు. '' బషర్ పాలనతో పోలిస్తే ఇకపై సిరియాలో పరిస్థితి చాలా ఆశాజనకంగా ఉండొచ్చు. అందుకే స్వదేశం వెళ్తున్నాం'' అని హమా నుంచి శరణార్థిగా లెబనాన్‌కు వచ్చిన సమీ అబ్దెల్ లతీఫ్ చెప్పారు.

మెరుపువేగంతో ఆక్రమణ

2018 ఏడాది తర్వాత తిరుగుబాటుదారులు మళ్లీ డమాస్కస్ దాకా రాలేకపోయారు. కానీ నవంబర్ 27 నుంచి విపక్షాల దన్నుతో రెబల్స్ మెరుపువేగంతో ముందుకు కదిలారు. సొంత యుద్ధాల్లో బిజీగా ఉన్న ఇరాన్, రష్యాల నుంచి అసద్ సైన్యానికి ఎలాంటి ఆయుధ, సైనిక సాయం లేకపోవడంతో తిరుగుబాటుదారులకు ఎదురే లేకుండాపోయింది. అలెప్పో, హమా, హోమ్స్ మొదలు సిరియా దక్షిణప్రాంతాన్నంతా ఆక్రమించిన రెబెల్స్ వడివడిగా రాజధాని డమాస్కస్ వైపుగా కదిలి విజయపతాకం ఎగరేశారు. హయత్ తహ్రీర్ అల్–షామ్(హెచ్‌టీఎస్) గ్రూప్ నేతృత్వంలో ఈ తిరుగుబాటుదారులు అసద్ సైన్యంతో పోరాడి యావత్ దేశాన్ని తమ గుప్పిట్లోకి తెచ్చుకున్నారు. 2017 నుంచే వాయవ్య సిరియా మొత్తాన్ని పాలిస్తున్న హెచ్‌టీఎస్ గ్రూప్ ఇప్పుడు యావత్‌సిరియాను సురక్షిత దేశంగా ఏ విధంగా పాలిస్తుందో వేచిచూడాల్సిందే. అంతర్యుద్ధాన్ని రూపుమాపి, అమెరికా ఆంక్షలను తట్టుకుని దేశాన్ని ముందుకు నడిపించాల్సి ఉంది. అంతర్జాతీయ సమాజంతోపాటు, మైనారిటీల మెప్పు పొందేందుకు బహుళత్వాన్ని, పరమత సహనాన్ని సాధించేందుకు హెచ్‌టీఎస్ అధినేత అబూ మొహమ్మద్ గోలానీ ఏ మేరకు సిద్ధపడతారోనని పశ్చిమాసియా దేశాలు ఎదురుచూస్తున్నాయి. ''తక్షణం జెనీవాలో చర్చలు మొదలెట్టి కొత్త ప్రభుత్వానికి అంతర్జాతీయ గుర్తింపు, సాధారణ రాజకీయ, అధికార మార్పిడి ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి'' అని ఐరాసలో సిరియా రాయబారి గెయిర్ పెడర్‌సన్ కోరారు. సిరియాలో అసద్‌పాలన అంతమైన నేపథ్యంలో ప్రాంతీయ భద్రతపై ఇరాన్, ఈజిప్ట్, సౌదీ అరేబియా, జోర్డాన్, రష్యా, తుర్కియే, ఖతార్ దేశాల విదేశాంగ మంత్రులు అత్యవసరంగా సమావేశమై తాజా పరిస్థితిపై చర్చించారు.

అదును చూసి ఆక్రమించిన ఇజ్రాయెల్

సిరియాతో సరిహద్దును పంచుకుంటున్న ఇజ్రాయెల్ ఈ పరిణామాన్ని తనకు అనువుగా మార్చుకుంటోంది. 1974లో కుదిరిన ఒప్పందాన్ని కాలరాస్తూ గోలన్‌హైట్స్ సమీప నిస్సైనికీకరణ(బఫర్‌జోన్) ప్రాంతాన్ని ఇజ్రాయెల్ సేనలు ఆక్రమించాయి. యుద్ధం సందర్భంగా 1967 జూన్‌లో సిరియా నుంచి గోలన్‌హైట్స్ ప్రాంతాన్ని ఇజ్రాయెల్ ఆక్రమించిన విషయం విదితమే. దేశం తమ స్వాధీనంలోకి వచ్చిన నేపథ్యంలో తన పేరును అహ్మద్ అల్‌షారాగా గోలానీ మార్చుకున్నారు. తొలిసారిగా డమాస్కస్‌లోని ఉమయ్యాద్ మసీదుకు వచ్చి అందరి సమక్షంలో ప్రసంగించారు. '' ప్రభుత్వ సంస్థల వద్ద కాల్పులు జరపకండి. అధికార మార్పిడి జరిగేదాకా ప్రభుత్వ కార్యాలయాలన్నీ ప్రధాని ఘాజీ జలానీ సారథ్యంలోనే పనిచేస్తాయి'' అని చెప్పారు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం ఆపేందుకు సోమవారం ఉదయం దాకా డమాస్కస్‌లో కర్ఫ్యూ విధించారు. '' సిరియా ఇప్పుడు అందరిదీ. డ్రూజ్‌లు, సున్నీలు, అల్లవీట్, మైనారిటీలందరికీ సమాన హక్కులుంటాయి'' అని రెబల్ కమాండర్ అనాస్ సల్ఖాదీ ప్రకటించారు. రెబల్స్‌కు మద్దతు తెలుపుతున్నట్లు ఆదివారం యెమెన్ ప్రకటించింది. జర్మనీ, ఫ్రాన్స్‌సహా చాలా యూరోపియన్ దేశాలు అసద్ పాలన అంతంపై హర్షంవ్యక్తంచేశాయి.

సురక్షితంగా భారతీయులు

న్యూఢిల్లీ: అసద్ ప్రభుత్వం కూలిపోయి సిరియా తిరుగుబాటుదారుల చేతుల్లోకి వెళ్లినాసరే అక్కడి భారతీయులు క్షేమంగానే ఉన్నారని భారత సర్కార్ ఆదివారం స్పష్టంచేసింది. డమాస్కస్‌లో భారత రాయబార కార్యాలయం యథాతథంగా పనిచేస్తుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అక్కడి భారతీయులతో ఇండియన్ ఎంబసీ సంప్రతింపులు జరుపుతోందని, అంతా సురక్షితంగా ఉన్నారని ఆయా వర్గాలు వెల్లడించాయి.

సుస్థిర శాంతి సాధ్యమా?

ఇన్నాళ్లూ అసద్ ఏలుబడిలో యావత్ సిరియా లేదని వాస్తవ పరిస్థితులు స్పష్టంచేస్తున్నాయి. 14 రాష్ట్రాలకుగాను కేవలం మూడు రాష్ట్రాల్లోనే అసద్ పాలన కొనసాగుతోంది. మిగతా చోట్ల వేర్వేరు తిరుగుబాటుదారుల కూటములు, మిలిటెంట్ ముఠాలు పాలిస్తున్నాయి. తక్కువ ప్రాంతానికి పరిమితమైనాసరే ఇరాన్, రష్యాల ప్రత్యక్ష సహకారం ఉండబట్టి అసద్ పరిపాలిస్తున్న ప్రాంతానికి మాత్రమే అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోందని తెలుస్తోంది. కొన్ని ప్రాంతాలను తుర్కియే దన్నుతో 'సిరియన్ నేషనల్ ఆర్మీ' పాలిస్తోంది. అమెరికా నుంచి సాయం పొందుతున్న కుర్దుల బలగాలు కొన్నిచోట్ల పాలిస్తున్నాయి. ఐసిస్ ఉగ్రసంస్థ కొంత ప్రాంతాన్ని ఏలుతోంది. హెచ్‌టీఎస్ తిరుగుబాటుదారులు, విపక్షాల ఫైటర్లు ఇంకొన్ని ప్రాంతాలను తమ అధీనంలో ఉంచుకున్నారు. గోలన్‌హైట్స్‌సహా కొంతభాగాన్ని దశాబ్దాల క్రితమే ఇజ్రాయెల్ ఆక్రమించుకుంది.

రష్యాలో అసద్ ?

మిత్రదేశాలు ఇరాన్, రష్యాల నుంచి సైనికసాయం అందక, సొంత సైన్యంతో తిరుగుబాటుదారులను ఎదుర్కొనే సామర్థ్యం లేక అధ్యక్షుడు అసద్ దేశాన్ని వీడారు. రష్యా తయారీ ఇల్యూషిన్–ఐఎల్76 రకం సిరియా ఎయిర్‌ఫ్లైట్ నంబర్ 9218 విమానంలో ఆదివారం తెల్లవారుజామునే అసద్ దేశం వదిలి పారిపోయారని సిరియా స్థానిక మీడియాలో వార్తలొచ్చాయి. అసద్ రష్యా లేదా ఇరాన్‌కు పారిపోయి ఉంటారని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. అయితే అసద్‌కు, ఆయన కుటుంబానికి రష్యా ఆశ్రయం కల్పించినట్లు ఆదివారం రాత్రి వార్తలు వెలువడ్డాయి. ఆయన మాస్కో చేరుకున్నట్లు తెలిపాయి. అసద్ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన ఉన్నతాధికారుల జాడ కూడా తెలీడంలేదు. సైన్యాధికారులు ఇరాక్ వెళ్లినట్లు తెలుస్తోంది. దేశం విడిచివెళ్లడానికి ముందే అసద్.. తిరుగుబాటుదారులతో హడావిడిగా చర్చలు జరిపి శాంతియుతంగా అధికార మార్పిడిపై తగు సూచనలు చేసి వెళ్లారని రష్యా విదేశాంగ శాఖ ఆదివారం ప్రకటించింది. ఇంకా తమ సైనిక స్థావరం సిరియాలోనే కొనసాగుతుందని రష్యా స్పష్టం చేసింది. రష్యా ముఖం చాటేయడంతోనే అసద్ పారిపోయాడని కాబోయే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు.

కంటి వైద్యుడి నుంచి కర్కశ నియంత దాకా..



బీరూట్: రెండు పుష్కరాల క్రితం అన్యమనస్కంగా అధ్యక్ష పీఠంపై కూర్చున్న అసద్ తదనంతరకాలంలో నిరంకుశ నేతగా ఎదిగిన వైనం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. డమాస్కస్ మెడికల్ కాలేజీలో చదివిన అసద్ తర్వాత ఆప్తమాలజీ చదివేందుకు బ్రిటన్ వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. అసద్ తొలినాళ్లలో లండన్‌లో నేత్ర వైద్యునిగా సేవలందించేవారు. 1971 సంవత్సరం నుంచి సిరియాను తన ఉక్కుపిడికిలి కింద పాలిస్తున్న తన తండ్రి హాఫీజ్ మరణంతో 2000 సంవత్సరంలో అసద్ స్వదేశం తిరిగొచ్చాడు. సానుభూతిపరుల మద్దతుతో అయిష్టంగానే అధ్యక్ష పీఠంపై కూర్చున్నారు. అప్పటికి ఆయన వయసు కేవలం 34 సంవత్సరాలు. అధ్యక్ష పదవికి కనీస అర్హత వయసు అయిన 40 ఏళ్లకూడా నిండకపోవడంతో ఈయన కోసం పార్లమెంట్‌లో చట్టసవరణ చేశారు. నిజానికి హాఫీజ్ తన పెద్ద కుమారుడు బస్సెల్‌ను తన వారసునిగా చూడాలనుకున్నారు. అయితే 1994లో కారు ప్రమాదంలో బస్సెల్ మరణించడంతో అసద్ అసలైన వారసుడయ్యారు. 2011దాకా అసద్ పాలనపై పెద్దగా విమర్శలు రాలేదు. కానీ అరబ్ విప్లవం మొదలయ్యాక 2011 మార్చిలో అసద్ పాలనను వ్యతిరేకిస్తూ ప్రజలు డమాస్కస్, డేరా నగరాల్లో వీధుల్లోకి వచ్చి ఉద్యమాలు చేశారు. వీటిని అసద్ సర్కార్ ఉక్కుపాదంతో అణచివేసింది. ఆనాటి నుంచి అసద్ నిరంకుశ పాలనకు తెరలేపారు. మానవహక్కుల ఉల్లంఘన, అక్రమ అరెస్టులు, జనంపైకి రసాయన ఆయుధాల ప్రయోగం, కుర్దులను అణగతొక్కడం, ప్రభుత్వ ఆధ్వర్యంలో కిడ్నాప్‌లు, హత్యలు వంటి అరాచకాలు ఆనాటి నుంచి నిత్యకృత్యమయ్యాయి. ఆ తర్వాతి ఏడాది అలెప్పో సిటీలో ఘర్షణలు పెరిగాయి. తిరుగుబాటుదారులు నగరాన్ని ఆక్రమించుకోగా నాలుగేళ్లు కష్టపడి సైన్యం తిరిగి స్వాధీనంచేసుకుంది. ఆ తర్వాత తూర్పు ఘూతాలో ప్రభుత్వం జరిపిన రసాయన ఆయుధ దాడిలో ఏకంగా వందలాది మంది అమాయక పౌరులు చనిపోయారు. దీంతో ఐసిస్ ఉగ్రసంస్థ విజృంభించి రఖాను స్వాధీనం చేసుకుంది. 2019దాకా ఐసిస్ పట్టుకొనసాగింది. అయితే 2015 సెప్టెంబర్‌లో రష్యా రాకతో అసద్ బలం పుంజుకున్నారు. అయితే 2017 ఏప్రిల్‌లో అసద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అమెరికా సేనలు పరోక్షంగా రంగ ప్రవేశం చేశాయి. 14 ఏళ్ల అంతర్యుద్ధానికి ముగింపు పలుకుతూ గత నెల 27న ఇడ్లిబ్ సిటీ ఆక్రమణతో మొదలైన తిరుగుబాటుదారుల జైత్రయాత్ర రాజధాని డమాస్కస్‌దాకా కొనసాగడంతో 59 ఏళ్ల అసద్ పలాయనం చిత్తగించక తప్పలేదు. అసద్ పాలనలో దాదాపు ఐదు లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. అంతర్యుద్ధం కారణంగా 11 లక్షల మంది సిరియాను వదిలి విదేశాలకు శరణార్థులుగా వలసవెళ్లారు. అసద్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఉగ్ర చీఫ్ నుంచి దేశ సారథి దాకా!

తొలినాళ్లలో ఇరాక్‌లో అమెరికాకు వ్యతిరేకంగా పోరాటం



బీరూట్: 14 ఏళ్ల అంతర్యుద్ధాన్ని తట్టుకుని ఎలాగోలా పరిపాలన సాగిస్తున్న అసద్‌ను చావుదెబ్బ తీస్తూ దాడులు మొదలెట్టిన కేవలం 11 రోజుల్లో దేశంపై పట్టుసాధించిన అబూ మొహమ్మెద్ అల్ గోలానీ గురించి సర్వత్రా చర్చ మొదలైంది. జిహాదీ ఉగ్రవాదిగా మొదలైన ప్రస్థానం నేడు దేశాధినేత స్థాయిలో కొత్త పంథాలో కొనసాగనుంది. 42 ఏళ్ల గోలానీ 2003లో తొలిసారిగా అల్‌ఖైదాతో చేతులు కలిపారు. ఇరాక్‌లో అమెరికా సేనలకు వ్యతిరేకంగా పోరాడారు. అమెరికాకు చిక్కి ఐదేళ్లు జైలుజీవితం గడిపారు. ఈ సమయంలోనే భావసారుప్యత ముఠాలను ఒక్కతాటి మీదకు తెచ్చి అల్‌ఖైదా.. అబూ బకర్ అల్ బాగ్దాదీ సారథ్యంలో ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్‌ను స్థాపించింది. 2011లో సిరియాలో అసద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగించాలంటూ అబూబకర్.. గోలానీని సిరియాకు పంపించాడు. అక్కడ అల్‌ఖైదా అనుబంధ నుస్రా ఫ్రంట్‌ను స్థాపించారు. దీనిని ఆనాడే అమెరికా ఉగ్రసంస్థ ముద్రవేసింది. గోలానీని పట్టిస్తే ఒక కోటి డాలర్లు ఇస్తామని నజరానా ప్రకటించింది. 2013లో సిరియాలో అంతర్యుద్ధం మొదలయ్యాక నుస్రా ఫ్రంట్‌ను 'ఇరాక్ అల్‌ఖైదా'లో కలిపేసి కొత్తగా 'ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా(ఐసిస్)'ను స్థాపించాని అబూబకర్ సూచించారు. అయితే ఐసిస్ ఏర్పాటు నచ్చక సొంతంగా నుస్రా ఫ్రంట్‌ను గోలానీ కొనసాగించారు. 2013లో గోలానీని అమెరికా ఉగ్రవాదిగా ప్రకటించింది. 2016లో అల్‌ఖైదాతో తెగతెంపులు చేసుకుని సొంతంగా జభాత్ ఫతే అల్–షామ్(ది సిరియా కాంక్వెస్ట్ ఫ్రంట్)ను గోలానీ స్థాపించారు. ఇంకొక ఏడాది తర్వాత దాని పేరును హయత్ తహ్రీర్ అల్ షామ్(సిరియా విమోచన సంస్థ)గా నామకరణం చేశారు. ఇడ్లిబ్ ప్రావిన్స్‌లో తన పట్టు నిలుపుకున్నారు. స్వతంత్రంగా పోరాటంచేసే వేర్వేరు ఇస్లామిక్ ఉగ్రవాదుల ఆధిపత్యాన్ని అణచివేసి, వారిని తమలో కలుపుకుని సంస్థను మరింత పటిష్ఠవంతం చేశారు. తుర్కియే అండతో చెలరేగిపోయిన వేర్పాటువాదుల దాడుల్లో చనిపోయిన కుర్దుల కుటుంబాలను కలిసి మంచివాడిగా పేరుతెచ్చుకున్నారు. 2016లో తొలిసారిగా బహిరంగంగా ప్రపంచానికి తనను తాను పరిచయం చేసుకున్నారు. మూడేళ్ల క్రితం అమెరికన్ జర్నలిస్టుకు తొలిసారిగా ఒక ఇంటర్వ్యూ ఇచ్చారు. తమ సంస్థ పశ్చిమదేశాలకు వ్యతిరేకంగా పనిచేయబోదని, సిరియాపై ఆంక్షలు విధించడం సబబుకాదని, పరోక్షంగా అమెరికా ఆంక్షలను తీవ్రంగా తప్పుబట్టారు. '' పశ్చిమ దేశాల విదేశాంగ విధానాలను విమర్శించిన మాట వాస్తవమే. కానీ మేం అమెరికా, యూరప్ దేశాలతో యుద్ధాలకు దిగాలనుకోవట్లేము. మాకు శాంతిస్థాపనే ముఖ్యం'' అని గోలానీ గతంలో వ్యాఖ్యానించారు.

ఎక్కడా లేని ఈవీఎంలు మనకెందుకు?

ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్

షోలాపూర్: అమెరికా, ఇంగ్లాండ్ వంటి అభివృద్ధి చెందిన దేశాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నారని, మన దగ్గర మాత్రం ఈవీఎంలు ఎందుకని ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ ప్రశ్నించారు. ఈవీఎంలను పక్కనపెట్టి కేవలం బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని దేశ ప్రజలు కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈవీఎంల కారణంగా ఎన్నికల్లో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నట్లు అనుమానాలు ఉన్నాయని చెప్పారు. మహారాష్ట్రలో నాసిక్ జిల్లా మర్కద్‌వాడీ గ్రామంలో బ్యాలెట్ పేపర్లతో రీపోలింగ్ జరపాలని పోరాడుతున్న ప్రజలను శరద్ ఆదివారం కలుసుకున్నారు. వారికి సంఘీభావం ప్రకటించారు. మర్కద్‌వాడీ గ్రామస్థులు గొప్ప ఉద్యమం ప్రారంభించారని, మొత్తం దేశానికే సరైన దశాదిశ చూపుతున్నారని శరద్ పవార్ ప్రశంసించారు. గ్రామస్థులపై పోలీసులు నమోదు చేసిన కేసుల వివరాలు తనకు ఇవ్వాలని, ముఖ్యమంత్రి, రాష్ట్ర ఎన్నికల సంఘం, ప్రధానమంత్రి, కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తానని శరద్ పవార్ పేర్కొన్నారు.

మమతా బెనర్జీ సమర్థ నేత

విపక్ష ఇండియా కూటమి సారథ్య బాధ్యతలను పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత మమతా బెనర్జీని అప్పగించాలన్న ప్రతిపాదనకు శరద్ పవార్ మద్దతు పలికారు. ఆమె సమర్థత కలిగిన నాయకురాలు అని చెప్పారు. ఇండియా కూటమిని ముందుకు నడిపించడానికి సిద్ధంగా ఉన్నానని మమతా బెనర్జీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

రబీలో పెరిగిన పంటల సాగు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ప్రస్తుత రబీ సీజన్‌లో పంటల సాగు గణనీయంగా పెరిగిందని వ్యవసాయ శాఖ వెల్లడించింది. పంటల సాగు గత ఏడాది 4.11 కోట్ల హెక్టార్ల మేర ఉంటే అది ఈ ఏడాది డిసెంబర్ తొలి వారానికి 4.28 కోట్ల హెక్టార్లను దాటిందని పేర్కొంది. వరి పంటల సాగు గత ఏడాది 91.6లక్షల హెక్టార్ల నుంచి 97.5 లక్షల హెక్టార్లకు పెరగ్గా, గోధుమల సాగు 1.87 కోట్ల హెక్టార్ల నుంచి 2 కోట్ల హెక్టార్లకు, పప్పుధాన్యాలు 1.05 కోట్ల హెక్టార్ల నుంచి 1.08 కోట్ల హెక్టార్లకు పెరిగినట్లు తెలిపింది.

మళ్లీ ఉద్రిక్తంగా 'చలో ఢిల్లీ'

- పంజాబ్–హరియాణా సరిహద్దులో రైతుల పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు
- 8 మంది రైతులకు గాయాలు



శంభు సరిహద్దు వద్ద రైతులపైకి పోలీసులు భాష్పవాయుగోళాలను ప్రయోగించిన దృశ్యం

శంభు: పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతోపాటు ఇతర డిమాండ్ల సాధనకు రైతులు పోరాటం కొనసాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా ఆదివారం పునఃప్రారంభమైన 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పంజాబ్–హరియాణా సరిహద్దులోని శంభు నిరసన ప్రాంతం నుంచి పాదయాత్రగా బయలుదేరిన 101 మంది రైతుల బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఆంక్షలను లెక్కచేయకుండా ముందుకు దూసుకెళ్తున్న రైతులపై కొన్ని మీటర్ల దూరంలోనే పోలీసులు ఆపేశారు. నిరసనకారులను చెదరగొట్టడానికి బాష్పవాయువు గోళాలు, జల ఫిరంగులు ప్రయోగించారు. ఈ ఘటనలో 8 మంది రైతులు తీవ్రంగా గాయపడినట్లు రైతు సంఘాలు నేతలు చెప్పారు.

యాత్ర తాత్కాలికంగా నిలిపివేత

ఆదివారం నాటి యాత్రలో పోలీసుల దాడిలో ఎనిమిది మంది రైతులు గాయపడడంతో యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు నేతలు ప్రకటించారు. తదుపరి కార్యాచరణను అతిత్వరలో ఖరారు చేస్తామని వివరించారు. నిరసనల నేపథ్యంలో ఢిల్లీలోని సింఘు బోర్డర్ పాయింట్ వద్ద ఆదివారం భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా సిబ్బంది మోహరించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీలో అడుగుపెట్టేందుకు ప్రయత్నించిన రైతులను పోలీసులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లోని గౌతమబుద్ధ నగర్ జిల్లా జైలులో రైతులు నిరాహార దీక్ష ప్రారంభించారని సంయుక్త కిసాన్ మోర్చా ఆదివారం తెలియజేసింది. గ్రేటర్ నోయిడా రైతులు ప్రస్తుతం ఈ జైలులో ఉన్నారని, హక్కుల సాధన కోసం దీక్షకు దిగారని పేర్కొంది.

సరిహద్దు భద్రతకు యాంటీ–డ్రోన్ యూనిట్

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడి

జోధ్‌పూర్: మన దేశ సరిహద్దులను శత్రుదుర్భేద్యంగా మార్చడానికి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. సరిహద్దుల్లో సమగ్ర యాంటీ–డ్రోన్ యూనిట్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. శత్రుదేశాల నుంచి డ్రోన్లు, మానవ రహిత వైమానిక వాహనాల ముప్పు పెరుగుతోందని అన్నారు. రాబోయే రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం కనిపిస్తోందని పేర్కొన్నారు. అందుకే సరిహద్దుల్లో శత్రుదేశాల డ్రోన్లను గుర్తించి, ధ్వంసం చేయడానికి యాంటీ–డ్రోన్ యూనిట్ నెలకొల్పాలని నిర్ణయించినట్లు స్పష్టంచేశారు. సరిహద్దు భద్రతా దళాలు, రక్షణ శాఖ, పరిశోధన సంస్థలు, డీఆర్‌డీఓ భాగస్వామ్యంతో దీన్ని తీసుకురాబోతున్నట్లు వివరించారు. రాజస్తాన్‌లో ఆదివారం సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) 60వ రైజింగ్ డేలో అమిత్ షా పాల్గొన్నారు. బీఎస్ఎఫ్ జవాన్లను ఉద్దేశించి ప్రసంగించారు. లేజర్‌తో పనిచేసే యాంటీ–డ్రోన్ గన్ మౌంటెడ్ వ్యవస్థను ఇప్పటికే ప్రవేశపెట్టామని, దీంతో సత్ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. పంజాబ్‌లో భారత్–పాకిస్తాన్ సరిహద్దుల్లో ఈ వ్యవస్థ అమల్లో ఉందని అమిత్ షా పేర్కొన్నారు. అధికారిక గణాంకాల ప్రకారం.. 2023లో భారత్–పాకిస్తాన్ సరిహద్దుల్లో భారత సైన్యం 110 డ్రోన్లను కూల్చివేసింది, కొన్నింటిని స్వాధీనం చేసుకుంది.

ఏకాభిప్రాయంతో ఇండియా కూటమి నేత ఎంపిక: తేజస్వీ

కోల్‌కతా: విపక్షాల 'ఇండియా' కూటమి సారథిగా టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ సహా సీనియర్ నేతలెవరున్నా తనకు అభ్యంతరం లేదని ఆర్‌జేడీ సీనియర్ నేత, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ స్పష్టం చేశారు. కూటమి నేత ఎంపిక ఏకాభిప్రాయంతో జరగాలని చెప్పారు. 'నేత ఎంపిక విషయమై కూటమిలో ఇప్పటి వరకు చర్చ జరగలేదు. అన్ని సభ్య పార్టీలను చర్చలోకి పరిగణనలోకి తీసుకోవాలి. కూటమికి మమతా బెనర్జీ సారథ్యం వహిస్తే మాకైతే అభ్యంతరం లేదు. అందరూ కలిసి కూర్చుని చర్చించాకనే భవిష్యత్ నేత ఎంపిక జరగాలి'అని ఆయన వివరించారు.

ఉక్రెయిన్‌లో తక్షణమే శాంతి నెలకొనాలి

- పారిస్‌లో జెలెన్‌స్కీతో భేటీ అనంతరం ట్రంప్ పిలుపు
- నాటో నుంచి అమెరికా వైదొలగడం సాధ్యమేనని వ్యాఖ్య

వాషింగ్టన్: రష్యా, ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం తక్షణమే ఆగిపోవాలని అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. నాటో నుంచి అమెరికా వైదొలిగే అంశాన్ని పరిశీలిస్తున్నామని కూడా ఆయన వెల్లడించారు. పారిస్‌లో శనివారం ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ వేర్వేరుగా సమావేశమయ్యారు. అనంతరం ట్రంప్ తన సొంత ట్రూత్ సోషల్‌లో.. 'రష్యాతో వెయ్యి రోజులకు పైగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలుకుతూ ఉక్రెయిన్ ఒప్పందం కుదుర్చుకోవాలని భావిస్తున్నా' అంటూ వ్యాఖ్యానించారు. 'అవసరమే లేని యుద్ధంలో రష్యా, ఉక్రెయిన్‌లు రెండూ వేలాదిగా సైనికులను పోగొట్టుకున్నాయి. అందుకే చర్చలు ప్రారంభించి, వెంటనే కాల్పుల విరమణ ఒప్పందానికి రావాలి. ఎన్నో ప్రాణాలు అనవసరంగా బలయ్యాయి. ఎన్నో కుటుంబాలు నాశనమయ్యాయి. యుద్ధానికి ముగింపు పలకాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కోరుతున్నా' అని ఆయన పేర్కొన్నారు. ట్రంప్‌తో సమావేశం నిర్మాణాత్మకంగా జరిగిందని అంతకుముందు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. 'శాంతి ఒప్పందంతో మాకు న్యాయం జరగాలి. రష్యా, పుతిన్, ఇతర దురాక్రమణదారులు ఇలాంటి యుద్ధాలకు దిగే అవకాశం మళ్లీ ఇవ్వరాదు'అని స్పష్టం చేశారు. ఈ యుద్ధంలో తాము 43 వేల మంది సైనికులను కోల్పోయామని, మరో 3.70 లక్షల మంది క్షతగాత్రులయ్యారని జెలెన్‌స్కీ చెప్పారు. ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధమేనని రష్యా ట్రంప్ ప్రకటనపై ఈ మేరకు స్పందించడం గమనార్హం. అయితే, అధ్యక్షుడిగా పుతిన్ ఉన్నంతకాలం రష్యాతో చర్చల ప్రసక్తే లేదని గతంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చేసిన ప్రకటనను గుర్తు చేసింది.

నాటో నుంచి బయటికొస్తాం

నాటో నుంచి అమెరికా బయటికి వచ్చే విషయం ఇప్పటికీ తమ పరిశీలనలో ఉందని, అది సాధ్యమేనని ట్రంప్ ఎన్‌బీసీ చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 'నాటోలో అమెరికా బలగాలుండాలంటే బదులుగా యూరప్, కెనడా ప్రభుత్వాలు అందుకయ్యే వ్యయం భరించాలి. అప్పుడే వాళ్లు మమ్మల్ని సమభావంతో చూస్తున్నట్లు లెక్క. అలాగైతేనే మేం నాటోలో కొనసాగుతాం' అని ఆయన స్పష్టం చేశారు. యూరప్, కెనడాలకు తామెందుకు భద్రత కల్పించాలంటూ అమెరికా అధ్యక్షుడిగా ఉండగా గతంలోనే ఆయన ప్రశ్నించడం తెల్సిందే.

హిందుత్వ ఒక వ్యాధి: ఇల్తీజా

జమ్మూ: పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తీజా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హిందుత్వ ఒక వ్యాధి అని, అది హిందూవాదాన్ని అప్రతిష్ఠపాలుచేస్తోందని విమర్శించారు. మైనార్టీలపై దాడులు, వేధింపులు, హత్యలకు హిందుత్వ కారణమని మండిపడ్డారు. ఓటు బ్యాంకును బలోపేతం చేసుకోవడానికి బీజేపీ హిందుత్వ కార్డును వాడుకుంటోందని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఇల్తీజా ఆదివారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ''రామ నామం జపించడానికి నిరాకరించినందుకు ఓ ముస్లిం బాలుడిని చెప్పులతో కొట్టారు. ఘోరంగా జరుగుతున్నా అడ్డుకోకుండా నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయినందుకు శ్రీరాముడు సిగ్గుతో ఉరి వేసుకోవాలి. హిందుత్వ ఒక వ్యాధి. దాంతో కోట్లాది మంది భారతీయులు బాధలు పడుతున్నారు'' అని ధ్వజమెత్తారు. బాలుడిని కొట్టిన వీడియోను షేర్‌చేశారు. అనంతరం ఆమె జమ్మూలో మీడియాతో మాట్లాడారు. హిందుత్వ, హిందూయిజం మధ్య చాలా వ్యత్యాసం ఉందన్నారు. హిందుత్వ అనేది విద్వేషాన్ని వ్యాప్తి చేస్తుందన్నారు. భారతదేశం హిందువులదే అని బోధిస్తుందని చెప్పారు. హిందుయిజం మాత్రం ఇస్లాం మతం తరహాలోనే లౌకికవాదాన్ని, సామరస్యాన్ని ప్రబోధిస్తుందని వివరించారు. హిందుత్వ అనే వ్యాధిని నయం చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జైశ్రీరామ్ అనే నినాదం రామరాజ్యం స్థాపనకు సంబంధించింది కాదని అన్నారు. మూకదాడుల సమయంలో ఆ నినాదం వాడుకుంటున్నారని చెప్పారు. ఇదిలా ఉండగా, ఇల్తీజా ముఫ్తీ వ్యాఖ్యలపై జమ్మూకశ్మీర్ బీజేపీ మాజీ అధ్యక్షుడు రవీందర్ రైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు గానీ ఇతరుల మతపరమైన మనోభావాలను గాయపర్చే హక్కు ఎవరికీ లేదని తేల్చిచెప్పారు.



గ్రేటర్.. డేంజర్!

నగరంలో రహదారి భద్రత కరువైంది. డ్రంకెన్ డ్రైవ్, గుంతలు తదితర కారణాలతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దేశంలోనే అత్యధిక ప్రమాదాలు జరిగే నగరాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంది.

-8లో



కేక్స్ మిక్స్.. టేస్ట్ అదుర్స్..

డిసెంబర్ వచ్చిందంటే చాలు నగరం నూతనోత్సాహాన్ని పుంజుకుంటుంది. ఒకవైపు న్యూ ఇయర్, మరోవైపు క్రిస్మస్ వేళ కేక్ మిక్సింగ్ సందడి నెలకొంది.

-సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.0/22.0

నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 30, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.









గగన విన్యాసం.. భువన హృదయోల్లాసం!

ఒకవైపు ఆకాశమే హద్దుగా వైమానిక దళాల విన్యాసాలు.. మరోవైపు హృదయోల్లాసంగా సాగిన సాంస్కృతిక ప్రదర్శనలు.. ఇంకోవైపు రాహుల్ సిప్లీగంజ్ గానామృతం.. వెరసీ.. ఆదివారం సంధ్యవేళ హుస్సేన్ సాగర్ తీరం సోయగాల రాగాలను ఆలపించింది. మరోపక్క తెలంగాణ వంటకాలు, రుచులను పరిచయం చేస్తూ ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లు, తినుబండారాలు, అలంకరణ వస్తువులతో కూడిన స్టాళ్లు.. ఇలా మొత్తం కలగలిపి సాగర తీరం జన జాతరను తలపించింది. ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆయా కార్యక్రమాలు నగర వాసులను అమితంగా ఆకట్టుకున్నాయి.

– ఖైరతాబాద్







ఉప్పల్ భగాయత్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత



సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్ భగాయత్‌లో అక్రమ నిర్మాణాలపై హెచ్ఎండీఏ కొరడా ఝుళిపించింది. ఉప్పల్ భగాయత్‌లోని హెచ్ఎండీఏ స్థలాల్లో కొందరు అక్రమంగా నిర్మాణాలు కొనసాగిస్తున్న వైనంపై ఈ నెల 2న 'జాగాలో పాగా' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి హెచ్ఎండీఏ అధికారులు స్పందించారు. ఉప్పల్ భగాయత్‌లోని తూర్పు వైపు సుమారు 150 గజాల స్థలంలో అక్రమంగా నిర్మించిన రెండు గదుల ఇంటిని కూల్చివేశారు. లే అవుట్‌లోని వివిధ ప్రాంతాల్లో మిగిలిపోయిన స్థలాలకు రక్షణ లేకుండా పోయింది. కొందరు వ్యక్తులు షెడ్లు వేసి అద్దెలకిస్తున్నారు. అక్రమార్కులపై అధికారులు శాశ్వత చర్యలు చేపట్టకపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసినప్పుడే అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటున్నారని, ఆ తర్వాత యథావిధిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 'సాక్షి' కథనంతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మెట్రో స్టేషన్.. మెరిసెన్..




సాక్షి, సిటీబ్యూరో: ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాలను హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఘనంగా నిర్వహిస్తోంది. తెలంగాణ తల్లి విగ్రహ నమూనా చిత్రాన్ని రద్దీ ఎక్కువగా ఉండే మెట్రో స్టేషన్లలో ప్రదర్శిస్తున్నారు. 'జయ జయహే తెలంగాణ.. జననీ జయ కేతనం' అంటూ తెలంగాణ స్ఫూర్తిని అంది పుచ్చుకుంటూ హైదరాబాద్‌లోని మొత్తం 25 మెట్రో స్టేషన్లలో కొత్తగా రూపొందించిన 'తెలంగాణ తల్లి' చిత్రాలను ఏర్పాటు చేసినట్లు హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాలను హైదరాబాద్ మెట్రో స్టేషన్ల పరిధిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందమైన విద్యుద్దీపాల అలంకరణతో ప్రధానం మెట్రో మార్గాలు నగరవాసులను విశేషంగా అలరిస్తున్నాయి.



ఎయిడెడ్ టీచర్ల ఆన్ డ్యూటీ మాయ!

పాఠశాలల మూసివేతతో టీచర్ల సర్దుబాటు



సాక్షి, సిటీబ్యూరో: సర్కారు బడుల్లో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఎయిడెడ్ టీచర్లు ఆన్ డ్యూటీ పేరిట పైరవీలు, వసూళ్ల వ్యవహారానికే ప్రాధాన్యమిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎయిడెడ్ పాఠశాలలు మూతపడటంతో టీచర్లను ప్రభుత్వ పాఠశాలల్లో డిప్యూటేషన్ పేరిట సర్దుబాటు చేశారు. దీంతో కొందరు ఎయిడెడ్ ఉపాధ్యాయులు పాఠశాలల్లో బోధన విస్మరిస్తూ ఆన్ డ్యూటీ పేరిట డిప్యూటీ ఈఓ, డిప్యూటీ ఐఓఎస్‌లలో తిష్టవేసి వివిధ బిల్లులు మంజూరు, ప్రైవేటు స్కూల్స్- అధికారులతో మధ్యవర్తిత్వం వహించడం, వివిధ వసూళ్లలో కీలక పాత్ర వహించడం లాంటి వ్యవహారాలకు ప్రాధాన్యమిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇక మరికొందరు ఉపాధ్యాయులు.. ఉన్నతాధికారుల అండదండలతో విధులకు హాజరు కాకుండానే నెలవారీగా వేతనాలు డ్రా చేస్తున్నారనే ఆరోపణలు కూడా లేకపోలేదు.

అత్యధికంగా ఇక్కడే..

హైదరాబాద్ జిల్లాలోనే అత్యధిక ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నట్లు విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రం మొత్తమ్మీద ఈ బడులు 617 ఉండగా.. ఒక హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ పరిధిలోనే 223 ఉన్నాయి. రెండేళ్ల క్రితం మరికొన్ని బడులు మూతపడ్డాయి. దీంతో వీటి పరిధిలోని టీచర్లను ప్రభుత్వ పాఠశాలల్లో డిప్యూటేషపై సర్దుబాటు చేశారు. అయితే.. వీరిపై పెద్దగా హెచ్ఎంల పర్యవేక్షణ లేకపోవడంతో విధులకు మొక్కుబడిగా హాజరవుతూ ఆన్ డ్యూటీ పేరిట డిప్యూటీ ఈఓ, డిప్యూటీ ఐఓఎస్ కార్యాలయంలో పైరవీలకు తెరలేపినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మచ్చుకు కొన్ని ఉదాహరణలు..

- మారేడుపల్లి మండలంలోని ఓ ఎయిడెడ్ స్కూల్ మూతపడటంతో టీచర్లను డిప్యూటేషన్‌పై సమీప ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. అయితే.. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు కేటాయించిన ఓ తెలుగు పండిట్ మాత్రం విద్యార్థులకు పాఠాలు బోధించడం బదులు ఆన్ డ్యూటీ పేరిట ఉప విద్యాధికారి కార్యాలయంలో తిష్ట వేసి వివిధ బిల్లుల పైరవీలకు ప్రాధాన్యమిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- అమీర్‌పేటలో ఒక ఎయిడెడ్ స్కూల్ కూడా మూత పడటంతో అందరితో పాటు గణితం టీచరు కూడ ప్రభుత్వ స్కూల్‌కు డిప్యూటేషన్‌పై కేటాయించారు. సదరు టీచరు పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెప్పడం బదులు ఆన్ డ్యూటీ పేరిట డిప్యూటీ ఐఓఎస్ ఆఫీస్‌లో పైరవీలకు పరిమితమయ్యారనే ఆరోపణలున్నాయి. ఇదే మండలంలోని మరో స్కూల్ మూతపడగా ప్రభుత్వ పాఠశాలకు టీచర్లను సర్దుబాటు చేశారు. సదరు ఎస్‌జీటీ బోధన మరిచి.. ఆన్ డ్యూటీ పేరిట డీఈఓ, ఆర్‌జేడీ ఆఫీస్, సచివాలయంలోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్ల సేవల్లో నిత్యం మునిగి తేలుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- తిరుమలగిరిలోని ఓ ఎయిడెడ్ స్కూల్ మూతపడగా ముగ్గురు టీచర్లు, ఒక ఆఫీస్ సబార్డినెట్ ప్రభుత్వ పాఠశాలకు డిప్యూటేషన్లపై సర్దుబాటు అయ్యారు. అందులో ఒక మహిళా టీచరు మాత్రం విధులకు హాజరు కాకుండానే వేతనం డ్రా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సదరు మహిళా టీచరుకు ఆర్‌జేడీ ఆఫీస్ అండదండలు ఉండటంతో స్కూల్ వర్గాలు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఒకే మండలంలో 15 ఏళ్లుగా..

- తిరుమలగిరి మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 15 ఏళ్లపాటు కర్లక్‌గా పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ ఒకరు సంబంధిత మండల డిప్యూటీ ఐఓఎస్ ఆఫీస్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఏ స్కూల్‌లో పోస్టింగ్ ఉన్నా డీఐఓఎస్ ఆఫీస్‌లో తిష్ట వేసి బిల్లుల మంజూరులో చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ ప్రభుత్వ పాఠశాలలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఎయిడెడ్ ఆఫీస్ సబార్డినెట్‌ను తన ఏజెంట్‌గా పెట్టుకొని అతని యూపీఐ ద్వారా ఆర్థిక లావాదేవీలు సాగిస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.
- ఇటీవల కొత్త టీచర్ల మొదటి నెల జీతం బిల్లుల విషయం సైతం తన ఏజెంట్ యూపీఐ ద్వారా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టిన కారణంగా సదరు క్లర్క్‌పై విజిలెన్స్ విచారణ జరిపించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా..

- రద్దీ రహదారులపై రాత్రిపూట మ్యాన్‌హోల్స్ క్లీనింగ్
- బకెట్ క్లీనింగ్ పద్ధతి ద్వారా సిల్ట్ తొలగింపు
- నల్లగొండ ఎక్స్ రోడ్‌లో సాయంత్రం నుంచి ఉదయం వరకు..
- కొనసాగుతున్న 90 రోజుల సీవరేజీ స్పెషల్ డ్రైవ్



నల్లగొండ ఎక్స్ రోడ్‌లో రాత్రి వేళ సీవరేజీ డీసిల్టింగ్ పనులు

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలోని డ్రైనేజీ సీవరేజీపై జలమండలి పూర్తిస్థాయి యుద్ధం ప్రకటించింది. మురుగు రహిత నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 90 రోజుల 'సీవరేజీ ఓవర్ ఫ్లో స్పెషల్ డ్రైవ్'లో భాగంగా మ్యాన్‌హోల్ టు మ్యాన్ హోల్ డీసిల్టింగ్ నిర్వహిస్తోంది. సెక్షన్ల వారీగా నిరంతరం సీవరేజీ ఓవర్‌ఫ్లో అయ్యే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి మ్యాన్‌హోళ్ల క్లీనింగ్ నిర్వహిస్తున్న జలమండలి.. తాజాగా రద్దీ అధికంగా ఉండే ప్రధాన రోడ్లపై డ్రైనేజీ పైపులైన్ల క్లీనింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా రాత్రి పూట సిబ్బందిని రంగంలోకి దింపి క్లీనింగ్ నిర్వహించే విధంగా చర్యలు చేపట్టింది.

నల్లగొండ ఎక్స్‌రోడ్‌లో..

హైదరాబాద్ టూ విజయవాడ జాతీయ రహదారి గల నల్లగొండ ఎక్స్‌రోడ్, అక్కడి నుంచి చంచల్‌గూడ వెళ్లే మార్గంలో డ్రైనేజీ పొంగుతోంది. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు పూర్తిస్థాయి డ్రైనేజీ పైపులైన్ క్లీనింగ్ చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశాలతో డివిజన్ జీఎం శ్యామ్ నాయక్ చౌహాన్ ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. అయితే.. ఆ మార్గంలో పగటి పూట రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోడ్డుపై ఎలాంటి వాహనాలు నిలిపినా.. కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీంతో పనిదినాల్లో కాకుండా వీకెండ్ రోజు అదికూడా రాత్రి పూట డ్రైనేజీ పైప్‌లైన్ క్లీనింగ్‌కు సిద్ధమయ్యారు.

బకెట్ క్లీనింగ్ పద్ధతిలో..

ప్రధాన రహదారి కావడంతో డీప్ మ్యాన్‌హోల్స్‌తో కూడిన డ్రైనేజీ పైపులైన్ ఉండటంతో డీసిల్టింగ్ కోసం బకెట్ క్లీనింగ్ పద్ధతి పాటించాలని జలమండలి అధికారులు నిర్ణయించారు. దీంతో శనివారం సాయంత్రం పెద్ద సంఖ్యలో ఎయిర్‌టెక్ బకెట్ క్లీనింగ్ వాహనాలు రప్పించి క్షేత్ర స్థాయి సిబ్బందిని రంగంలో దింపారు. సాయంత్రం 4 నుంచి మరుసటిరోజు ఉదయం 11 గంటల వరకు సుమారు కిలో మీటరున్నర పొడవునా మ్యాన్‌హోల్ టు మ్యాన్ హోల్ డ్రైనేజీ పైపులైన్ క్లీనింగ్ చేపట్టారు. డీసిల్టింగ్ కోసం బకెట్ క్లీనింగ్ పద్ధతి ఉపయోగించడంతో టన్నుల కొద్దీ మురుగు బయటపడింది. ప్రధాన రహదారి.. అది కూడా రాత్రి పూట కావడంతో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. మొత్తం దాదాపు పది టన్నుల వరకు సిల్ట్ బయటికి తీసినట్లు జలమండలి అధికారులు చెప్పారు.

మ్యాన్‌హోళ్ల ఓవర్‌ఫ్లో కట్టడే లక్ష్యం..



సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ పైపులైన్ డీసిల్టింగ్ చేపడుతున్నాం. వంద శాతం మురుగు రహిత నగరంగా మార్చేందుకు అడుగులు వేస్తున్నాం. అంతర్గత రహదారులతో పాటు ప్రధాన దారులపై సైతం మ్యాన్‌హోళ్ల ఓవర్‌ఫ్లోను కట్టడి చేయడమే లక్ష్యం. నిరంతరం రద్దీ ఉండే ప్రధాన రహదారులపై డ్రైనేజీ పైపులైన్ల క్లీనింగ్‌ను రాత్రి పూట నిర్వహించేలా చర్యలు చేపట్టాం.

– అశోక్ రెడ్డి, ఎండీ, జలమండలి

క్షీణిస్తున్న వాయు నాణ్యత!

- నగర రహదారులపై నైట్రోజన్ డయాక్సైడ్
- డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాల కంటే అధికం
- హెచ్‌సీయూ వద్ద అత్యధికంగా 41 మైక్రో గ్రాములు
- కాలం చెల్లిన వాహనాలు, ఇంధనాల పొగ ప్రధాన కారణాలు
- గ్రీన్ పీస్ ఇండియా తాజా అధ్యయనంలో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో స్వచ్ఛమైన గాలి కరువవుతోంది. ఏటికేడాది వాయు నాణ్యత క్షీణిస్తోంది. నగర రహదారులపై నైట్రోజన్ డయాక్సైడ్ (ఎన్‌ఓ2) అత్యధికంగా విడుదలవుతోంది. వాహనాల నుంచి వెలువడే పొగ, ఇంధన వనరుల వినియోగం, ట్రాఫిక్ రద్దీ కారణంగా నగరంలోని గాలిలో ఎన్‌ఓ2 అత్యధికంగా విడుదలవుతోందని గ్రీన్‌పీస్ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది.

9 ప్రాంతాల్లో ఎన్‌ఓ2 అధికం..

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం గాలిలో ఎన్ఓ2 వార్షిక సగటు సాంద్రత క్యూబిక్ మీటర్‌కు 10 మైక్రోగ్రాములకు మించి ఉండకూడదు. కానీ.. గతేడాది నగరంలోని 14 వాయు నాణ్యత మానిటరింగ్ స్టేషన్లలో 9 ప్రాంతాలలో డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాల కంటే కాలుష్యం అధికంగా ఉంది. గ్రేటర్‌లో అత్యధికంగా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రాంతంలో ఎన్ఓ2 41 మైక్రో గ్రాములు (ఎంజీ)గా నమోదైంది. ఆ తర్వాత జూ పార్క్‌లో 23, బొల్లారంలో 22 ఎంజీ, సనత్‌నగర్‌లో 19, ఐడీఏ పాశమైలారంలో 17, ఇక్రిశాట్ లో 13, సోమాజిగూడలో 12, నాచారంలో 11, న్యూ మలక్‌పేటలో 11, కోకాపేటలో 8, రామచంద్రాపురంలో 8, కొంపల్లి, ఐఐటీహెచ్ కంది, ఈసీఐఎల్‌లో 7 మైక్రో గ్రాముల చొప్పున నైట్రోజన్ డయాక్సైడ్ నమోదైంది.

ఆరోగ్యంపై ప్రభావం..

కాలం చెల్లిన వాహనాల వినియోగం, ఏటేటా వాహనాలు సంఖ్య పెరగడంతో గాలి నాణ్యత క్షీణిస్తుంది. మానవ ఆరోగ్యంపై ఎన్ఓ2 తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తోంది. ఉబ్బసం, శ్వాసకోశాల్లో మంట, చర్మ సంబంధమైన వ్యాధులు, ఊపిరితిత్తుల కేన్సర్ వంటి ఆరోగ్య సమస్యలు సంభవిస్తాయి. 2015లో హైదరాబాద్‌లో 2,430 పీడియాట్రిక్ ఆస్తమా కేసులకు కారణం ఎన్ఓ2 కాలుష్యమే కారణమని పరిశోధనల్లో తేలిదంటే నైట్రోజన్ డయాక్సైడ్ తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.



రారండోయ్ వేడుక చూద్దాం

- నేడు ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు వేడుకలు
- సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ
- ఎన్టీఆర్ మార్గ్‌లో డ్రోన్ షో
- పెద్ద ఎత్తున బాణసంచా ప్రదర్శన
- సంగీత దర్శకుడు తమన్ నేతృత్వంలో మ్యూజికల్ నైట్

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా మూడు రోజులు పాటు ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ మార్గ్‌లో నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. ముగింపు వేడుకల సందర్భంగా సచివాలయంలో సాయంత్రం 5 గంటలకు కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో లక్ష మంది స్వయం సహాయక సంఘాల మహిళలతో భారీ బహిరంగ సభ జరగనుంది. సాయంత్రం 7.30 గంటలకు ఎన్టీఆర్ మార్గ్‌లో డ్రోన్ ప్రదర్శన, హుస్సేన్ సాగర్‌లో పెద్దఎత్తున బాణసంచా ప్రదర్శన, అనంతరం హెచ్ఎండీఏ మైదానంలో తమన్ నేతృత్వంలో సంగీత కచేరీ, సాంస్కృతిక ప్రదర్శన ఉంటుంది. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డులో ఫుడ్‌స్టాళ్లతో పాటు హస్తకళల, సాంస్కృతిక, పలు ప్రభుత్వ విభాగాలకు చెందిన స్టాళ్లను ఏర్పాటు చేశారు.

బహు పసందుగా ఫుడ్ స్టాళ్లు

ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా నెక్లెస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లలోని పలు పసందైన వంటకాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. నగరంలో ప్రసిద్ధి చెందిన పలు బ్రాండెడ్ హోటల్స్ ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేశాయి. హైదరాబాదీ బిర్యానీ, మొఘలాయి, తెలంగాణ, ఆంధ్ర వంటకాలతో పాటు బేకరీ ఐటమ్స్ చాట్, ఐస్‌క్రీం.. ఇలా వందకు పైగా ఫుడ్‌స్టాళ్లు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు తెలంగాణ వంటకాలు పాలమూరు గ్రిల్, తెలంగాణ విందు, అంకాపూర్ నాటుకోడి చికెన్, ఫుడ్ జాయింట్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా నగరమంతా విద్యుత్ దీపాలంకరణతో జిగేమంటోంది. డా.బీఆర్ అంబేడ్కర్ సచివాలయం, పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో తళుక్కుమంటున్నాయి.

థియేటర్‌లో తొక్కిసలాట ఘటనలో ముగ్గురి అరెస్ట్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్‌లో ఈ నెల 4న జరిగిన తొక్కిసలాట..ఒకరి మృతి ఘటనలో థియేటర్ యజమాని, ఇద్దరు మేనేజర్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, ఎస్‌ఐ మౌనికలు వెల్లడించారు. ఆదివారం రాత్రి ఇక్కడ వారు మీడియాతో మాట్లాడుతూ థియేటర్‌లో ముందు రోజే భారీ హంగామా చేయడం, భద్రతా చర్యల్లో నిర్లక్ష్యం వహించడం వల్లే రేవతి అనే మహిళ మృతిచెందినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. సినిమా నటులు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌కు వస్తున్నారన్న విషయం థియేటర్ నిర్వాహకులు తమకు తెల్పలేదన్నారు. విచారణ అనంతరం సంధ్య థియేటర్‌కు సంబంధించిన ఏడుగురు యజమానుల్లో ఒకరైన ముడుపు సందీప్, సీనియర్ మేనేజర్ నాగరాజు, అప్పర్, లోయర్ బాల్కనీని చూసుకునే మేనేజర్ గంధం విజయ్‌చందర్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామని చెప్పారు. కోర్టు రిమాండ్ విధించడంతో వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుని పరిస్థితిపై లీగల్ టీంను సంప్రదించి..తదుపరి విచారణ నిమిత్తం హీరో అల్లు అర్జున్‌కు కూడా నోటీసులు ఇస్తామని పోలీసు అధికారులు స్పష్టం చేశారు.

శిక్షకు భయపడి ఎస్కేప్!

- నకిలీ పత్రాలతో లోన్ల కేసులో చిక్కిన అసిస్టెంట్ డైరెక్టర్
- 2016 నుంచి సికింద్రాబాద్ కోర్టులో సాగిన కేసు ట్రయల్
- నేరం నిరూపణ అవుతుందనే ఉద్దేశంతో 2021లో పరారీ
- ముమ్మరంగా గాలించి పట్టుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్


నిందితుడు రంజిత్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: నకిలీ గుర్తింపుకార్డులతో వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని మోసం చేసిన కేసులో పోలీసులకు చిక్కాడు...న్యాయస్థానంలో జరిగిన కేసు విచారణ (ట్రయల్) చూసి శిక్ష ఖాయమని భావించాడు... తీర్పు వెలువడే రోజు కోర్టు నుంచి పారిపోయాడు...మూడేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న ఈ కేటుగాడిని ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని కటకటాల్లోకి పంపారు. యూసుఫ్‌గూడ రహ్మత్‌నగర్‌కు చెందిన కేఎస్ రంజిత్‌రెడ్డి వృత్తిరీత్యా సినీ రంగంలో అసిస్టెంట్ డైరెక్టర్. తేలిగ్గా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నేరాలకు తెరలేపారు. నకిలీ గుర్తింపుకార్డులతో రుణాలు తీసుకుని బ్యాంకుల్ని మోసం చేయడానికి పథకం వేశాడు. వివిధ పేర్లు, చిరునామాలతో నకిలీ గుర్తింపు కార్డులు, ఓటర్ ఐడీలు, పాన్ కార్డులు తయారు చేశాడు. వీటి ఆధారంగా రాణిగంజ్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ సహా వివిధ బ్యాంకులకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. రకరకాల ఎత్తులు వేసి వెరిఫికేషన్ ప్రక్రియను ఎవరికీ అనుమానం రాకుండా పూర్తి చేయించుకున్నారు. ఇలా భారీ మొత్తంలో రుణాలు పొందిన రంజిత్‌రెడ్డి ఒకటిరెండు నెలలు ఈఎంఐలు చెల్లించినా...ఆపై మానేసి బ్యాంకుల్ని మోసం చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇతడి వ్యవహారాలపై 2016 టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈ ఏడాది జూలై 30న ఎంజీ రోడ్‌లో రంజిత్‌రెడ్డి తలదాచుకున్న ప్రాంతంపై దాడి చేసిన పోలీసులు అతడిని పట్టుకున్నారు. ఈ ఘరానా మోసగాడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన మహంకాళి పోలీసులు సికింద్రాబాద్ కోర్టులో అభియోగపత్రాలు సైతం దాఖలు చేశారు. నిందితుడిని బెయిల్ లభించగా...2020 వరకు ఈ కేసు విచారణ కోర్టులో జరిగింది. ప్రాసిక్యూషన్ వాదనలు, సమర్పించిన ఆధారాలు తదితరాలను చూసిన రంజిత్‌రెడ్డి తనకు కచ్చితంగా శిక్ష పడుతుందని భావించాడు. 2021లో తీర్పు వెలువడే రోజు కోర్టుకు హాజరైన రంజిత్‌రెడ్డి అక్కడ నుంచి ఎస్కేప్ అయ్యాడు. దీంతో న్యాయస్థానం ఇతడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న ఇతడిని పట్టుకోవడానికి నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.సైదులు నేతృత్వంలోని బృందం రంగంలోకి దిగింది. క్షేత్ర స్థాయిలో ఆరా తీసిన పోలీసులు నిందితుడు పోలీసులకు చిక్కకుండా ఉండటానికి మూడేళ్లల్లో నాలుగు ఇళ్లు మార్చినట్లు తేలింది. దీంతో సాంకేతికంగా ముందుకు వెళ్లిన టాస్క్‌ఫోర్స్ రంజిత్‌రెడ్డి ఆచూకీ కనిపెట్టి ఆదివారం పట్టుకుంది. తదుపరి చర్యల నిమిత్తం మహంకాళి పోలీసులకు అప్పగించింది.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థి మృతి

గచ్చిబౌలి: లెక్కలు సరిగ్గా చేయడం లేదనే కారణంతో గోడ కుర్చీ వేయించడం, అందరి ముందు తిట్టడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థి బాలు (16) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాయదుర్గంలోని నాగార్జున హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థి బాలు ఈ నెల 4న మ్యాథ్స్ టీచర్ అబ్దుల్ నయీమ్ తిట్టడంతో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా తల్లి గమనించి ఆస్పత్రిలో చేర్పించిన విషయం విదితమే.

కాగా బాలుడు చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 5 గంటలకు మృతి చెందాడని డీఐ సతీష్ కుమార్ తెలిపారు.

గ్రేటర్..డేంజర్!



- నగరంలో యాక్సిడెంట్లు అత్యధికం
- అధిక ప్రమాద భరిత ప్రాంతాల్లో మియాపూర్‌ది 6వ స్థానం
- డ్రంకెన్ డ్రైవ్, రోడ్లపై గుంతలు, కుక్కల కారణంగానే ప్రమాదాలు
- 'అకో' యాక్సిడెంట్ ఇండెక్స్-2024 తాజా అధ్యయనం వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో రహదారి భద్రత కరువైంది. డ్రంకెన్ డ్రైవ్, గుంతలు, వీధి జంతువులు తదితర కారణాలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దేశంలో అత్యధిక ప్రమాదాలు మెట్రో నగరాల్లోనే నమోదవుతుండగా..అత్యధికంగా జీహెచ్ఎంసీలో 16.45 శాతం యాక్సిడెంట్లు జరిగాయని ప్రముఖ టెక్ ఫస్ట్ ఇన్సూరెన్స్ ప్రొవైడర్ 'అకో' యాక్సిడెంట్ ఇండెక్స్-2024 తాజా అధ్యయనం వెల్లడించింది. 2024లో 78 శాతం రోడ్డు ప్రమాదాలు ప్రధాన మెట్రో నగరాల్లోనే జరిగాయని అధ్యయనం తెలిపింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 87 వేల రోడ్డు ప్రమాదాల ఇన్సూరెన్స్ క్లయిమ్‌లను పూర్తి చేయగా..ఇందులో 78 శాతం యాక్సిడెంట్లు మెట్రో నగరాల నుంచి వచ్చినవే. ఈ డేటా ప్రకారం..దేశంలోనే అత్యధిక ప్రమాదాలు జరిగే నగరాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంది.

ఢిల్లీని దాటేసిన గ్రేటర్..

బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, ముంబై మెట్రో నగరాలలో రోడ్డు ప్రమాద పోకడలను అకో ఇన్సూరెన్స్ అధ్యయనం చేసింది. 2022లో అత్యధిక రోడ్డు ప్రమాదాల్లో ఢిల్లీ-ఎన్‌సీఆర్ తొలి స్థానంలో ఉండగా..ఇప్పుడు ఆ స్థానాన్ని హైదరాబాద్ ఆక్రమించేసింది. 16.45 శాతం రోడ్డు ప్రమాదాల రేటుతో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవగా 15.9 శాతంతో ఢిల్లీ-ఎన్‌సీఆర్ రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత పుణే, బెంగళూరు, ముంబై, కోల్‌కతా ఉన్నాయి. అతి తక్కువగా చెన్నైలో 13.25 శాతం రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. రోడ్ల విస్తరణ, వర్షాలు తదితర కారణాలతో రహదారులపై గుంతలు ఏర్పడుతున్నాయి. రోడ్డు ప్రమాదాలకు ఇవే ప్రధాన కారణంగా మారుతున్నాయి. ఈ ఏడాది గుంతల కారణంగా అత్యధికంగా బెంగళూరులో 44.8 శాతం రోడ్డు ప్రమాదాలు జరిగాయి. దేశంలో అత్యధిక రోడ్డు ప్రమాదాలు బెంగళూరులోని బొమ్మనహల్లిలో జరుగుతున్నాయి. ఆ తర్వాత ఢిల్లీలోని నోయిడా, పుణేలోని మరుంజీ, ముంబైలోని మీరా రోడ్, చెన్నైలోని మేడవక్కం, హైదరాబాద్‌లోని మియాపూర్, అహ్మదాబాద్‌లోని భోపాల్, కోల్‌కతాలోని గోబిందా ఖటిక్ రోడ్ ఉన్నాయి.

కొబ్బరి బోండాలతో యాక్సిడెంట్లు!

మద్యం తాగి వాహనాలు నడపటం అత్యంత ప్రమాదకరమని మనందరికీ తెలిసిందే. కానీ ఈ ఏడాది కొన్ని నగరాల్లో డ్రంకెన్ డ్రైవ్ కంటే కొబ్బరి బోండాలు, కాయలతో 2.28 రెట్లు రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నమోదయ్యాయి.

ఎక్కువ ప్రమాదాలు కుక్కల వల్లే..

వీధి జంతువుల వల్ల కూడా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిలో అత్యధికంగా 62 శాతం రోడ్డు ప్రమాదాలు వీధి కుక్కల వల్లే జరిగాయి. ఆ తర్వాత ఆవులు 29 శాతం, దున్నపోతులు 4 శాతం , కోతులు 3 శాతం, మేకల వల్ల 1 శాతం యాక్సిడెంట్లు జరుగుతున్నాయని అధ్యయనం తేల్చింది.

జీవనశైలి వ్యాధుల నుంచి అప్రమత్తంగా ఉండాలి


సదస్సును ప్రారంభిస్తున్న జస్టిస్ శ్రీసుధా, చిత్రంలో డాక్టర్ గురుదత్త తదితరులు

నాంపల్లి: జీవన శైలి వ్యాధుల నుంచి ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పెరుగు శ్రీసుధ అన్నారు. ఆదివారం మాధవ్‌భాగ్ ఆయుర్వేదిక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 'ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ విత్ మాధవ్‌భాగ్ టు ట్రీట్ డయాబెటిస్ అండ్ కార్డియాక్ డిజార్డర్స్' అంశంపై రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ సురానా ఆడిటోరియంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ సుధ మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహా భాగ్యమని, ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం లేకుంటే అంతా వృథానే అన్నారు. దేశంలో జీవన శైలి ఆధారిత వ్యాధుల (ఎన్‌సీడీఎస్) ప్రాబల్యం క్రమంగా పెరుగుతోందని పేర్కొన్నారు. ఆసుపత్రి ముఖ్య వైద్యాధికారి డాక్టర్ గురుదత్త ఆనంద్ అమీన్ మాట్లాడుతూ... మాధవ్‌భాగ్ ప్రోటోకాల్స్ ద్వారా మధుమేహాన్ని ఎలా నియంత్రించవచ్చునో వివరించారు. కార్యక్రమంలో నిమ్స్ ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ అశిమా శర్మ, అశ్విని డయాబెటిక్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సత్యనారాయణ, హైదరాబాద్ ఆయుర్వేదిక్ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సారంగపాణి, డాక్టర్ బి.ఆర్.కె.ఆర్.గవర్నమెంట్ ఆయుర్వేద ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.రమాదేవి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ హైదరాబాద్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.రవినాయక్, ఎఫ్‌టీసీసీఐ హెల్త్‌కేర్ కన్వీనర్ శేఖర్ అగర్వాల్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో చాంపియన్‌గా హైదరాబాద్ జట్టు


హైదరాబాద్ జట్టుకు ఓవరాల్ చాంపియన్ షిప్ కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి స్విమ్మింగ్ పూల్‌లో రెండు రోజులపాటు జరిగిన తెలంగాణ రాష్ట్ర 9వ శీతాకాల ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ -2024 పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లు, కప్‌లు అందజేశారు. ఈ స్విమ్మింగ్ పోటీల్లో హైదరాబాద్ జట్టు అత్యధిక మెడల్స్ సాధించి ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకోగా ద్వితీయ స్థానంలో రంగారెడ్డి నిలిచింది. గ్రూప్ -1 విభాగంలో డి.వర్షిత్ 5 గోల్డ్ మెడల్స్, అదితి నాదెళ్ల ఐదు గోల్డ్ మెడల్స్, గ్రూప్ -2 విభాగంలో సచిన్ సాత్విక్ 4 గోల్డ్, ఒక సిల్వర్, జోహన్న సిజు- 4 గోల్డ్, ఒక సిల్వర్, గ్రూప్ -3 విభాగంలో అబ్దుల్ హమీద్ ఇషాన్ -5 గోల్డ్, అభినయ జాహ్నవి -4 గోల్డ్ మెడల్స్ సాధించారు. అత్యధిక పాయింట్లు సాధించినందుకు వీరికి కప్‌లను అందజేశారు.

15 తులాల బంగారం చోరీ

కాచిగూడ: బీరువాలో భద్రపరిచిన 15 తులాల బంగారం చోరీకి గురైన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..గాంధీకుటీర్‌లో నివాసం ఉండే పెంటయ్య ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం బయటకు వెళ్లి వచ్చేసరికి బీరువా పగులగొట్టి ఉండటాన్ని గమనించి పరిశీలించగా..అందులో భద్రపరిచిన 15 తులాల బంగారం కనబడలేదు. దీంతో ఆందోళన చెందిన పెంటయ్య స్థానికుల సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో టోకరా

- వీసా ప్రాసెసింగ్ అంటూ భారీ వసూళ్లు
- బాధితుల నుంచి రూ.83 లక్షలు స్వాహా
- ఇద్దరిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ టీమ్


పట్టుబడిన నిందితులు

సాక్షి, సిటీబ్యూరో: విదేశాల్లో ఉద్యోగాలు, భారీ జీతాలు, వీసాల ప్రాసెసింగ్ పేరుతో నిరుద్యోగులు, చిరుద్యోగుల్ని నిండా ముంచిన మోసగాళ్లను ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కన్సల్టెన్సీ ముసుగులో ఇద్దరు నిందితులు పలువురి నుంచి రూ.83 లక్షల మేర స్వాహా చేసినట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర ఆదివారం తెలిపారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన వై.అభిషేక్‌రెడ్డి గతంలో జాబ్ వీసాపై సింగపూర్ వెళ్లాడు. కొన్నాళ్లు అక్కడ ఉద్యోగం చేసిన ఇతగాడికి కొందరితో పరిచయాలు ఏర్పడ్డాయి. వీటిని ఆధారంగా చేసుకుని వీసా ప్రాసెసింగ్ వ్యాపారం ప్రారంభించాలని నిర్ణయించుకున్నాడు. నగరానికి తిరిగి వచ్చిన అభిషేక్ నిజాంపేటకు చెందిన తుమ్మ చిన్నమ్మతో కలిసి హిమాయత్‌నగర్‌లో ఉన్న కుబేరా టవర్స్‌లో జీఎంజే రెడ్డి కన్సల్టెన్సీ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేశాడు. కొందరు ప్రతినిధుల్ని ఏర్పాటు చేసుకున్న ఈ ద్వయం వారి ద్వారా అనేక మందిని విదేశాల్లో ఉద్యోగాలు, మంచి జీతాలు, ఇతర సౌకర్యాలు, వీసా ప్రాసెసింగ్ పేరుతో ఎర వేశారు. మూడు నెలల్లోనే పూర్తి ప్రాసెస్ పూర్తి చేయడంతో పాటు అక్కడ ఉద్యోగం, బస, విమాన టిక్కెట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తమకు ఈ రంగంలో ఉన్న విశేష అనుభవాన్ని వినియోగించుకుని ఇతర సౌకర్యాలు కల్పిస్తామని నమ్మబలికారు. ఇలా ఎంబీఏ, ఇంజినీరింగ్, హోటల్ మేనేజ్‌మెంట్ చేసిన దాదాపు 25 మంది నుంచి రూ.83 లక్షలు వసూలు చేశారు. కొందరికి అసలు వీసాలే ఇప్పించలేదు. మరికొందరికి నకిలీ వీసాలు అంటగట్టడంతో విమానాశ్రయం నుంచే వెనుదిరగాల్సి వచ్చింది. ఇంకొందరు యువకులకు వీసాలు ఇప్పించి విదేశాలకు పంపినా..ఉద్యోగాలు ఇప్పించలేదు. బాధితుల ఫిర్యాదుతో వీరిపై నారాయణగూడ ఠాణాలో కేసు నమోదైంది. దీంతో పరారైన నిందితులు అల్వాల్‌లో మరో కార్యాలయం ఏర్పాటు చేసి ఇంకొందరిని మోసం చేశారు. దీనిపై ఆ పోలీసుస్టేషన్‌లోనూ కేసు నమోదు కావడంతో పూర్తి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వీరి కదలికలపై నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ కె.సైదులు నేతృత్వంలో ఎస్సైలు శ్రీనివాసులు దాసు, సి.రాఘవేందర్‌రెడ్డి తమ బృందాలతో రంగంలోకి దిగారు. ఆదివారం వలపన్ని ఇరువురినీ పట్టుకోవడంతో పాటు వీరి నుంచి ల్యాప్‌టాప్స్, సెల్‌ఫోన్లు, నకిలీ పత్రాలు, కారు స్వాధీనం చేసుకున్నారు. బాధితుల నుంచి స్వాహా చేసిన సొమ్మును నిందితులు జల్సాల కోసం వినియోగించారని పోలీసులు గుర్తించారు. ఈ నగదు నుంచే కొంత వెచ్చించి ఓ కారు కొన్న అభిషేక్.. గత ఏడాది నుంచి దాని ఈఎంఐలు సైతం ఆ మొత్తం నుంచే చెల్లిస్తున్నట్లు గుర్తించారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను నారాయణగూడ పోలీసులకు అప్పగించారు.

శునకాల చెలగాటం.. నెమళ్లకు ప్రాణ సంకటం

- కేబీఆర్ పార్కులో వీధి కుక్కల స్వైర విహారం
- పట్టించుకోని అధికారులు
- నెమళ్లకు సైతం కుక్కలు తినే పెడిగ్రీ వేస్తున్న వాకర్లు


కేబీఆర్ పార్కు వాక్‌వేలో సంచరిస్తున్న వీధి కుక్కలు


నెమళ్లకు వేసిన కుక్కలు తినే ఆహారం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ప్రతిష్టాత్మక కేబీఆర్ పార్కులో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అవి యథేచ్ఛగా పార్కు లోపల ఉన్న వాక్‌వేలో తిరుగుతూ వాకర్లను, నెమళ్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పార్కు లోపల పెద్ద సంఖ్యలో ఉన్న నెమళ్లను వీధి కుక్కలు వెంటాడుతుండటంతో అవి భయంతో పరుగులు తీస్తూ రోడ్లపైకి వస్తూ ప్రమాదాలకు గురవుతున్నాయి. కేబీఆర్ పార్కులో ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్ద సంఖ్యలో వాకర్లు వాకింగ్‌కు వస్తుంటారు. తెల్లవారుజామున వచ్చే వాకర్లు వీధి కుక్కల కారణంగా ప్రమాదాల బారిన సందర్భాలు కూడా ఉన్నాయి. సమస్యను పలుమార్లు పార్కు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మరో వైపు కొందరు వాకర్లు, సందర్శకులు వన్యప్రాణులకు వివిధ రకాల ఆహార పదార్థాలు, గింజలను వేస్తున్నారు. వన్యప్రాణులకు, పక్షులకు ఎటువంటి ఆహారం పదార్థాలు వేయవద్దని నిబంధనలు పేర్కొంటున్నా వారు పట్టించుకోవడంలేదు. దీనిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు వ్యక్తులు యథేచ్ఛగా పక్షులకు ఫీడింగ్ చేస్తున్నారు. కొందరు కుక్కలకు వేసే పెడిగ్రి గింజలను సైతం నెమళ్లు నీళ్లు తాగే ప్రాంతాల వద్ద కుప్పలుగా పోసి వెళ్తున్నారు. వాటిని తినేందుకు వచ్చిన నెమళ్లను కుక్కలు వేటాడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి పార్కులో ఆహార పదార్థాలు వేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, వీధి కుక్కలు పార్కు లోపలికి రాకుండా కట్టడి చేయాలని వాకర్లు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ముగిసిన స్టేట్ స్క్వాష్ చాంపియన్‌షిప్

సాక్షి, సిటీబ్యూరో: గేమ్‌పాయింట్ సహకారంతో నగరం వేదికగా తెలంగాణ స్క్వాష్ రాకెట్స్ అసోసియేషన్ నిర్వహించిన మూడు రోజుల తెలంగాణ స్టేట్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో ఆర్య ద్వివేది, కరణ్ వశిష్ట విజేతలుగా నిలిచారు. గేమ్‌పాయింట్ హైటెక్ ఎరీనాలో ఈ నెల 6 నుంచి 8 వ తేదీ వరకు జరిగిన పోటీల్లో ఎనిమిది విభాగాలలో 90 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గేమ్‌పాయింట్ తెలంగాణ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ చైర్మన్ ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ..ఈ ఏడాది టోర్నమెంట్ అద్భుతంగా ఉందని, ప్రతి మ్యాచ్‌లో పాల్గొనేవారు పోటీ స్థాయిని పెంచుతున్నారని, స్క్వాష్ ఆటగాళ్లకు వేదికను అందించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబురావు, తెలంగాణ స్క్వాష్ రాకెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీశైలం తదితర క్రీడా ప్రముఖులు విజేతలకు బహుమతులు అందజేశారు.

మౌలానా సిరాజ్‌కు డాక్టరేట్



సాక్షి, సిటీబ్యూరో: మౌలానా హఫీజ్ మహమ్మద్ సిరాజ్ నఖ్‌బందీ మౌల్వీ కామిల్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. జామియా నిజామియా హజ్రత్ సయ్యద్ ఇబ్రహీం అదీబ్ రిజ్వీసాల్ సాహితీ గ్రంథం -'లాక్ రిజ్వీసాల్'పై విశ్లేషణాత్మక సమీక్ష నిర్వహించి థీసిస్‌ను సమర్పించినందుకు ఉస్మానియా జామియా అరబిక్ భాషలో డాక్టరేట్ అందించింది. ప్రముఖ అరబిక్ పరిశోధకుడు డాక్టర్ ముహమ్మద్ ఫజులుల్లా షరీఫ్ హెఫ్జల్లా పర్యవేక్షణలో సిరాజ్ ఈ థీసిస్‌ను పూర్తి చేశారు.

ఔటర్‌పై లారీ-కారు ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో తుక్కయిన కారు

మణికొండ: ఔటర్ రింగ్ రోడ్డుపై ముందు వెళ్తున్న లారీని కారు ఢీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఆదివారం తెల్లవారు జామున శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వస్తున్న కారు వేగంగా వచ్చి అప్పా సర్కిల్ వద్ద ముందున్న లారీని వేగంగా ఢీ కొట్టింది. కారు లారీ కిందకు దూసుకుని వెళ్లడంతో పూర్తిగా దెబ్బతిన్నది. అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్రంగా గాయపడడంతో ఔటర్ హెల్ప్ లైన్ వారు గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారి వివరాలు తెలియలేదని, కారు నెంబర్‌తోనే ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేశారని నార్సింగి పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కేన్సర్‌కు అత్యాధునిక చికిత్సలు

లక్డీకాపూల్: కేన్సర్ వ్యాధిని సమర్థవంతంగా నివారించేందుకు అత్యాధునిక వైద్య చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చినట్టు కేన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ భరత్ పటోడియా తెలిపారు. అడ్వాన్స్‌డ్ కేన్సర్, స్కిన్ కేర్ కోసం కొంపల్లిలో ఏర్పాటు చేసిన క్లినిక్‌ను ఆదివారం ఆధ్యాత్మిక గురువు ఆచార్య సత్యానారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ భరత్ మాట్లాడుతూ..కేన్సర్‌తో పాటు చర్మ వ్యాధులకు ఈ సెంటర్‌లో అధునాతన వైద్యసేవలు అందుతాయని పేర్కొన్నారు.

టీఎస్‌ఆర్‌ఏ అధ్యక్షుడిగా రవి నాయక్


రవినాయక్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

తుక్కుగూడ: స్క్వాష్ రాకెట్ అసోసియేషన్ (టీఎస్‌ఆర్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన 10వ వార్డు కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో ఈ మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ.. తన ఎన్నిక కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల, కళాశాల స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు.

14న 'పట్నం' మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

ఇబ్రహీంపట్నం: వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ పదవీ ప్రమాణస్వీకారోత్సవాన్ని ఈనెల 14న ఉదయం పదిన్నర గంటలకు స్థానిక మార్కెట్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు కొత్తగా నియమితులైన కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

అరిగపూడి విజయ్‌కుమార్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్‌రావు

బంజారాహిల్స్: ప్రముఖ సంఘ సంస్కర్త, కేబీఆర్ పార్కు నేచర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరిగపూడి విజయ్‌కుమార్ సంస్మరణ సభ జూబ్లీహిల్స్‌లోని కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. పలువురు రాజకీయ నేతలతో పాటు సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, వాకర్లు తరలివచ్చి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యావికాస్ వార్షికోత్సవం



స్కాలర్‌షిప్స్ అందుకున్న విద్యార్థులతో విద్యావికాస్ రాజీవ్‌నగర్ శాఖ నేతలు

వెంగళరావునగర్: విద్యావికాస్ రాజీవ్‌నగర్ శాఖ 14వ వార్షికోత్సవ వేడుకలను కాలనీ ప్లేగ్రౌండ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విద్యావేత్తలు, ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు విద్యావికాస్ ద్వారా 1428 మంది నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇచ్చారని భవిష్యత్‌లోనూ కొనసాగాలని సూచించారు. అంతకుముందు విద్యావికాస్ అధ్యక్షుడు పీఎస్‌జీ కృష్ణశర్మ ప్రగతి నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ వైవీ సుబ్రమణ్యం, ఎం.నాగేశ్వరరావు, సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణశర్మ కే వెంకటరమణ, కోశాధికారి ఎస్.మోహన్‌రావు, సంయుక్త కార్యదర్శి ఎంవీ సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు, ఇతర కాలనీనేతలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి శాంతి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న కార్పొరేటర్ దంపతులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-17లోని శ్రీ సీతారామస్వామి ఆలయంలోని శ్రీశక్తి సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ఆదివారం అభిషేకం, అర్చనలు చేశారు. అలాగే హోమం, శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
వెంగళరావునగర్: స్థానిక జీటీఎస్ ఆలయంలో శనివారం రాత్రి సుబ్రమణ్యస్వామి షష్టి కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్ దేదీప్య విజయ్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వల్లి దేవసేన సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. కార్పొరేటర్ దంపతులు స్వామివారికి వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

ఏడాది పాలనలో ఎంతో అభివృద్ధి



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న సదానందు

లిబర్టీ: కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం ఆయన కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని కొనియాడారు.

బోరబండ బస్టాప్ వద్ద..

రహమత్‌నగర్ : బోరబండ బస్టాప్ వద్ద కార్పొరేటర్ మహిళలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ప్లకార్డులు ప్రదర్శించి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఎస్పీఆర్‌హిల్స్‌లోని బాలుర వసతి గృహంలో విద్యార్థులతో కలిసి ప్రజాపాలన సంబురాలు జరుపుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట నాయకులు తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సీఎన్ రెడ్డి



బోరబండలో సంబరాల్లో బాబా ఫసియుద్దీన్

ఓయూలో గ్రూప్-4 ఉద్యోగుల రిపోర్టింగ్

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీపీఎస్సీ ద్వారా కొత్తగా ఎంపికైన గ్రూప్-4 ఉద్యోగులు ఓయూలో రిపోర్టు చేస్తున్నారు. యూనివర్సిటీ మొత్తానికి 375 మంది ఉద్యోగులను కేటాయించగా ఇప్పటివరకు 127 మంది రిపోర్టు చేశారు. ఓయూ చరిత్రలో తొలిసారి టీజీపీఎస్సీ ద్వారా నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేస్తున్నారు. గతంలో వర్సిటీలో తాత్కాలికంగా పని చేసే వారి సీనియర్టీని బట్టి పర్మనెంట్ చేశారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వత వర్సిటీ నియామకాలను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం టీజీపీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించారు. అయితే గ్రూప్-4 ఉద్యోగులు వచ్చినంత మాత్రన ఓయూలో గత 27 ఏండ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించబోమని అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఉస్మానియ క్యాంపస్‌తో పాటు అనుబంధ కాలేజీలు నిజాం కాలేజీ, సైఫాబాద్ పీజీ కాలేజీ, సికింద్రాబాద్ పీజీ కాలేజీలు, జిల్లా పీజీ సెంటర్లకు గ్రూప్-4 ఉద్యోగులకు పోస్టింగులు ఇవ్వనున్నారు. ఓయూలో చేరే గ్రూప్-4 ఉద్యోగులలో ఎగ్జామినేషన్ బ్రాంచ్‌కు అధికంగా 50 మందిని నియమించనున్నారు. ఇతర కార్యాలయాలు, కళాశాలలకు అవసరాలను బట్టి 10 నుంచి 15 వరకు గ్రూప్-4 ఉద్యోగులను కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు.

శీతాకాల సమావేశాల్లోనే బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

లిబర్టీ: శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ బిల్లు ప్రవేశపెట్టేలా ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై ఒత్తిడి తేవాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి పేర్కొన్నారు. దళ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీసీ మంత్రులు, ఎంపీలు సంఘటితమై ప్రధానిని ఒప్పించి ప్రస్తుత సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించేలా చూడాలన్నారు. లేకుంటే కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు.

10లో పాత పద్ధతికి సై

- పదో తరగతిలో గ్రేడింగ్ విధానం ఎత్తివేతపై విద్యార్థుల హర్షం
- ఈ విద్యా సంవత్సరం నుంచే మళ్లీ మార్కుల పద్ధతి అమలు
- ఈ మేరకు స్టూడెంట్స్‌ను సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు
- ఖైరతాబాద్ జోన్‌లో ప్రత్యేక తరగతుల నిర్వహణ



బంజారాహిల్స్: పదో తరగతి విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచే గ్రేడింగ్ విధానాన్ని ప్రభుత్వం ఎత్తివేయడంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గతంలో ఉత్తమ గ్రేడ్ సాధించాలంటే 20 అంతర్గత మార్కులతో పాటు 80 మార్కులు రాత పరీక్ష ద్వారా సాధించాల్సి ఉండేది. అయితే ఈ విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. ఇప్పుడు ప్రతి పరీక్షకు 100 మార్కుల చొప్పున ఆరు సబ్జెక్టులకు 600 మార్కులు ఉంటాయి.విద్యా సంవత్సరం సగానికి పైగా గడిచిన నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయంపై వ్యతిరేకత రావడంతో ఈ ఏడాది మాత్రమే 20 అంతర్గత మార్కులను మాత్రం యథాతథంగా ఉంచారు. మార్కుల విషయంలో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని 2015 నుంచి గ్రేడింగ్ విధానం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది మార్చిలో 80 మార్కులకు పరీక్ష ఉంటుంది. మిగతా 20 అంతర్గత మార్కులతో కలుపుతారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో 17 ప్రభుత్వోన్నత, 2 రెసిడెన్షియల్, 143 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో నుంచి సుమారు 20 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. అయితే నిన్నటివరకు గ్రేడింగ్ పద్ధతిలో విద్యార్థులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే ఎస్ఏ-1 (సమ్మిటివ్ అసెస్‌మెంట్) పూర్తి కాగా అంతర్గత మార్కులకు అవసరమైన ఎఫ్ఏ-1, 2 పరీక్షలు కూడా రాశారు. ఈ తరుణంలో ప్రభుత్వం గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం గ్రేడింగ్‌కు బదులుగా మార్కులు ఇవ్వనుండడంతో ఆ మేరకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు త్వరలోనే వారికి నూతన విధానం ప్రకారం నమూనా ప్రశ్నాపత్రాలు అందించనున్నారు. ఉపాధ్యాయులు ఈ మేరకు చొరవ తీసుకుని విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ నిర్ణయం అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.



ప్రభుత్వ నిర్ణయం మంచిదే..



విద్యార్థులకు గ్రేడింగ్‌కు బదులు మార్కులు ఇవ్వడం అనేది చాలా మంచి నిర్ణయం. మేము కూడా వారిని మార్పులకు అనుగుణంగా సన్నద్ధం చేస్తున్నాం. విద్యార్థులు వారు సాధించిన మార్కులు తెలుసుకుంటే ఎంతో ఆనందంగా ఉంటారు. ఉపాధ్యాయులు కూడా తాము చెప్పిన సిలబస్‌లో సదరు విద్యార్థులు ఎన్ని మార్కులు సాధించారో అనే దానిపై ఒక అంచనా ఉంటుంది.

– సురేందర్, ఫిజిక్స్ టీచర్, రాజ్‌భవన్ హైస్కూల్

విధానం ఏదైనా పర్వాలేదు..



పదో తరగతిలో ఏ విధానం ఉన్నా పర్వాలేదు. గ్రేడింగ్ ఉన్నా, మార్కులు వేసినా ఆ మేరకు సన్నద్ధం అవుతాం. కష్టపడి చదువుతున్నాం కాబట్టి మా ప్రతిభను తెలుసుకునేందుకు మార్కులైనా సరే, జీపీఏ అయినా ఏం ఇబ్బంది లేదు.

– నందిని, పదో తరగతి

మార్కులు ఉంటేనే మంచిది..



ఇప్పటివరకు జీపీఏ పద్ధతిలో కేవలం గ్రేడింగ్ ఇచ్చేవారు. గతంలో మాదిరిగా ఇప్పుడు మార్కులు ఇస్తారని మా టీచర్లు చెప్పారు. ఏయే సబ్జెక్టులో ఎన్ని మార్కులు వచ్చాయో ఈ విధానం ద్వారా ఖచ్చితంగా తెలుస్తుంది.

– చాణక్య, పదో తరగతి

ఇంతకుముందు మార్కులు తెలిసేవి కావు..



గ్రేడింగ్ పద్ధతి వల్ల మార్కులు తెలిసేవి కావు. ఇప్పుడు మార్కుల విధానాన్ని ప్రభుత్వం మళ్లీ తేవడం సంతోషంగా ఉంది. వారం నుంచి మార్కుల పద్ధతిలోనే చదువుకుంటున్నాం. సార్లు కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

– చాతుర్య, పదో తరగతి

రాజ్‌నగర్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఎన్నిక



బంజారాహిల్స్: ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని రాజ్‌నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. మొత్తం 217 ఓట్లు పోలుకాగా ఏ.శ్రీనివాస్ 139 ఓట్లు సాధించి బస్తీ అధ్యక్షుడిగా గెలుపొందారు. అనంతరం ఆయన స్థానికులతో కలిసి బస్తీలో ఊరేగింపుగా వెళ్లారు. తనను గెలిపించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. బస్తీ సమస్యలు తెలుసుకుంటూ అభివృద్ధికి పాటుపడతానని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తానని ఆయన పేర్కొన్నారు.

తరలిన అయ్యప్ప స్వాములు

లాలాపేట: తార్నాకకు చెందిన బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లికంటి అయ్యప్ప స్వామి మాల ధరించి దాదాపు 41 రోజుల నియమ నిష్టలతో దీక్షను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో పలువురు దీక్షాపరులు ఆదివారం అయ్యప్ప స్వామి దర్శనానికి బయలుదేరివెళ్లారు.

'ఏనుగమ్మ ఏనుగు' కవితా సంపుటి ఆవిష్కరణ



చిన్నపిల్లలతో కలిసి సంపుటి ఆవిష్కరిస్తున్న కవి శివారెడ్డి

పంజగుట్ట: కవి, రచయిత వసీరా (వీ సీతారామ రావు) రచించిన కవితా సంపుటి 'ఏనుగమ్మ ఏనుగు' పుస్తకాన్ని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రముఖ కవి శివారెడ్డి చిన్నపిల్లలతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నపిల్లల దృష్టితో ప్రపంచాన్ని చూసి పుస్తకం రచించారన్నారు. అలాగే పుస్తకంలో బొమ్మలు వేసిన శివాజీకి శివారెడ్డి పుస్తకాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయితలు పసునూరి శ్రీధర్ బాబు, ప్రసాదమూర్తి, వాడ్రేవు చినవీరభద్రుడు, వాసిరెడ్డి నవీన్ చీకోలు సుందరయ్య, జగన్నాథ శర్మ, పుస్తకాన్ని అజు పబ్లికేషన్స్ ప్రచురించగా, అజు పబ్లికేషన్స్ ముఖ్యులు మల్లికార్జున్ పాల్గొన్నారు.

జైలుకు పంపించాడన్న కక్షతో కత్తితో దాడి

రహమత్‌నగర్ : జైలుకు పంపించాడన్న కక్షతో ఓ యువకుడు ఇద్దరిపై కత్తితో దాడి చేసిన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సలీం (31) అనే యువకుడు గతంలో గంజాయి కేసులో జైలుకు వెళ్లాడు. అయితే మీరాజ్ అనే వ్యక్తి ఇచ్చిన సమాచారం వల్లే తాను జైలుకు వెళ్లాల్సి వచ్చిందని కక్ష పెంచుకున్నాడు.ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో మీరాజ్ కార్మికనగర్ మీదుగా వస్తుండగా సలీం తన వద్ద ఉన్న బటన్ చాకుతో దాడి చేశాడు. అడ్డుకోబోయిన మీరాజ్ స్నేహితుడు అయాజ్‌పై సైతం దాడికి దిగాడు. దీంతో మీరాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు సలీం. షేక్ జావిద్, షకీల్ పాషాపై కేసు నమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు.

మెట్లెక్కలేం బాబోయ్..!

గాంధీ వైద్య కళాశాలలో పనిచేయని లిఫ్టులు

- నాలుగు అంతస్తులు ఎక్కిదిగేందుకు మెడికోల ఇబ్బందులు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సీనియర్ వైద్యులు
- పట్టించుకోని నిర్వహణాధికారులు



గాంధీ మెడికల్ కాలేజీలో పనిచేయని లిఫ్టులు

గాంధీఆస్పత్రి: దేశవిదేశాలకు నిష్ణాతులైన వైద్యులను అందించిన సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో గత కొన్నినెలలుగా లిఫ్టులు మొరాయించడంతో సీనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నాలుగు అంతస్తుల గాంధీ కళాశాల భవనంలో మైక్రోబయోలజీ, ఫిజియాలజీ, పాథాలజీ, బయోకెమిస్ట్రీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఎల్రక్టానిక్ లైబ్రరీలతో పాటు పలు వైద్య విభాగాలు కొనసాగుతున్నాయి. 1250 మంది వైద్యవిద్యార్థులు, 450కి పైగా వైద్యులు, జూనియర్ డాక్టర్లు, హౌస్‌సర్జన్లు, మరో 250 మందితోపాటు, ఫోరెన్సిక్ విభాగానికి నగరంలోని పలు పోలీస్ ఠాణాల సిబ్బంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు 20 శాతం మంది సీనియర్ వైద్యుల వయస్సు 60 ఏళ్లు దాటింది. వీరితోపాటు దివ్యాంగులు, ఇతర రుగ్మతలతో బాధపడే ఉద్యోగులు నాలుగు అంతస్తులు ఎక్కి దిగలేక అపసోపాలు పడుతున్నారు. నాలుగు అంతస్తుల భవన సముదాయంలో కేవలం రెండు లిఫ్టులు మాత్రమే ఏర్పాటు చేయగా, ఒక లిఫ్ట్ ఏడాది క్రితం పాడవగా, రెండోది మూడు నెలల క్రితం మొరాయించింది. అప్పటి నుంచి వైద్యులు, సిబ్బంది ఆయా అంతస్తులకు వెళ్లేందుకు మెట్లు ఎక్కి దిగలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మెట్లు ఎక్కలేని మరికొంత మంది గ్రౌండ్ ఫ్లోర్‌లోనే కూర్చుని, అక్కడి నుంచే తమ పనులను చక్కబెడుతున్నారని, మెట్లు ఎక్కేసమయంలో ఆయాసానికి గురై ఆస్పత్రి పాలవుతున్నారని ఓ సీనియర్ వైద్యుడు వాపోయారు. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన కళాశాల భవనంలోని లిఫ్ట్‌ల కాలపరిమితి ముగిసిందని, బకాయిలు చెల్లించకపోవడంతో నిర్వహణ సంస్థ మరమ్మతులు చేయడం లేదని తెలిసింది. తక్షణమే కళాశాల పాలనా యంత్రాంగం, తెలంగాణ వైద్యవిద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి లిఫ్టలను అందుబాటులోకి తేవాలని, మరికొన్ని ఆధునిక లిఫ్టులు ఏర్పాటు చేయాలని వైద్యులు, వైద్యవిద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయమై 'సాక్షి' వివరణ కోరేందుకు యత్నించగా కళాశాల ప్రిన్సిపాల్ అందుబాటులోకి రాలేదు. కాగా కాలేజీలో పనిచేయని లి ఫ్ట్‌ల పరిస్థితిని వైద్యా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఓ సీనియర్ వైద్యుడు తెలిపారు.

వైభవంగా సహస్ర కలశాభిషేకం



పూజలు చేస్తున్న అర్చకులు, స్వాములు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప స్వామికి ఆదివారం సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతి హోమం అనంతరం 108 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. సుగంధ ద్రవ్యాలు నింపిన కలశాలతో అయ్యప్ప మూల విరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం అయ్యప్ప స్వామి భస్మ చందన అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం పడిపూజ, పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాస శర్మ, రామకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బోరబండలో గౌడ సంఘం నాయకుల నిరసన



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గౌడ సంఘం నాయకులు

రహమత్‌నగర్ : సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాస్‌గౌడ్ మృతికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని గౌడ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం బోరబండ బస్టాప్ వద్ద దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. అలాగే జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నాయకులు బండారి అశోక్, బాలరాజ్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, నరసింహ, గోగుల్ల వెంకటేశ్, మహేందర్ పాల్గొన్నారు.

కనుల పండువగా మహా పడిపూజ



పూజలో పాల్గొన్న భక్తులు

రహమత్‌నగర్ : ఎస్పీఆర్‌హిల్స్ ప్రతిభానగర్ రామాలయంలో అయ్యప్ప మహా పడిపూజను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బేగంబజార్ వ్యాపారులు శంకర్, కన్నా అగర్వాల్, శ్రీధర్‌ను గురుస్వామి రాంబాబు తదితరులు సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నల్లోల జీవన్



రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ కమలానగర్ బస్తీకి చెందిన నల్లోల జీవన్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కమలానగర్ బస్తీలో ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

జలమండలి ఆధ్వర్యంలో తాగునీటి శిబిరాల ఏర్పాటు



ఎన్టీఆర్‌మార్గ్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి శిబిరం

బంజారాహిల్స్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జలమండలి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్‌రోడ్డు, ట్యాంక్‌బండ్‌లో దాదాపు 45 చోట్ల ఉచిత తాగునీటి శిబిరాలు ఏర్పాటుచేశారు. జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్ ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు శిబిరాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఒక్కరోజే 5 లక్షలకు పైగా తాగునీటి ప్యాకెట్లను పంపిణీ చేశామని తెలిపారు. సోమవారం శిబిరాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్ : ఇంటి ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌కాలనీలో నివసించే కే వెంకటేశ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 6న రాత్రి విధులు ముగించుకుని తన బైక్‌ను ఇంటి ఎదుట పార్క్ చేశాడు. ఉదయం లేచి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల, పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

ఆలయానికి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. జవహర్‌నగర్‌లో నివసించే కే వీరేశం డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పదేళ్లుగా భార్య, ముగ్గురు పిల్లలతో అక్కడే నివాసం ఉంటున్నాడు. ఆమెకు కల్లు తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలో ఈనెల 7న భార్య ఆలయానికి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో వీరేశం పెద్ద కుమారుడితో కలిసి ఆచూకీ కోసం గాలించినా కనిపించలేదు. దీంతో ఆమె స్నేహితురాలైన స్వప్నకు ఫోన్ చేయగా సాయంత్రం కల్లు దుకాణం వద్ద కనిపించిదని చెప్పింది. అక్కడ విచారించినా ఫలితం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయభావం పెంపొందించేందుకు కృషి



సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులు, యువతలో జాతీయతాభావం పెంపొందించేందుకు విద్యా భారతి కృషి చేస్తోందని అఖిల భారతీయ సంఘటనా మంత్రి గోవింద్ మహాపాత్రో అన్నారు. హైదరాబాద్ శారదా ధామంలో ఆదివారం విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ జాతీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచ కోశ వికాసం, సమగ్ర వికాసం దిశగా 1952 నుంచి నిరంతరాయంగా ప్రయత్నం జరుగుతోందన్నారు. సామాన్య యువతను అసామాన్య పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమాజంలో సోషల్ మీడియా పోషిస్తున్న పాత్రపై సమాలోచనలు జరిపారు. ప్రచార విభాగం, అభిలేఖాగార్ (డాక్యుమెంటేషన్) విభాగాల నుంచి పలు రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. గత ఏడాది నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్షించారు. సంఘటన పరంగా పటిష్టం చేసేందుకు మార్గాలను, భవిష్యత్తు కార్యాచరణను ఈ సమావేశాల్లో చర్చించారు. కార్యక్రమంలో మణిపూర్ సెంట్రల్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ తిరుపతి రావు, కార్యదర్శి ముక్కాల సీతారాములు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చామర్తి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి ఆయాచితుల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు ఎస్‌బీఐ భరోసా



మాట్లాడుతున్న ఎస్‌బీఐ జీఎం ప్రకాష్ చంద్ర బరోరా

రాంగోపాల్‌పేట్: విదేశాల్లో విద్యనభ్యసించాలనే విద్యార్థులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భరోసా కల్పిస్తుందని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ప్రకాష్ చంద్ర బరోరా అన్నారు. ఆదివారం ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్‌బీఐ ఆవరణలో విదేశాల్లో విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఎలాంటి కొలెట్రల్ సెక్యూరిటీ లేకుండా రూ.50లక్షల వరకు విద్యా రుణాలు అందించేందుకు మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విదేశాల్లో టాప్ 100 యూనివర్సిటీల్లో విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఎలాంటి ఆస్తుల తాకట్టు లేకుండానే వారి ప్రతిభను బట్టి రూ.7.50 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు విద్యా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది దేశ వ్యాప్తంగా 1.27లక్షల మంది విద్యార్థులకు రూ.10,860 కోట్ల విద్యా రుణాలు అందించిన ఘనత ఎస్‌బీఐకి దక్కుతుందన్నారు. ఇందులో ఎలాంటి వివక్ష లేకుండా విద్యార్థినులకు 41 శాతం రుణాలు అందిస్తున్నామన్నారు. ఎస్‌బీఐ వీధి వ్యాపారులతో సహా ఎయిర్‌పోర్టులు, పోర్టులు, జాతీయ రహదారులతో పాటు అనేక భారీ ప్రాజెక్టులకు రుణాలు అందిస్తుందన్నారు. వి మేక్స్ స్కాలర్స్ సంస్థ కో ఫౌండర్ దామిని మాట్లాడుతూ విద్యార్థులు, బ్యాంకర్లకు మధ్య అనుసంధానంగా ఉంటూ రుణాలు పొందేందుకు వారికి అవసరమయ్యే సహాయ సహకారాలు అందిస్తామన్నారు. విద్యనభ్యసించే సమయంలోనూ వారికి ఎదరయ్యే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐఎస్ డీజీఎంలు వినోద్ కస్తూరి, రవీంద్ర, వివేక చంద్ర జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు. దాదాపు 500 మంది విద్యార్థులకు ప్రీ అప్రూవల్ లెటర్లు అందించారు.

బకెట్ దందాకు అడ్డుకట్ట వేయండి



మాట్లాడుతున్న సుర్వి దామోదర్ గౌడ్

కాచిగూడ: బకెట్ దందాకు అడ్డుకట్ట వేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మైన్స్ అండ్ సాండ్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు సుర్వి దామోదర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'ఇసుక యజమానుల సమస్యలు- ప్రభుత్వ వైఖరి'పై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బకెట్ దందా వల్ల ఏడు నుంచి పది టన్నుల అధిక లోడుతో లారీలను నింపేస్తున్నారని, దీంతో ఆర్టీఏ, పోలీస్ అధికారులు, సిబ్బంది దాడులు చేసి తమపై కేసులు నమోదు చేస్తున్నారన్నారు. తాము చేయని తప్పులకు శిక్ష అనుభవించవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బకెట్ దందా వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుందన్నారు. టీజీఎండీసీ కార్పొరేషన్ నిర్వహిస్తున్నటు ఇసుక క్వారీల్లో లారీలను అధికలోడు నింపుతున్నారన్నారు. లారీల్లో ఓవర్ లోడ్ కారణంగా అధికారులు దాడులు చేసి రూ. లక్షలు చలానా వేసి వేధిస్తున్నారన్నారు. ఇసుక క్వారీల్లో తూకాలు సరిగా లేనందున బయటికి వచ్చిన వెంటనే ఆర్టీఏ అధికారుల దాడులు జరుగుతున్నాయన్నారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి జిల్లాలో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం లోడింగ్ వ్యవస్థను బలోపేతం చేసి అక్రమ కేసుల నుంచి తమని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు యాదగిరి రెడ్డి, పవన్ కళ్యాణ్ రెడ్డి, ఎండీ సలీం, జగదీష్ యాదవ్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా 'ది ఫిన్ రన్'



రన్‌ను ప్రారంభిస్తున్న సైబర్ క్రైమ్ డీసీపీ బాలాదేవి తదితరులు





రాయదుర్గం: సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు ఆదివారం 'ది ఫిన్ రన్' పేరిట నిర్వహించిన రన్ అట్టహాసంగా కొనసాగింది. ఇండియా రిటైల్ ఇన్వెస్ట్‌మెంట్ ఎక్స్‌పో చొరవతో, ఫెయిర్స్ కమ్యూనికేషన్స్ సీఈఓ రమేష్‌ఐతా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జీఎంసీ బాలయోగి స్టేడియం వద్ద సైబరాబాద్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్, సైబర్ క్రైమ్ డీసీపీ బాలాదేవి, ఎస్‌సీఎస్‌సీ సీఈఓ నవేద్ ఆలమ్‌ఖాన్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ సాజిదాఖాన్, ఆక్వాట్రాన్ డైరెక్టర్ అనిల్‌బొల్లినా, ప్రాస్పెరిటీ ఎండీ జయపవన్, వాసవీగ్రూప్ సీనియర్ మేనేజర్ కుశలవ్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: సైబర్ క్రైమ్ డీసీపీ బాలాదేవి

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీసీపీ బాలాదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న సైబర్ నేరాల ముప్పును ఎదుర్కొనేందుకు ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో తొలిసారిగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన 'ది ఫిన్ రన్'కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. డి ఫెయిర్స్ కమ్యూనికేషన్ సీఈఓ రమేష్ ఐతా మాట్లాడుతూ సైబర్ బెదిరింపులను నియంత్రించేందుకు సురక్షితమైన డిజిటల్ స్థలాన్ని నిర్మించడానికి అందరూ కలిసిరావాల్సిన అవసరం ఉందన్నారు. ఈవెంట్‌లో పాల్గొన్నవారు ఫిట్‌నెస్ కోసమే కాకుండా డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేయాలని సూచించారు.

పార్టీ మారినట్లు నిరూపిస్తే రూ.11 లక్షలు ఇస్తా..



చెక్కును చూపిస్తున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: తాను బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని, పార్టీ మారినట్లు ఎవరైనా ఆధారాలతో నిరూపిస్తే రూ.11 లక్షలు నజరానా ఇస్తానని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గౌలిగూడ చమన్‌లోని తన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తాను బీఆర్‌ఎస్‌లోనే ఉన్నా.. కొందరు ఉద్దేశపూర్వకంగా తమ పార్టీలో చేరినట్లు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచి క్రమ శిక్షణతో రాజకీయాల్లో కొనసాగుతున్న తనను అప్రతిష్టపాలు చేసేందుకు కొందరు వ్యక్తులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అధినేత తనపై ఎంతో నమ్మకంతో హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా టికెట్ ఇచ్చి ప్రోత్సహించారన్నారు. నైతిక విలువలకు కట్టుబడి ఉంటానని, తాను ఏ రాజకీయ పార్టీలోనైనా చేరినట్లు రుజువు చేస్తే చార్మినార్ భాగ్యలక్ష్మీ సాక్షిగా రూ.11 లక్షలు ఇస్తానని తెలిపారు. రాబోయే నాలుగేళ్లు గోషామహల్ నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేస్తానని తెలిపారు. సమావేశంలో నాయకులు హెచ్.కుమార్, మేగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఎదురు చూపులు

- ఏడాది క్రితమే సర్కారు ఆక్రమిత నివాస స్థలాల దరఖాస్తుల పరిశీలన
- ప్రభుత్వం నిర్ణయంతోనే క్రమబద్ధీకరణకు మోక్షం
- అసెంబ్లీ శీతాకాల సమావేశాల నేపథ్యంలో పేదల ఆశలు

గ్రేటర్ సహా శివార్లలో జీఓ 58,59,118 కింద 1.19లక్షల దరఖాస్తులు



సాక్షి,సిటీబ్యూరో: గ్రేటర్‌తోసహా శివారుల్లో ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం గడుపుతున్న నిరుపేద ప్రజలు భూ క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్నారు. రెండో విడత భూ క్రమబద్ధీకరణలో భాగంగా సర్కారు అక్రమిత నివాస స్థలాల్లో నివాసముంటున్న పేద ప్రజల నుంచి జీఓ 58,59 కింద అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించి..వాటి పరిశీలన కార్యక్రమాన్ని కూడా పూర్తి చేసింది. అర్హులను గుర్తించి జీఓ 58,59 కింద భూ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాల్సి ఉండగా.... సాధారణ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావటంతో వాయిదా పడింది. అలాగే, జీఓ 118 కింద స్వీకరించిన దరఖాస్తుల పురోగతి కూడా నిలిచిపోయింది. ఎన్నికలు పూర్తయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా దరఖాస్తుల మోక్షం కోసం పేద ప్రజలకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఆరు గ్యారంటీలు , ధరణి పోర్టల్‌లో మార్పులు ,చేర్పులు వంటి అంశాలతో పాటు రెవెన్యూ శాఖపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం జీఓ 58,59 దరఖాస్తుల విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 9 నుంచి ప్రారంభంకానున్న శాసన సభ, మండలి శీతాకాల సమావేశాల్లో జీఓ 58,59 కింద భూ క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోగలదని గ్రేటర్ సహా శివారుల్లోని దరఖాస్తుదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నగర శివార్లలోని 44 కాలనీల్లో నివాస స్థలాల్లో భూ క్రమబద్ధీకరణకు సంబంధించిన అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 118 పై కూడా ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని స్థానికులు ఆశిస్తున్నారు. వీటికి సంబంధించిన గ్రేటర్‌తో సహా శివారుల్లో సుమారు 1.19 లక్షలకు పైగా దరఖాస్తులు అందినట్లు రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

మేడ్చల్ జిల్లాలో అత్యధికం..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జీఓ 58 కింద 26,092 దరఖాస్తులు రాగా,15 మండలాల పరిధిలోని పురపాలికలు, గ్రామ పంచాయతీల్లో 41 బృందాలు క్షేత్ర స్థాయిలో విచారణ పూర్తి చేశాయి. జిల్లాలో జీఓ 59 కింద వచ్చిన 15,200 దరఖాస్తులను కూడా క్షేత్ర స్థాయిలో 41 బృందాలు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. రాష్ట్రంలోనే మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో జీఓ 58,59 కింద అత్యధికంగా 41,292 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల విచారణలో భాగంగా ఇళ్ల పరిశీలన బృందాల్లో డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి బృందం ఇంటి ఫొటో అప్‌లోడ్ చేయటంతో పాటు జీవో నిబంధనల ప్రకారం ఉన్నాయా ? లేదా అని చెక్ చేసుకోవటం, సేకరించిన ఆధారాలను ప్రత్యేకంగా రూపొందించిన ' మొబైల్ యాప్'లో నమోదు చేసి, వాటిని కలెక్టర్ లాగిన్ సిపార్సు చేయడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ దరఖాస్తులను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మరో మారు పరిశీలించిన తర్వాత ఆమోదం లేదా తిరస్కరించే అవకాశముంటోంది.

◆ మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో మొదటి విడతలో జీఓ 59 కింద 33,258 దరఖాస్తులు రాగా, అధిక విలువ కలిగిన భూములకు సంబంధించిన 5 వేల దరఖాస్తుల వివరాలను అధికార యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. సర్కారు ఆదేశాల మే రకు 5 వేల దరఖాస్తులను పరిశీలించిన రాష్ట్ర ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో విచారించి, అర్హులైన లబ్ధిదారుల నుంచి జీఓ 59లో పేర్కొన్న విధంగా డబ్బులు వసూలు చేయాలని సూచించారు. వీటిపై కూడా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు.

16,17,18 తేదీల్లో 'హలో బీసీ.. చలో ఢిల్లీ'

కాచిగూడ: దేశ వ్యాప్త సమగ్ర కులగణన సాధన కోసం ఈనెల 16,17,18 తేదీల్లో 'హలో బీసీ -ఛలో ఢిల్లీ'కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ తెలిపారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని, కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ విద్యార్థులకు 100 శాతం ఫీజు రీయిబర్స్‌మెంట్ ఇవ్వాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలన్నారు. జస్టిస్ రోహిణి కమిషన్ రిపోర్టును బహిర్గతం చేయాలని, దేశవ్యాప్తంగా బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలని కోరారు. మూడు రోజుల పాటు ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగే మహా ధర్నాకు బీసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

10న జిల్లా కలెక్టరేట్‌ల ముట్టడి



వాల్‌దాస్ చంద్రశేఖర్ గౌడ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో 16.75 లక్షల మంది విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజుబకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడికి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని బీసీ విద్యార్థి సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వాల్‌దాస్, చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఫీజు బకాయిలు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కమీషన్ల కోసం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న పాలకులు విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మూసీ సుందరీకరణ పేరుతో రూ. 1.5 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వానికి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలన్న ఆలోచన లేకపోవడం దారుణమన్నారు.

పురస్కారాలు ఉత్తేజాన్నిస్తాయి



పురస్కార గ్రహీతలతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద తదితరులు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద
- ఘనంగా 'విశ్వగురు' కామధేను పురస్కారాల ప్రదానం

సనత్‌నగర్: పురస్కారాలు ఉత్తేజాన్ని ఇస్తాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద అన్నారు. బేగంపేట, టూరిజం ప్లాజాలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన కళాకారులకు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ కామధేను పురస్కారాలను ప్రదానం చేసింది. విద్యావేత్తలు, వైద్య రంగ నిపుణులు, సినీ ప్రముఖులు, సమాజ సేవకులు, వ్యాపార, ఆధ్యాత్మిక, జ్యోతిష్య రంగాలకు చెందిన 50 మంది కళాకారులను గుర్తించి ఈ పురస్కారాలను అందజేశారు. విశ్వగురు సంస్థ సీఈఓ సత్యవోలు రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవార్డులు బాధ్యతను మరింత పెంచుతాయన్నారు. వారు ఉత్సాహంగా ముందుకెళ్లేలా చేస్తాయన్నారు. వివిధ రంగాల్లో నిష్ణాతులను గుర్తించి వారికి పురస్కారాలను అందజేయడం అభినందనీయమన్నారు. ఆధ్యాత్మిక రంగం నుంచి శంఖారావంలో ప్రసిద్ధిగాంచిన డాక్టర్ కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు, రచనా రంగంలో టాన్స్‌జెండర్స్‌పై తెలుగులో పుస్తకం రచించిన డాక్టర్ ప్రభాకర్, మహిళా మ్యూజిక్ డైరెక్టర్ విభాగం శ్రీలేఖ, జాతీయ ఉత్తమ ఫాదర్ కేటగిరీలో ముదినేపల్లికి చెందిన డాక్టర్ మనోజ్, రాష్ట్ర ఉత్తమ తల్లి కేటగిరిలో పోసాని రాణి, సేవా రంగంలో కుసుమ భోగరాజు, వైద్య రంగంలో అశ్విని అమరేశ్వర్, సూక్ష్మ కళా రంగంలో ముంజంపల్లి విద్యాధరాచారి తదితరులు పురస్కారాలను అందుకున్నారు. బండి శ్రీనివాస్ రఘువీర్, పీవీ రావు, డాక్టర్ సారంగపాణి, కిషోర్ కుమార్, సత్యవోలు పూజిత, ఫిల్మ్ సెన్సార్‌బోర్డు మెంబర్ కృష్ణాది శేషు, రవిచరణ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా హానర్ రన్

ఖైరతాబాద్: నెక్లెస్ రోడ్డులో ఆదివారం సాయుధ బలగాల రన్ ఉత్సాహంగా సాగింది. సైనికులు, మాజీ సైనికులతో కలిసి హానర్ రన్ పేరుతో 4కె, 5కె, 12.5కె విభాగాలలో రన్ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద మేజర్ జనరల్ అఖిలేష్ కుమార్ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణలో సైనికుల సేవలు వెలకట్టలేవని, అనునిత్యం దేశం కోసం పాటు పడతారని, వారి సేవలను ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. అనంతరం రన్‌లో పాల్గొన్న వారికి మెడల్స్ అందజేశారు.



హానర్ రన్‌లో పాల్గొన్న సైనికులు

ప్రజా ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నాలను తిప్పికొడదాం

- బీఆర్‌ఎస్, బీజేపీ కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి
- టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కి



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి, తదితరులు

మన్సూరాబాద్: ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి అన్నారు. ఆదివారం ఆయన ఎల్‌బీనగర్‌లో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, సుజాతనాయక్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. 6 గ్యారంటీలు.. 66 అబద్ధాలంటూ ప్రతిపక్షాలు అసత్యాలు మాట్లాడటం మంచిది కాదన్నారు. బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్రమంత్రులు, 8 మంది ఎంపీలు ఉన్నారని, వారు రాష్ట్రానికి తీసుకు వచ్చిన నిధుల వివరాలు వెల్లడించాలన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సభకు 2వేల మంది హాజరుకాలేదని, సభలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఎక్కువ... ప్రజలు తక్కువని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను గ్లోబల్ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు ఒక్కటేనన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ 11 నెలల పాలన, బీజేపీ ప్రభుత్వ 11 ఏళ్ల పాలనపై చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. నాగోలు నుంచి ఎల్‌బీనగర్ ఎయిర్ పోర్టు వరకు, ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్‌కు మెట్రోరైలును పొడిగించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ,బీఆర్‌ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందాలున్నాయని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బీజేపీకి సహకరించినందుకు కేసీఆర్ కుమార్తె కవితకు బెయిల్ వచ్చిందని మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. బీజేపీ అధ్యక్షుడు సభలో పచ్చి అబద్ధాలు మాట్లాడారన్నారు. ప్రతి రైతుకు ప్రతి కారుకు ఏటా రూ.15వేల వరకు లబ్ధి జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, గజ్జి భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

నగరంలో నేడు

- డా.బి.ఆర్. అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సాయంత్రం 6.05 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుంది.
- ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా ఎన్టీఆర్ మార్గ్‌లో రాత్రి 7.30 గంటలకు డ్రోన్ షో, రాత్రి 8 గంటలకు బాణ సంచా ప్రదర్శన, హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో తమన్ సంగీత కార్యక్రమాలు జరుగుతాయి.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణలో ఆకృతి ఆధ్వర్యంలో ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్ హైటెక్స్‌లోని నవోటెల్ హెచ్ఐసీసీలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటలకు హైలైఫ్ సంస్థ ఆధ్వర్యంలో నగల ప్రదర్శన జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఉమ్రా యాత్రికులకు స్వాగతం



ఎయిర్‌పోర్టులో ఉమ్రా యాత్రికుల బృందం

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుంచి వెళ్లిన ఉమ్రా యాత్రికులు క్షేమంగా యాత్రను పూర్తి చేసుకుని ఆదివారం మధ్యాహ్నం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా యాత్రికులకు వారి బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఉమ్రా యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసి వచ్చినట్లు యాత్ర పర్యవేక్షకులు అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలి తెలిపారు.

సమస్యను అర్థం చేసుకుంటే పరిష్కారం సులువు



సెమినార్‌లో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: సమస్యను గుర్తించి, అర్థం చేసుకుంటే సులభంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని జస్టిస్ వి ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం ఆయన శాంతిసరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో బ్రహ్మకుమారీస్ సంస్థ హైదరాబాద్ బిజినెస్ అండ్ ఇండస్ట్రియల్ వింగ్ ఆధ్వర్యంలో 'పర్సనల్ ఎక్స్‌లెన్స్ ఫర్ బిజినెస్ స్ట్రాటజీ అండ్ సక్సెస్' అనే అంశంపై ప్రత్యేక సెమినార్, ప్యానల్ డిస్కషన్ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఉండే వారు ఆధ్యాత్మికతకు కూడా ప్రాధాన్యం ఇస్తే ఆయా రంగాల్లో మరింత రాణించేందుకు, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. సమస్యలను ప్రశాంతంగా అర్థం చేసుకుని, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండడంతో వాటికి పరిష్కార మార్గాలను గుర్తించడానికి అవకాశం ఉంటుందన్నారు. సీనియర్ కార్పొరేట్ లీడర్, ఇండియా ఐసీఏ ఫెల్లో మెంబర్ సి.రామకృష్ణ, వెంచర్ క్యాపిటలిస్ట్ కిరణ్ చంద్రకల్లూరి మాట్లాడుతూ ప్రతి రంగంలో విజయం సాధించాలంటే కొన్ని లక్ష్యాలు గుర్తించి వాటికోసం చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టర్కీ బ్రహ్మకుమారీస్ సంస్థ డైరెక్టర్ యోగేష్ శ్రద్ధ, శాంతిసరోవర్ డైరెక్టర్ బీకే కుల్దీప్ దీదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాకారులు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



శాంతిసరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో కళాకారుల నృత్య ప్రదర్శన

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 9, డిసెంబర్, 2024

వివిధ రకాల డ్రై ఫ్రూట్స్‌తో ప్రిపరేషన్
నగరంలో కొనసాగుతున్న సందడి
వినోదాన్ని పంచే గ్రేప్ స్టాంపింగ్..
నూతనోత్సాహంతో ప్రజల భాగస్వామ్యం
స్టార్ హోటల్స్ మొదలు.. ప్రముఖ సంస్థల్లోనూ

హైదరాబాద్ వైబ్స్





డిసెంబర్ వచ్చిందంటే చాలు హైదరాబాద్ నగరం నూతనోత్సాహాన్ని పుంజుకుంటుంది. ఒకవైపు ఇయర్ ఎండ్, న్యూ ఇయర్ వేడుకలు, మరోవైపు క్రిస్మస్ సంబరాలతో నగరం అంతా పార్టీ మూడ్‌లో ఉంటుంది. ఇందులో భాగంగా నగరంలో ఇప్పటికే విభిన్న వేదికల్లో వినోద కార్యక్రమాలు, వేడుకలు మొదలయ్యాయి. కల్చరల్ డైవర్సిటీకి కేర్ ఆఫ్ అడ్రస్‌గా నిలిచే హైదరాబాద్‌లో సర్వమత సమ్మేళనంలో భాగంగా క్రిస్మస్ వేడుకలు సైతం ఘనంగా నిర్వహిస్తుంటారు. ప్రీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేక్ మిక్సింగ్ సందడి నెలకొంది. నూతన ఏడాదికి స్వాగతం పలికేందుకు ఇయర్ ఎండ్ వేడుకలకు కూడా సన్నద్ధం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్వహించే కేక్ మిక్సింగ్‌పైనే ఈ కథనం..

- సాక్షి, సిటీ బ్యూరో

కేక్స్ మిక్స్.. టేస్ట్ అదుర్స్..



కల్చరల్ డైవర్సిటీలో మరోసారి హైదరాబాద్ టాప్

నగరంలో గత కొన్ని సంవత్సరాలుగా కేక్ మిక్సింగ్.. ట్రెండ్ కొనసాగుతోంది. మొదట్లో క్రిస్మస్ ప్రీ ఈవెంట్స్‌లో భాగంగా కేక్ మిక్సింగ్ నిర్వహించేవారు. కానీ ఈ మధ్యకాలంలో ప్రతి ఒక్కరూ కేక్ మిక్సింగ్‌లో పాల్గొంటూ వినూత్న సంస్కృతికి నాంది పలుకుతున్నారు. నగరంలోని ఫైవ్ స్టార్ హోటల్స్, రిసార్ట్స్, ఎన్జీవోలు, విద్యా వ్యాపార సంస్థల్లో, ఇతర ఎంటర్‌టైన్మెంట్ వేదికలుగా కేక్ మిక్సింగ్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఈవెంట్లలో పలువురు సెలబ్రిటీలు సైతం పాల్గొని సందడి చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే నోవోటెల్ హైదరాబాద్, గోల్కొండ హోటల్, తాజ్ కృష్ణ, తాజ్ వివంత వంటి ఫైవ్ స్టార్ హోటల్స్‌తో పాటు ఇతర వేదికల్లో కేక్ మిక్సింగ్ వేడుకలు మొదలై కొనసాగుతూనే ఉన్నాయి.



సెలిబ్రిటీల సందడి..

నగర జీవన శైలిలో భాగమైన ఈ కార్యక్రమాలకు సెలిబ్రిటీల నుండి కూడా మంచి ఆదరణ లభిస్తుంది. నిర్వాహకులు సైతం పలువురు సెలిబ్రిటీలు, సామాజికవేత్తలు, ఐకానిక్ వ్యక్తులను ఈ కేక్ మిక్సింగ్ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఆహ్వానిస్తూ నగరవాసులను తమ వైపుకు తిప్పుకుంటున్నారు. ఇలా ఈ ఏడాది నగర వేదికగా ఇప్పటికే జరిగిన పలు వేడుకల్లో సినీ తారలు, సింగర్లు, స్పోర్ట్స్ స్టార్స్ పాల్గొని సందడి చేశారు.



వివిధ రకాల డ్రై ఫ్రూట్స్..

ప్రీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా, కేక్ మిక్సింగ్, గ్రేప్ స్టాంపింగ్ ప్రధానంగా నిర్వహిస్తారు. ఈ కేక్ మిక్సింగ్‌లో దాదాపు 25 రకాల డ్రై ఫ్రూట్స్, పలు రకాల స్పైసెస్, రం, బ్రాందీ, విస్కీ లాంటి లిక్కర్ కలుపుతారు. ఇందులో వాడే పదార్థాల మిశ్రమం మంచి పోషకాలతో ఆరోగ్య ప్రదాయిని గానూ ఉంటున్నాయి. ఈ మిశ్రమాన్నంతా కొద్ది రోజులపాటు సోక్ (పులియ బెట్టడం) చేసి ఆ తరువాత ప్లమ్ కేక్ తయారు చేస్తారు. పాశ్చాత్య సంస్కృతిలో భాగంగా తయారు చేసిన ఈ ప్లమ్ కేక్ క్రిస్మస్ వేడుకల్లో అందరికీ ఫేవరెట్. కేక్ మిక్సింగ్‌లో చిన్నలు, పెద్దలు అందరూ కలిసి లిక్కర్‌తో డ్రై ఫ్రూట్స్ కలుపుతూ ఎంజాయ్ చేస్తారు.

గ్రేప్ స్టాంపింగ్..

కేక్ మిక్సింగ్‌తో పాటు ఈ మధ్యకాలంలో గ్రేప్ స్టాంపింగ్ విరివిగా నిర్వహిస్తున్నారు. ఈ గ్రేప్ స్టాంపింగ్‌లో ఒక పెద్ద చెక్క బుట్టలో అధిక మొత్తంలో ద్రాక్ష పళ్లను వేసి సామూహికంగా వాటిని తొక్కుతూ ద్రాక్ష రసాన్ని తీసి దాని నుండి వైన్ తయారు చేస్తారు. ఈ వైన్ కూడా క్రిస్మస్ వేడుకల్లో ప్రధాన అంశమే ఇలాంటి సాంస్కృతిక వినోదపరమైన కార్యక్రమాలకు నగరంలోని యువత సాఫ్ట్ వేర్ ఉద్యోగులు కూడా అమితాసక్తి చూపిస్తున్నారు. ఈ నెలలో వీకెండ్ వచ్చిందంటే చాలు ఎక్కడెక్కడ ఇలాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయో తెలుసుకొని అందులో పాలుపంచుకుంటున్నారు. ఈ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ సందడి చేస్తున్నారు.

నూతనోత్సాహం కోసం..

కేక్ మిక్సింగ్ కూడా మన జీవన పరమార్థాన్ని తెలిపే ఓ వేడుకే. ఈ కేక్ మిక్సింగ్ లో కలిపే డ్రై ఫ్రూట్స్ నట్స్ సుగంధద్రవ్యాల లాగే మన అందరి జీవితాలు కలుపుగోలుగా అందంగా ఉండాలని అర్థం. అంతేకాకుండా ప్రతి ఏడాదీ నూతనోత్సాహాన్ని అందించడానికి ముందస్తు వేడుక. నగరంలో ఈ మధ్యకాలంలో ఈ సంస్కృతికి ఆదరణ బాగా పెరిగింది.
– ఎస్పీ శైలజ, ప్రముఖ సింగర్, (ఈ మధ్య జరిగిన ఓ కేక్ మిక్సింగ్ వేడుకలో భాగంగా).

విదేశీ విద్యపై షిఫ్టెడ్

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచం నలుమూలల నుంచి వెళ్లి అమెరికాలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల్లో మన దేశం నుంచే అత్యధిక శాతం ఉన్నారంటూ, తాజా అమెరికా ఎన్నికల ఫలితాలు అక్కడి భారతీయులపై ప్రతికూల ప్రభావాలు చూపే అవకాశం లేదని జాతీయ అంతర్జాతీయ విద్యా వేత్తలు అభిప్రాయపడ్డారు. నగరానికి చెందిన ఎడ్యుఫిన్‌టెక్ సంస్థ గ్రాడ్‌రైట్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని నోవోటెల్ హోటల్‌లో విదేశీ విద్యపై 'షిఫ్టెడ్' సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికాకు చెందిన పలు విశ్వవిద్యాలయాల ప్రతినిధులు మాట్లాడుతూ భారత్ నుంచి మరీ ముఖ్యంగా తెలంగాణ నుంచి అత్యధిక సంఖ్యలో తమ వర్సిటీలకు విద్యార్థులు తరలివస్తున్నారని, విద్యార్జనతో పాటు తగిన ఉద్యోగ ఉపాధి సైతం పొందగలుగుతున్నారని వెల్లడించారు. విద్యార్థులకు షిఫ్టెడ్ పేరిట రెగ్యులర్‌గా సేవలు అందిస్తున్న నిర్వాహక సంస్థను ప్రశంసించారు. అమెరికా అభివృద్ధిపై పూర్తి అవగాహన ఉన్న ట్రంప్ గెలుపు వల్ల అమెరికాలోని భారతీయ విద్యార్థులకు సమస్యలు వస్తాయనేది అపోహ మాత్రమేనన్నారు. ఈ సదస్సుకు సెయింట్ లూయిస్‌లోని వాషింగ్టన్ వర్సిటీ, లెహి విశ్వవిద్యాలయం, రట్జర్స్ విశ్వవిద్యాలయం, బ్రాండీస్ విశ్వవిద్యాలయం, సిటీ యూనివర్శిటీ ఆఫ్ న్యూయార్క్, శాన్ డియాగో విశ్వవిద్యాలయం తదితర విశ్వవిద్యాలయాల డీన్స్, అడ్మిషన్ల డైరెక్టర్లు పలు అగ్రగామి బ్యాంక్‌ల ప్రతినిధులు హాజరయ్యారు.



సామాజిక అంతరాల దర్పణమే కల్కి!

ఒకరితో మరొకరిని పోల్చడం సరికాదు

టెడ్ ఎక్స్‌లో ప్రముఖ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్






సాక్షి, సిటీబ్యూరో: సామాజిక అంతరాలను మనసులో పెట్టుకునే కల్కి సినిమాను రాసుకున్నానని ప్రముఖ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ తెలిపారు. ప్రస్తుతం అన్ని రంగాలూ అభివృద్ధి చెందాయని, అన్ని రకాల వసతులూ అందుబాటులోకి వచ్చాయని, అయితే అదే సమయంలో కనీసం వైద్యం, విద్య అందలేని స్థితిలో చాలా మంది పేదలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆలోచన నుంచే కల్కి సినిమా కథను రాసుకుని రూపొందించామని చెప్పారు. శిల్పకళా వేదికలో ఆదివారం టెడ్ ఎక్స్ హైదరాబాద్ 10వ ఎడిషన్ జరిగింది. సమాజంలో ఎవరి టాలెంట్ వారికి ఉంటుందని, ఒకరితో ఒకరిని పోల్చడం సరికాదని పేర్కొన్నారు. పుట్టినప్పటి నుంచే వేరే వారితో పోల్చడం ప్రారంభం అవుతుందని చెప్పారు. పెయింటింగ్స్, హస్తకళలు, సినిమా వంటి కళలను ఒకదానితో ఒకటి ఎలా పోల్చగలరని, దేనికి ఉండాల్సిన ప్రాముఖ్యత దానికి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే టెడ్‌ఎక్స్‌లో పాల్గొన్న తెలంగాణ విమెన్ సేఫ్టీ వింగ్ హెడ్ షికా గొయెల్ ప్రసంగించారు. ఒక మహిళా ఐపీఎస్ అధికారిగా తన జీవితం ఎప్పుడూ చాలెంజింగ్‌గా ఉంటుందని, అయితే మానసికంగా, శారీరకంగా, ఎమోషనల్‌గా ఇబ్బంది అనిపించినప్పుడల్లా శక్తి కూడదీసుకుని ముందుకు వెళ్తుంటానని షికా గొయెల్ అన్నారు. సైబర్ సెక్యూరిటీలో తెలంగాణ అద్భుతంగా పనిచేస్తోందని, దాదాపు రూ.140 కోట్లు సైబర్‌నేరస్తుల నుంచి రికవరీ చేసి బాధితులకు అందజేశామని గుర్తు చేశారు. మహిళల భద్రతలో ఎంతో జాగ్రత్త తీసుకుంటున్నామని, చిన్నారులకు భరోసా కల్పిస్తున్నామని వివరించారు. పలువురు ప్రముఖులు తమ అనుభవాలను పంచుకున్నారు. దాదాపు 12 వేల మంది ఔత్సాహికులు పాల్గొన్నారు.

గచ్చిబౌలిలో ఫిన్ స్విమ్మింగ్ 2024


గచ్చిబౌలి: ఆలిండియా ఫిన్ స్విమ్మింగ్ ఫెడరేషన్ కప్–2024 పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలోని స్విమ్మింగ్‌పూల్‌లో ఈ పోటీలను బాలురు, బాలికల విభాగాల్లో వేర్వేరుగా నిర్వహించారు. ఇందులో 50 మీటర్లు, 100, 200, 400 మీటర్లు, 800 మిడ్ రిలే పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను అండర్ వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఇండియా ప్రధాన కార్యదర్శి మయూర్‌పటేల్, యూఎస్ఏఐ చీఫ్ జనరల్ సెక్రెటరీ కుల్‌దీప్‌పాటిల్, యూఎస్ఎఫ్ఏటీ అధ్యక్షురాలు జ్యోతి, ప్రధాన కార్యదర్శి దినేష్‌రాజోరియా ప్రారంభించారు. ఈ పోటీలను మొదటిసారి నిర్వహిస్తున్నామని, దక్షిణ భారతదేశంలో నిర్వహణకు అవకాశం కల్పించడానికి ప్రభుత్వ సహకారం మరువలేనిదని జ్యోతి అన్నారు. మూడు రోజులపాటు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే ఈ పోటీలు 11తో ముగుస్తాయన్నారు. 17 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారని, పోటీలో ప్రతిభ చాటిన వారికి సర్టిఫికెట్లు, మెడల్స్ అందిస్తామని తెలిపారు.





ఎత్నిక్ షైన్..






సాక్షి, సిటీబ్యూరో: సంప్రదాయశైలి దుస్తులను ఆధునికులకు తగ్గట్టుగా రూపుదిద్దిన ఎత్నిక్ శైలి డిజైన్స్ ఆకట్టుకున్నాయి. కూకట్‌పల్లిలోని నెక్సస్ మాల్‌లో ఆదివారం ఆర్యన్ ఏజే ఈవెంట్స్‌తో కలిసి ప్రముఖ దుస్తుల బ్రాండ్ తరుణి నిర్వహించిన ఎత్నిక్ ఫ్యాషన్ షోలో మోడల్స్ విభిన్న రకాల డిజైనర్ దుస్తులను ప్రదర్శించారు. లెహంగాలు, అనార్కలీ తదితర వస్త్ర శైలులు, చీరలు ఈ కలెక్షన్స్‌లో ఉన్నాయి. పెళ్లి, పండుగలతో పాటు ప్రత్యేక సందర్భాలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న అకేషనల్ వేర్ అటు సంప్రదాయం, ఇటు ఫ్యాషన్ మేళవించి అందిస్తున్నామని తరుణి మేనేజర్ ఊర్వశి తెలిపారు.



'ఇసుజు' ఐ కేర్ వింటర్ క్యాంప్

సాక్షి, సిటీబ్యూరో: ఇసుజు మోటార్స్ ఇండియా ఆధ్వర్యంలో 'ఇసుజు ఐ–కేర్ వింటర్ క్యాంప్' నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. డీ–మాక్స్ పికప్ ఎస్‌యూవీ శ్రేణి కోసం నిర్వహిస్తున్న ఈ సేవా శిబిరం వాహన యజమానులకు ఉపయుక్తంగా ఉంటుందని, నగరంలోని తమ అధీకృత డీలర్ సర్వీస్ అవుట్ లెట్‌లలో సోమవారం నుంచి 14 వరకూ కొనసాగుతుందని వివరించారు. శిబిరాన్ని సందర్శించే వినియోగదారులకు ఉచిత 37–పాయింట్ సమగ్ర తనిఖీ, ఉచిత టాప్ వాష్ లతో పాటు పలు రకాల సేవలు రాయితీ ధరల్లో అందుతాయన్నారు.



క్లుప్తంగా...

17న మంగళగిరికి రాష్ట్రపతి



మంగళగిరి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 17న ఏపీలో పర్యటించనున్నట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదివారం తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఆల్ ఇండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఎయిమ్స్)ను రాష్ట్రపతి సందర్శిస్తారని చెప్పారు.

12న తిరుమలలో చక్రతీర్థ ముక్కోటి

తిరుమల: తిరుమలలో జరిగే ఉత్సవాల్లో అత్యంత ప్రముఖమైన చక్రతీర్థ ముక్కోటి ఈ నెల 12న జరగనుంది. ప్రతి ఏడాదీ కార్తీక మాసం శుద్ధద్వాదశినాడు ఈ చక్రతీర్థ ముక్కోటి జరుపుతారు. ఆ రోజున స్వామివారికి ప్రాతఃకాల, మధ్యాహ్న ఆరాధనలు పూర్తయిన తరువాత అర్చకులు, పరిచారకులు, ఉద్యోగులు, భక్తులు, యాత్రికులు మంగళవాయిద్యాలతో ఆలయం నుంచి ఊరేగింపుగా స్వామివారిని చక్రతీర్థానికి తీసుకువెళతారు. అక్కడ శ్రీ చక్రత్తాళ్వారు వారికి, నరసింహస్వామివారికి, ఆంజనేయస్వామివారికి అభిషేకం, పుష్పాలంకారం, ఆరాధన చేస్తారు. హారతి నివేదించిన అనంతరం తిరిగి శ్రీవారి ఆలయానికి చేరుకుంటారు.

కారుణ్య డీమ్డ్ వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు

సాక్షి, హైదరాబాద్: కోయంబత్తూరులోని ప్రఖ్యాత కారుణ్య డీమ్డ్ యూనివర్సిటీ అత్యాధునిక సాంకేతికతపై సదస్సుకు వేదికైంది. వర్సిటీలో ఇటీవల కంప్యూటర్, ఇంటెలిజెన్స్ రియాలిటీ టెక్నాలజీలపై ప్రతిష్టాత్మక ఐట్రిపుల్ ఈ అంతర్జాతీయ సదస్సు (ఐసీసీఐఆర్‌టీ–2024) నిర్వహించారు. ఇందులో సాంకేతిక విద్యారంగంలో లబ్ధ ప్రతిష్టులైన వ్యక్తులు పాల్గొని కొత్త టెక్నాలజీలపై ఉపన్యసించారు. ఆస్ట్రేలియాలోని డీకిన్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గాంగ్‌లీ, బ్రిటన్‌లోని డర్హమ్ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ అనీష్ జిందాల్, ఆ వర్సిటీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డీన్ (అంతర్జాతీయ సంబంధాలు) హెలెన్ థామ్సన్, ఐఐటీ భువనేశ్వర్ డైరెక్టర్ ఆశిష్ ఘోష్ తదితరులు సదస్సులో ప్రసంగించారు. ఈ సదస్సులో ఐవోటీ ఇన్నోవేషన్స్, న్యూరల్ ఇన్ఫర్మాటిక్స్, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లర్నింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ సాంకేతికతలపై లోతైన చర్చలు జరిగాయి.

'గగన్‌యాన్'కు యూరప్ సహకారం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఈ నెల 5న పీఎస్‌ఎల్‌వీ సీ59 రాకెట్ ద్వారా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా–3 ఉపగ్రహ ప్రయోగంతో ఇరు దేశాలకు చెందిన రెండు అంతరిక్ష సంస్థల బంధం మరింతగా బలపడింది. ఉపగ్రహం, రాకెట్ సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి ఒకరికొకరు సహకారం అందించుకునే విధంగా డిసెంబర్ 5న సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లో ఒప్పందాలు జరిగాయి. భవిష్యత్తులో నిర్వహించబోయే గగన్‌యాన్ మిషన్‌లకు గ్రౌండ్ ట్రాకింగ్ సపోర్ట్ కోసం టెక్నికల్ ఇంప్లిమెంటింగ్ ప్లాన్ (టిప్) డాక్యుమెంట్లపై ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్, బెల్జియం నుంచి భారతదేశ రాయబారి వాన్ డెర్ హాసెల్ట్ సమక్షంలో ఇరు అంతరిక్ష సంస్థలకు చెందిన డైరెక్టర్లు సంతకాలు చేశారు. గగన్‌యాన్ మిషన్‌ల ప్రయోగాలకు గ్రౌండ్‌స్టేషన్ టెక్నాలజీని అందించేందుకు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ముందుకు రావడంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింతగా బలపడ్డాయని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

భార్య సమాధి వద్ద భర్త ఆత్మహత్య

- ఆరు నెలల కిందట భార్యను హత్య చేసిన భర్త
- ఆపై ఆరు నెలలు జైలు.. బెయిల్‌పై విడుదల
- చేసిన తప్పునకు పశ్చాత్తాపంతో బలవన్మరణం

రామకుప్పం: క్షణికావేశంలో చేసిన తప్పునకు పశ్చాత్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం బైపరెడ్లపల్లికి చెందిన గంగిరెడ్డి(49), సుజాత భార్యాభర్తలు. ఇద్దరు కుమారులతో కలిసి పదేళ్ల కిందట జీవనోపాధి కోసం బెంగళూరు వెళ్లి కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. ఏడాది నుంచి ఇద్దరి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఆరు నెలల కిందట ఘర్షణ పడ్డారు. గంగిరెడ్డి క్షణికావేశంలో భార్య సుజాతపై కత్తితో దాడి చేయడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. భార్యను తానే చంపేశానని గంగిరెడ్డి అక్కడి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. ఈ కేసులో 6 నెలల జైలు జీవితం గడిపి.. శనివారం బెయిల్‌పై విడుదలై స్వగ్రామంలో ఉన్న కుమారుల వద్దకు వచ్చాడు. రాత్రి వారితో కలిసి భోజనం చేశాడు. ఇకపై తనను అందరూ భార్యను చంపేశానన్న ఏహ్య భావంతో చూస్తారని, క్షణికావేశంలో భార్యను చంపుకొన్నానని.. తనకు బతకాలని లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. రాత్రి ఇంట్లో కుమారులతో కలిసి నిద్రించాడు. ఆదివారం తెల్లవారుజామున మెలకువ వచ్చిన కుమారులకు ఇంట్లో తండ్రి కనిపించలేదు. గ్రామంలో వెతికారు. గంగిరెడ్డి తన తండ్రి, భార్య సమాధుల వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండటాన్ని గమనించారు.

కూటమి కొత్త స్టంట్స్

పేరెంట్స్ కమిటీ సమావేశాల పేరుతో ఏమార్చే యత్నం • ఇంతటి నటనా కౌశలం సీఎం చంద్రబాబుకే సొంతం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపాటు

- టీచర్లు–విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు కొత్తేమీ కాదు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా జరిగాయి
- తల్లిదండ్రుల కమిటీల భాగస్వామ్యంతోనే నాడు–నేడు పనులు
- ఈ సమావేశాలకు ఇప్పుడు కొత్త పేరు పెట్టి ఏమార్చే యత్నం
- విద్యా రంగాన్ని నాశనం చేయడమేకాక ఈ సమావేశాలకు చందాలు అడుగుతారా?
- అమ్మ ఒడి గురించి సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్.. ఎందుకు మాట్లాడలేదు?
- ఇంగ్లిష్ మీడియం, టోఫెల్, సబ్జెక్ట్ టీచర్ల విధానం, సీబీఎస్‌ఈ, ఐబీ, ట్యాబ్‌లు.. ఎందుకు ఆపేశారు? .. మధ్యాహ్న భోజనం బాగోలేదని పేరెంట్స్ గగ్గోలు పెట్టడం మీ చెవులకూ వినిపించ లేదా?
- స్కూళ్లు, టాయిలెట్ల నిర్వహణ గురించి ఎందుకు పట్టించుకోలేదు?
- విద్యా దీవెన, వసతి దీవెన ఇవ్వకుండా డైవర్షన్ రాజకీయాలా?



సాక్షి, అమరావతి : సహజంగా ప్రతి స్కూల్లో జరిగే పేరెంట్స్ కమిటీ సమావేశాల పేరు మార్చి, ఆ సమావేశాలేవో ఇప్పుడే జరుగుతున్నట్టుగా, వాటిని ప్రచార వేదికలుగా మార్చుకుని చంద్రబాబు కూటమి ప్రభుత్వం చేస్తున్న స్టంట్స్ చూస్తుంటే ఆశ్చర్యమేస్తోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో కష్టపడి తీర్చిదిద్దిన ప్రభుత్వ స్కూళ్లను, విద్యా రంగాన్ని ఒకవైపు నాశనం చేస్తూ.. అమ్మకు వందనం పేరిట తల్లిదండ్రులకు సున్నం రాసి, వారిని దగాచేసి, మళ్లీ ఇప్పుడు రొటీన్‌గా జరిగే పేరెంట్స్ సమావేశాలపై పబ్లిసిటీ చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈ ప్రపంచంలో ఒక్క చంద్రబాబు మాత్రమే ఇలాంటి మోసాలు చేయగలరన్నారు. ఇంతటి నటనా కౌశలం **చంద్రబాబుకే సొంతం అంటూ వ్యంగోక్తులు విసిరారు.** ఈ మేరకు ఆదివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

1 టీచర్లు–విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు కొత్తేమీ కాదు. క్రమం తప్పకుండా గతంలో నుంచీ జరుగుతున్నవే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యా రంగానికి పూర్తి జవసత్వాలు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ప్రతి విప్లవాత్మక మార్పులోనూ, అమలు చేసిన ప్రతి సంస్కరణలోనూ పిల్లల తల్లిదండ్రుల ఆలోచనలు, వారి భాగస్వామ్యాన్ని తీసుకున్నాం. 15,715 పాఠశాలల్లో మొదటి విడత, 22,344 పాఠశాలల్లో మలివిడత నాడు–నేడు పనులన్నీ తల్లిదండ్రుల కమిటీల భాగస్వామ్యంతోనే జరిగాయి. అప్పట్లో పిల్లలందరికీ ఇంగ్లిష్ మీడియంలో బోధన చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కూడా పేరెంట్స్ కమిటీలు సంపూర్ణంగా ఆమోదించి తీర్మానాలు చేశాయి. ప్రభుత్వ స్కూళ్లలో టాయిలెట్స్ మెయింటెనెన్స్ ఫండ్, స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ నిర్వహణలో తల్లిదండ్రులదే ముఖ్య భూమిక. ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడంలో ఈ విధంగా తల్లిదండ్రులు తమ వంతు పాత్ర పోషించారు. ఇప్పుడు ఈ సమావేశాలకు కొత్త టైటిల్స్ పెట్టి, ఓవైపు విద్యా రంగాన్ని నాశనం చేస్తూ, మరోవైపు తామేదో కొత్తగా చేస్తున్నామనే భ్రమ కల్పించడానికి చంద్రబాబు, టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. మరో విశేషం ఏంటంటే.. పేరెంట్స్ కమిటీ సమావేశాలకు దాతల నుంచి చందాలు, సామగ్రిని తీసుకోవాలని ఏకంగా సర్క్యులర్ పంపడం.

2 మేం అమ్మ ఒడి కింద ప్రతి తల్లికీ ఏడాదికి రూ.15 వేల చొప్పున, క్రమం తప్పకుండా 44.49 లక్షల మంది తల్లులకు రూ.26,067 కోట్లు ఇచ్చాం. నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అంటూ చంద్రబాబు సహా కూటమి పార్టీల నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ రూ.15 వేల చొప్పున ఇస్తామన్నారు. సూపర్ సిక్స్ అంటూ ఊరూరా, ప్రతి ఇంటికీ డప్పు కొట్టారు. ఇద్దరు పిల్లుంటే రూ.30 వేలు.. ముగ్గురు ఉంటే రూ.45 వేలు.. నలుగురు ఉంటే రూ.60 వేలు ఇస్తామన్నారు. ఎంత మంది పిల్లలనైనా కనాలని చంద్రబాబు పిలుపు కూడా ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయ్యింది. ఇప్పటి వరకు ఒక్క పైసా ఇవ్వలేదు కదా.. గతంలో ఉన్న అమ్మ ఒడి పథకాన్నీ ఆపేశారు. బడ్జెట్లో రూ.12,450 కోట్లు పెట్టాల్సి ఉండగా పెట్టలేదు. మరి ఈ డబ్బులు ఎప్పుడు ఇస్తారు? ఆ హామీని అమలు చేయక పోవడంతో తల్లిదండ్రుల మీద పిల్లల ఖర్చులు, వారి భారం పడుతోంది కదా? నిన్నటి పేరెంట్స్ కమిటీ సమావేశాల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు, డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రిగా లోకేశ్ అసలు దీని గురించి ఎందుకు మాట్లాడలేదు? ఇది దగా చేయడం కాదా? ఒక్క మాట కూడా మాట్లాడ్డం లేదంటే తల్లిదండ్రులకు సున్నం పెడుతున్నట్టే కదా?

4 గతంలో రోజుకో మెనూతో ఘనంగా ఉన్న మధ్యాహ్న భోజన పథకం గోరు ముద్ద కార్యక్రమం అత్యంత దారుణంగా తయారయ్యిందంటూ ఈ మీటింగ్స్‌లో పేరెంట్స్ గగ్గోలు పెట్టడం మీ చెవులకూ వినిపించిందా చంద్రబాబు గారూ? డొక్కా సీతమ్మ అనే మహా తల్లి పేరుపెట్టి చివరకు స్కూళ్లలో, హాస్టళ్లలో విద్యార్థుల డొక్క మాడుస్తున్నారు. కనీసం ఆయాలకు జీతాలు కూడా ఇవ్వడం లేదు. విద్యార్థులు అపరిశుభ్రమైన ఆహారం తిని ఆరోగ్యంపాడై ఆస్పత్రుల్లో చేరుతున్న ఘటనలు మీ ప్రభుత్వ హయాంలో కోకొల్లలు. పిల్లలు వెళ్లే గవర్నమెంటు స్కూళ్లలో టాయిలెట్ల నిర్వహణ కోసం ఇచ్చే టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్, స్కూళ్ల నిర్వహణ కోసం ఇచ్చే స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ ఈ రోజు ఏమైంది? టాయిలెట్ల మెయింటెనెన్స్ గురించి గానీ, స్కూళ్ల మెయింటెనెన్స్ గురించి గానీ ఎవరైనా పట్టించుకున్నారా?

5 అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఇలా ప్రభుత్వ విద్యా రంగాన్ని దిగజార్చి, కావాలనే సమస్యలు సృష్టించి ఉద్దేశపూర్వకంగా ప్రైవేటు బడులకు వెళ్లేలా చేసి, తల్లిదండ్రులు చదువు కొనుక్కునేలా వారిపై ఆర్థిక భారం మోపి, ఇప్పుడు అదే పిల్లల ముందుకు, తల్లిదండ్రుల ముందుకు వెళ్లి ఏమార్చే మాటలు చెప్పడానికి, వారిని మభ్యపెట్టడానికి సిగ్గేయడం లేదా?

6 విద్యా దీవెన, వసతి దీవెనల కింద గతంలో విద్యార్థులకు ఇచ్చే తోడ్పాటు ఇప్పుడు లభిస్తోందా? ఈ జనవరి వస్తే నాలుగు త్రైమాసికాలుగా ఎలాంటి చెల్లింపులు లేవు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఇచ్చే వసతి దీవెన, విద్యా దీవెన.. ఈ రెండింటికీ కలిపి ఏకంగా రూ.3,900 కోట్లు బకాయిలుగా పెట్టి, ఈ రోజు పిల్లలను ఉద్ధరిస్తున్నట్టుగా మీరు చేస్తున్న డ్రామా మరో డీవియేషన్ రాజకీయం కాదా?



వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ.15 లక్షల చెక్కును ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేస్తున్న నటుడు సిద్ధూ జొన్నలగడ్డ, ఆయన తండ్రి సాయి కృష్ణ

కొనసాగుతున్న అల్పపీడనం

- దక్షిణ కోస్తా, రాయలసీమలో రేపటి నుంచి అక్కడక్కడా వానలు
- 17వ తేదీన మరో అల్పపీడనం



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న హిందూ మహాసముద్రంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. ఇది సోమవారం సాయంత్రానికి బలపడి వాయుగుండంగా మారే సూచనలు కనిపిస్తున్నాయని విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. ఆ తర్వాత పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ ఈ నెల 11 నాటికి నైరుతి బంగాళాఖాతానికి చేరుతుందని వెల్లడించారు. అనంతరం తమిళనాడు–శ్రీలంక మధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీని ప్రభావం తమిళనాడు రాష్ట్రంపై అధికంగా ఉన్నప్పటికీ.. దక్షిణ కోస్తా, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో కూడా కాస్త ప్రభావం చూపుతుందని చెప్పారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో సోమవారం రాత్రి లేదా మంగళవారం ఉదయం నుంచి అక్కడక్కడా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని వివరించారు. అదేవిధంగా ఈ నెల 17వ తేదీన అరేబియా సముద్రంలో మరో అల్పపీడనం ఏర్పడటానికి అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఇది 20వ తేదీ తర్వాత బలపడే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు.

బిల్లులు చెల్లించకుంటే పోరుబాటే!

- అసెంబ్లీ సమావేశాల తర్వాత పల్లెబాట.. 27న ఆమరణ నిరాహార దీక్ష
- మాజీ సర్పంచుల జేఏసీ హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్

పంజాగుట్ట: తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించకపోతే అసెంబ్లీ సమావేశాల అనంతరం పల్లెబాట కార్యక్రమం చేపడతామని మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అకెనపల్లి కరుణాకర్ ప్రకటించారు. తమ బిల్లుల సమస్యతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్తామని హెచ్చరించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 27వ తేదీన అమరవీరుల స్థూపం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. 'గత ఎనిమిది నెలలుగా మా పెండింగ్ బిల్లులు విడుదల చెయ్యాలని కలెక్టర్ దగ్గర నుంచి ఎమ్మెల్యేలు, మంత్రుల వరకు అందరికీ వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుతం ప్రభుత్వం పరిస్థితి దారుణంగా ఉందని ఒక మంత్రి.. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు మేము ఎందుకు బిల్లులు ఇవ్వాలని మరో మంత్రి మాట్లాడుతున్నారు. మమ్మల్ని చులకనగా చూస్తున్న ఈ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం. రాష్ట్రంలో ప్రజా పాలన కాదు.. రాక్షస, కార్పొరేట్ పాలన నడుస్తోంది'అని మండిపడ్డారు. సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చెన్నమనేని స్వయంప్రభ, దుమ్మ అంజయ్య, గున్నాల లక్ష్మణ్, కెంద గంగాధర్, మల్యాల దేవయ్య, ఆరె మహేందర్, లింగంపల్లి కరుణాకర్, రాజేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అదే ఉన్మాదం

సెకీ విద్యుత్‌పై వాస్తవాలు కనిపిస్తున్నా ఆగని ఈనాడు గుడ్డిరాతలు

- అంతర్రాష్ట్ర ప్రసార చార్జీల నుంచి 25 ఏళ్ల పాటు సెకీ విద్యుత్‌కు పూర్తి మినహాయింపు
- ఆ విషయం కేంద్ర ప్రభుత్వం, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఆదేశాలు, సెకీ ఒప్పందంలోనూ స్పష్టం
- ఏపీలోనే 6,400 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి ప్రాజెక్టు పెట్టాలంటే రూ.2,600 కోట్లు వ్యయం
- సెకీ నుంచి తీసుకోవడంవల్ల ఆ వ్యయం లేకపోగా భారీగా ఆదా
- ఒకే అబద్ధాన్ని పదేపదే చెప్పడం ద్వారా ప్రజలను ఏమార్చాలని టీడీపీ, దాని కరపత్రిక పన్నాగం

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రెవెన్యూశాఖ పునరుద్ధరణలో భాగస్వాములమవుతాం

- కొత్త ఆర్‌వోఆర్ చట్టం అమలుకు కృషి చేస్తాం
- గ్రామానికో అధికారి నియామకం వల్ల వ్యవస్థకు మేలు
- రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సమావేశంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి
- టీజీఆర్‌ఎస్‌ఏ నూతన కార్యవర్గం ఎన్నిక..
- అధ్యక్షుడిగా బాణాల రాంరెడ్డి, కార్యదర్శిగా భిక్షం



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చిన్నాభిన్నమైన రెవెన్యూ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం సంతోషకరమని..ఈ ప్రయత్నంలో రెవెన్యూ ఉద్యోగులుగా అందరం భాగస్వాములవుతామని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ వ్యవస్థ నిర్వీర్యమైందని, గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ లేకుండా పోయిందని చెప్పారు. ఆదివారం లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్‌ఎస్‌ఏ) రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లచ్చిరెడ్డి మాట్లాడుతూ వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థలను ఎత్తివేసిన ఫలితంగానే లగచర్ల లాంటి ఘటనలు జరిగాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో క్షేత్రస్థాయి రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణకు ప్రయత్నం జరగడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. గ్రామానికో రెవెన్యూ అధికారిని నియమించడం వల్ల వ్యవస్థకు మేలు కలుగుతుందని, ఈ నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకురావాలని భావిస్తున్న ఆర్‌వోఆర్ చట్టం అమలు కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తామని చెప్పారు.

అన్ని స్థాయిల ఉద్యోగులతో టీజీఆర్‌ఎస్‌ఏ

రెవెన్యూ శాఖలోని ఆఫీస్ సబార్డినేట్ నుంచి డిప్యూటీ తహసీల్దార్ వరకు అన్ని స్థాయిల ఉద్యోగులకు తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులను ఐక్యం చేయడం ద్వారా వారి సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ పని చేస్తుందన్నారు. ఈ సమావేశంలో భాగంగా టీజీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాణాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భిక్షం, కోశాధికారిగా మల్లేశ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సుజాత చౌహాన్‌లను ఎన్నుకున్నారు.

విధ్వంస వ్యవస్థను గాడిలో పెట్టే యత్నం: బాణాల

గతంలో విధ్వంసమైన రెవెన్యూ వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు టీజీఆర్‌ఎస్‌ఏ నూతన అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. గ్రామ, డివిజన్, జిల్లా స్థాయిలో పరిష్కారం కావాల్సిన సమస్యలు గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర స్థాయికి వెళ్లాయని, గ్రామస్థాయి రెవెన్యూ అధికారి లేకపోవడం వల్ల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూసేవారు లేకుండా పోయారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక, సెక్రటరీ జనరల్ పూల్ సింగ్ చౌహాన్, మహిళా అధ్యక్షురాలు రాధ, కోశాధికారి శ్రీనివాస్ శంకర్‌రావు పాల్గొన్నారు.

ముస్తాబైన ఓసీపీ క్వారీలోకి వెళ్లే హాలేజీ ప్రధాన రోడ్డు



సింగరేణి 'సేఫ్టీ'

- నేటి నుంచి బొగ్గు గనులపై రక్షణ పోటీలు
- 15రోజుల పాటు నిర్వహణకు ఏర్పాట్లు

• జీడీకే–7ఎల్‌ఈపీ గని ఇన్‌చార్జ్ మేనేజర్ ఇటీవల ఇసుక బంకర్‌లో పడి మృతి చెందారు. ఈ ప్రమాదం నివారించతగినదే. అయినా తొందరపాటుతో నిండు ప్రాణం గాల్లో కలిసిందని అధికారులు చెబుతున్నారు.

• జీడీకే–11గనిలో ఇటీవల ఎల్‌హెచ్‌డీ యంత్రాన్ని పార్క్ చేస్తుండగా, దాని బకెట్ కిందకు జారి పడి ఆపరేటర్ మృతి చెందాడు. బకెట్‌ను కిందకు దింపి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదంటున్నారు.

• మందమర్రి వర్క్‌షాప్‌లో ఇటీవల ఐరన్ పట్టీలు క్రేన్‌తో వాహనంలో లోడ్ చేస్తుండగా రూఫ్ వైర్ తెగిపడి ఓ కార్మికుడు మృతి చెందాడు. సరైన రూఫ్‌వైర్ వినియోగించినా, కార్మికుడు కొంత దూరంలో ఉన్నా ఈ ప్రమాదాన్ని నివారించే వీలుందని అధికారులు అంటున్నారు.

గోదావరిఖని: ప్రమాద రహిత సింగరేణిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా యాజమాన్యం సోమవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది. సంస్థలో ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు ఉద్యోగులు మృతి చెందగా, గతేడాది జరిగిన ఐదు ప్రమాదాల్లో ఐదుగురు చనిపోయారు. ఇవన్నీ నివారించగలిగే ప్రమాదాలేనని, అవగాహన, రక్షణ చర్యలు, జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను అధిగమించవచ్చని చెబుతోంది. ఈ క్రమంలోనే రక్షణ పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు రక్షణ చర్యలపైనా పూర్తిస్థాయిలో దృష్టి పెడుతోంది.

17 ఓసీపీలు.. 22 భూగర్భ గనులు

సింగరేణిలో 17 ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు(ఓసీపీలు), 22 భూగర్భ గనులు ఉన్నాయి. వాటితోపాటు డిపార్ట్‌మెంట్లలో రక్షణ చర్యలపై పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన 12 ప్రత్యేక బృందాలు కార్పొరేట్, గనులు, ఓసీపీలు, డిపార్ట్‌మెంట్లలో రక్షణ చర్యలపై తనిఖీ చేస్తాయి. డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ ఆదేశాల మేరకు వారం నుంచి 15 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రతీ అంశంపై క్షుణ్ణంగా ..

ప్రత్యేక బృందాలు ఓసీపీల్లో భారీ యంత్రాల కదలికలు, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్, అగ్ని ప్రమాదాలపై దృష్టి పెడతాయి. భూగర్భ గనుల్లో స్ట్రాటా కంట్రోల్ మేనేజ్‌మెంట్, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్, రూఫ్, సైడ్ సపోర్టింగ్‌ను తనిఖీ చేస్తాయి. డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగులు, సిబ్బంది కదలికలు, పనిముట్ల తీరును పరిశీలిస్తాయి. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన గనులను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తాయి.

నిశితంగా తనిఖీ




ఓసీపీలు, భూగర్భ గనులతోపాటు వివిధ డిపార్ట్‌మెంట్లలో రక్షణ చర్యలను ప్రత్యేక బృందాలు నిశితంగా తనిఖీ చేస్తాయి. రక్షణపై దృష్టి సారించాకే బొగ్గు ఉత్పత్తి తీయాలి. ఈ విషయంపై ప్రత్యేక బృందాలతో అధ్యయనం చేస్తాం.
– శ్రీనివాస్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం

సింగరేణిలో ఏడేళ్లలో జరిగిన ప్రమాదాలు ఇలా

ఏడాది	మృతులు	తీవ్ర గాయాలు	సాధారణ గాయాలు
2018	7	191	347
2019	8	138	217
2020	12	102	108
2021	13	122	107
2022	05	96	122
2023	05	68	70
2024	06	84	72

నోట్ : ఈ ఏడాది డిసెంబర్ 8వ తేదీవరకు

మితిమీరిన వేగంతోనే ముప్పే



9,749 రాష్ట్రంలోని హైవేలు, ఓఆర్ఆర్‌పై గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాలు

5,817 ప్రమాదాలకు ఓవర్ స్పీడ్‌తో వెళ్లడమే కారణం

3,532 నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో యాక్సిడెంట్లు

- 2023లో జరిగిన ప్రమాదాలను విశ్లేషించిన పోలీస్‌శాఖ రోడ్డు భద్రత విభాగం
- ప్రమాదాల నివారణకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టే యోచన

సాక్షి, హైదరాబాద్: 'స్పీడ్ థ్రిల్స్..బట్ కిల్స్..'(వేగం ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని ఇస్తుంది కానీ చంపేస్తుంది) అని పోలీసులు చెబుతున్నా, రహదారులపై అక్కడక్కడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నా.. కొందరు వాహనదారులు చెవికెక్కించుకోవడం లేదు. విశాలమైన రోడ్లపై యమస్పీడ్‌గా దూసుకెళుతున్నారు. అంతే వేగంగా ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై రోడ్డు ప్రమాదాలకు కారణాలు విశ్లేషిస్తే.. మితిమీరిన వేగంతోనే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వెల్లడవుతోంది. రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు, ప్రమాదాలకు మూల కారణాలు తెలుసుకోవాలన్న ఉద్దేశంతో తెలంగాణ పోలీస్‌శాఖ రోడ్డు భద్రత విభాగం అధికారులు 2023లో రాష్ట్ర పరిధిలోని జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదాల గణాంకాలు విశ్లేషించారు. రహదారులు, ఓఆర్ఆర్‌పై మొత్తం 9,749 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, ఇందులో 5,817 రోడ్డు ప్రమాదాలు వాహనదారుల మితిమీరిన వేగం కారణంగానే సంభవించినట్టు అధికారులు గుర్తించారు. మద్యం సేవించి వాహనాలు నడపడంతో 120 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అత్యంత నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో 3,532 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ప్రమాదాలకు అసలు కారణాలు గుర్తించడం ద్వారా వాటిని నివారించేందుకు ప్రణాళిక రూపొందించడంతో పాటు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు.

రోడ్డు భద్రతా విభాగం విశ్లేషణ మేరకు 2023లో ఏ కారణంగా ఎన్ని ప్రమాదాలు జరిగాయంటే..

కారణం	ప్రమాదాలు
మితిమీరిన వేగం	5,817
ర్యాష్, నెగ్లిజెంట్ డ్రైవింగ్	3,532
మద్యం తాగి వాహనాలు నడపడం	120
రాంగ్‌సైడ్ డ్రైవింగ్	237
రెడ్ సిగ్నల్ జంపింగ్	22
మొబైల్ ఫోన్ మాట్లాడుతూ నడపడం	21

రోడ్డు ప్రమాదాలకు గురైన వాహనాల సంఖ్య..

వాహనం	సంఖ్య
ద్విచక్రవాహనం	2,660
ఆటోరిక్షా	558
కారు/వ్యాన్/జీప్/ట్యాక్సీ	2,616
బస్సు	632
ట్రక్ లారీ	1,969
హెవీ ఆర్టిక్యులేటెడ్ వాహనం	163
టెంపో/ట్రాక్టర్	158
సైకిల్	2
సైకిల్ రిక్షా	1
ఎద్దుల బండి	4

ఏయే వేళల్లో ఎన్ని ప్రమాదాలు..

ప్రమాదాలు	సమయం
974	ఉదయం 6 నుంచి 9 గంటలు
1427	ఉదయం 9 నుంచి 12 గంటలు
1521	మధ్యాహ్నం 12 నుంచి 3గంటలు
1818	మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటలు
1907	సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటలు
1029	రాత్రి 9 నుంచి రాత్రి అర్ధరాత్రి 12 గంటలు
527	అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజామున 3 గంటలు
546	తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 6 గంటలు

ఆదమరిస్తే చెరువులోకే..



నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో 65వ నంబర్ జాతీయ రహదారి వెంట ఉన్న చెరువు వద్ద కనిపించని రక్షణ గోడలు

రేడియం స్టిక్కర్లతోనే సరి..



భూదాన్‌పోచంపల్లి: సూచిక బోర్డులు లేకపోవడంతో శనివారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పరిధిలోని జలాల్‌పురం చెరువులో కారు పడిపోయి ఐదుగురు యువకులు జలసమాధి అయ్యారు. దీంతో అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ధర్నా చేసినా ఫలితం లేకపోయింది. ఆదివారం పోలీసులు మూలమలుపు వద్ద రోడ్డు పక్కన ఉన్న చెట్లకు రేడియం స్టిక్కర్లు అతికించి చేతులు దులిపేసుకున్నారు.

8 నెలల్లో ఇంటింటికీ ఇంటర్నెట్

రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలకు హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ తీసుకొస్తాం

- టీ–ఫైబర్ ఆధ్వర్యంలో తక్కువ ధరకే టీవీ, ఇంటర్నెట్, ఫోన్ సేవలు అందిస్తాం
- ప్రయోగాత్మకంగా 3 గ్రామాల్లో ఇంటర్నెట్ సేవల ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు
- రైతులకు పంట రుణాల కోసం యాప్, మీ–సేవలోకి కొత్తగా 9 సర్వీసులు.. యాప్ ఆవిష్కరణ
- మంత్రి సమక్షంలో రూ. 7,592 కోట్ల పెట్టుబడులతో 3 పరిశ్రమల ఎంవోయూలు



టీ–ఫైబర్ ఇంటర్నెట్ సేవలప్రారంభ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: టీ–ఫైబర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లోని అన్ని ఇళ్లకు వచ్చే 6–8 నెలల్లో తక్కువ ధరకే హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ కనెక్టివిటీతోపాటు డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు ప్రకటించారు. దీనివల్ల ప్రతి ఇంట్లో టీవీ, ఇంటర్నెట్, టెలిఫోన్‌తోపాటు కంప్యూటర్ ఆధారిత అన్ని రకాల సేవలు అందుబాటులో వస్తాయన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలకు ఫైబర్ ఆప్టిక్ కేబుల్ నెట్‌వర్క్ ఏర్పాటు పనులు పూర్తికావొచ్చాయని చెప్పారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మద్దూరు (కొడంగల్ నియోజకవర్గం), సంగంపేట (అందోల్), అడవి శ్రీరాంపూర్ (మంథని) గ్రామాల్లో ప్రయోగాత్మకంగా అమల్లోకి తెచ్చిన టీ–ఫైబర్ ఇంటర్నెట్ సేవలను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులతో వర్చువల్‌గా సంభాషించి అభినందనలు తెలిపారు. అలాగే పరిశ్రమల శాఖ ప్రవేశపెట్టిన పలు యాప్‌లను ఆయన ఆవిష్కరించారు.

ఇక 2 రోజుల్లో పంట రుణాలు....

రైతులు పంట రుణాలు పొందడానికి ప్రస్తుతం 30 రోజుల సమయం పడుతుండగా కొత్తగా ఆవిష్కరించిన స్మార్ట్ అగ్రి క్రెడిట్ సర్వీస్ యాప్ ద్వారా కేవలం 2 రోజుల్లోనే పొందవచ్చని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అలాగే రైతులు వాయిస్ కమాండ్ ద్వారా ఎరువులు, క్రిమికీటకాల నివారణ వంటి అంశాల్లో సూచనలను సైతం పొందవచ్చని చెప్పారు. డ్రగ్స్‌పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడానికి తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో 'మిత్ర–తెలంగాణ'అనే మరో యాప్‌ను తీసుకొచ్చామన్నారు.

ఇక యాప్ ద్వారా మీ-సేవ

మీ–సేవ విస్తరణలో భాగంగా స్టడీ గ్యాప్ సర్టిఫికెట్, పేరు మార్పు, లోకల్ క్యాండిడేట్, మైనారిటీ, ఇన్‌కమ్, క్యాస్ట్, క్రీమీలేయర్/నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్లతోపాటు సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ ఫిర్యాదులు, వన్యప్రాణుల దాడిలో మరణించే వ్యక్తులు, పశువులకు నష్టపరిహారం, టింబర్ డిపో/సామిల్స్‌కు పర్మిట్ల జారీ/రెన్యూవల్ కలిపి మొత్తం 9 సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని శ్రీధర్‌బాబు తెలిపారు. కొత్తగా ఆవిష్కరించిన మీ–సేవ యాప్, 'కియోస్క్'లతో సైతం ఇప్పటికే మీ–సేవ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న 400కిపైగా సేవలను ప్రజలు పొందొచ్చని వివరించారు. టీ–వర్క్స్–బిట్స్ పిలానీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ రీసెర్చ్ ఎక్సలెన్స్ ఇన్ నేషనల్ సెక్యూరిటీ(సీఆర్ఈఎన్ఎస్)ని మంత్రి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్య అన్వేషణ, అభివృద్ధికి 'రూరల్ వర్క్స్' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు.

రూ. 7,592 కోట్ల పెట్టుబడులతో 3 మెగా పరిశ్రమలు

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, విస్తరణకు రూ. 7,592 కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చిన 3 కంపెనీలతో మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో పరిశ్రమల శాఖ 4 పరస్పర అవగాహన ఒప్పందా (ఎంవోయూ)లు కుదుర్చుకుంది. ఆయా సంస్థల ఏర్పాటుతో 5,200 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. సీతారాంపూర్‌లో 4 గిగావాట్ల సౌర విద్యుత్ పరికరాల తయారీ పరిశ్రమను నిర్వహిస్తున్న 'ప్రీమియర్ ఎనర్జీస్'.. వ్యాపార విస్తరణలో భాగంగా రూ. 1,950 కోట్లతో సోలార్ ఇంగాట్స్ అండ్ అల్యూమినియం ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు, మరో రూ. 3,342 కోట్ల పెట్టుబడితో 4 గిగావాట్ల సోలార్ పీవీ టాప్కాన్ సెల్, 4 గిగావాట్ల సోలార్ పీవీ టాప్కాన్ మాడ్యూల్స్ తయారీ యూనిట్ల స్థాపనకు ముందుకొచ్చిందన్నారు. అలాగే రూ. 1,500 కోట్లతో 'లెన్స్‌కార్ట్'ప్రపంచంలోనే అతిపెద్ద కళ్లద్దాలు, అనుబంధ ఉత్పత్తుల తయారీ హబ్‌ను ఫ్యాబ్‌సిటీలో ఏర్పాటు చేయనుందని వివరించారు. ఆజా ద్ ఇంజనీరింగ్ సంస్థ ఘణపూర్‌లో రూ. 800 కోట్లతో సూపర్ అల్లాయ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుందని చెప్పారు. రాష్ట్రంలో ప్రగతిని అడ్డుకోవడానికి చాలా మంది విషప్రచారం చేసినా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు తాము తెచ్చిన పాలసీకి విశేష స్పందన లభిస్తోందన్నారు. రాష్ట్రంలో త్వరలో 2 వేల ఎకరాల్లో రూ. 1,500 కోట్లతో కొత్తగా 12 మినీ ఇండస్ట్రీయల్ పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు శ్రీధర్‌బాబు తెలిపారు.

ఆ స్పెషల్ రైళ్లు.. ఇక రెగ్యులర్

- వందశాతం ఆక్యుపెన్సీ ఉన్న ప్రత్యేక రైళ్లు ఆ జాబితాలోకి
- దీంతో 'ప్రత్యేక'చార్జీలు కూడా తగ్గింపు

సాక్షి, హైదరాబాద్: కొన్ని ప్రత్యేక రైళ్లు ఇక రెగ్యులర్ జాబితాలోకి రానున్నాయి. వందశాతం ఆక్యుపెన్సీతో నడిచే రైళ్లను క్రమబద్ధీకరించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఆయా మార్గాల్లో రైళ్ల సంఖ్య పెరగడంతోపాటు 'ప్రత్యేక'చార్జీల భారం కూడా తగ్గనుంది. సాధారణంగా ప్రయాణికుల రద్దీ, పండుగలు, వరుస, వేసవి సెలవులు వంటి రోజుల్లో సాధారణంగా నడిచే రైళ్లతోపాటు అదనపు రైళ్లు ఏర్పాటు చేస్తారు. ఈ రైళ్ల చార్జీలు కూడా తత్కాల్ చార్జీలకు సమానంగా ఉంటాయి. రెగ్యులర్ చార్జీల కంటే 20 శాతం ఎక్కువ. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వారం, పది రోజుల ముందు ప్రత్యేక రైళ్ల కోసం ప్రణాళికలు వేసి అందుబాటులోకి తెస్తారు. కానీ కొన్ని రూట్లలో రెగ్యులర్‌గా నడిచే రైళ్లతోపాటు ప్రత్యేక రైళ్లకు కూడా ఏడాది పొడవునా డిమాండ్ ఉంటుంది. ఇలాంటి స్పెషల్ ట్రైన్స్ నంబర్లన్నీ సున్నా (0)తో మొదలవుతాయి. రెగ్యులర్ రైళ్లకు మాత్రం సాధారణ నంబర్లను కేటాయిస్తారు. కోవిడ్ కాలం నుంచి కొన్ని రూట్లలో ప్రత్యేక రైళ్లే నడుస్తుండగా, మరికొన్నిమార్గాల్లో కోవిడ్ కంటే ముందు నుంచి ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి.

నిర్దిష్ట కాల పరిమితికే ప్రత్యేకం

ప్రస్తుతం అయ్యప్ప భక్తులు పెద్దఎత్తున శబరిమలకు వెళుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లు కూడా నడుపుతోంది. నాంపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్‌ల నుంచి సుమారు 30కి పైగా స్పెషల్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇవి జనవరి నెలాఖరు వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఆ తర్వాత రద్దీ మేరకు మరో రూట్‌లో వీటిని మళ్లిస్తారు.

- హైదరాబాద్ నుంచి శబరికి ప్రతిరోజు ఒక ట్రైన్ మాత్రం రెగ్యులర్‌గా నడుస్తుంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ రూట్‌లో మరో రైలును ప్రవేశపెట్టాలనే ప్రతిపాదన ఉంది.
- సికింద్రాబాద్ నుంచి షిరిడికి వెళ్లేందుకు అజంతా ఎక్స్ ప్రెస్ ఒక్కటే ఉంది. ఆ రూట్‌లో కూడా ప్రయాణికుల రద్దీ మేరకు రైళ్లు అందుబాటుకి తెస్తారు.
- జంటనగరాల నుంచి తిరుపతికి ఐదారు రెగ్యులర్ రైళ్లు నడిచినా, ప్రయాణికుల డిమాండ్ మాత్రం తగ్గడం లేదు. దీంతో గతంలో 'ప్రత్యేకం'గా నడిచిన రైలును ఆ తర్వాత 'సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్'గా రెగ్యులర్ చేశారు.
- హైదరాబాద్ నుంచి విశాఖ, కాకినాడ, తిరుపతి, విజయవాడ, దానాపూర్, పట్నా, జైపూర్ తదితర నగరాలకు రెగ్యులర్‌గా నడిచే రైళ్లతోపాటు ప్రత్యేక రైళ్లు కూడా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇలా ప్రయాణికుల రద్దీ, డిమాండ్ అత్యధికంగా ఉన్న రూట్‌లను ఎంపిక చేసి ఆ మార్గాల్లో 100 శాతం ఆక్యుపెన్సీ ఉన్న రైళ్లను దశలవారీగా క్రమబద్ధీకరిస్తారు.

వచ్చే నెలలో కొత్త టైమ్ టేబుల్...

రైళ్ల వేళల్లో మార్పులు..చేర్పులు, హాల్టింగ్ స్టేషన్‌లు, కొత్త రూట్‌లు, కొత్తగా అందుబాటులోకి రానున్న రెగ్యులర్ సర్వీసుల వేళలతో రూపొందించిన కొత్త టైమ్‌టేబుల్ జనవరి నుంచి అమల్లోకి రానుంది. ప్రస్తుతం ప్రత్యేకంగా నడుస్తూ రెగ్యులర్‌గా మారనున్న రైళ్ల వేళలను కూడా టైమ్‌టేబుల్‌లో చేర్చుతారు. కోవిడ్ కాలం నుంచి కొన్ని రూట్లలో డెము, మెము రైళ్లను ప్రత్యేక కేటగిరీ కింద నడుపుతున్నారు. సికింద్రాబాద్–వరంగల్, కాచిగూడ–మహబూబ్‌నగర్, కాచిగూడ–కర్నూల్, తదితర మార్గాల్లో నడిచే ఇలాంటి రైళ్లను కూడా తిరిగి రెగ్యులర్ జాబితాలో చేర్చే అవకాశముందని అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కానిస్టేబుళ్ల దుర్మరణం

- మారథాన్‌కు బైక్‌పై వెళుతుండగా ఢీకొట్టిన బొలేరో వాహనం
- గజ్వేల్ బైపాస్‌రోడ్డులో ఘటన



వెంకటేశ్



పరంధాములు

గజ్వేల్‌రూరల్: మారథాన్ పోటీలో పాల్గొనేందుకు వెళుతున్న ఇద్దరు కానిస్టేబుళ్లు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో చోటుచేసుకుంది. హిట్ అండ్ రన్ ఘటనతో పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద విషాదకర వాతావరణం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోదూరు మండలం పెద్దకోదూరు గ్రామానికి చెందిన వర్కల్ పరంధాములు(46) రాయపోల్ ఠాణాలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, గాడిచర్లపల్లికి చెందిన పూసల వెంకటేశ్(38) దౌల్తాబాద్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు హైదరాబాద్‌లోని ఈసీఎల్ ప్రాంతంలో మారథాన్(రన్) కార్యక్రమం ఉండడంతో వీరు ఆదివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో పట్టణంలోని జాలిగామ బైపాస్ రోడ్డు మార్గంలో రాంగ్ రూట్లో వెళుతుండగా, ఇదే సమయంలో గజ్వేల్ నుంచి దౌల్తాబాద్ వైపు వెళుతున్న బొలెరో వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని పలువురు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో ఇద్దరు కానిస్టేబుళ్లు హెల్మెట్లు ధరించినా, తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. వీరి మరణవార్త తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం విచారకరమని, బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు.

మరణంలోనూ వీడని స్నేహం: మరణంలోనూ వీరి స్నేహం విడిపోలేదంటూ మృతుల కుటుంబసభ్యులు చెప్పారు. పరంధాములుది 2004 బ్యాచ్ కాగా, వెంకటేష్ 2007 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్. ఎక్కడ మారథాన్ పోటీలు జరిగినా పోలీస్‌శాఖ తరఫున వెళ్లి పాల్గొనే వారని తోటి పోలీసు సిబ్బంది పేర్కొన్నారు. పోలీస్‌శాఖలో మారథాన్ పోటీల్లో పాల్గొనేవారు ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. అందులో సభ్యులుగా ఉన్న వెంకటేష్, పరంధాముల మధ్య స్నేహం ఏర్పడింది. సిద్దిపేట, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌తో పాటు ముంబయి, న్యూఢిల్లీలో సైతం జరిగిన మారథాన్ పోటీల్లో పాల్గొని బహుమతులు పొందారని గుర్తు చేసుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు.

కొడుకును బావిలో తోసి తల్లి ఆత్మహత్య

- తప్పించుకున్న కూతురు
- వికారాబాద్ జిల్లాలో దారుణం



అరుంధ



రుత్విక్

నవాబుపేట: ఏం కష్టమొచ్చిందో కానీ.. వికారాబాద్ జిల్లాలో ఓ తల్లి తన కొడుకును బావిలోకి తోసి తానూ అందులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో కొడుకు, తల్లి ఇద్దరూ ప్రాణాలొదిలారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం గేట్‌వనంపల్లి (కొజ్జ వనంపల్లి)లో ఈ హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుల్ల రాములు, అరుంధ (32) దంపతులు. వీరికి ఒకటో తరగతి చదివే కుమారుడు రుత్విక్ (7), నాలుగో తరగతి చదువుతున్న ప్రజ్వల సంతానం. శనివారం రుత్విక్ ఆరోగ్యం బాగాలేకపోవడంతో పిల్లలిద్దరూ స్కూల్‌కు వెళ్లలేదు. ఉదయం రాములు పొలానికి వెళ్లగా.. భార్యాపిల్లలు ఇంటి వద్దే ఉన్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో అరుంధకు ఎవరి నుంచో ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ మాట్లాడిన తర్వాత బోరున విలపించిన ఆమె.. మేకలకు మేత తీసుకువద్దామని పిల్లలను పొలానికి తీసుకెళ్లింది. అక్కడ ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లగానే కుమారుడు రుత్విక్‌ను బావిలోకి తోసేసింది. కూతురును కూడా బావిలోకి తోసేందుకు ప్రయత్నించగా.. ఆ పాప భయంతో 'అమ్మా తమ్ముడిని ఎందుకు బావిలోకి తోసేసావ్? నన్ను సంపకు.. వదిలేయ్'అని ఏడుస్తూ దూరంగా పారిపోయింది. వెంటనే తల్లి సైతం బావిలోకి దూకింది. భయకంపితురాలైన ప్రజ్వల.. గ్రామంలోకి పరుగెత్తి గ్రామస్తులకు విషయం చెప్పటంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే బావి వద్దకు చేరుకొన్న ఎస్ఐ అరుణ్‌కుమార్.. బావిలోని నీరు తోడించి మృతదేహాలను వెలికితీశారు. మృతురాలి తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు వివాహేతర సంబంధాలేమైనా కారణమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సై హరీశ్, యువతి ఆడియో సంభాషణ వైరల్

- ఇది నిజమేనా.. అబద్ధమా?
- ఆరా తీస్తున్న పోలీసులు

ములుగు: ఎస్సై హరీశ్, ఆ యువతి మాట్లాడుకున్నట్టుగా చెబుతున్న ఓ ఆడియో వైరల్ అవుతోంది. ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఓ రిసార్టులో ఎస్సై హరీశ్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. హరీశ్ ఆత్మహత్యకు సూర్యాపేట జిల్లాలోని దుగ్యాతండాకు చెందిన ఓ యువతిపై పోలీసులు ఎక్కువగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ యువతి పేరిట బయటకు వచ్చిన ఆడియోపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇది నిజమా..అబద్ధమా అని తేల్చే పనిలో పోలీసులు ఉన్నారు.

ఆ ఆడియోలో ఏముందంటే...: 'మనం పెళ్లి చేసుకోవాలంటే ముందుగా నువ్వు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ధర్నా చేయాలి. పలువురిని ఆకర్షించేలా చేస్తేనే మన ప్రేమ విషయం బయటకు వస్తుంది.. అప్పుడు పెళ్లి చేసుకోవడానికి వీలవుతుంది. విషయం బయటకు వచ్చిన తర్వాత పెద్దలు ఒప్పుకోని పక్షంలో నా తల్లిదండ్రుల కాళ్లు పట్టుకుందాం.' – ఎస్సై హరీశ్

'నేను కాళ్లు పట్టుకుంటాను కానీ.. మా అమ్మా నాన్న పట్టుకోరు.. నేను కొందరిపై కేసులు పెట్టినట్టు వార్తలు ప్రచారం అవుతున్నాయి. నన్ను ఇబ్బంది పెట్టిన ఇద్దరిపై కేసులు పెట్టాను. ఈ విషయం హరీశ్‌కు ముందుగానే తెలిపాను. ఆయన మంచి మనసుతో కలిసి జీవించడానికి ఒప్పుకున్నాడు.. మా ఇద్దరి మధ్య ఎలాంటి డబ్బు చర్చలు రాలేదు. నాకు డబ్బులు ఇచ్చినట్టుగా జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. నా బ్యాంకు ఖాతాలను చూస్తే ఆ విషయం తెలుస్తుంది. నాపై కావాలనే చిలుకూరులోని కొందరు కుట్ర పూరితంగా వ్యవహరించి తప్పుడు ప్రకటనలు వచ్చేలా చేశారు'. – సదరు యువతి

సిగ్నల్ సమస్య.. నిలిచిన రైళ్లు

- హనుమకొండ జిల్లా ఉప్పల్‌లో పనిచేయని రైల్వే సిగ్నలింగ్
- కాషన్ ఆర్డర్ల ద్వారా రైళ్లను పంపించిన అధికారులు




ఉప్పల్‌లో నిలిచిన రాజధాని ఎక్స్‌ప్రెస్

కమలాపూర్: కాజీపేట–బల్లార్షా రైల్వే మార్గంలో హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్‌లో సాంకేతిక కారణాలతో రైల్వే సిగ్నల్ వ్యవస్థ ఆదివారం స్తంభించిపోయింది. దీంతో ఆ మార్గంలో నడిచే పలు ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్లను ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. సమస్యను వెంటనే గుర్తించలేకపోవటంతో కాషన్ ఆర్డర్ల ద్వారా రైళ్లను అక్కడి నుంచి ముందుకు పంపించారు. వందేభారత్, రాజధాని, యశ్వంత్‌పూర్, కోబ్రా వంటి ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లు సుమారు అరగంటపాటు ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సికింద్రాబాద్ రైల్వే డివిజన్ అధికారులు.. టెక్నీషియన్లతో ఉప్పల్‌కు చేరుకుని సమస్యను గుర్తించే ప్రయత్నం చేశారు. ఈ సమస్యతో ఉప్పల్ రైల్వే గేట్ కూడా రాత్రి వరకు తెరుచుకోలేదు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనాలు రైల్వే గేట్‌కు ఇరువైపులా బారులు తీరాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు సమస్య తలెత్తగా.. రాత్రి 7 గంటలు దాటినా దానిని గుర్తించలేకపోవడం పట్ల ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

ఇక్కత్ పట్టు.. పుష్ప హిట్టు

- పుష్ప 2 లో ఇక్కత్ పట్టు చొక్కా ధరించిన అల్లు అర్జున్



పోచంపల్లి వస్త్ర దుకాణాల్లో ఇక్కత్ వస్త్రాలు. అల్లు అర్జున్ ధరించింది ఇదే..



భూదాన్‌పోచంపల్లి: ఇటీవల ప్రపంచవ్యాప్తంగా విడుదలై రికార్డులు సృష్టిస్తున్న సుకుమార్ 'పుష్ప 2'సినిమాలో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు వెండి తెరపై తళుక్కుమన్నాయి. పోలీస్ ఆఫీసర్ బన్వర్‌సింగ్ షెకావత్‌తో.. 'పుష్ప అంటే ఫ్లవర్ అనుకొన్నావా, పుష్ప అంటే వైల్డ్ ఫైర్'అనే డైలాగ్ చెప్పినప్పుడు.. హీరో అల్లు అర్జున్ బీరపువ్వు రంగు పోచంపల్లి ఇక్కత్ సీకో పట్టు షర్ట్ ధరించాడు. కాగా పుష్ప 2 సినిమా షూటింగ్‌ను పోచంపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించారు. ఆ సందర్భంగా పోచంపల్లికి వచ్చిన చిత్రం యూనిట్ ఇక్కత్ వస్త్రాలు కొనుగోలు చేసి ఉంటారని వస్త్ర వ్యాపారులు తెలిపారు. కాగా పోచంపల్లి మార్కెట్‌లో అల్లు అర్జున్ ధరించిన ఇక్కత్ డిజైన్ చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి.

తవ్వకాల్లో బయటపడిన రాతి స్తంభం

- స్తంభంపై శివలింగం, నందీశ్వరుడి విగ్రహాలు



రాతి స్తంభంపై శివలింగం, నంది విగ్రహం

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్ ఏసీనగర్ రోడ్డు రహదారిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి ఆదివారం కాంట్రాక్టర్ చేపట్టిన తవ్వకాల్లో.. కాకతీయుల కాలం నాటి రాతి స్తంభం బయటపడింది. ఆస్తంభాన్ని శుభ్రంగా చేయగా.. దానిపై శివలింగం, నందీశ్వరుడు దర్శనమిచ్చాయి. ఈ విషయం ప్రజలకు తెలియ టంతో పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. రాతి స్తంభం వెలువడిన సమీపంలోనే గుడి ఉంటుందని పురావస్తు నిపుణులు చెబుతున్నారు. స్థానిక కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, ప్రవీణ్ స్తంభాన్ని పరిశీలించారు. స్తంభాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

ధరణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం

హన్మకొండ అర్బన్: ధరణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఆదివారం హనుమకొండలోని రెవెన్యూ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సూర్యాపేట జిల్లాకు చెందిన చెన్నగాని పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు(హనుమకొండ), ఉపాధ్యక్షులుగా శివసాయి వెంకట వరప్రసాద్ (నల్లగొండ), చక్రధర్ (వరంగల్), కార్యదర్శులుగా లింగం (కామారెడ్డి), పవన్ (మేడ్చల్), కోశాధికారిగా అభిలాష్ (జగిత్యాల), కార్యవర్గ సభ్యులుగా సుకర్ణరెడ్డి(వికారాబాద్), పవన్ (ఖమ్మం), రామ్మోహన్ (నిజామాబాద్), శివప్రసాద్ (నారాయణపేట), సల హాదారులుగా రాజలింగం (మంచిర్యాల), బాల నరసింహ (యాదాద్రి భువనగిరి), లక్ష్మీ కాంత్(మహబూబ్‌నగర్) ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ బాధ్యులు మాట్లాడుతూ ధరణి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశానికి అన్ని జిల్లాల కో–ఆర్డినేటర్లు, అధ్యక్షులు హాజరయ్యారు.

దంపతుల కిడ్నాప్.. భార్య హత్య

- ఇన్‌ఫార్మర్ నెపంతో హతమార్చిన మావోయిస్టులు



సుక్రు మృతదేహం

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల ఇద్దరు సర్పంచ్‌లు ఓ అంగన్‌వాడీ కార్యకర్తను హతమార్చిన మావోయిస్టులు.. తాజాగా ఓ మహిళను ఇన్‌ఫార్మర్ పేరిట హత్య చేశారు. బీజాపూర్ జిల్లా మద్దేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడేడ్ గ్రామానికి చెందిన దంపతులు యాలం సుక్రు, రామయ్య ఇంటికి శనివారం ఉదయం 8 గంటలకు వచ్చిన మావోయిస్టులు ఇద్దరినీ కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి ఇద్దరినీ విపరీతంగా కొట్టడంతో పాటు భార్య సుక్రు (40)ను చెట్టుకు ఉరి తీసి హతమార్చారు. 2017 నుంచి పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారని, హెచ్చరించినా వారిలో మార్పు రాకపోవడంతో ఈ ఘటనకు పాల్పడ్డామని మావోయిస్టు పార్టీ మద్దేడు ఏరియా కమిటీ పేరిట లేఖను విడుదల చేశారు. పోలీసులు భారీ భద్రతతో అటవీ ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని గ్రామానికి తరలించారు.



గుకేశ్‌కు రెండో విజయం... డింగ్ లిరెన్‌పై 6-5తో ఆధిక్యం

సింగపూర్ సిటీ: పిన్న వయస్సులోనే ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ సాధించే దిశగా భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ అడుగు ముందుకు వేశాడు. డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో ఆదివారం జరిగిన 11వ రౌండ్ గేమ్‌లో 18 ఏళ్ల గుకేశ్ కేవలం 29 ఎత్తుల్లో అద్భుత విజయం సాధించాడు. వరుసగా ఏడు 'డ్రా'ల తర్వాత ఫలితం రావడం విశేషం. ఈ గెలుపుతో గుకేశ్ 6-5తో ఆధిక్యంలోకి వెళ్లాడు. మిగిలిన మూడు గేమ్‌లను గుకేశ్ 'డ్రా' చేసుకుంటే విశ్వనాథన్ ఆనంద్ తర్వాత క్లాసికల్ చెస్ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్ అయిన రెండో భారతీయ క్రీడాకారుడిగా గుర్తింపు పొందుతాడు. 11వ గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన గుకేశ్ అశ్వంతో తొలి ఎత్తును వేయగా... లిరెన్ తొలి ఎత్తు నుంచే తప్పిదాలు చేసి చివరకు 29వ ఎత్తు వద్ద తన ఓటమిని అంగీకరించాడు. నేడు జరిగే 12వ గేమ్‌లో లిరెన్ తెల్లపావులతో ఆడతాడు.



భారత క్రికెట్‌కు 'బ్యాడ్ సండే'

ఒకే రోజు మూడు వేర్వేరు మ్యాచ్‌ల్లో భారత జట్లకు ఓటమి

డే నైట్ టెస్టులో 10 వికెట్లతో రోహిత్ బృందం పరాజయం

రెండో వన్డేలోనూ ఓడిపోయిన హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టు

జూనియర్ ఆసియా కప్ ఫైనల్లో యువ భారత్‌కు షాక్

క్రికెట్ మైదానంలో ఆదివారం భారత్‌కు ఏదీ కలిసిరాలేదు! 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' రెండో టెస్టులో రోహిత్ శర్మ సారథ్యంలోని పురుషుల జట్టు ఆస్ట్రేలియా చేతిలో పరాజయం చవిచూడగా... ఆస్ట్రేలియాలోని మరో వేదిక బ్రిస్బేన్‌లో భారత మహిళల జట్టుకూ భారీ ఓటమి ఎదురైంది. అడిలైడ్ 'పింక్ బాల్' టెస్టులో పురుషుల జట్టు ప్రభావం చూపలేకపోగా... రెండో వన్డేలో ఓడిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని మహిళల జట్టు కంగారూలకు సిరీస్ కోల్పోయింది. ఇక దుబాయ్‌లో జరిగిన ఆసియా జూనియర్ కప్ అండర్–19 టోర్నీలో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన యువ భారత జట్టు తుదిపోరులో బంగ్లాదేశ్ చేతిలో ఓడి టైటిల్‌కు దూరమైంది. మొత్తానికి ఒకే రోజు మూడు వేర్వేరు విభాగాల్లో భారత క్రికెట్ జట్లను పరాజయం పలకరించడంతో 'హ్యాపీ సండే' కావాల్సిన చోట 'బ్యాడ్ సండే'గా మారింది.



అడిలైడ్‌లో అదే వ్యథ

అడిలైడ్: గులాబీ బంతి పరీక్షలో భారత జట్టు గట్టెక్కలేదు. నాలుగేళ్ల క్రితం అడిలైడ్‌లో జరిగిన 'పింక్ బాల్' టెస్టులో ఘోర పరాజయం ఎదుర్కొన్న టీమిండియా... ఇప్పుడు మరోసారి అడిలైడ్ వేదికగా ఓటమి వైపు నిలిచింది. ఆదివారం ముగిసిన 'డే అండ్ నైట్' టెస్టులో భారత్ 10 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. తొలి టెస్టులో చిత్తుగా ఓడిన ఆస్ట్రేలియా... తమకు అచ్చొచ్చిన 'పింక్ బాల్' టెస్టులో ఘనవిజయంతో 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'ని 1–1తో సమం చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 128/5తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన టీమిండియా... 36.5 ఓవర్లలో 175 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (47 బంతుల్లో 42; 6 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి భారత టాప్ స్కోరర్‌గా నిలవగా... మిగతా వాళ్లు ప్రభావం చూపలేకపోయారు. ఆస్ట్రేలియా బౌలర్లలో కెప్టెన్ కమిన్స్ 5 వికెట్లు పడగొట్టగా... బోలండ్ 3 వికెట్లు, స్టార్క్ 2 వికెట్లు తీశారు. అనంతరం 19 పరుగుల స్వల్ప విజయ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 3.2



ఓవర్లలో వికెట్ నష్టపోకుండా ఛేదించి విజయాన్ని అందుకుంది. ఓపెనర్లు మెక్‌స్వీనీ (10 నాటౌట్), ఖ్వాజా (9 నాటౌట్) అజేయంగా నిలిచారు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీతో చెలరేగిన ట్రావిస్ హెడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య ఈ నెల 14 నుంచి బ్రిస్బేన్ వేదికగా మూడో టెస్టు జరుగుతుంది.

మరో 47 పరుగులే జోడించి...

ప్రధాన ఆటగాళ్లు రెండో రోజే అవుటైనా... రిషభ్ పంత్ (28), నితీశ్ కుమార్ రెడ్డి క్రీజులో ఉండటంతో... భారత అభిమానులు అడిలైడ్‌లో అద్భుతం జరగకపోతుందా అని ఆశిస్తే... అది అడియాశే అయింది. క్రితం రోజు స్కోరు వద్దే పంత్.. స్టార్క్ బౌలింగ్‌లో స్లిప్‌లో స్మిత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పుడే పరాజయం ఖాయమైపోగా... నితీశ్ రెడ్డి దూకుడు పెంచి జట్టుకు ఇన్నింగ్స్ ఓటమిని తప్పించాడు. ఈ ఆంధ్ర కుర్రాడు జట్టును ఆధిక్యంలోకి తీసుకెళ్లిన తర్వాత 9వ వికెట్ రూపంలో అవుటయ్యాడు. తాజా సిరీస్‌లో ఆడిన నాలుగు ఇన్నింగ్స్‌ల్లో మూడుసార్లు భారత్ తరఫున నితీశ్ రెడ్డి టాప్ స్కోరర్‌గా నిలవడం విశేషం. అశ్విన్ (7), హర్షిత్ రాణా (0), సిరాజ్ (7) ఇలా ఒకరి వెంట ఒకరు పెవిలియన్ చేరిపోవడంతో టీమిండియా ఆలౌటైంది. చేతిలో ఐదు వికెట్లతో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన రోహిత్ బృందం క్రితం రోజు స్కోరుకు మరో 47 పరుగులు మాత్రమే జోడించగలిగింది. ఈ మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి భారత జట్టు కేవలం 81 ఓవర్లు మాత్రమే ఆడింది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 180; **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 337; **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) కేరీ (బి) బోలండ్ 24; రాహుల్ (సి) కేరీ (బి) కమిన్స్ 7; గిల్ (బి) స్టార్క్ 28; కోహ్లి (సి) కేరీ (బి) బోలండ్ 11; పంత్ (సి) స్మిత్ (బి) స్టార్క్ 28; రోహిత్ (బి) కమిన్స్ 6; నితీశ్ రెడ్డి (సి) మెక్‌స్వీనీ (బి) కమిన్స్ 42; అశ్విన్ (సి) కేరీ (బి) కమిన్స్ 7; హర్షిత్ (సి) ఖ్వాజా (బి) కమిన్స్ 0; బుమ్రా (నాటౌట్) 2; సిరాజ్ (సి) హెడ్ (బి) బోలండ్ 7; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (36.5 ఓవర్లలో ఆలౌట్)** 175. **వికెట్ల పతనం:** 1–12, 2–42, 3–66, 4–86, 5–105, 6–128, 7–148, 8–153, 9–166, 10–175. **బౌలింగ్:** స్టార్క్ 14–1–60–2; కమిన్స్ 14–0–57–5; బోలండ్ 8.5–0–51–3.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: మెక్‌స్వీనీ (నాటౌట్) 10; ఖ్వాజా (నాటౌట్) 9; **మొత్తం (3.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా)** 19. **బౌలింగ్:** బుమ్రా 1–0–2–0; సిరాజ్ 1.2–0–9–0; నితీశ్ కుమార్ రెడ్డి 1–0–8–0.

12 ఇప్పటి వరకు 13 డే అండ్ నైట్ టెస్టులు ఆడిన ఆస్ట్రేలియా 12 టెస్టుల్లో నెగ్గడం విశేషం. అడిలైడ్‌లో ఆడిన 8 డే నైట్ టెస్టుల్లోనూ ఆస్ట్రేలియా గెలిచి అజేయంగా ఉంది. మరోవైపు ఇప్పటి వరకు ఐదు డే అండ్ నైట్ టెస్టులు ఆడిన భారత జట్టు రెండింటిలో ఓడిపోయింది. ఈ రెండూ అడిలైడ్‌లోనే కావడం గమనార్హం.



దుబాయ్‌లో డీలా

- మళ్లీ బంగ్లాదేశ్ చేతిలో భారత్‌కు చుక్కెదురు
- ఆసియా కప్ అండర్–19 క్రికెట్ టోర్నీలో రన్నరప్ టీమిండియా
- టైటిల్ నిలబెట్టుకున్న బంగ్లాదేశ్

దుబాయ్: లక్ష్యంపై నిర్లక్ష్యం... పోయిన ఏడాది సెమీఫైనల్లో... ఇప్పుడేమో ఫైనల్లో... యువ భారత్ టైటిల్‌నే మూల్యంగా చెల్లించుకుంది. అండర్–19 ఆసియా కప్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ బంగ్లాదేశ్ చేతిలో ఎనిమిది సార్లు విజేత అయిన భారత్ పరాభవం చవిచూసింది. వన్డే ఫార్మాట్‌లో కనీసం 200 పరుగులైనా లేని లక్ష్యాన్ని ఛేదించలేక... ఆదివారం జరిగిన ఫైనల్లో భారత జట్టు 59 పరుగుల తేడాతో కంగుతింది. యువభారత్ టాస్ నెగ్గి ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 49.1 ఓవర్లలో 198 పరుగులకే ఆలౌటైంది. రిజాన్ హుస్సేన్ (47; 3 ఫోర్లు), షిహబ్ (40; 3 ఫోర్లు, 1 సిక్స్), ఫరీద్ (39; 3 ఫోర్లు) రాణించారు. యుధజీత్ గుహ, చేతన్ శర్మ, హార్దిక్ రాజ్ తలా 2 వికెట్లు తీశారు. ఈ టోర్నీలో బ్యాటింగ్‌లో అదరగొట్టిన భారత్ టైటిల్‌ను గెలిచే మ్యాచ్‌లో సులువైన లక్ష్యాన్ని ఛేదించలేక 35.2 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ అమాన్ (26; 1 ఫోర్) ఇన్నింగ్స్ టాప్‌స్కోరర్ అయితే హార్దిక్ (24; 3 ఫోర్లు), కార్తికేయ (21; 2 ఫోర్లు), సిద్ధార్థ్ (20; 3 ఫోర్లు) 20 పైచిలుకు పరుగులు చేశారంతే! టోర్నీ మొత్తం నిలకడగా రాణించిన భారత ఫ్యూచర్ స్టార్, 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఫైనల్లో మాత్రం 9 పరుగులకే వెను దిరిగాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో హకీమ్ (2.2–1–8–3) రెండున్నర ఓవర్లు కూడా పూర్తిగా వేయని స్పెల్‌తో భారత్‌ను లక్ష్యానికి దూరం చేశాడు. ఇక్బాల్ 3, అల్ ఫహాద్ 2 వికెట్లు తీశారు.


బ్రిస్బేన్‌లో బోల్తా

- రెండో వన్డేలోనూ ఓడిన భారత మహిళల జట్టు
- సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకున్న ఆస్ట్రేలియా
- 'శత'క్కొట్టిన జార్జియా, ఎలీస్ పెరీ



బ్రిస్బేన్: భారత మహిళల క్రికెట్ జట్టు వరుసగా రెండో వన్డేలోనూ ఓడింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంకో మ్యాచ్ మిగిలుండగానే 0–2తో సిరీస్‌ను ఆస్ట్రేలియాకు సమర్పించుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన పోరులో ఆసీస్ 122 పరుగుల తేడాతో హర్మన్‌ప్రీత్ బృందంపై గెలిచింది. ముందుగా ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 371 పరుగులు చేసింది. వన్డేల్లో భారత జట్టుపై ఆసీస్‌కిదే అత్యధిక స్కోరు. టాపార్డర్‌లో ఓపెనర్ జార్జియా వోల్ (87 బంతుల్లో 101; 12 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాటర్ ఎలీస్ పెరీ (75 బంతుల్లో 105; 7 ఫోర్లు, 6 సిక్స్‌లు) పసలేని భారత బౌలింగ్‌పై మెరుపు శతకాలు సాధించారు. మరో ఓపెనర్ లిచ్‌ఫీల్డ్ (60; 8 ఫోర్లు, 1 సిక్స్), నాలుగో వరుస బ్యాటర్ బెత్ మూనీ (44 బంతుల్లో 56; 8 ఫోర్లు) అర్ధసెంచరీలతో కదంతొక్కారు. సైమా ఠాకూర్ 3, మిన్ను మణి 2 వికెట్లు తీశారు. అనంతరం భారత జట్టు 44.5 ఓవర్లలో 249 పరుగులకే





ఆలౌటైంది. ఓపెనర్ రిచా ఘోష్ (54; 8 ఫోర్లు) ఫిఫ్టీ సాధించగా, జెమీమా (43; 5 ఫోర్లు), మిన్ను మణి (46 నాటౌట్; 4 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (38; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఆసీస్ బౌలర్ అనాబెల్ సదర్లాండ్ 4 వికెట్లు తీసింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌బీఐ 25 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఒప్పంద ప్రాతిపదికన స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 25.
» **పోస్టుల వివరాలు:** హెడ్(ప్రొడక్ట్, ఇన్వెస్ట్‌మెంట్, రీసెర్చ్)-01, జోనల్ హెడ్–04, రీజనల్ హెడ్–10, రిలేషన్‌షిప్ మేనేజర్–టీమ్ లీడ్–09, సెంట్రల్ రీసెర్చ్ టీమ్(ప్రొడక్ట్ లీడ్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 01.08.2024 నాటికి రిలేషన్‌షిప్ మేనేజర్–టీమ్ లీడ్ పోస్టుకు 28 నుంచి 42 ఏళ్లు, సెంట్రల్ రీసెర్చ్ టీమ్ పోస్టుకు 30 నుంచి 45 ఏళ్లు, ఇతర పోస్టులకు 35 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, మెరిట్ లిస్ట్, అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పనిచేయాల్సిన ప్రదేశాలు:** ముంబై, చెన్నై, కోల్‌కతా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.12.2024
» **వెబ్‌సైట్:** http://https//sbi.co.in

సీఎస్ఐఆర్-సీఈఆర్ఐ, చెన్నైలో 28 సైంటిస్ట్ పోస్టులు

చెన్నైలో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్)కు చెందిన సెంట్రల్ ఎలక్ట్రో కెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఈఆర్ఐ), కరైకుడి డైరెక్ట్ ప్రాతిపదికన సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 28.
» **వేతనం:** నెలకు రూ.1,13,720.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 31.12.2024 నాటికి 32 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, అభ్యర్థుల షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.12.2024
» **వెబ్‌సైట్:** https://www.cecri.res.in

సీఎస్ఐఆర్-సీఎస్ఎంసీఆర్ఐ, భావ్‌నగర్‌లో 43 అప్రెంటిస్‌లు

భావ్‌నగర్(గుజరాత్)లోని సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఎంసీఆర్ఐ).. ఐటీఐ/గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 43.
» **శిక్షణ వ్యవధి:** ఏడాది.
» **ట్రేడులు:** సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మ్యాన్, ప్లంబర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, కార్పెంటర్, టర్నర్, మెషినిస్ట్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగాల్లో డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, టెక్నికల్ స్కిల్ టెస్ట్‌లో వచ్చిన మార్కులు, సర్టిఫికేట్‌ల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.12.2024
» **వెబ్‌సైట్:** http://www.csmcri.res.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టులు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసిస్టెంట్(లాజిస్టిక్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ఉద్యోగానుభవం ఉండాలి. వయసు: 13.12.2024 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** మొదటి ఏడాది నెలకు రూ.24,400, రెండో ఏడాది రూ.25,100, మూడో ఏడాది రూ.25,900.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఉద్యోగానుభవం ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.12.2024
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

క్యాట్.. మలిదశకు సిద్ధమా!

» ముగిసిన క్యాట్ 2024 పరీక్ష
» దేశ వ్యాప్తంగా 2.93 లక్షల మంది హాజరు
» మొత్తం 68 ప్రశ్నలతో మూడు సెక్షన్లలో పరీక్ష
» 85-90 పర్సంటైల్‌గా కటాఫ్ అంచనా
» క్యాట్ స్కోర్ ఆధారంగా మలి దశ ప్రవేశ ప్రక్రియ



కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్).. ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) క్యాంపస్‌లలో.. ఎంబీఏ/మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష! ఐఐఎంలతోపాటు దేశ వ్యాప్తంగా మరో 1200కు పైగా బిస్కూల్స్‌లో ప్రవేశానికీ క్యాట్ ప్రామాణికంగా నిలుస్తోంది! ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షకు 2.93 లక్షల మంది హాజరయ్యారు. ఈ నేపథ్యంలో.. క్యాట్-2024 విశ్లేషణ, కటాఫ్ అంచనా, మలిదశలో ఐఐఎంల ఎంపిక ప్రక్రియ, సన్నద్ధత తదితర వివరాలు..

గత ఏడాది కంటే ఈ సంవత్సరం క్యాట్ ప్రశ్నలు కాసింత సులభంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ఏడాది మాదిరిగానే ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు కేటాయించారు. ఎంసీక్యూలకు నెగెటివ్ మార్కింగ్‌ను పేర్కొన్నారు. ఐఐఎంలు మలిదశ ఎంపిక ప్రక్రియకు క్యాట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. ఈ ఏడాది తొలితరం ఐఐఎంల్లో కటాఫ్ పర్సంటైల్ 99 -100 మధ్యలో ఉంటుందని అంచనా వేస్తున్నారు. మిగిలిన ఐఐఎంలలో కటాఫ్ పర్సంటైల్ 94–95 మధ్యలో ఉండొచ్చని పేర్కొంటున్నారు.

స్లాట్‌ల వారీగా కటాఫ్‌ల అంచనా

- ఈ ఏడాది మూడు స్లాట్‌లో పరీక్ష నిర్వహించారు. ఆయా స్లాట్‌ల వారీగా కటాఫ్‌పై వేర్వేరు అంచనాలు వ్యక్తమవుతున్నాయి. స్లాట్–1లో 90, స్లాట్–2లో 95, స్లాట్–3లో 99 పర్సంటైల్ కటాఫ్ అంచనాగా ఉంది.
- సెక్షన్ల వారీగా వీఏఆర్‌సీ స్లాట్–1లో 85, స్లాట్–2లో 95, స్లాట్–3లో 99, డీఐఎల్ఆర్‌లో స్లాట్–1లో 85, స్లాట్–2లో 95, స్లాట్–3లో 99 అంచనాగా ఉంది. క్వాంటిటేటివ్ ఎబిలిటీలోనూ ఇదే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తంగా మూడు స్లాట్లను నార్మలైజేషన్ ప్రక్రియ ద్వారా క్రోడీకరించి పర్సంటైల్స్‌ను నిర్ధారించే క్రమంలో.. 92 నుంచి 99 స్కోర్‌తో 99 పర్సంటైల్, 69 -75 స్కోర్‌తో 95 పర్సంటైల్, 57-63 స్కోర్‌తో 90 పర్సంటైల్ పొందే అవకాశం ఉంది.

కటాఫ్ పర్సంటైల్ నిబంధన

ఐఐఎంలు క్యాట్‌లో నిర్దిష్ట కటాఫ్ స్కోర్ తప్పనిసరని పేర్కొంటున్నాయి. ఆయా ఐఐఎంలు క్యాట్‌లో నిర్దిష్ట కటాఫ్ పర్సంటైల్ ఉన్న వారికే మలిదశకు దరఖాస్తుకు అర్హత కల్పిస్తున్నాయి. కనీసం 80, గరిష్ఠంగా 95 పర్సంటైల్‌ను కటాఫ్ పర్సంటైల్‌గా నిర్దేశిస్తున్నాయి. తుది జాబితా రూపకల్పనలో గత రెండు, మూడేళ్లుగా 93 శాతంపైగా పర్సంటైల్ ఉంటేనే ప్రవేశం ఖరారైనట్లు స్పష్టమవుతోంది.

ఐఐఎం-కోల్‌కత, ఐఐఎం-అహ్మదాబాద్ వంటి తొలి తరం ఐఐఎంలలో ప్రవేశం పొందాలంటే.. 99కి పైగా పర్సంటైల్ ఉంటేనే సాధ్యమని గత ప్రవేశాల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

క్యాట్ ప్రశ్నపత్రం ఇలా

- క్యాట్–2024లో డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ సెక్షన్‌లో.. ప్రశ్నల సంఖ్య పెరిగింది. గత ఏడాది 20 ప్రశ్నలతోనే ఈ విభాగంలో ప్రశ్నలు ఉంటే.. ఈ ఏడాది 22 ప్రశ్నలు అడిగారు. మిగతా రెండు విభాగాల్లో.. వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 24 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 22 ప్రశ్నలు అడిగారు. ఈ రెండు సెక్షన్ల ప్రశ్నల సంఖ్యలో ఎలాంటి మార్పు లేదు. దీంతో.. మొత్తం 68 ప్రశ్నలతో క్యాట్ పరీక్షను నిర్వహించారు.
- ప్రతి విభాగంలోనూ బహుళైచ్ఛిక ప్రశ్నలు(ఎంసీక్యూ)తోపాటు నాన్-ఎంసీక్యూలు కూడా అడిగారు. వీఏఆర్‌సీ విభాగంలో నాలుగు, డీఐఎల్ఆర్‌లో 8, క్యూఏలో 7 నాన్-ఎంసీక్యూలు అడిగారు. దీంతో.. విద్యార్థులకు కొంత సమయాభావ సమస్య ఎదురైంది.
- మూడు స్లాట్లలో నిర్వహించిన క్యాట్–2024లో మూడు సెక్షన్లలోనూ ఎంసీక్యూలు, నాన్-ఎంసీక్యూలు సమ్మిళితంగా ప్రశ్నలు అడిగారు. వీటికి నెగెటివ్ మార్కింగ్ నిబంధన లేకపోవడం విద్యార్థులకు ఊరట కలిగించే అంశంగా చెప్పొచ్చు.

మలి దశకు మెరుగులు ఇలా

క్యాట్ కటాఫ్ అంచనాలపై అవగాహన ఏర్పడిన అభ్యర్థులు.. ఐఐఎంలు మలిదశలో నిర్వహించే ఎంపిక ప్రక్రియకు సన్నద్ధత ప్రారంభించాలి.

ఆర్‌ఏటీ, గ్రూప్ డిస్కషన్

ఐఐఎంలు క్యాట్ స్కోర్ ఆధారంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. తదుపరి దశలో రిటెన్ ఎబిలిటీ టెస్ట్, గ్రూప్ డిస్కషన్‌లను నిర్వహిస్తున్నాయి. వీటిలో ప్రతిభ ఆధారంగా చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ పర్సనల్ ఇంటర్వ్యూలోనూ విజయం సాధిస్తే.. ఐఐఎంల్లో ప్రవేశం ఖరారవుతుంది.

గ్రూప్ డిస్కషన్

మలి దశ ఎంపికకు అర్హత సాధించిన అభ్యర్థులకు ఆయా ఐఐఎం క్యాంపస్‌లలో తొలుత గ్రూప్ డిస్కషన్(జీడీ) నిర్వహిస్తారు. ఈ జీడీలో అభ్యర్థులను బృందాలుగా విభజించి ఏదైనా ఒక అంశాన్ని ఇచ్చి దానిపై చర్చించమంటారు. కోర్ నుంచి కాంటెంపరరీ వరకు అనేక అంశాలు అడుగుతున్నారు. కాబట్టి అభ్యర్థులు సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు సమకాలీన అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

రిటెన్ ఎబిలిటీ టెస్ట్

క్యాట్‌కు హాజరైన అభ్యర్థులు రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌పైనా పట్టు సాధించాలి. ఇందులో నిర్దిష్టంగా ఏదైనా ఒక అంశాన్ని పేర్కొని.. అభ్యర్థుల అభిప్రాయం తెలుసుకునేలా ప్రశ్నలు అడుగుతున్నారు. ఆయా అంశానికి సంబంధించి మూడు వందల నుంచి నాలుగు వందల పదాల మధ్యలో అభ్యర్థులు తమ సమాధానం రాయాల్సి ఉంటుంది. ఈ అంశాలు కూడా సబ్జెక్ట్ నాలెడ్జ్, సోషల్ అవేర్‌నెస్ సమ్మిళితంగా ఉంటున్నాయి.

పర్సనల్ ఇంటర్వ్యూ

గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో విజయం సాధించిన విద్యార్థులు.. చివరిగా ఎదుర్కోవాల్సిన ప్రక్రియ పర్సనల్ ఇంటర్వ్యూ. ఇంటర్వ్యూలో.. సదరు విద్యార్థికి మేనేజ్‌మెంట్ విద్య పట్ల ఉన్న వాస్తవ ఆసక్తి, అతని భవిష్యత్తు లక్ష్యాలు, వాటిని అందుకునేందుకు ఎంచుకున్న మార్గాలు తదితర అంశాలను నిపుణులైన ప్రొఫెసర్స్ కమిటీ తెలుసుకునే ప్రయత్నం చేస్తుంది.

వెయిటేజీతో తుది ఎంపిక

- ఐఐఎంలలో తుది అభ్యర్థుల జాబితాను విడుదల చేసే క్రమంలో.. క్యాట్ స్కోర్, జీడీ, ఆర్ఏటీ, పర్సనల్ ఇంటర్వ్యూలలో ప్రతిభతో పాటు మరెన్నో అంశాలను ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకుంటున్నారు.
- వంద మార్కుల వెయిటేజీ ఫార్మట్‌లో 35 నుంచి 50 శాతం మేరకు జీడీ, పీఐలకు వెయిటేజీ ఉంటోంది.
- డైవర్సిటీ వెయిటేజీ పేరుతో జండర్ డైవర్సిటీ, కల్చరల్ డైవర్సిటీలకు మూడు నుంచి అయిదు శాతం చొప్పున వెయిటేజీ ఇస్తున్నారు.
- పలు ఐఐఎంలు అకడమిక్ వెయిటేజీ నిబంధన కూడా అమలు చేస్తున్నాయి. పదో తరగతి, ఇంటర్మీడియెట్, బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు ఒక్కో కోర్సుకు ప్రత్యేకంగా వెయిటేజీ ఉంటోంది. అన్ని ఐఐఎంలు ఈ వెయిటేజీని ఒక్కో కోర్సుకు పది శాతంగా పరిగణిస్తున్నాయి.
- అకడమిక్ వెయిటేజీలోనే ప్రొఫెషనల్ అర్హత ఉన్న వారికి ప్రత్యేక వెయిటేజీని ఐఐఎంలు కల్పిస్తున్నాయి. బ్యాచిలర్ డిగ్రీ తర్వాత ప్రొఫెషనల్ కోర్సులు చదివిన విద్యార్థులకు ఇచ్చే ఈ వెయిటేజీ రెండు నుంచి మూడు శాతం మధ్యలో ఉంటోంది.
- అదే విధంగా.. పని అనుభవానికి అయిదు నుంచి పది శాతం మధ్యలో వెయిటేజీ ఇస్తున్నాయి. దీంతోపాటు.. మహిళా విద్యార్థులు మేనేజ్‌మెంట్ పీజీలో చేరేలా ప్రోత్సహించేందుకు ఐఐఎంలు జండర్ డైవర్సిటీ విధానాన్ని అమలు చేస్తున్నాయి. ఇందుకోసం రెండు నుంచి మూడు పాయింట్ల వరకు జండర్ డైవర్సిటీ పేరుతో మహిళా విద్యార్థులకు కేటాయిస్తున్నారు.

'క్యాట్' స్కోర్‌కు 40 శాతం

ఐఐఎంలు ఆయా ప్రోగ్రామ్‌లకు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో క్యాట్ స్కోర్‌కు కల్పిస్తున్న వెయిటేజీ తక్కువగానే ఉంటోంది. తుది జాబితా రూపకల్పనతో క్యాట్ స్కోర్‌కు వెయిటేజీ 40 శాతంగానే ఉంటోంది. గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు 40 నుంచి 50 శాతం వెయిటేజీ ఇస్తున్నాయి. ప్రొఫైల్, పని అనుభవం తదితర అంశాలకు దాదాపు 20 శాతం మేరకు వెయిటేజీ ఇస్తున్నాయి. వెయిటేజీ గణనలో తమ దరఖాస్తును పరిగణనలోకి తీసుకోవాలన్నా.. అభ్యర్థులు సదరు ఐఐఎంలు పేర్కొన్న విధంగా క్యాట్‌లో సెక్షనల్ కటాఫ్‌లు, మొత్తం కటాఫ్‌ల పరంగా కనీస కటాఫ్ మార్కులు పొందాల్సి ఉంటుంది.

స్టాక్ మార్కెట్లు

(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	57	81,709
నిఫ్టీ ▽	31	24,678

విదేశీ సూచీలు


నాస్‌డాక్	19,860	△	159
డోజోన్స్	44,643	▽	123
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,309	▽	41
డాక్స్	20,386	△	27
షాంఘై	3,404	▽	35
నికాయ్	39,091	▽	304

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధామనకుక	82.90	85.19
£	బ్రిటన్ పౌండ్	ధామనకుక	105.70	108.71
€	యూరో	ధామనకుక	87.44	90.19
¥	జపాన్ ఎన్ (100)	ధామనకుక	45.32	61.33
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధామనకుక	52.22	55.20
S$	సింగపూర్ డాలర్	ధామనకుక	60.97	63.81
SAR	సౌదీ రియాల్	ధామనకుక	21.70	23.25
UAE D	యూఏఈ దిర్హామ్	ధామనకుక	22.18	23.18
¥	చైనా యువాన్	ధామనకుక	10.79	12.62

క్రెడిట్ కార్డ్.. గీత దాటొద్దు..!



- మితిమీరిన వినియోగం మంచిది కాదు
- క్రెడిట్ లిమిట్‌లో 50 శాతంలోపే ఉండాలి
- లేదంటే క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం
- తప్పదంటేనే క్రెడిట్ ఓవర్ లిమిట్ సదుపాయం
- పరిమితి పెంచుకోవడం మెరుగైన మార్గం

క్రెడిట్ కార్డు యూజర్ల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఈ ఏడాది మార్చి నాటికి యాక్టివ్ కార్డులు 10 కోట్ల మార్క్‌ను దాటగా.. వచ్చే ఐదేళ్లలో (2029 మార్చి నాటికి) 20 కోట్లకు పెరుగుతాయని పీడబ్ల్యూసీ అంచనా. యూపీఐ దెబ్బకు డెబిట్ కార్డుల వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. చెల్లింపులకు వచ్చే సరికి యూపీఐ తర్వాత క్రెడిట్ కార్డుల హవాయే నడుస్తోంది. బ్యాంకు ఖాతాలో బ్యాలన్స్ ఉంటేనే యూపీఐ. బ్యాలన్స్ లేకపోయినా క్రెడిట్ (అరువు)తో కొనుగోళ్లకు క్రెడిట్ కార్డులు వీలు కల్పిస్తాయి. అందుకే వీటి వినియోగం పట్ల ఆసక్తి పెరుగుతూ పోతోంది. కానీ, క్రెడిట్ కార్డ్‌లను ఇష్టారీతిన వాడేయడం సరికాదు. ఇది క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేస్తుంది. భవిష్యత్‌లో రుణాల అర్హతకు గీటురాయిగా మారుతుంది. రుణ ఊబిలోకి నెట్టేసే ప్రమాదం లేకపోలేదు. క్రెడిట్ కార్డుపై లిమిట్ ఎంత? ఎంత వ్యయం చేయాలి? గీత దాటితే ఏమవుతుంది? తదితర అంశాలపై అవగాహన కల్పించే కథనమే ఇది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఇప్పుడంతా డిజిటల్ చెల్లింపులే. కరోనా విపత్తు తర్వాత నుంచి నగదు చెల్లింపులు గణనీయంగా తగ్గిపోయాయి. వినియోగదారులు నగదుకు బదులు క్రెడిట్ కార్డుతో షాపింగ్‌కు వెళితే మరింత ఎక్కువ ఖర్చు చేస్తున్నట్టు పలు అధ్యయనాల్లో వెల్లడైంది. పైగా గతంతో పోలిస్తే జీవనశైలి ఖర్చులు గణనీయంగా పెరిగిపోయాయి. దీంతో క్రెడిట్ కార్డుల స్వైపింగ్ మితిమీరుతోంది. పండుగల సందర్భంగా ఆకర్షించే ఆఫర్లు కూడా ఇందుకు ఒక కారణం. కార్డు ఉంది కదా అని చెప్పి ఇష్టారీతిన ఖర్చు చేస్తే.. తిరిగి చెల్లించేటప్పుడు ఆ భారం మోయాల్సి వస్తుంది. పైగా క్రెడిట్ స్కోర్‌ను ఇది ప్రతికూలంగా ప్రభావితం చేయగలదు. అందుకే క్రెడిట్ కార్డు వినియోగం విషయమై ప్రతి ఒక్కరూ అవగాహనతో, బాధ్యతతో వ్యవహరించాలి.

క్రెడిట్ లిమిట్



కార్డుపై ఉన్న గరిష్ట వ్యయ పరిమితి ఇది. ఏ కాలంలో అయినా ఈ మేరకు గరిష్టంగా వినియోగించుకోవచ్చు. వినియోగించుకున్న మేర తదుపరి గడువు నాటికి పూర్తిగా చెల్లించేస్తే ఎలాంటి వడ్డీ భారం పడదు. ఆదాయం, వ్యక్తిగత ఆర్థిక చరిత్ర, రిస్క్ ఆధారంగా క్రెడిట్ లిమిట్‌ను కార్డు జారీ సమయంలోనే బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు నిర్ణయిస్తుంటాయి. సాధారణంగా ఆరంభంలో తక్కువ లిమిట్‌తో కార్డులు జారీ చేస్తుంటాయి. కార్డుపై వినియోగం, చెల్లింపుల తీరు ఆధారంగా తర్వాతి కాలంలో ఈ లిమిట్‌ను సవరించుకునే అవకాశం ఉంటుంది.

వినియోగం

కార్డుపై క్రెడిట్ లిమిట్ రూ.లక్ష ఉందనుకుంటే.. గరిష్టంగా రూ.లక్ష వరకు వినియోగించుకోవచ్చని అర్థం. ఇలా పూర్తి పరిమితి మేర ప్రతి నెలా కార్డు ఖర్చు చేస్తుంటే అది క్రెడిట్ స్కోర్‌కు ఏ మాత్రం మంచిది కాదు. క్రెడిట్ వినియోగ నిష్పత్తి (సీయూఆర్) అని ఒకటి ఉంటుంది. రూ.లక్ష క్రెడిట్ లిమిట్ ఉన్నప్పుడు ఒక నెలలో రూ.90,000 ఖర్చు పెట్టారని అనుకుందాం. అప్పుడు సీయూఆర్ 90 శాతం అవుతుంది. "అధిక క్రెడిట్ వినియోగ నిష్పత్తి రుణ దాహార్తిని తెలియజేస్తుంది. ఇది క్రెడిట్ స్కోర్‌ను తగ్గించేస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో సీయూఆర్ దాటి ఖర్చు చేయడం తప్పు కాదు. కానీ అది అరుదుగానే ఉండాలి. సీయూఆర్ 30 శాతం మించకుండా చూసుకుంటేనే మంచిది. కార్డుపై బకాయి మొత్తాన్ని గడువులోపు పూర్తిగా చెల్లించేయాలి. ఇలా చేయడం వల్ల క్రెడిట్ స్కోర్ మెరుగవుతుంది. దీనివల్ల తర్వాతి కాలంలో క్రెడిట్ లిమిట్‌ను సులభంగా పెంచుకోవచ్చు. రుణాలను తక్కువ వడ్డీ రేటుకు పొందొచ్చు" అని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్ శెట్టి సూచించారు. సాధారణంగా సీయూఆర్ 70 శాతం మించితే అది క్రెడిట్ స్కోర్‌ను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. ఖర్చులపై నియంత్రణలేమిని, బలహీన ఆర్థిక పరిస్థితులను ఇది తెలియజేస్తుంది.



క్రెడిట్ ఓవర్ లిమిట్

ఒక బిల్లు సైకిల్ పరిధిలో క్రెడిట్ లిమిట్‌ను మొత్తం వాడేస్తే.. తదుపరి చెల్లింపులకు అవకాశం ఉండదు. కానీ, క్రెడిట్ స్కోర్ అధికంగా ఉన్న వారికి ఇందులో వెసులుబాటు ఉంది. క్రెడిట్ ఓవర్ లిమిట్ సదుపాయం వినియోగించుకోవచ్చు. కార్డు లిమిట్ పూర్తయినప్పటికీ.. అదే కార్డుపై మరింత లిమిట్ తీసుకోవచ్చు. ఇందుకు అదనపు చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. "కొన్ని సందర్భాల్లో మంచి చెల్లింపుల చరిత్ర ఉన్న కస్టమర్లకు తాత్కాలికంగా క్రెడిట్ లిమిట్‌ను బ్యాంక్‌లు పెంచుతాయి. ఇందుకోసం ముందుగానే సంప్రదించాలి. కొన్ని కార్డు సంస్థలు క్రెడిట్ లిమిట్ మించిపోయినప్పటికీ, లావాదేవీలను అనుమతిస్తుంటాయి. కాకపోతే అందుకు ఓవర్ లిమిట్ ఫీజు వడ్డిస్తాయి. పెనాల్టీ వడ్డీ రేట్లను కొన్ని అమలు చేస్తాయి. ఇవి సాధారణ రేట్ల కంటే అధికంగా ఉంటాయి" అని ఆదిల్ శెట్టి వివరించారు. క్రెడిట్ ఓవర్ లిమిట్‌పై చార్జీలు అన్ని క్రెడిట్ కార్డు సంస్థల్లో ఒకే విధంగా ఉండవు. కొన్ని బ్యాంక్‌లు 2.5 శాతం లేదా కనీసం రూ.550, కొన్ని సంస్థలు 3 శాతం చొప్పున చార్జీ వసూలు చేస్తున్నాయి. క్రెడిట్ ఓవర్ లిమిట్ ఆప్షన్‌తో కొన్ని ప్రత్యేక కార్డులు కూడా ఉన్నాయి. లేని వారు బ్యాంక్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా యాక్టివేట్ చేసుకోవచ్చు. ఏదైనా అసాధారణ పరిస్థితుల్లో తప్పించి, దీన్నొక అలవాటుగా మార్చుకోకూడదు.



మినిమం డ్యూ

ఒక నెలలో కార్డుపై చేసిన వ్యయం మొత్తాన్ని బిల్లు జారీ చేసిన నాటి నుంచి 20 రోజుల్లోపు చెల్లించాల్సి ఉంటుంది. అంత మొత్తం చెల్లించే వెసులుబాటు లేకపోతే, మినిమం డ్యూ అమౌంట్ అని ఉంటుంది. అంత చెల్లించినా సరిపోతుంది. మొత్తం బిల్లులో ఇది సుమారు 5 శాతంగా ఉంటుంది. అప్పుడు మిగిలిన బకాయిపై నెలవారీ 3 శాతానికి పైనే వడ్డీ రేటు పడిపోతుంది. ఇతర చార్జీలు కూడా చెల్లించుకోవాలి. మినిమం డ్యూ అమౌంట్ చెల్లించడం చెల్లింపుల వైఫల్యం కిందకు రాదు. బకాయి మొత్తాన్ని వెంటనే చెల్లించలేని వారు పెద్ద లావాదేవీలను ఈఎంఐ కిందకు మార్చుకోవచ్చు. లేదంటే లోన్ ఎగైనెస్ట్ క్రెడిట్ కార్డ్ (కార్డుపై రుణం) ఆఫర్‌ను వినియోగించుకోవడం ద్వారా రుణం పొంది సత్వర చెల్లింపుల నుంచి గట్టెక్కొచ్చు.



లిమిట్ పెంచుకోవచ్చు..



క్రెడిట్ స్కోర్ మెరుగ్గా ఉండి, కార్డుపై అధిక వ్యయం చేసే వారికి ఉచితంగా లిమిట్‌ను పెంచుకునేందుకు బ్యాంక్‌లు ఆఫర్లు ఇస్తుంటాయి. లేదంటే ఎవరికి వారే స్వచ్ఛందంగా కార్డు సంస్థను సంప్రదించి లిమిట్ పెంచాలని కోరొచ్చు. వినియోగం 70–80 శాతం దాటుతున్న వారు ప్రస్తుత కార్డుపైనే లిమిట్‌ను పెంచుకోవడం లేదంటే మరో కార్డు తీసుకుని వ్యయాలను రెండు కార్డుల మధ్య వైవిధ్యం చేసుకోవడం మంచి నిర్ణయం అవుతుంది. దీనివల్ల క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో (సీయూఆర్)ను తగ్గించుకోవచ్చు.

స్వీయ నియంత్రణ

క్రెడిట్ కార్డుపై వాస్తవ రుణ పరిమితి (క్రెడిట్ లిమిట్) కంటే తక్కువ లిమిట్‌ను ఎవరికి వారే విధించుకోవచ్చు. దీనివల్ల వ్యయాలపై నియంత్రణ సాధ్యపడుతుంది. బ్యాంక్/ఎన్‌బీఎఫ్‌సీ యాప్ ద్వారా క్రెడిట్ లిమిట్‌లో మార్పులు చేసుకోవచ్చు. ఉదాహరణకు రూ.3 లక్షల క్రెడిట్ లిమిట్ ఉన్నప్పుడు రూ.లక్ష పరిమితిని సొంతంగా నిర్ణయించుకోవచ్చు. అటువంటప్పుడు కార్డుపై ఒక నెలలో వ్యయం రూ.లక్షకు చేరగానే తదుపరి చెల్లింపులు తిరస్కరణకు గురవుతాయి. ఎలాంటి పెనాల్టీ చార్జీలు పడవు. ఖర్చులు చేయిదాటిపోకుండా, గుర్తు చేసేందుకు ఈ సదుపాయం అక్కరకు వస్తుంది. యాప్‌లోకి వెళ్లి ఈ పరిమితిలో ఎప్పుడైనా మార్పులు చేసుకోవచ్చు.

క్రెడిట్ స్కోర్‌పై రిమార్క్

కార్డు బకాయిల తిరిగి చెల్లింపులు తీరు క్రెడిట్ స్కోర్‌పై 35 శాతం మేర ప్రభావం చూపిస్తుందని బ్యాంక్ బజార్ చెబుతోంది. మెరుగైన క్రెడిట్ స్కోర్ కొనసాగాలంటే సకాలంలో బకాయిలు చెల్లించడం ఎంతో అవసరం. లేదంటే అధిక వడ్డీలకుతోడు, ఆలస్య రుసుములు చెల్లించాల్సి వస్తుంది. క్రెడిట్ స్కోర్ కూడా తగ్గిపోతుంది. క్రెడిట్ వినియోగ రేషియో అధికంగా ఉన్నా, క్రెడిట్ ఓవర్ లిమిట్‌కు వెళ్లినా కానీ క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం పడుతుంది. క్రెడిట్ స్కోరును లెక్కించే సందర్భంగా తక్కువ సీయూఆర్‌ను సానుకూలంగా చూస్తామని క్రిఫ్ హైమార్క్ (క్రెడిట్ బ్యూరో) మాజీ ఎండీ సంజీత్ దావర్ తెలిపారు.



ఒకరికి ఎన్ని కార్డులు

"అందరికీ ఒక్కటే సూత్రం వర్తించదు. ఆర్థిక పరిస్థితులు, ఖర్చు చేసే అలవాట్లపై ఎన్ని క్రెడిట్ కార్డులు అన్నది ఆధారపడి ఉంటుంది. బాధ్యతాయుతంగా వినియోగిస్తూ, సకాలంలో చెల్లింపులు చేసే వారు ఎన్ని కార్డులు అయినా కలిగి ఉండొచ్చు. కాకపోతే ఒకరికి రెండు లేదా మూడు కార్డులు మించి ఉండరాదన్నది సాధారణ సూత్రం" అని మై మనీ మంత్ర వ్యవస్థాపకుడు రాజ్‌ఖోస్లా వివరించారు. ఆన్‌లైన్ చెల్లింపులకు వినియోగించేందుకు తక్కువ లిమిట్‌తో ఒక కార్డు, ఇతర ముఖ్యమైన, అత్యవసరాల కోసం మరొక కార్డు కలిగి ఉండొచ్చని ప్లాన్ అహెడ్ వెల్త్ అడ్వైజర్స్ వ్యవస్థాపకుడు విశాల్ ధావన్ సూచించారు.




లాభ–నష్టాలు..



- అధిక లిమిట్ అత్యవసర వైద్యం, ప్రయాణాలప్పుడు ఆదుకుంటుంది.
- కార్డులు పెరిగేకొద్దీ వాటిపై వ్యయాలు కూడా ఇతోధికం అవుతుంటాయి. అన్నీ కలసి రుణ భారాన్ని పెంచేస్తాయి.
- స్వీయ నియంత్రణ లేనట్టయితే, అధిక క్రెడిట్ లిమిట్ విషయంలో హద్దులేనట్టుగా వ్యవహరించినట్టయితే రుణ ఊబిలో చిక్కుకునే ప్రమాదం ఎదురవుతుంది.
- కార్డులు ఎక్కువైనప్పుడు వాటి వేర్వేరు గడువు తేదీలను గుర్తు పెట్టుకుని, సకాలంలో చెల్లించాల్సి ఉంటుంది.
- చెల్లింపుల వైఫల్యాలు, అధిక క్రెడిట్ వినియోగం క్రెడిట్ స్కోర్‌ను తగ్గించేస్తాయి.
- బాధ్యతతో, వివేకంతో వినియోగిస్తే క్రెడిట్ కార్డు ద్వారా తగ్గింపు ఆఫర్లు పొందొచ్చు. వినియోగంపై రివార్డు పాయింట్లను కూడా పొందొచ్చు. క్రెడిట్ స్కోరును బలోపేతం చేసుకోవచ్చు.

ఫండ్స్‌లోనా లేదా స్టాక్స్‌లోనా..?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

రూ.30 లక్షలను ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ద్వారా లేదా నేరుగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుసరించాల్సిన వ్యూహం ఏంటి? మెరుగైన అస్సెట్ అలోకేషన్ విధానం ఏది అవుతుంది? – హితేంద్ర వాణి

మీ పెట్టుబడి రూ.30 లక్షలను 12 నుంచి 24 సమాన నెలసరి వాయిదాలుగా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. మంచి పనితీరు కలిగిన ఫండ్‌ను ఎంపిక చేసుకోవాలి. లేదా నేరుగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసేట్టు అయితే అత్యుత్తమ నాణ్యత కలిగిన కంపెనీలను ఎంపిక చేసుకోవాలి. పటిష్టమైన ఈక్విటీ పోర్ట్‌ఫోలియోని నిర్మించుకోవడం పెద్ద సవాలుతో కూడుకున్నదే. రూ.30 లక్షలు ఇన్వెస్ట్ చేస్తున్నారు. కనుక ఒక కంపెనీకి గరిష్టంగా రూ.6 లక్షలు లేదా అంతకంటే తక్కువ కేటాయించుకోవచ్చు. బలమైన మూలాలు, నమ్మకమైన వృద్ధి అవకాశాలున్న కంపెనీలను ఎంపిక చేసుకోవాలి. పెట్టుబడులను వివిధ కంపెనీల మధ్య వైవిధ్యం చేసుకోవాలి. ఇది రిస్క్‌ను తగ్గిస్తుంది. పెట్టుబడుల నాణ్యతను పెంచుతుంది. ఎంపిక, పెట్టుబడుల కేటాయింపులు, వైవిధ్యం వీపోర్ట్‌ఫోలియో వీటికి ప్రాధాన్యం ఇవ్వాలి. తగినంత సమయం, విశ్వాసం లేకపోతే అప్పుడు మంచి ఫ్లెక్సీక్యాప్ లేదా మల్టీక్యాప్ ఫండ్ మేనేజర్‌పై ఆ బాధ్యతను పెట్టాలి. ఏ స్టాక్స్ ఎంపిక చేసుకోవాలన్న శ్రమ మీకు తప్పుతుంది. స్టాక్స్ పోర్ట్‌ఫోలియో నిర్వహణలో అనుభవం లేకపోతే నేరుగా ఇన్వెస్ట్ చేయకపోవడమే మంచిది. మీకు తగిన అనుభవం, సమయం ఉంటే, నిబంధనల ప్రకారం వ్యవహరించేట్టు అయితే ఫండ్స్‌తో పోలిస్తే ఎక్కువ రాబడులు సొంతం చేసుకోవచ్చు.

నేను రిటైర్మెంట్ తీసుకున్నాను. క్రమానుగత పెట్టుబడుల ఉపసంహరణ (ఎస్‌డబ్ల్యూపీ) కోసం లిక్విడ్ ఫండ్ లేదా షార్ట్ డ్యురేషన్ ఫండ్‌లో దేనిని ఎంపిక చేసుకోవాలి? – విఘ్నేశ్

లిక్విడ్ ఫండ్స్ స్థిరత్వంతో, తక్కువ రిస్క్‌తో ఉంటాయి. కనుక షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌తో పోల్చితే సిస్టమ్యాటిక్ విత్ డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) కోసం ఇవి అనుకూలం. అతి తక్కువ అస్థిరతలతో, స్థిరమైన రాబడులు ఇవ్వడం వల్ల లిక్విడ్ ఫండ్స్‌లో పెట్టుబడులతో నిశ్చింతగా ఉండొచ్చు. 1. లిక్విడ్ ఫండ్స్ పెట్టుబడుల విలువ దాదాపుగా తగ్గిపోవడం ఉండదు. వారం, నెల వ్యవధిలోనూ ఇలా జరగదు. ఉదాహరణకు కోటక్ లిక్విడ్ ఫండ్ గడిచిన దశాబ్ద కాలంలో వారం వారీ 99.78 శాతం సందర్భాల్లో సానుకూల రాబడులు ఇచ్చింది. నెలవారీగా చూస్తే నూరు శాతం సందర్భాల్లోనూ సానుకూల రాబడులు ఉన్నాయి. అదే కోటక్ షార్ట్ డ్యురేషన్ ఫండ్ పనితీరు గమనించినట్టయితే.. విలువలో కొంత క్షీణించడాన్ని గుర్తించొచ్చు. గడిచిన దశాబ్ద కాలంలో వారం వారీ రాబడులను గమనిస్తే 15.8 శాతం సందర్భాల్లో ప్రతికూలంగా, నెలవారీ రాబడుల్లో 7 శాతం సందర్భాల్లో ప్రతికూల పనితీరును గమనించొచ్చు. 2. లిక్విడ్ ఫండ్స్ అయితే అదే రోజు లేదా మరుసటి రోజు పెట్టుబడులు చేతికి అందుతాయి. నెలవారీ ఊహించతగిన రాబడులకు అనుకూలంగా ఉంటాయి. షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లోనూ లిక్విడిటీ ఎక్కువే. కాకపోతే వాటి ఎన్‌ఏవీలో స్వల్ప ఊగిసలాటలు ఉంటాయి. ఇది నెలవారీ ఉపసంహరించుకునే మొత్తంపై ప్రభావం చూపిస్తుంది. 3. షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లో రాబడులు కొంచెం ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు రూ.10 లక్షల పెట్టుబడిపై ఒక ఏడాదిలో రూ.వేలల్లో ఉంటుంది. కానీ, ఈ మేరకు రిస్క్ కూడా అధికంగా ఉంటుంది. 4. లిక్విడ్ ఫండ్స్‌పై మార్కెట్ అస్థిరతలు పెద్దగా ఉండవు. కనుక ప్రశాంతంగా ఉండొచ్చు.

ఎంపీఎస్ | బ్రోకరేజ్: కీనోట్ క్యాపిటల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,175 **టార్గెట్:** రూ. 3,112

ఎందుకంటే: డిజిటల్ విభాగంలో కంటెంట్, విభిన్న ప్లాట్‌ఫామ్ సొల్యూషన్లు అందించే ఎంపీఎస్ ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో వార్షిక ప్రాతిపదికన 37 శాతం ఎగసింది. అంతేకాకుండా మొత్తంగా నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు భారీగా 7.39 శాతం మెరుగుపడ్డాయి. ప్రధానంగా కంటెంట్, ప్లాట్‌ఫామ్ సొల్యూషన్స్ విభాగాలు ఇందుకు తోడ్పాటునిచ్చాయి. వార్షికంగా కంటెంట్ విభాగ ఆదాయం 37 శాతం పుంజుకోగా.. ప్లాట్‌ఫామ్ సొల్యూషన్స్ 67 శాతం జంప్‌చేసింది. అయితే ఈలెర్నింగ్ బిజినెస్ మందగమనం కొనసాగింది. వార్షికంగా ఈ విభాగం ఆదాయం 8 శాతమే పురోగమించింది. విదేశీ అనుబంధ సంస్థ ఏజేఈ కార్యకలాపాలను టర్న్‌అరౌండ్ చేయడం ద్వారా ఎంపీఎస్ మార్జిన్లను భారీగా బలపరచుకుంది. దీనికితోడు ఎంపీఎస్‌ఎల్ వివిధ ప్రాంతాలు, విభాగాలలో పటిష్ట వృద్ధిని సాధించడం పటిష్ట ఫలితాలకు సహకరించింది. ఈ ఏడాది క్యూ1(ఏప్రిల్–జూన్)లో మార్జిన్లను భారీగా మెరుగుపరచుకున్న కంపెనీ అదే బాటలో కొనసాగుతోంది. భవిష్యత్‌లోనూ మార్జిన్లను మరింత పెంచుకోగలమని భావిస్తోంది. దీంతో ఈ ఏడాది అక్టోబర్–డిసెంబర్(క్యూ3)తోపాటు.. జనవరి–మార్చి(క్యూ4)లోనూ మార్జిన్లలో వృద్ధిని అంచనా వేస్తోంది. వెరసి మధ్య కాలానికి అంచనాలకు అనుగుణమైన పనితీరు చూపే బాటలో సాగుతోంది. అంటే బలమైన మార్జిన్లను నిలుపుకుంటూనే 2027–28కల్లా రూ. 1,500 కోట్ల ఆదాయాన్ని అందుకునే ప్రణాళికల్లో ఉంది. ఇందుకు ఆదాయ అంచనాల్లో సగభాగాన్ని ఈ ఏడాదిలోనే సాధించాలని ఆశిస్తోంది.



సిగ్నేచర్ గ్లోబల్ | బ్రోకరేజ్: ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,301 **టార్గెట్:** రూ. 2,007

ఎందుకంటే: రియల్టీ రంగ కంపెనీ సిగ్నేచర్ గ్లోబల్ అమ్మకాల బుకింగ్స్‌లో 63 శాతం వృద్ధిని అందుకుంది. ఇందుకు అందుబాటు ధరల, మధ్యాదాయ హౌసింగ్ ప్రాజెక్టులను వృద్ధి మార్గంగా ఎంచుకుంది. ఈ బాటలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) తొలి అర్ధభాగం(ఏప్రిల్–సెప్టెంబర్)లో రూ. 5,900 కోట్ల విలువైన అమ్మకాల బుకింగ్స్‌ను సాధించింది. ఇందుకు గురుగ్రామ్‌లోని సెక్టార్ 71లో ప్రవేశపెట్టిన టైటానియం ప్రాజెక్ట్‌తో పాటు, సోహ్నాలో డాక్సిన్ విస్టాస్ లగ్జరీ ప్రాజెక్ట్ ప్రధానంగా తోడ్పాటునిచ్చాయి. 2024–28 మధ్య కాలంలో కంపెనీ పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ప్రవేశపెట్టే ప్రణాళికల్లో ఉంది. వీటి కారణంగా నాలుగేళ్లలో రూ. 45,000 కోట్ల విలువైన స్థూల డెవలప్‌మెంట్ విలువ(జీడీవీ)ని సాధించగలదని అంచనా. వెరసి 2024–27 కాలంలో వార్షిక ప్రాతిపదికన 21 శాతం అధికంగా అమ్మకాల బుకింగ్స్‌ను నమోదు చేయగలదని అంచనా. దీంతో 2025–27 కాలంలో వార్షికంగా రూ. 11,000–13,000 కోట్ల అమ్మకాల బుకింగ్స్‌కు అవకాశముంది. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో సాధించిన ప్రోత్సాహకర పనితీరు ప్రభావంతో ఈ ఏడాది 7 శాతం వృద్ధితో రూ. 10,800 కోట్లు, వచ్చే ఏడాది(2025–26) రూ. 11,400 కోట్ల విలువైన అమ్మకాలు సాధించగలదని భావిస్తున్నాం. రెండేళ్ల కాలంలో సగటున రూ. 2,920 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా), 30 శాతం ఇబిటా మార్జిన్లు సాధించగలదని అంచనా. ప్రధానంగా గురుగ్రామ్ మార్కెట్లో మందగమన పరిస్థితులు, భూములను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేకపోవడం వంటి అంశాలను కీలక రిస్కులుగా భావించవచ్చు.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

9-12-2024	
విశాఖ	610–00
చిత్తూరు	633–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	620–00
విజయవాడ	620–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	620–00
వరంగల్	622–00
రిటైల్ ధర	6.80

న్యూ ఫండ్ ఆఫర్


యాక్సిస్ క్రిసిల్–ఐబీఎక్స్ ఎన్‌బీఎఫ్‌సీ–హెచ్‌ఎఫ్‌సీ ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్, కొత్తగా యాక్సిస్ క్రిసిల్–ఐబీఎక్స్ అఅఅ బాండ్ ఎన్‌బీఎఫ్‌సీ–హెచ్‌ఎఫ్‌సీ–జూన్ 2027 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది క్రిసిల్– ఐబీఎక్స్ అఅఅ ఎన్‌బీఎఫ్‌సీ–హెచ్‌ఎఫ్‌సీ ఇండెక్స్–జూన్ 2027లోని సెక్యూరిటీల్లో పెట్టుబడి పెట్టే ఓపెన్–ఎండెడ్ టార్గెట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్. ఈ స్కీములో ఒక మోస్తరు వడ్డీ రేటు రిస్కు, మిగతా సాధనాలతో పోలిస్తే తక్కువ క్రెడిట్ రిస్కు ఉంటాయి. కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. డిసెంబర్ 10 వరకు ఇది అందుబాటులో ఉంటుంది.

శామ్కో మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్

శామ్కో అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ.. కొత్తగా శామ్కో మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను ప్రారంభించింది. ఈ నెల 4న ప్రారంభమైన న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌వో), ఈ నెల 18 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈక్విటీలు, బంగారం, డెట్, ఆర్బిట్రేజ్ సాధనాల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. ఆయా విభాగాల్లో ఆకర్షణీయమైన అవకాశాలకు అనుగుణంగా కేటాయింపుల్లోనూ మార్పులు, చేర్పులు చేస్తుంటుంది. ఈక్విటీలు ర్యాలీ చేసే సమయంలో వాటికి కేటాయింపులు పెంచడం, ఈక్విటీలు అధిక వ్యాల్యూషన్లకు చేరి నిదానించిన సమయంలో బంగారంలోకి పెట్టుబడులు తరలించడం తదితర వ్యూహాలను అనుసరిస్తుంది. తద్వారా రిస్క్‌ను అధిగమించి, మెరుగైన రాబడులు ఇచ్చే విధంగా పనిచేస్తుంది. ఈక్విటీలకు 20–80 శాతం మధ్య, డెట్‌కు 10–70 శాతం మధ్య, బంగారం, సిల్వర్ ఈటీఎఫ్‌లకు 10–70 శాతం మధ్య అవకాశాలకు అనుగుణంగా కేటాయింపులు చేస్తుంది. 30 శాతం వరకు కమోడిటీ డెరివేటివ్‌లు, 10 శాతం వరకు రీట్‌లు, ఇన్విట్‌లలోనూ పెట్టుబడులు పెడుతుంది. ఎన్‌ఎఫ్‌వోలో భాగంగా ఒకరు కనీసం రూ.5,000 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

ఇన్వెస్కో ఇండియా మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్



ఈక్విటీ, డెట్, గోల్డ్ ఈటీఎఫ్‌లు/సిల్వర్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేసే ఇన్వెస్కో ఇండియా మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్ ఆవిష్కరించింది. ఈ ఓపెన్ ఎండెడ్ న్యూ ఫండ్ ఆఫర్ డిసెంబర్ 11 వరకు అందుబాటులో ఉంటుంది. కనీసం రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. సిప్ విధానంలో రూ. 500 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ఈక్విటీలు, డెట్ సాధనాల్లో 10–80 శాతం వరకు, గోల్డ్ ఈటీఎఫ్‌లు/సిల్వర్ ఈటీఎఫ్‌లలో 10–50 శాతం వరకు ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. అలాగే అవకాశాన్ని బట్టి విదేశీ సెక్యూరిటీస్‌లో 35 శాతం వరకు పెట్టుబడులు పెడుతుంది.





వైమానిక విన్యాసాలను తిలకిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో కోమటిరెడ్డి, కేకే, పొంగులేటి తదితరులు



నింగీ నేల ఏకమైన కేరింత..

అద్భుత వైమానిక విన్యాసాలు

- చూపు తిప్పుకోనివ్వని కళా ప్రదర్శనలు
- ప్రజల కేరింతలు, పండుగ వాతావరణం
- ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డులో ప్రజాపాలన విజయోత్సవాలు

ఖైరతాబాద్/కవాడిగూడ: ఆకాశంలో జూ..మ్మని దూసుకుపోతూ.. విమానాల అద్భుత విన్యాసాలు.. నేలపై సంస్కృతి సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు చూపుతూ సాగిన కూచిపూడి, భరతనాట్యం, బోనాలు, డప్పు వాయిద్యాలు.. విద్యుత్ కాంతుల్లో ధగధగా మెరిసిపోయిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం.. ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ ఉర్రూతలూగించే పాటలు.. ఎటుచూసినా కోలాహలం.. పండుగ సందడి. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు ప్రాంతంలో ఆదివారం సాయంత్రం కనిపించిన దృశ్యాలివి. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హుస్సేన్‌సాగర్, సచివాలయం, బిర్లా టెంపుల్, ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో సూర్యకిరణ్ విమానాలు అద్భుత విన్యాసాలు చేశాయి. ఈ విన్యాసాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 15 సూర్యకిరణ్ విమానాలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఈ ప్రదర్శనను తిలకించేందుకు నగరవాసులు భారీగా తరలిరావటంతో ఎన్టీఆర్ మార్గ్ సందర్శకులతో కిటకిటలాడింది. సచివాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఏర్పాటుచేసిన మూడు వేదికలపై వివిధ రంగాల కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. మరోపక్క తెలంగాణ రుచులను పరిచయం చేస్తూ ఏర్పాటుచేసిన ఫుడ్ స్టాల్స్, అలంకరణ వస్తువులతో కూడిన స్టాల్స్ సందర్శకులను అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాల్లో మంత్రులు, పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారత వాయుసేన సేవలు అనిర్వచనీయం

ప్రజాపాలన విజయోత్సవాల్లో వాయుసేన అద్భుత ప్రదర్శన

- సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం వైమానిక విన్యాసాలు
- కెప్టెన్‌గా అనుభవాలను పంచుకున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: దేశ సరిహద్దుల్లో భారత వాయుసేన అందిస్తున్న సేవలు అనిర్వచనీయమైనవని పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దేశం కోసం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ వాయుసేన పోషిస్తున్న పాత్ర నేటితరానికి స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని.. ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద భారత వాయుసేన, సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం ప్రదర్శించిన వైమానిక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం కెప్టెన్ అజయ్ దాశరథి, ఇతర సభ్యులతో మంత్రి ఉత్తమ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. భారత వాయుసేన, సూర్యకిరణ్ బృందం సేవలను కొనియాడారు. వారి దేశభక్తి, ధైర్యసాహసాలు, నిబద్ధత అజరామరమని పేర్కొన్నారు. భారత వాయుసేనలో యుద్ధవిమాన పైలట్‌గా పనిచేసిన ఉద్విగ్న క్షణాలను ఆయన గుర్తు చేసుకున్నారు. పాక్, చైనా సరిహద్దుల్లో మిగ్–21, మిగ్–23 వంటి యుద్ధ విమానాలను నడపడం గర్వకారణంగా ఉందన్నారు. సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం కెప్టెన్ అజయ్ దాశరథి మాట్లాడుతూ యుద్ధవిమానాలు నడపడంలో సిద్ధహస్తుడిగా పేరొందిన మంత్రి కెప్టెన్ ఉత్తమ్ సేవలు విశిష్టమైనవని అభినందించారు. 2019 నుంచి 2023 వరకు రక్షణ శాఖ కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీలో ఉత్తమ్.. రక్షణ శాఖ సిబ్బంది, రిటైరైన వారి సంక్షేమానికి పాటుపడ్డారని గుర్తు చేశారు.



సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందంతో మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.





కార్తీక దీపోత్సవం సందర్భంగా వేములవాడ రాజన్న సన్నిధిలో నిత్యం యాభై మంది మహిళలు.. పూలతో ప్రత్యేక ఆకృతులు పేర్చి దీపాలు వెలిగించిన దృశ్యాలు

కాలకంఠుడి కార్తీక వైభోగం

వేములవాడ రాజన్న క్షేత్రంలో నెలరోజులు సాగిన వేడుకలు

రోజూ 2 వేల దీపాలు... రంగురంగుల పువ్వులతో నైవేద్యం

కూచిపూడి నృత్యాలతో నాట్య నివేదన... అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు







నాట్యనివేదన చేస్తున్న కళాకారులు

వేములవాడ: కాలకంఠుడైన శ్రీరాజరాజేశ్వరుడికి కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు, దీపోత్సవాలు ఆకట్టుకున్నాయి. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో కార్తీకమాసంలో నెలరోజులపాటు ప్రతిష్టాత్మకంగా దీపోత్సవం నిర్వహించారు. రంగురంగుల పూలతో త్రిశూలం, ఓం, లింగాకారం, స్వస్తిక్, శంఖుచక్రాలు, దేవీరూపాలను పేర్చారు. అందులో వేలాది దీపాలను వెలిగించి.. దీపోత్సవం నిర్వహించారు. రాజన్న ఆలయంలోని ఓపెన్‌స్లాబ్‌లో ఈ వేడుకలు జరిగాయి.

నెల రోజులూ ప్రత్యేక కార్యక్రమాలు

రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా రాష్ట్ర దేవాదాయశాఖ ఆదేశాలతో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు సామూహిక కార్తీక దీపోత్సవం జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు, స్థానికులు, సుహాసినులు, కళాకారులు పాల్గొన్నారు. దీపాలంకరణ అనంతరం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు నాట్య నివేదన చేశారు. హరికథాగానం, సంగీత కచేరి, భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాలకు తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి హాజరయ్యారు. నవంబర్ 12న లక్ష పుష్పారాధన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.



ఉత్సవాలు జరిగిందిలా..

సుహాసినులు:	100 మంది
పూలు:	3వేల కిలోలు
నూనె:	10 కిలోలు
దీపాలు:	2 వేలు
సేవాసమితులు:	15
ప్రసాదాలు:	10 కేజీలు
కనుములు:	50 మందికి
పండ్లు:	100 కేజీలు
మొత్తం కళాకారులు:	వెయ్యి మంది

కనుల పండువగా నిర్వహించాం



“దేవాదాయశాఖ ఆదేశాలతో వేములవాడ రాజన్న ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం కనుల పండువగా నిర్వహించాం. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయం ద్వారా సమకూర్చాం. సుహాసినులు, కళాకారులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు. దేవాదాయశాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు.

– కొప్పుల వినోద్‌రెడ్డి, ఆలయ ఈవో





నేనూ.. ఆటో నడుపుతా

మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో ఓ కొండెంగ ఆటో డ్రైవర్ సీట్లో కూర్చుని సందడి చేసింది. నెహ్రూ సెంటర్‌లో ఆదివారం ఆటోస్టాండ్‌లో ఆగిఉన్న ఆటో డ్రైవర్ సీట్లో కొండెంగ కూర్చుంది. స్టీరింగ్ తిప్పుతూ ఆటో నడుపుతున్నట్లు ఫోజులిచ్చినప్పుడు కనిపించిన దృశ్యాలివి. – గార్ల





ప్రజాపాలన విజయోత్సవాల నేపథ్యంలో విద్యుత్ దీపాల కాంతులతో తళుకులీనుతున్న సచివాలయ పరిసర ప్రాంతాలు

అసెంబ్లీ ముందుకు మహిళా వర్సిటీ బిల్లు

బాసర ట్రిపుల్ ఐటీ బిల్లు కూడా.. పూర్తయిన కసరత్తు

సాక్షి, హైదరాబాద్: విశ్వవిద్యాలయాలకు చెందిన రెండు ప్రధానమైన బిల్లులు ఈసారి సమావేశాల్లో అసెంబ్లీ ముందుకు వచ్చే వీలుంది. ఇందులో ఒకటి వీరనారి చాకలిఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు మహిళా విశ్వవిద్యాలయం లేకుండా పోయింది. దీంతో కోఠి ఉమెన్స్ కాలేజీని మహిళా విశ్వవిద్యాలయంగా మారుస్తూ 2021లో గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2022 ఏప్రిల్‌లో ఇందుకు సంబంధించిన జీవో (నెంబర్ 12) జారీ చేసింది. అప్పుడే ఇన్‌చార్జ్ వీసీని కూడా నియమించారు. కానీ ఇందుకు సంబంధించిన బిల్లును మాత్రం అసెంబ్లీ ఆమోదించలేదు. గత అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెడతామని అధికారవర్గాలు చెప్పినా..కార్యాచరణకు నోచుకోలేదు. దీనివల్ల సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. ఇక్కడ చదివిన విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ పేరుతోనే పట్టాలు ఇస్తున్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో పలు పీజీ కోర్సుల్లో చేరిన విద్యార్థినుల చదువులు గత ఆగస్టులో పూర్తయ్యాయి. తాము మహిళా యూనివర్సిటీ అని చేరామని, ఆ పేరుతోనే డిగ్రీలు ఇవ్వాలని విద్యార్థినులు పలు సందర్భాల్లో ఆందోళనకు దిగారు. ఈ పేరుతో పట్టాలివ్వాలంటే ముందుగా వర్సిటీని యూజీసీ గుర్తించాలి. అలా గుర్తించాలంటే యూనివర్సిటీ బిల్లును చట్టసభ ఆమోదించాలి. ఈసారి బిల్లు ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవసరమైన పత్రాలను కూడా ఉన్నత విద్యామండలి అధికారులు ఇటీవల సిద్ధం చేశారు.

బాసర ట్రిపుల్ ఐటీ బిల్లుకు మోక్షం

బాసర ఆర్‌జీయూకేటీ (ట్రిపుల్ ఐటీ)కి ఈ సమావేశంలో మోక్షం లభించవచ్చని భావిస్తున్నారు. బాసర ట్రిపుల్ ఐటీకి చాలాకాలంగా శాశ్వత వీసీ లేరు. రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీలకు కులపతిగా గవర్నర్ వ్యవహరిస్తారు. ఇక్కడ మాత్రం విద్యావేత్త చాన్సలర్‌గా ఉంటారు. రిజిస్ట్రార్‌కు బదులు పరిపాలనాధికారి ఉంటారు. ఇతర యూనివర్సిటీల్లాగా ఇక్కడ మార్పులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు గత ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాల్లోనే చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించినా, అది సాధ్యపడలేదు. ఈసారి ఈ బిల్లు అసెంబ్లీ ముందుకొచ్చే వీలుంది.

మెగా రక్తదాన శిబిరం నేడు

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా సోమవారం గాంధీభవన్‌లో వేడుకలు జరగనున్నాయి. ఉదయం 8:30 గంటలకు మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసే కార్యక్రమం ఉంటుందని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ఉదయం 9 గంటలకు టీపీసీసీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ప్రారంభ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌లు పాల్గొంటారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

తెలంగాణ అహోబిలం.. నవ నారసింహ ఆలయం

అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ శివారులో కొలువైన చారిత్రక దేవాలయం

కొండను తొలచి గదులు, మండపంగా ఏర్పడిన అద్భుత కట్టడం

ఆలయ ధ్వజస్తంభంగా నారవేప వృక్షం • గుప్త నిధుల వేటలో ధ్వంసమైన విగ్రహాలు

నవ నారసింహ ఆలయం



నల్లమల అటవీప్రాంతంలోని అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ గ్రామ శివారులో ఉన్న చారిత్రక నవ నారసింహ ఆలయం ఎంతో ప్రత్యేకమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లాలో ఉన్న అహోబిలం నరసింహస్వామి ఆలయంలో ఉన్నట్లుగానే ఇక్కడి ఆలయంలోనూ నరసింహుడు తొమ్మిది రూపాలతో కొలువై ఉన్నాడు. తెలంగాణలో ఇలాంటి అరుదైన ఆలయం ఉన్నప్పటికీ ఆలయ అభివృద్ధి లేక ప్రాచుర్యంలోకి రావడం లేదు. ఏటా తొలిఏకాదశి సందర్భంగా మాత్రమే ఇక్కడ పూజలు జరుగుతాయి. పురాతనమైన ఈ ఆలయంలోని విగ్రహాల్లో ఇప్పటికే కొన్ని గుప్తనిధుల వేటలో ధ్వంసమయ్యాయి. ఈ ఆలయంపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో అపురూపమైన విగ్రహాలు తరచూ అపహరణకు గురవుతున్నాయి.

– సాక్షి, నాగర్‌కర్నూల్



అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ శివారులోని నవ నారసింహ ఆలయం

నవరూపాలు కొలువైన దేవాలయం

లక్ష్మాపూర్ గ్రామ శివారులోని నరసింహుల వాగు పక్కన దరిగా ఏర్పడిన కొండపై ప్రకృతి రమణీయ ప్రదేశంలో నరసింహుడు కొలువై ఉన్నాడు. కొండను తొలచి గదులు, మండపంగా ఏర్పరిచిన దేవాలయంలో ఒకప్పుడు నరసింహుని తొమ్మిది రూపాలు ఉన్నాయి. నరసింహుని అవతారాలైన నృసింహ, వరాహ, బాల, వృద్ధ, ఉగ్ర, యోగ, శాంత, ప్రసన్న, వరద నారసింహ రూపాల్లో నరసింహుని రూపాలున్నాయి. ప్రధానాలయంలో నృసింహుడికి ఇరువైపులా ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవతల విగ్రహాలు ఉండగా, ఎదురుగా వరాహమూర్తి అవతారంలో ఉన్న విగ్రహం ఉంది.

ధ్వజస్తంభంగా నారవేప వృక్షం

పూర్వకాలం నుంచి ఆలయాల్లో ధ్వజస్తంభాల కోసం వినియోగించే నారవేప వృక్షం ఈ ఆలయానికి ఎదురుగా ధ్వజస్తంభం స్థానంలో ఉండటం మరో విశేషం. నరసింహుడి తొమ్మిది రూపాలతో పాటు హనుమంతుడు, హయగ్రీవుడు, శివుడు, మహిషాసురమర్ధిని, గణపతి, భైరవుడి విగ్రహాలున్నాయి. ప్రధాన మండపంలో ఆళ్వారు స్వాముల ప్రతిమలు కూడా ఉండగా స్థానికులు వీటిని బోడ బ్రాహ్మలనే పేరుతో పిలుస్తున్నారు. ఆలయంలోని విగ్రహాలన్నింటినీ నల్లని కృష్ణశిలలతో చెక్కగా, ఒక్క భైరవుని విగ్రహం మాత్రమే సాధారణ రాయిని తలపిస్తోంది. ఇక్కడి ప్రతిమల్లో శిల్పుల సూక్ష్మ కళ కట్టిపడేస్తుంది. ఆలయ పరిసరాల్లో శాసనాలు ఏవీ లభించకపోయినా మహిషాసురమర్ధిని ఆలయ శిలలపై ఉన్న పంక్తులతో 'త్రైలోక్యాదిత్య ధర్మదిత'అని గతంలోనే ప్రముఖ రచయిత కపిలవాయి లింగమూర్తి తన పుస్తకంలో ప్రస్తావించారు.

గుప్తనిధుల మాటున ధ్వంసం

నల్లమలలోని పురాతనమైన నవ నారసింహ ఆలయంలో అడుగడుగునా గుప్త నిధుల కోసం దుండగుల వేట కొనసాగుతోంది. ఇప్పటికే ప్రధాన ఆలయంతో పాటు మండపంలోని ప్రతి మలు ధ్వంసం అయ్యాయి. కొన్ని విగ్రహాలను అపహరించుకుని వెళ్లారు. ఇప్పటికే తవ్వకాలతో ఆలయంలోని కొంత భాగం ధ్వంసమైంది. మారుమూల ప్రాంతంలో ఉన్న విశిష్టమైన ఆలయాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చారిత్రక ఆలయాన్ని అభివృద్ధి చేయాలి





“లక్ష్మాపూర్‌లోని నవ నారసింహ ఆలయం ఎంతో అపురూపమైనది. చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యం ఉంది. నవరూపాల్లో కొలువైన నారసింహుని విగ్రహాలు అరుదైనవి. వీటిని సంరక్షించడంతో పాటు ఆలయాన్ని అభివృద్ధి చేయాలి.

– కుమార్ శర్మ, అర్చకుడు, అమరేశ్వరాలయం, అమ్రాబాద్



ఆలయం ముందు ధ్వజస్తంభం స్థానంలో నారవేప వృక్షం





ప్రధాన ఆలయంలోని విగ్రహాలు, భైరవుడి విగ్రహం వద్ద గుప్తనిధుల తవ్వకాలు

క్లుప్తంగా...

'ఉపాధి కూలీ'ల వేతనాల వాటా పెంపు

సాక్షి, అమరావతి: గోకులం కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో వ్యక్తిగత పశువుల కొట్టాలు, గొర్రెలు షెడ్లను నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే. వీటికి అందజేసే ఆర్థిక సహాయంలో కొంత మొత్తాన్ని..కూలీలకు వేతనాల రూపంలో చెల్లించే విధంగా నిబంధనల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. 6 పశువుల కొట్టాల నిర్మాణానికి ఇప్పటివరకు రూ.1,93,229ను మెటీరియల్ కేటగిరీలో నేరుగా నగదు రూపంలో అందజేస్తుండగా.. కొత్త నిబంధనల్లో భాగంగా ఆ మొత్తంలో 46 పని దినాలకు రూ.13,371 మొత్తాన్ని ఆయా పనులకు హాజరయ్యే కూలీలకు వేతనాల రూపంలో చెల్లించనుంది. అలాగే, 50 గొర్రెలకు ఏర్పాటు చేసుకునే షెడ్డుకు ఇప్పటివరకు రూ.1,40,794 ఉపాధి మెటీరియల్ నిధుల నుంచి చెల్లిస్తుండగా, ఇక నుంచి 67 పనిదినాలకు రూ.20,205 మొత్తాన్ని కూలీలకు వేతనాల రూపంలో చెల్లించనున్నట్లు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

వైఎస్సార్‌సీపీ వారిమని కక్షగట్టి తొలగించారు

– విలేకరుల ముందు కన్నీళ్లు పెట్టుకున్న గొట్టిప్రోలు రేషన్ డీలర్

నాయుడుపేట టౌన్: తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గం, నాయుడుపేట మండల పరిధిలోని గొట్టిప్రోలు రేషన్ డీలర్‌ను అధికార పార్టీ నేతల ఒత్తిడితో తీసేశారని బాధితురాలు శానంపూడి విజయలక్ష్మి వాపోయింది. ఈ మేరకు ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తాను, తన భర్త వేమాల వెంకటరమణయ్య వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారమన్నారు. కక్ష పూరితంగా తన రేషన్‌షాపు డీలర్‌షిప్ తొలగించి అన్యాయం చేశారని వాపోయారు. గ్రామంలో ఎటువంటి వివాదాలు లేకుండా రేషన్ సరకులు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అధికార పార్టీ నేతల ఒత్తిడితో నిబంధనలకు విరుద్ధంగా తన రేషన్ డీలర్ షిప్‌ను అధికారులు తొలగించారన్నారు.

నాటు తుపాకీ మిస్ ఫైర్ అయ్యి గిరిజనుడి మృతి

రాపూరు: నాటు తుపాకీ మిస్‌ఫైర్ కావడంతో గిరిజనుడు మృతి చెందిన ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలం, పెనుబర్తి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు.. శనివారం రాత్రి పెనుబర్తి గ్రామానికి చెందిన తాళ్లసుధాకర్(27)శొంటిమణి, శివకుమార్ కలసి గ్రామ సమీపంలోని అడవిలోకి అడవి పందుల వేటకు వెళ్లారు. అక్కడ ఏం జరిగిందో కానీ శొంటి మణి చేతిలోని తుపాకీ పేలి సుధాకర్ కణత లోంచి తూటా దూసుకుపోయింది. అతన్ని ఇంటికి తీసుకువచ్చి ఆస్పత్రికి తీసుకువెళ్లకుండా ఇంట్లోనే ఉంచారు. ఆదివారం ఉదయం విషయం తెలుసుకున్న గ్రామస్తులు 108 వాహనంలో రాపూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరళించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



పద్మాపురం ఉద్యానవనంలో ఏర్పాటుచేసిన హాట్ ఎయిర్ బెలూన్

గగన విహారం

- అరకు అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు
- పద్మాపురం ఉద్యానవనంలోని హాట్ ఎయిర్ బెలూన్‌కు మంచి ఆదరణ

మెలికలు తిరిగే ఘాట్ రోడ్డు, ఎటుచూసినా ఎత్తయిన కొండలు, పచ్చని చెట్లు, రంగురంగుల పూల మొక్కలు. మంచు దుప్పట్లో ప్రకృతి అందాలు. ఇలా భూతల స్వర్గాన్ని తలపించే అరకు అందాలను ఆకాశ వీధిలోంచి వీక్షించేందుకు పాడేరు ఐటీడీఏ హాట్ ఎయిర్ బెలూన్‌ను అందుబాటులోకి తెచ్చింది. అరకు పద్మాపురం ఉద్యానవనంలో ఏర్పాటుచేసిన దీనిపై విహరించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. పది నిమిషాలు ఆకాశంలో విహరించేందుకు ఒకొక్కరి నుంచి రూ. 1500 వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు 244 మంది విహరించగా 3.66 లక్షల ఆదాయం వచ్చింది. దీనిని పాడేరు ఐటీడీఏ, ఈగల్ ప్లై కంపెనీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఇక్కడ రెండు హాట్ ఎయిర్ బెలూన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు అందుబాటులో ఉంటుంది. పారామెటార్లను కూడా కంపెనీ ప్రతినిధులు సిద్ధం చేశారు. ఇందుకుగాను గ్రౌండ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇది కూడా త్వరలోనే అందుబాటులోకి రానుంది. పాడేరు ప్రాంతానికి చెందిన కొంతమంది నిరుద్యోగులు ఢిల్లీలోని గురుగామ్‌లో హాట్ ఎయిర్ బెలూన్, పారా మోటార్ ఫ్లయింగ్‌లో శిక్షణ పొందారు. వీరంతా ఇక్కడ ఉపాధి పొందుతున్నారు.

- అరకులోయ టౌన్





మీ ఆర్డర్.. వచ్చిందండీ..

బ్యాగు నిండా పార్శిళ్లతో.. ఇప్పుడు ఎక్కడ చూసినా డెలివరీ బాయ్‌లే. పగలనక రేయనకా, ఎండనక వాననక కాళ్లకు చక్రాలు కట్టుకున్నట్లు బైక్‌లు, స్కూటర్లపై రయ్ రయ్ మంటూ ఉరుకులు పరుగులు పెడుతూ కనిపిస్తున్నారు. వస్తువులు, ఆహారాన్ని ఆర్డర్ పెట్టిన వారి చెంతకు చేరుస్తూ సేవలందిస్తున్నారు.

పెరిగిన ఆన్‌లైన్ బిజినెస్
ఈ కామర్స్ నుంచి ఫుడ్ వరకు ఆన్‌లైన్‌లోనే ఆర్డర్లు

- డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు పెరిగిన ఆదరణ
- జిల్లాలో ఏడు వేల మంది వరకు డెలివరీ బాయ్స్
- నెలకు రూ. 17 వేల నుంచి 20 వేలకు పైనే సంపాదన



కాలంతో పోటీపడుతూ

పార్శిల్ డెలివరీ చేస్తేనే డెలివరీ బాయ్స్‌కు కమీషన్ వస్తుంది. అందుకయ్యే బైక్ మెయింటినెన్స్, పెట్రోల్ ఖర్చులను వీరే భరించాలి. ట్రాఫిక్ ఉన్నా, గుంతల రోడ్డైనా కాలంతో పోటీ పడుతూ నిర్ణీత సమయానికి ఆర్డర్ కస్టమర్లకు డెలివరీ ఇవ్వడంలోనే ఆనందాన్ని వెతుక్కుంటారు. ట్రెస్‌లో ఉన్నా ఆర్డర్ చెంతకు చేరుస్తారు. ఒక్కోసారి తప్పుగా ఇచ్చిన అడ్రస్‌లు, ఫోన్ నెంబర్లతో ఆచూకీ తెలియక ఇబ్బందులు పడుతుంటారు. ఆర్డర్ పెట్టిన వస్తువులు సరిగా లేదనో, చెప్పిన సమయానికి రాలేదనో కస్టమర్ల చీత్కారాలకు చిరునవ్వుతో బదులిస్తూనే సాగిపోతుంటారు.



సాక్షి, భీమవరం: ఇటీవల కాలంలో ఆన్‌లైన్ బిజినెస్ పెరిగింది. ఫ్యాన్సీ, ఎలక్ట్రికల్, క్లాత్, రెడీమేడ్, టూల్స్, హోమ్ నీడ్స్, మెడికల్, కిరాణా, ఫర్నీచర్ తదితర వివిధ రకాల వస్తువుల నుంచి ఫుడ్ ఐటమ్స్ వరకు అన్నీ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అందుకు తగ్గట్టుగానే వస్తువులను డోర్ డెలివరీ సేవలందించే ఈ కార్ట్, డెలివరీ, అమెజాన్, షాడోఫెక్స్, ఈ.కామ్ ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బీస్, బ్లూడార్ట్, వాల్మో తదితర ఈ-కామర్స్ సంస్థలు తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఈ-కార్ట్ బ్రాంచీలు మూడు వరకు ఉన్నాయి. తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, భీమవరం, నరసాపురం, ఆకివీడు తదితర పట్టణాలతో పాటు పలు మండల కేంద్రాల్లోను తమ బ్రాంచ్‌లు ఏర్పాటుచేశాయి. జిల్లా వ్యాప్తంగా ఆయా సంస్థలకు చెందిన బ్రాంచ్‌లు 80కు పైనే ఉన్నాయి.

డెలివరీ బాయ్స్‌కు డిమాండ్

ఆన్‌లైన్ ఆర్డర్లు పెరగడంతో డెలివరీ బాయ్స్‌కు డిమాండ్ ఏర్పడింది. పార్శిళ్లపై గతంలో అంతంత మాత్రంగా ఉండే కమీషన్‌ను ఇటీవల ఏజెన్సీలు పెంచాయి. ప్రస్తుతం లోకల్, లాంగ్ రూట్‌ను బట్టి ఒక్కో పార్శిల్ డెలివరీపై రూ.14 నుంచి రూ.20 వరకు కమీషన్ ఇస్తున్నాయి. వారం వారం పేమెంట్లు చేస్తున్నాయి. నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదించుకోవచ్చునంటూ విస్తృతంగా ప్రచారం చేస్తూ నిరుద్యోగ యువతను ఆకర్షిస్తున్నాయి. డెలివరీ బాయ్స్‌కు బైక్, డ్రైవింగ్ లైసెన్స్, స్మార్ట్ ఫోన్ తప్పనిసరి. ఒక్క భీమవరంలోనే 500 మందికిపైగా డెలివరీ బాయ్స్/ఏజెంట్లుగా సేవలు అందిస్తూ ఉపాధి పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు వేలకు పైగా డెలివరీ బాయ్స్ ఉంటారని అంచనా. అధిక శాతం మంది ఫుల్ టైమ్ వర్కర్స్‌గా పనిచేస్తున్నారు. 5 శాతం వరకు మహిళలు కూడా డెలివరీ సర్వీస్ చేస్తున్నారు. రోజుకు 40 నుంచి 60 వరకు పార్శిళ్లు డెలివరీ చేయడం ద్వారా నెలకు 15 వేల నుంచి రూ. 20 వేలకు పైగా ఆర్జిస్తున్నారు.

ఫుడ్ డెలివరీ యాప్‌లతో పార్ట్‌టైం అవకాశాలు

ఒకప్పటిలా రెస్టారెంట్‌కు వెళ్లి తినడం, పార్శిల్ తెచ్చుకోవడమంటే ఇప్పుడు చాలా మంది పెద్ద పనిగా ఫీల్ అయిపోతున్నారు. మొబైల్‌లోని జొమాటో, స్విగ్గీ తదితర ఫుడ్ డెలివరీ యాప్‌పై ఒక క్లిక్ ద్వారా తమకు ఇష్టమైన రెస్టారెంట్ నుంచి ఇష్టమైన ఫుడ్ ఆర్డర్ చేసుకుంటున్నారు. దీంతో ఫుడ్ డెలివరీ సంస్థల సేవలు మారుమూల ప్రాంతాలకు విస్తరించాయి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి నిర్ణీత వేళల్లో ఫుడ్ ఆర్డర్లు ఉండటం వల్ల వీటిలో పార్ట్‌టైం జాబ్ అవకాశాలు ఉంటున్నాయి. ఆయా సమయాల్లో మూడు నాలుగు గంటల పాటు డోర్ డెలివరీ సర్వీస్ చేస్తూ ఆదాయం పొందుతున్నారు. పాకెట్ మనీగా పనికొస్తాయని విద్యార్థులు, డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ను స్ఫూర్తిగా తీసుకుని డిగ్రీ, పైచదువులు చదివిన వారు సైతం డెలివరీ బాయ్స్‌గా చేస్తున్నారు. ఈ ఫుడ్ డెలివరీ యాప్‌లలో పని చేస్తున్న వారు మూడు వేల వరకు ఉండగా అధికశాతం మంది నిరుద్యోగ యువత, విద్యార్థులు ఉంటున్నారు. రోజుకు రూ. 500 నుంచి రూ.700 వరకు ఆర్జిస్తున్నారు.

ఇన్‌టైంలో అందిస్తేనే..



రెండు నెలల నుంచి డెలివరీ బాయ్‌గా చేస్తున్నాను. రోజుకు 40 నుంచి 50 వరకు పార్శిళ్లు డెలివరీ చేస్తుంటాను. ఇన్‌టైంలో ఆర్డర్ పెట్టిన వారికి పార్శిల్ డెలివరి చేయాలన్నదే మా టార్గెట్. అది రీచ్ అయితేనే ఆనందంగా ఉంటుంది.

– బి.అశోక్ కుమార్, వీరవాసరం

ఉరుకుల పరుగుల జీవితం



మూడేళ్ల నుంచి డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాను. ఆర్డర్‌లో సూచించిన సమయానికి పార్శిల్ డెలివరీ చేయాలి. అందుకనే ఎండైనా వానైనా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఉరుకులు పరుగులు పెడుతూ పార్శిల్స్ అందజేస్తుంటాం.

– ఎం.సునీల్ కుమార్, డెలివరీ బాయ్, భీమవరం

ఇబ్బందులు ఉంటాయి



డెలివరీ చేసే సమయంలో ఆర్డర్ పెట్టిన వారు ఫోన్ నంబర్, అడ్రస్ సరిగా ఇవ్వకపోవడం వల్ల ఒక్కోసారి ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆర్డర్ డెలివరీ చేస్తేనే మాకు కమిషన్ వస్తుంది. లేకపోతే ఎంత తిరిగినా ఫలితం లేక నష్టపోతాం.

– పి.రమేష్, డెలివరీ బాయ్, పెన్నాడ



నాగార్జునసాగర్ ప్రాజెక్టు



శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ

తెలుగువారి జీవధారకు 69 వసంతాలు

70 వ ఏడాదిలోకి ప్రవేశిస్తున్న నాగార్జున సాగర్ ప్రాజెక్ట్

ప్రజా సౌభాగ్య మందిరానికి శంకుస్థాపన చేస్తున్నానని చెప్పిన నెహ్రూ

విజయపురిసౌత్: నాటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి రేపటితో 69 ఏళ్లు నిండుతాయి. ఆనాడు నెహ్రూ కన్న కలలను నిజం చేస్తూ కోట్లాది మంది ప్రజలకు జీవనాధారంగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అన్నపూర్ణగా ఆధునిక దేవాలయంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు విరాజిల్లుతోంది. 1955 డిసెంబర్ 10న ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనాడు నాగార్జున సాగరానికి నేనిక్కడ జరిపే శంకుస్థాపనను పవిత్రకార్యంగా పరిగణిస్తున్నాను. ఇది భారత ప్రజాసౌభాగ్య మందిరానికి జరుగుతున్న శంకుస్థాపన. ఈనాడు మనం ఆసేతుహిమాచల పర్యంతం నిర్మించుకుంటున్న నవదేవాలయాలకు ఇది చిహ్నం' అని అన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో పూర్తిస్థాయిలో మానవశక్తితో నిర్మితమైన ప్రాజెక్టు నాగార్జునసాగర్. సాగునీటి కోసం కుడి, ఎడమ కాలువలను నిర్మించారు. కుడికాలువను జవహర్ కాలువగా, ఎడమకాలువను లాల్‌బహదూర్ కాలువగా పిలుస్తారు. జవహర్ కాలువ సాగర్ రిజర్వాయర్ నుంచి ఆనకట్టకు కుడివైపు నుంచి ప్రారంభమవుతుంది. ఈ కాలువ పనులను అప్పటి ఆంధ్రరాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 1956 అక్టోబర్ 10న ప్రారంభించారు. దక్షిణ విజయపురి (రైట్‌బ్యాంకు) వద్ద ఈ కాలువ సొరంగ మార్గం ద్వారా ప్రారంభమై 392 కిలో మీటర్లు ప్రయాణిస్తుంది. ఈ కాలువ ద్వారా గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 11లక్షల 74వేల 874 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. 132 టీఎంసీల నీటిని కేటాయించారు. రిజర్వాయర్ ఎడమవైపు నుంచి ప్రారంభమయ్యే కాలువకే లాల్‌బహదూర్ కెనాల్ అని పేరు. ఈ కాలువ పొట్టిచెలమ నుంచి చలకుర్తి వరకు సొరంగ మార్గం ద్వారా ప్రయాణిస్తుంది. ఈ కాలువ నిర్మాణాన్ని ఆనాటి గవర్నర్ భీమ్‌సేన్ సచార్ 1959లో ప్రారంభించారు. ఈ కాలువ పొడవు 349కిలోమీటర్లు. ఈ కాలువ కింద 10 లక్షల 37వేల 796 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించారు. 132 టీఎంసీల నీటిని కేటాయించారు. రిజర్వాయర్ నీటిమట్టం 489 అడుగుల పైన ఉన్నప్పుడు కుడికాలువలాగే ఈ కాలువకు కూడా నీటిని విడుదల చేయవచ్చు. సాగర్ ప్రాజెక్టు ఒకసారి నిండితే ప్రభుత్వానికి 20 వేల కోట్ల రూపాయలకు పైచిలుకు ఆదాయం వస్తుందని అంచనా. 1967 ఆగస్టు 4న నాటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాలువలకు నీటిని వదిలారు.

సాగర్ జలాశయం విస్తీర్ణం, 110 చదరపు మైళ్లు

గరిష్ట నీటిమట్టం	డెడ్ స్టోరేజ్ లెవల్
590 అడుగులు	490 అడుగులు
నీటి నిల్వ 408.24 టీఎంసీలు (ప్రస్తుతం పూడిక నిండటంతో 312.0. టీఎంసీలు)	
డెడ్‌స్టోరేజీనీరు 179.16 టీఎంసీలు (ప్రస్తుతం పూడిక నిండటంతో 168 టీఎంసీలు)	నీటివిడుదలకు కనీస నీటిమట్టం 510 అడుగులు

పాఠశాల సమీపంలో మద్యం షాపు తీసేయండి

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో వైఎస్సార్‌సీపీ మహిళా జెడ్పీటీసీ ఆందోళన

కర్నూలు(అర్బన్): నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర వసతి గృహం సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం షాపు వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని నందికొట్కూరు వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ షేక్ కరీమున్నీసా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ హైస్కూల్ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు ఇటీవల మద్యం సేవించి స్కూల్‌కు వచ్చిన విషయాన్ని సంబంధిత స్కూల్ ప్రధానోపాధ్యాయుడు గుర్తించారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బడి, గుడికి సమీపంలో మద్యం షాపులను ఏర్పాటు చేయరాదని ఉన్నా, ఇక్కడ ఏర్పాటు చేశారన్నారు. మహిళా జెడ్పీటీసీ మాట్లాడుతున్న సమయంలో నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అడ్డుతగలడంతో కొంత వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలోనే కోసిగి మహిళా జెడ్పీటీసీ పవిత్రాపాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపులను ఏర్పాటు చేయడం వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా కలెక్టర్ జీ రాజకుమారి గణియా జోక్యం చేసుకుని స్కూల్, బాలుర వసతి గృహానికి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపు ఏర్పాటు చేసి ఉంటే విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తిరుపతి ఐఐటీ వేదికగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే

రేణిగుంట(ఏర్పేడు): స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024 గ్రాండ్ ఫినాలేను తిరుపతి ఐఐటీలో ఈనెల 11, 12వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. దేశంలో ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతికి నాయకత్వం వహించడానికి విద్యా మంత్రిత్వ శాఖ గుర్తించిన 51 నోడల్ కేంద్రాల్లో ఒకటైన తిరుపతి ఐఐటీ ప్రాంగణంలోని ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గ్రాండ్ ఫినాలే పోటీలు జరగనున్నట్లు ఆయన వివరించారు. హ్యాకథాన్ 22 ఎలైట్ టీమ్‌లతో, దేశవ్యాప్తంగా ఉన్న ఆరుగురు ప్రతిభావంతులైన కళాశాల విద్యార్థులతో పోటీలు జరగనున్నాయన్నారు. వీరు ఆయుష్ మంత్రిత్వ శాఖ ఇచ్చిన నాలుగు క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలు రూపొందించడంలో పోటీపడతారన్నారు. ప్రతి సమస్యకు సంబంధించి విజేతకు భారత ప్రభుత్వం నగదు బహుమతితో సత్కరిస్తుందని, యువతలో పరిశోధనల పట్ల ఆసక్తిని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు.

రవి అస్తమించినా విశ్రమించం



మట్టిగడ్డపై చెమటచుక్క చిందిస్తే ఊపిరిపోసుకున్న వరిగింజ మొలకై, చేనై, నిండు కంకయ్యి పైరు గాలికి తలూపుతూ బాసలు చెబుతుంటే గట్టుపై నిల్చుని శ్రద్ధగా వినే రైతులు ఆ పంటను ఇంటికి చేర్చే సమయంలో పగలూ రాత్రి మరచిపోతారు. కోడికూత తోనే కళ్లానికి చేరి సూర్యుడు అస్తమించినా విశ్రమించరు. అనంతపురం శివారులో చీకట్లు ముసురుకుంటున్నా వడ్లు తూర్పారపడుతున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

- సాక్షి, ఫొటోగ్రాఫర్, అనంతపురం

'పారా' హుషార్..



- సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సుందర విశాఖ తీరాన పర్యాటకులకు మరో సందడి అందుబాటులోకి వచ్చింది. రుషికొండ బీచ్‌లో ఆదివారం నుంచి పారామోటర్ గ్లైడింగ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. అలలకు పైన అలా అలా తేలిపోతూ సాగర అందాలను, నగర సౌందర్యాన్ని తిలకిస్తూ పర్యాటకులు మైమరచిపోతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులు దీనిపై ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు.

కూటి కోసం.. కూలి కోసం



కూటి కోసం కూలి కోసం పట్టణంలో బతుకుదామని తరలివచ్చిన ఓ వలస జీవి.. ఇలా నెత్తిన తట్టా పారా పెట్టుకుని గమ్యం వైపు వడివడిగా అడుగులేసుకుపోతోంది. నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లాలంటే నాలుగు రాళ్లు మోయాల్సిందే అని నమ్మిన కర్మయోగి. ఆదివారం ఉదయం నెల్లూరు నగరంలో పనిలోకి వెళ్తున్న ఈ భవన నిర్మాణ కార్మికురాలిని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

- సాక్షి, ఫొటోగ్రాఫర్, నెల్లూరు



సంక్రాంతి వస్తోంది!

వేడుకలు చూద్దాం... రండి!

సంక్రాంతి పండుగ వస్తోందంటే గ్రామాలకు ప్రయాణం మొదలవుతుంది. సొంతూరికి వెళ్లే వాళ్ల ఆనందం అన్నింటికంటే మిన్న. అలాగే హైదరాబాద్‌వాసులు శిల్పారామంలో నిర్వహించే వేడుకలతో ఆనందిస్తారు. గాలిపటాలతో గాల్లో తేలినట్లు సంతోషిస్తారు. ఇది మన తెలుగు సంక్రాంతి. ఇక తమిళులు సంక్రాంతిని దేశానికే తలమానికం అన్నట్లు నిర్వహించుకుంటారు. కళారంగం ఉత్సాహంతో ఉరకలేస్తుంది. దేశంలో ఎక్కడెక్కడో స్థిరపడిన వాళ్లంతా సొంత రాష్ట్రానికి వస్తారు. మైలాపోర్ వేడుకల్లో పాల్గొని సంతోషాన్ని మది నిండా నింపుకుని తిరిగి వెళ్తారు.



మైలాపోర్ వేడుకలు

తెలుగువాళ్లలాగే తమిళనాడుకి సంక్రాంతి పెద్ద పండుగ. సంక్రాంతికి నెల రోజుల ముందు నుంచి వేడుకల వాతావరణం నెలకొంటుంది. ఆ రాష్ట్ర రాజధాని చెన్నైలో ఏటా ఆర్ట్ ఫెస్టివల్ జరుగుతుంది. మైలాపోర్‌లో జరుగుతుంది కాబట్టి దీనికి మైలాపోర్ ఫెస్టివల్ అనే పేరు వ్యవహారంలోకి వచ్చింది. ఏటా సంక్రాంతి ముందు జరిగే ఈ వేడుక వచ్చే ఏడాది జనవరి తొమ్మిది నుంచి పన్నెండవ తేదీ వరకు జరుగుతాయి. గడచిన 72 ఏళ్లుగా జరుగుతున్న ఈ వేడుకల్లో 30కి పైగా కళలను ప్రదర్శిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మూడు వందలకు పైగా కళాకారులు పాల్గొంటారు. నాట్యప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలు, సాము గారడీ నుంచి జానపద కళారూపాల ప్రదర్శనలతో నగరం కళకళలాడుతుంది. అన్నింటిలోకి ముగ్గుల పోటీ ప్రత్యేకం. ముగ్గును కోలామ్ అంటారు. ఇందులో మహిళలతోపాటుబాలికలు కూడా ఉత్సాహంగా పాల్గొంటారు.



ఇంకా ఏమేమి ఉంటాయి?

ప్రాచీన కపాలి ఆలయానికి హెరిటేజ్ వాక్, తెప్పోత్సవం, మాడవీథుల్లో పర్యటనలు ఆహ్లాదకరంగా ఉంటాయి. సైక్లింగ్ టూర్‌లో టీనేజ్ నుంచి యువకులు ఉత్సాహంగా కనిపిస్తారు. బోట్ షికార్, ఫుడ్ వాక్, చిల్డ్రన్ టూర్... ఇలా థీమ్ ప్రకారం వేడుకలు సాగుతాయి. సంక్రాంతి సెలవుల్లో ఈ మైలాపోర్ ఫెస్టివల్ టూర్ ప్లాన్ చేసుకోవచ్చు.





హాలేబీడు ఉలి చెక్కిన గ్రంథం



హాలేబీడు ఈ ప్రదేశాన్ని ఒకటిగా పలకడం పర్యాటకరంగానికి అలవాటు ఉండదు. బేలూరు- హాలేబీడు అని పలుకుతారు. ఈ రెండు ప్రదేశాల మధ్య దూరం 17కిలోమీటర్లు. ఈ రెండు ప్రదేశాల్లోని నిర్మాణాలు ఒకేరీతిలో ఉంటాయి. ఒకే రాజవంశానికి చెందిన కట్టడాలు. హొయసల రాజవంశం దక్షిణ భారతదేశాన్ని దాదాపు 200 ఏళ్లు పాలించింది. యుద్ధాలు లేని ప్రశాంత సమయంలో ఈ నిర్మాణాలన్నీ జరిగాయి. హొయసలుల ఆలయాలన్నీ మహాభారతం, రామాయణం, భాగవత గ్రంథాలకు శిల్పరూపాలు. వేదవ్యాసుడు, వాల్మీకి రాసిన గ్రంథాలను శిలల్లో ఆకర్షణీయంగా చెక్కిన శిల్పులు కూడా అంతటి మహోన్నతులే అని చేతులెత్తి దండం పెట్టాలనిపిస్తుంది. పదకొండవ శతాబ్దంలో ఈ స్థాయిలో విరాజిల్లిన ప్రదేశం ఆ తర్వాత రాజకీయ సంక్లిష్టతల దుష్ప్రభావాన్ని ఎదుర్కొన్నది. ఇప్పుడు కనిపిస్తున్నది 14 శతాబ్దంలో అల్లాఉద్దీన్ ఖిల్జీ, మహమ్మద్ తుగ్లక్‌ల దాడిలో విధ్వంసం అయిన తర్వాత మిగిలిన రూపాలే. ఆ విగ్రహాలకు పూర్వవైభవం తీసుకురావడానికి ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ మెరుగులు దిద్దుతోంది.

కళకు శిలాసాక్ష్యాలు

హొయసల రాజవంశం కళాభిరుచికి ప్రతీకలు ఆలయాలు. వీటిని హొయసల టెంపుల్స్‌గా వ్యవహరిస్తారు. హాలేబీడులో హొయసలేశ్వర ఆలయంతోపాటు కేదారేశ్వరాలయం, జైన్ ఆలయాలు ప్రసిద్ధం. హొయసలుల ఆలయ నిర్మాణం ప్రత్యేకంగా ఉంటుంది. బేస్‌మెంట్ నక్షత్రం ఆకారంలో ఉంటుంది. హొయసలేశ్వర ఆలయం ట్విన్ టెంపుల్. శైవంతోపాటు వైష్ణం, శాక్తేయంతోపాటు వేదాలన్నింటికీ ప్రతిరూపం. దేవతల విగ్రహాలు, మునుల విగ్రహాలతో పాటు ఏనుగులు, సింహాలు, గుర్రాలు, పూలతీగలు అడవిలో చెట్టును అల్లుకున్నట్లు రాతిలో సజీవ రూపంలో ఉంటాయి. ఈ నిర్మాణాల్లో రాణి కేతలాదేవి చొరవ ప్రశంసనీయం. ఇక జైన ఆలయాల్లో పార్శ్వనాథుడు, శాంతినాథ, ఆదినాథ ఆలయాలున్నాయి. హొయసలేశ్వర ఆలయం ఆవరణలో బాహుబలి ప్రతిరూపాన్ని కూడా చూడవచ్చు. అసలు బాహుబలి (గోమతేశ్వరుడు) విగ్రహం శ్రావణ బెళగొళలోని వింధ్యగిరి కొండల్లో ఉంది.



మెట్లబావి కూడా ఉంది

బెంగళూరు నుంచి 200 కిమీల దూరంలో ఉంది హాలేబీడు. ఈ టూర్‌లో బేలూరులోని చెన్నకేశవాలయాన్ని కూడా కవర్ చేయవచ్చు. హాలేబీడుకు కిలోమీటరు దూరంలో హులికెరె అనే గ్రామంలో స్టెప్‌వెల్ ఉంది. రాణీకీవావ్, అదాలజ్ వావ్ వంటి గొప్ప స్టెప్‌వెల్స్‌కి గుజరాత్ ప్రసిద్ధి. ఢిల్లీలో కూడా అగ్రసేన్ కీ బావోలీ ఉంది. ఐదేళ్ల కిందట తెలంగాణ జిల్లాల్లో కూడా స్టెప్‌వెల్‌లు బయటపడ్డాయి. కర్నాటకలో మెట్లబావుల సంస్కృతి తక్కువే. కానీ చూడాల్సిన ప్రదేశం. నిర్మాణ శైలిలో ఒక ప్రాంతానికి మరొక ప్రాంతానికీ ఉన్న తేడాలను అర్థం చేసుకోవాలంటే చూసి తీరాలి. టూర్ ఆపరేటర్‌లను ముందుగా అడిగి ఇవన్నీ కవర్ చేసేలా మాట్లాడుకోవాలి.

ఆభరణాల నంది



టెంపుల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన మ్యూజియంలో 15వందలకు పైగా శిల్పాలు, ఇతర కళారూపాలున్నాయి. నంది విగ్రహం ధరించిన ఆభరణాలను నిశితంగా పరిశీలించడానికి కనీసం పది నిమిషాల సమయం పడుతుంది. సాధారణంగా శివాలయాల్లో శిల్ప సౌందర్యానికి అద్దం పట్టేది నంది విగ్రహమే. ఆంధ్రప్రదేశ్‌లోని లేపాక్షి, తెలంగాణలోని రామప్ప ఆలయాల్లో కూడా నంది విగ్రహాలు ప్రత్యేకంగా చెప్పుకోవాల్సినంత గొప్పగా ఉంటాయి. శిల్పులు తమ నైపుణ్యాన్ని శివలింగాన్ని చెక్కడంలో వ్యక్తం చేయడానికి ఏమీ ఉండదు. అందుకే నంది విగ్రహం, ఆ విగ్రహానికి ఆభరణాల కోసం ఉలికి పని చెప్తారు. దాంతో ఆ శిల్పి చాతుర్యం అంతా నందిలో కనిపిస్తుంది.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

కళ

స్క్రాప్ నుంచి అద్భుతమైన సృష్టి



ఇండోర్‌లోని దేవల్ వర్మ స్క్రాప్ మెటల్‌ను గ్లోబల్ ఆర్ట్‌గా మార్చాడు. సస్టెనబిలిటీని సాధించాడు. చిన్నతనంలో స్క్రాప్ మెటల్‌తో మినియేచర్ మోడల్‌లను తయారు చేయడం నుండి అద్భుతమైన గ్లోబల్ ఆర్ట్‌ను రూపొందించడం వరకు, దేవల్ వర్మ తన అప్‌సైకిల్ మాస్టర్‌పీస్‌తో సృజనాత్మకత, సుస్థిరతను చాటుతూ చాంపియన్‌గా నిలిచాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌వాసి అయిన దేవల్ వర్మ ప్రపంచ వ్యాప్తంగా స్క్రాప్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందుతున్నాడు.

ప్రముఖ టీవీ షో 'మ్యాడ్' హోస్ట్ హరున్ రాబర్ట్ నుండి ప్రేరణ పొందిన దేవల్ వర్మ కార్లు, మోటార్ సైకిళ్ల సూక్ష్మ నమూనాలను రూపొందించడానికి వ్యర్థ పదార్థాలతో ప్రయోగాలు చేయడం ప్రారంభించాడు. ఈ ఆసక్తి అతనిని జీవితాన్ని మార్చే ప్రయాణం వైపు నడిపిస్తుందని అతనికీ తెలియదు.


దేవల్ వర్మ

స్కూల్ ఏజ్ నుంచి

చిన్నతనంలో దేవల్ వారాంతాల్లో తన ఇల్లు, స్కూల్ చుట్టుపక్కల దొరికే స్క్రాప్‌లను సేకరించి, వాటితో కొన్ని వస్తువులను రూపొందించేవాడు. ఈ కళ అతను కాలేజీకి చేరుకునే సమయానికి ట్రాన్స్‌ఫార్మర్స్ వంటి సైన్స్ ఫిక్షన్ సినిమాల నుంచి ప్రేరణ పొంది స్క్రాప్ మెటల్‌తో క్లిష్టమైన నమూనాలను తయారు చేస్తున్నాడు.

మలుపు తిరిగిన సృజన

దేవల్ మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు, అతని నైపుణ్యాలు స్థానిక గ్యారేజీలు, ఆటోమోటివ్ ఫ్యాక్టరీల దృష్టిని ఆకర్షించాయి. అది అతనికి మెటల్ స్క్రాప్‌లను సరఫరా చేయడం ప్రారంభించింది. హార్లే డేవిడ్సన్ అధికారిక లోగో స్క్రాప్ ఇన్‌స్టాలేషన్ అతని అత్యంత ముఖ్యమైన సృష్టిలలో ఒకటి. ఇది వారి షోరూమ్ కోసం ప్రత్యేకంగా రూపొందించబడింది. అతను ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన తర్వాత దేవల్ సృజనాత్మక ప్రయాణం కీలక మలుపు తిరిగింది. అతని తల్లిదండ్రుల నుండి మొదట్లో అభ్యంతరాలు ఉన్నప్పటికీ, అతను తన హార్ట్‌లో ఉన్న జిజ్ఞాసనే అమలు పరిచాడు. పూణేలోని ఎమ్‌ఐటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో ప్రొడక్ట్ డిజైన్‌లో కోర్సు పూర్తి చేశాడు. దేవల్ ఈ కళను కొనసాగించడానికి ఇష్టం చూపుతుండటంతో ఇది అతని కెరీర్‌లో ఒక గొప్ప లక్షణంగా మారింది. ఇటీవల దుబాయ్‌లో అతని మొదటి ప్రదర్శన జరిగింది. అందులో మెటల్ స్క్రాప్‌తో రూపొందించిన రెండు గిటార్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. మెటల్ ఆర్టిస్ట్‌గా ఇప్పుడు అతని వృత్తిపరమైన ప్రయాణం అధికారికంగా ప్రారంభమైంది.



పట్టుదల, సలహాదారుల మద్దతు ద్వారా దేవల్ కళా ప్రపంచంలో గుర్తింపు పొందాడు. మినీ-రోబోట్ ప్లాంటర్‌ల వంటి క్రియాత్మక భాగాల నుండి విస్తృతమైన శిల్పాల వరకు అతని రచనలు భారతదేశం అంతటా, అంతర్జాతీయంగా ఎంతో మందిని ఆకర్షించాయి. సింగపూర్, ఇటలీ, యునైటెడ్ స్టేట్స్ నుండి కొనుగోలుదారులు అతని క్రియేటివిటీకి సలామ్ అంటున్నారు.

నృత్యం

ఎనిమిది శాస్త్రీయ నృత్య రూపాలు ఒకేసారి



ఎవరైనా ఒకటో రెండో శాస్త్రీయ నృత్య కళలను ప్రదర్శించడం చూస్తుంటాం. వారి కళకు అభివాదం తెలియజేస్తుంటాం. కేరళలోని ఇరింజలకుడ కు చెందిన అనఘశ్రీ సజీవనాథ్ భారతీయ శాస్త్రీయ నృత్య కళారూపాలైన కథాకళి, కూచిపూడి, సత్రియా, మణిపురి, ఒడిస్సీ, మోహినియాట్టం, భరతనాట్యం, కథక్‌లను ఒక గంటా 30 నిమిషాల్లో ప్రదర్శించి, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్‌ను నెలకొల్పారు. అన్ని భారతీయ శాస్త్రీయ నృత్య రూపాలను అత్యధిక కాలం పాటు ప్రదర్శించి, రికార్డు సాధించిన ఘనత అనఘశ్రీ సొంతం చేసుకుంది. 27 ఏళ్ల అనఘ చిన్ననాటి నుంచే శాస్త్రీయ నృత్య సాధనలో తనైదన మార్క్ చూపిస్తూ ఉండేది. తమ స్థానిక కళ మోహినియాట్టం నేర్చుకోవడంలో చూపే ఆసక్తి, ఆ తర్వాత తర్వాత ఇతర నృత్య సాధనలవైపు మళ్లేలా చేసిందని చెబుతుంది అనఘ.

వారసత్వం

తరం నుంచి తరానికి దేశానికో సంస్కృతి

ప్రాంతాలు, జాతుల వారీగా తరతరాలుగా వస్తున్న ఆచారాలను ఎప్పటికీ వదులుకోలేరు. దేశ దేశాల్లో వేల ఏళ్లుగా వస్తున్న సంస్కృతిలో వారి మనుగడ కూడా ఉండటం విశేషం. తమ ఆచారాలను ముందు తరాలకూ పరిచయం చేస్తూతమ కమ్యూనిటీ సంప్రదాయాన్ని బతికించుకుంటున్నారు. ఈ సంప్రదాయాలన్నీ యునెస్కో వారసత్వ సంపదలోకి చేరి, ఆ దేశాల గొప్పతనాన్ని చాటుతున్నాయి.



సౌదీ అరేబియాలోని తైఫ్ ప్రాంతంలో గులాబీ తోటలను విరివిగా సాగు చేస్తారు. ఇక్కడి సామాజిక, మతపరమైన ఆచారాలలో అంతర్భాగంగానూ, ముఖ్యమైన ఆదాయ వనరగానూ ఉంటుంది. మార్చిలో ప్రారంభమయ్యే పంట కాలంలో రైతులు, వారి కుటుంబాలు తెల్లవారుజామున గులాబీలను ఎంచుకొని స్థానిక మార్కెట్‌కు విక్రయించడానికి వెళతారు. కొన్ని కమ్యూనిటీలు ఈ గులాబీలతో సౌందర్య ఉత్పత్తులు, సాంప్రదాయ ఔషధం, ఆహారం, పానీయాలలో రోజ్ వాటర్, నూనెను తయారుచేస్తాయి.

జపాన్‌లో కోజి అచ్చుతో సాకే తయారీ

జపాన్‌లో పవిత్రమైన బహుమతిగా భావించే పానీయం ఒకటుంది. దానిపేరు సాకే. గింజలు, నీటితో తయారు చేసే ఆ ఆల్కహాలిక్ పానీయం జపాన్‌లో పండుగలు, వివాహాలు, ఆచారాలు, ఇతర సామాజిక సాంస్కృతిక సందర్భాలలో తప్పనిసరిగా ఉపయోగిస్తారు. జపనీస్ సంస్కృతిలో భాగమైపోయిన ఈ పానీయం పిండి పదార్థాలను చక్కెరగా మార్చడానికి కోజి అచ్చును ఉపయోగిస్తారు. ఈ అచ్చును హస్తకళాకారులు తయారు చేస్తారు. వీటిలో పదార్థం దీనికి అవసరమైన ఉష్ణోగ్రత అందేలా జాగ్రత్తలు తీసుకుంటారు.



సిరియాలోని అలెప్పో ఘర్ సబ్బు కళ

ఆలివ్ నూనె, లారెల్ ఆయిల్‌ను ఉపయోగించి సిరియాలో సబ్బు తయారుచేస్తారు. కొంతమంది కలిసి చేసే ప్రక్రియలో తరతరాల అనుభవం ఉంటుంది. ముందుగా పదార్థాలను ఎంపిక చేసి వండుతారు. ఆపై సంప్రదాయ సబ్బు మిశ్రమాన్ని కలిపి, మిద్దెల పైన పోస్తారు. మిశ్రమం చల్లబడిన తర్వాత హస్తకళాకారులు పెద్ద చెక్క బూట్లు ధరించి, తగిన పరిమాణంలో కత్తిరిస్తారు. ఆ తర్వాత ఆ సబ్బులను చేతితో స్టాంప్ చేసి, వరుసగా పేర్చుతారు.



ఉత్తర ఆఫ్రికా హెన్నా ఆచారాలు

ఉత్తర ఆఫ్రికా, మధ్యప్రాచ్యంలోని కమ్యూనిటీలు గోరింటాకు తోటలను సాగుచేస్తారు. హెన్నా పేస్ట్‌ను సాధారణంగా మహిళల అలంకారానికి ఉపయోగిస్తారు. ఇది ఆనందానికి చిహ్నం, దైనందిన జీవితంలో, పుట్టినరోజులు, వివాహాల వంటి పండుగ సందర్భాలలో ఉపయోగించబడుతుంది. దీని ఉపయోగం శతాబ్దాల నాటి సామాజిక నియమాలు, సంప్రదాయాలతో ముడిపడి ఉంది.



థాయిలాండ్ టోమ్యుమ్ కుంగ్ సూప్

టోమ్యుమ్ కుంగ్ అనేది థాయిలాండ్‌లో ఒక సంప్రదాయ రొయ్యల సూప్. మూలికలతో ఉడకబెట్టి, స్థానిక మసాలా దినుసులను కలిపి ఈ రొయ్యల సూప్‌ను రుచిగా తయారుచేస్తారు. సూప్ ఒక విలక్షణమైన వాసన, శక్తివంతమైన రంగులను కలిగి ఉంటుంది. తీపి, పులుపు, కారం, క్రీము, కొద్దిగా చేదు వంటి అనేక రుచులను మిళితం చేస్తుంది. ఈ వంటకం ముఖ్యంగా వర్షాకాలంలో శక్తిని, ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుందని నమ్ముతారు. ఇది థాయిలాండ్‌లోని సెంట్రల్ ప్లెయిన్స్‌లోని బౌద్ధ నదీతీర సమాజాల పాక జ్ఞానం, పర్యావరణం, ఔషధ మూలికల గురించి వారి సాంప్రదాయ జ్ఞానాన్ని కలిగి ఉంటుంది.



గుడ్లను అలంకరించే కళ

ఉక్రెయిన్, ఎస్టోనియాలో మైనాన్ని ఉపయోగించి గుడ్లకు సాంప్రదాయ నమూనాలు, చిహ్నాలను తీసుకువస్తారు. గుడ్లను అలంకరించే ఈ కళ ఈస్టర్‌తో అనుబంధం ఉన్నట్టుగా అనిపిస్తుంది. కానీ, మతంతో సంబంధం లేకుండా ఉక్రేనియన్ కమ్యూనిటీలకు ఈ సంప్రదాయాన్ని పాటిస్తుంటారు.



ఉన్న పరిమితులకు లోబడి పురోభివృద్ధికి కృషి చేయండి
అయితే శక్తివంచన లేకుండా కష్టపడండి..
- ఫిల్ నైట్, నైక్ వ్యవస్థాపకుడు

మహిళల కోసం యాక్సిస్ బ్యాంక్ ఎరైజ్ అకౌంట్లు



బ్యాంక్ ఎండీ, సీఈఓ అమితాబ్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిష్ శ్రద్ధతో సమక్షంలో ప్రత్యేక అకౌంట్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ మాజీ చీఫ్, సేల్స్ ఫోర్స్ ఇండియా చైర్మన్, సీఈఓ అరుంధతీ భట్టాచార్య

ముంబై: ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ తాజాగా మహిళలకు సమగ్రమైన ఆర్థిక సేవలు అందించే దిశగా 'ఎరైజ్ ఉమెన్స్ సేవింగ్స్ అకౌంటు'ను ఆవిష్కరించింది. ముగ్గురు కుటుంబ సభ్యులకు కూడా ఉపయోగపడేలా ఫ్యామిలీ బ్యాంకింగ్ ప్రోగ్రాం, చిన్న–మధ్య స్థాయి లాకర్లపై తొలి ఏడాది జీరో రెంటల్ ఫీజు, పీవోఎస్‌లలో రూ. 5 లక్షల వరకు లావాదేవీ పరిమితితో ఏరైజ్ డెబిట్ కార్డు, కాంప్లిమెంటరీగా నియో క్రెడిట్ కార్డు వంటి ప్రయోజనాలను దీనితో పొందవచ్చు. అలాగే, మహిళా నిపుణులతో ఆర్థిక సలహాలు, తొలి ఏడాది డీమ్యాట్ అకౌంటుపై వార్షిక మెయింటెనెన్స్ చార్జీల నుంచి మినహాయింపు, ప్రత్యేకంగా మహిళల కోసం కస్టమైజ్ చేసిన స్టాక్స్ బాస్కెట్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశం మొదలైన సర్వీసులను అందుకోవచ్చు. ఆరోగ్య సంరక్షణ విషయంలో మహిళలకు సంబంధించిన ప్యాప్‌స్మియర్ తదితర నిర్దిష్ట వైద్యపరీక్షలపై 70 శాతం వరకు డిస్కౌంట్లు, ప్రముఖ ఆస్పత్రుల్లో వైద్యులతో అపరిమిత కన్సల్టేషన్లు తదితర ప్రయోజనాలను పొందవచ్చని బ్యాంకు తెలిపింది.

దేశ, విదేశీ గణాంకాలకు ప్రాధాన్యం

రాజకీయ, భౌగోళిక అనిశ్చితుల ప్రభావం

- చమురు ధరలు, డాలరు కదలికలు కీలకం
- ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్‌పై అంచనాలు



ముంబై: దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌ను ఈ వారం ప్రధానంగా దేశ, విదేశీ గణాంకాలు నిర్దేశించే అవకాశముంది. వీటికితోడు ముడిచమురు ధరలు, ప్రపంచ ప్రధాన కరెన్సీలతో డాలరు మారకం వంటి అంశాలకూ ప్రాధాన్యత ఉన్నట్లు విశ్లేషకులు తెలియజేశారు. గత కొద్ది రోజులుగా దేశీ స్టాక్స్‌లో అమ్మకాలకే మొగ్గు చూపుతున్న విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు(ఎఫ్‌ఐఐలు) ఇటీవల కొనుగోళ్ల యూటర్న్ తీసుకున్న విషయం విదితమే. దీంతో విదేశీ పెట్టుబడులతోపాటు.. రాజకీయ భౌగోళిక అంశాలూ సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు స్టాక్ నిపుణులు తెలియజేశారు. ఎఫ్‌ఐఐల పెట్టుబడుల కారణంగా లార్జ్‌క్యాప్ బ్యాంకింగ్ షేర్లు జోరు చూపుతున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త వీకే విజయ్ కుమార్ తెలియజేశారు. కొన్ని ఎంపిక చేసిన షేర్లలో పెట్టుబడుల ప్రభావం కనిపిస్తున్నట్లు పేర్కొన్నారు. గత రెండు నెలలుగా భారీ అమ్మకాలు చేపట్టిన ఎఫ్‌ఐఐలు ఈ నెలలో నికర పెట్టుబడిదారులుగా నిలుస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

గత వారమిలా..

శుక్రవారం(6)తో ముగిసిన గత వారం దేశీ స్టాక్ ఇండెక్సులు పలు ఆటుపోట్ల మధ్య తిరిగి జోరందుకున్నాయి. సెన్సెక్స్ నికరంగా 1,906 పాయింట్లు(2.4 శాతం) జంప్‌చేసి 81,709 వద్ద ముగిసింది. నిఫ్టీ 547 పాయింట్లు(2.3 శాతం) ఎగసి 24,678 వద్ద స్థిరపడింది. గత వారం మార్కెట్ విలువరీత్యా టాప్–10 కంపెనీలలో ఆరు కంపెనీల మార్కెట్ విలువ రూ. 2 లక్షల కోట్లమేర బలపడింది. టీసీఎస్ మార్కెట్ క్యాప్ రూ. 62,575 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువ రూ. 45,338 కోట్లు, ఇన్ఫోసిస్ రూ. 26,886 కోట్లు, ఎస్‌బీఐ రూ. 22,312 కోట్లు చొప్పున ఎగసింది. అయితే ఎయిర్‌టెల్ విలువ రూ. 16,720 కోట్లు, ఐటీసీ విలువ రూ. 7,256 కోట్లు క్షీణించింది.

ఆర్థిక గణాంకాలు

దేశీయంగా అక్టోబర్ నెలకు పారిశ్రామికోత్పత్తి సూచీ వివరాలు గురువారం(12న) వెల్లడికానున్నాయి. సెప్టెంబర్‌లో పారిశ్రామికోత్పత్తి వార్షికంగా 3.1 శాతం పుంజుకుంది. ఆర్థికవేత్తల 2.5 శాతం అంచనాలను అధిగమించింది. ఇదేవిధంగా నవంబర్ నెలకు రిటైల్ ధరల ద్రవ్యోల్బణం(సీపీఐ) గణాంకాలు సైతం 12న వెలువడనున్నాయి. అక్టోబర్‌లో సీపీఐ వార్షిక రేటు 6.21 శాతంగా నమోదైంది. ఐఐపీ, సీపీఐ గణాంకాలు ఆర్థిక వ్యవస్థ పురోగతికి సంకేతాలని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలియజేశారు. ఎఫ్‌ఐఐలు పెట్టుబడులకు ఆసక్తి చూపడం ట్రేడర్లను ప్రభావితం చేసే వీలున్నట్లు వివరించారు.

యుద్ధ భయాలు

రష్యా– ఉక్రెయిన్ యుద్ధ భయాలు ఇన్వెస్టర్లలో ఆందోళనలు కలిగించే వీలున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ విశ్లేషకులు ప్రవేష్ గౌర్ పేర్కొన్నారు. మరోపక్క తాజాగా ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ బలహీనపడటానికితోడు ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ వెనకడుగు వేయడం భారత్‌వంటి వర్ధమాన మార్కెట్లకు సానుకూలంగా పరిణమిస్తున్నట్లు అభిప్రాయపడ్డారు. నవంబర్ నెలకు యూఎస్ వ్యవసాయేతర ఉపాధి గణాంకాలు అంచనాలు(2 లక్షలు) మించుతూ 2.2 లక్షలకు చేరింది. నిరుద్యోగిత 4.2 శాతంగా నమోదైంది. అక్టోబర్‌లో తుఫానుసహా బోయింగ్‌లో ఉద్యోగుల సమ్మె కారణంగా ఉపాధి గణాంకాలు పడిపోయిన విషయం విదితమే. ఇవేకాకుండా పలు ఇతర విదేశీ గణాంకాలు సైతం ఈ వారం విడుదలకానున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా తెలియజేశారు. చైనా ద్రవ్యోల్బణం నేడు(9న), వాణిజ్య గణాంకాలు 10న విడుదలకానుండగా.. 11న యూఎస్ కీలక ద్రవ్యోల్బణ గణాంకాలు వెల్లడికానున్నాయి. ఇవి ఈ నెలలో కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ చేపట్టనున్న పాలసీ సమీక్షపై ప్రభావం చూపే వీలున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. కాగా.. లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 71 డాలర్ల ఎగువకు చేరగా.. న్యూయార్క్ మార్కెట్లో పసిడి ఔన్స్ 2,670 డాలర్లను తాకింది. డాలరు ఇండెక్స్ 106 వద్ద కదులుతోంది.

ఎఫ్‌పీఐల స్పీడ్

తొలి వారంలో రూ. 24,454 కోట్లు



న్యూఢిల్లీ: గత రెండు నెలలుగా అమ్మకాల బాటలో సాగిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఇటీవల ఉన్నట్లుండి యూటర్న్ తీసుకున్నారు. దేశీ స్టాక్స్‌లో నికర కొనుగోలుదారులుగా నిలుస్తున్నారు. వెరసి ఈ నెల తొలి వారంలో ఎఫ్‌పీఐలు రూ. 24,454 కోట్లను ఇన్వెస్ట్ చేశారు. అక్టోబర్‌లో కొత్త రికార్డుకు తెరతీస్తూ రూ. 94,017 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించిన విదేశీ ఇన్వెస్టర్లు నవంబర్‌లో కొంత వెనకడుగు వేసి రూ. 21,612 కోట్ల అమ్మకాలకు పరిమితమయ్యారు. అయితే సెప్టెంబర్‌లో అంతక్రితం 9 నెలల్లోనే అత్యధికంగా రూ. 57,724 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. ఇకపై యూఎస్ కొత్త ప్రెసిడెంట్ ట్రంప్ విధానాలు, వడ్డీ రేట్లు, రాజకీయ భౌగోళిక అంశాల ఆధారంగా ఎఫ్‌పీఐల పెట్టుబడులు నమోదుకానున్నట్లు మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా అసోసియేట్ డైరెక్టర్ హిమాన్షు శ్రీవాస్తవ తెలియజేశారు.

మూమెంటమ్ ఇన్వెస్టింగ్‌పై ఈ అపోహలొద్దు

కార్తీక్ కుమార్



ఫండ్ మేనేజర్, యాక్సిస్ మ్యుచువల్ ఫండ్

మూమెంటమ్ ఇన్వెస్టింగ్‌కి ఆదరణ పెరుగుతున్నప్పటికీ ఇందులో అధిక రిస్కులు ఉంటాయనో లేక కేవలం షార్ట్–టర్మ్ ట్రేడర్లకే ఇది అనువైనదనో రకరకాల అపోహలున్నాయి. అయితే, పెట్టుబడులకు సంబంధించి ఇదొక వ్యూహాత్మకమైన, క్రమశిక్షణతో కూడుకున్న విధానం. సరిగ్గా అనుసరించగలిగితే మెరుగైన రాబడులు అందించేందుకు, డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియోలో భాగం అయ్యేందుకు మూమెంటమ్ ఇన్వెస్టింగ్‌కి పుష్కలంగా అవకాశాలు ఉంటాయి. ఈ నేపథ్యంలోమూమెంటమ్ ఇన్వెస్టింగ్‌పై సాధారణంగా నెలకొన్న అపోహలను తొలగించుకోవడంతో పాటు దాని సామర్థ్యాలు, పరిమితుల గురించి తెలుసుకుందాం.

అపోహ 1: 'సగటు ఇన్వెస్టర్లకు మూమెంటమ్ ఇన్వెస్టింగ్ చాలా రిస్కులతో కూడుకున్న వ్యవహారం – అలాంటప్పుడు ఎందుకు ఇన్వెస్ట్ చేయాలి?'

వాస్తవం: మూమెంటమ్ ఇన్వెస్టింగ్ అనేది కూడా మార్కెట్ ఒడిదుడుకుల ప్రభావాలకు లోనైనప్పటికీ, సమర్ధమంతమైన రిస్క్ మేనేజ్‌మెంట్, డైవర్సిఫికేషన్ కీలకాంశాలుగా ఉంటాయి. సగటుకు మించి రాబడులను ఆర్జించే లక్ష్యంతో, మూమెంటమ్ ఫండ్‌లో అసెట్స్‌ను, ఇటీవలి ధర ఎంత పటిష్టంగా ఉందనే అంశం ఆధారంగా ఎంపిక చేస్తారు. ఇందులో రిస్క్ కాస్త అధికంగా ఉన్నట్లు అనిపించినా మూమెంటమ్ ఆధారిత సూచీ అనేది వివిధ కాలావధులవ్యాప్తంగా, సంప్రదాయ బెంచ్‌మార్క్ నిఫ్టీ 200ని మించి, మెరుగైన రిస్క్–అడ్జస్టెడ్ రాబడులను అందించింది. ఈ ఫండ్స్ అనుభవజ్ఞులకే కాకుండా వివిధ రకాల ఇన్వెస్టర్లకు కూడా చక్కని ఆప్షన్ అవుతాయి. పోర్ట్‌ఫోలియోలో సముచితంగా సమతౌల్యం పాటించగలిగితే, ఈ విధానానికి కొత్త వారైనా సరే, చాలా మంది ఇన్వెస్టర్లకు, రిస్కుకు తగ్గ రాబడులను మూమెంటమ్ ఇన్వెస్టింగ్ అందించగలదు.

అపోహ 2: 'మూమెంటమ్ ఇన్వెస్టింగ్ అనేది హై–ఫ్రీక్వెన్సీ ట్రేడర్ల కోసం మాత్రమే'

వాస్తవం: మూమెంటమ్ ఇన్వెస్టింగ్ అనేది హై–ఫ్రీక్వెన్సీ ట్రేడింగ్‌కో లేక రోజువారీ మార్కెట్ కదలికలను చేజ్ చేయడానికో పరిమితం కాదు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక కాలవ్యవధులను మేళవించగలిగే ఒక వ్యూహాత్మక, డేటా ఆధారిత విధానం. ముమెంటం వ్యూహాలను అమలు చేసే మ్యుచువల్ ఫండ్స్ స్టాక్స్‌ను ఎంపిక చేసేందుకు క్వాంటిటేటివ్ మోడల్స్‌ను ఉపయోగిస్తాయి. మధ్యమధ్యలో పోర్ట్‌ఫోలియోలను రీబ్యాలెన్స్ చేస్తాయి. అంతే తప్ప డే–ట్రేడింగ్ తరహాలో ఉరుకుల, పరుగుల ధోరణితో వ్యవహరించవు. దీనివల్ల ఇన్వెస్టరుకు ఏమిటి ప్రయోజనం అంటే, దీర్ఘకాలికంగా ఒనగూరే ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇన్వెస్టరు మూమెంటమ్ ఫండ్‌ను కొనసాగించవచ్చు.

అపోహ 3: ''మూమెంటమ్ ఇన్వెస్టింగ్ అనేది గుంపును అనుసరించే విధానం''

వాస్తవం: ఇది గుంపును అనుసరిస్తూ వెళ్లే వ్యూహమనే అపోహ ఉంది. వాస్తవానికి ఇది భావోద్వేగాలతో నిర్ణయాలు తీసుకోవడం కాకుండా విశ్లేషణతో కూడుకున్నదై, ఆచరణలో పెట్టతగిన విధంగా ఉంటుంది. వివిధ కాలవ్యవధులు, మార్కెట్ సైకిల్స్‌పరంగా అంతర్జాతీయ మార్కెట్లు అసెట్ క్లాస్‌లవ్యాప్తంగా నిర్వహించిన అధ్యయనాల్లో దీనితో ఒనగూరే ప్రయోజనాలు నిరూపితమయ్యాయి. ప్రాక్టీషనర్లు, విద్యావేత్తలు మూమెంటమ్ ను సుదీర్ఘకాలం పాటు అధ్యయనం చేశారు. అండర్‌రియాక్షన్‌లాంటి బిహేవియోరల్ థియరీలు ఇందులో ఇమిడి ఉండటం వల్ల ఇది సమర్ధమంతంగా పనిచేయగలదని తేల్చారు. ముమెంటమ్ ఇన్వెస్టింగ్‌లో ఉపయోగించే క్వాంటిటేటివ్ మోడల్స్.. ధరల ట్రెండ్‌లు, ఇతరత్రా మార్కెట్ పరిస్థితులను విశ్లేషిస్తాయి. చారిత్రక డేటా, ప్యాటర్న్‌ల ఆధారంగా మరింత కాలం రాణించగలిగే స్టాక్స్‌ను సిస్టమాటిక్‌గా గుర్తించేందుకు మూమెంటమ్ ఫండ్స్ అనేవి రిలేటివ్ స్ట్రెంగ్త్, ప్రైస్ మూమెంటమ్‌లాంటి పటిష్టమైన ఇండికేటర్స్‌ను ఉపయోగిస్తాయి.

అపోహ4: ''మార్కెట్ పతనాల్లో మూమెంటమ్ ఇన్వెస్టింగ్ అంతగా రాణించదు''

వాస్తవం: మార్కెట్ సెంటిమెంట్‌లో వచ్చే మార్పుల వల్ల మూమెంటమ్ వ్యూహాలు ప్రభావితం అయినప్పటికీ, మార్కెట్ కరెక్షన్‌కి లోనైన ప్రతిసారి వీటి పనితీరు బాగుండదని భావించడానికి లేదు. మూమెంటమ్ వ్యూహాలనేవి ఎప్పటికప్పుడు మారే పరిస్థితులకు అనుగుణంగా మారుతుంటాయి, కొత్త ట్రెండ్స్ వచ్చే కొద్దీ పోర్ట్‌ఫోలియోను తదనుగుణంగా సరి చేసుకునేలా ఉంటాయి. చారిత్రక డేటాను బట్టి చూస్తే మూమెంటమ్ ఫండ్స్ కూడా నెమ్మదించే అవకాశాలు ఉన్నప్పటికీ అవి చాలా వేగంగా పుంజుకుని, దీర్ఘకాలంలో అత్యంత మెరుగ్గా రాణించగలవని తెలుస్తుంది. ముఖ్యంగా వివిధ మార్కెట్ పరిస్థితులను బట్టి మూమెంటమ్ ఇన్వెస్టింగ్ మారుతుంటుంది. తద్వారా విస్తృత మార్కెట్లు సంక్షోభానికి లోనైనా తట్టుకుని నిలబడగలిగే సత్తా కలిగి ఉంటుంది. అయితే, మూమెంటమ్ ఇన్వెస్టింగ్‌ను ఆచితూచి పాటించాలని, ఇది డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియోలో భాగంగా ఉండటానికే అనువైనదనే విషయాన్ని ఇన్వెస్టర్లు దృష్టిలో ఉంచుకోవాలి. ఇలాంటి పోర్ట్‌ఫోలియోలో ఇతర అసెట్స్ స్థిరత్వాన్ని అందించే విధంగా ఉన్నందున, ఈ విధానం మెరుగైన రాబడులను అందించేందుకు అవకాశం ఉండగలదు.

సమతూకమైన పోర్ట్‌ఫోలియోలో మూమెంటమ్ ఇన్వెస్టింగ్‌ను భాగం చేసుకోవడం..

డైవర్సిఫైడ్ అసెట్ అలొకేషన్ వ్యూహంతో జోడించినప్పుడు మూమెంటమ్ ఇన్వెస్టింగ్ అనేది శక్తివంతమైన సాధనంగా ఉండగలదు. విస్తృత ఇండెక్స్ ఫండ్స్‌తో పాటు మూమెంటమ్ ఫండ్స్‌ను ఉపయోగించుకున్నప్పుడు మొత్తం పోర్ట్‌ఫోలియోకి ఎదురయ్యే రిస్కులను సమర్థమంతంగా నిర్వహించుకుంటూనే, మెరుగ్గా రాణిస్తున్న స్టాక్స్ నుంచి ఇన్వెస్టర్లు ప్రయోజనాలను పొందవచ్చు.

చివరిగా..

మార్కెట్ ట్రెండ్స్ నుంచి ప్రయోజనం పొందేందుకు వ్యూహాత్మకమైన, క్రమశిక్షణతో కూడుకున్న విధానాన్ని పాటించాలని కోరుకునే ఇన్వెస్టర్లకు మూమెంటమ్ ఇన్వెస్టింగ్ అనేది చక్కని సాధనంగా ఉండగలదు. దీనిపై అపోహలు ఉన్నప్పటికీ, మార్కెట్ చెప్పేదే వేదం .. ఇటీవలి ధరల ట్రెండ్స్ అనేవి భవిష్యత్ రాబడుల ధోరణులను సూచిస్తాయనే నమ్మకం ఆధారంగా ఎప్పటికప్పుడు మారిపోయే ట్రెండ్స్‌ను అందిపుచ్చుకునేందుకు మూమెంటమ్ ఇన్వెస్టింగ్ తోడ్పడుతుందనేది వాస్తవం. దీన్ని అర్థం చేసుకోవడం ద్వారా ముమెంటం ఇన్వెస్టింగ్, తమ లక్ష్యాలు అలాగే రిస్కు సామర్థ్యాలకు అనుగుణంగా ఉందా లేదా అనేది ఇన్వెస్టర్లు మదింపు చేసుకోవచ్చు. తద్వారా, పోర్ట్‌ఫోలియోను సమగ్రమైనదిగా తీర్చిదిద్దుకునేందుకు వీలుగా, పూర్తి సమాచారంతో తగిన నిర్ణయం తీసుకోవచ్చు.

సంవర్ధన మదర్సన్ చేతికి జపాన్ కంపెనీ

రూ. 482 కోట్లతో అత్సుమిటెక్‌లో 95 శాతం వాటా కొనుగోలు



న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల తయారీ సంస్థ సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ తాజాగా జపాన్‌కు చెందిన అత్సుమిటెక్‌లో 95 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. ఇందుకోసం 57 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 482 కోట్లు) వెచ్చించనున్నట్లు తెలిపింది. అనుబంధ సంస్థ సంవర్ధన మదర్సన్ ఆటోమోటివ్ సిస్టమ్స్ గ్రూప్ ద్వారా నిర్వహించే ఈ లావాదేవీకి కంపెనీ బోర్డు ఆమోదముద్ర వేసినట్లు వివరించింది. ఫోర్ వీలర్లు, టూ వీలర్ల కోసం గేర్ షిఫ్టర్లు, చాసిస్‌లు మొదలైనవి తయారు చేసే అత్సుమిటెక్ సంస్థకు జపాన్, చైనా, అమెరికా తదితర దేశాల్లో తొమ్మిది ప్లాంట్లు ఉన్నాయి. కంపెనీలో 95 శాతం వాటాను సంవర్ధన మదర్సన్ కొనుగోలు చేయగా మిగతా 5 శాతం వాటా హోండా మోటర్స్ వద్ద ఉంటుంది.

ఆదాయాన్ని నిర్ధారించేవి.. మూడు..

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి / కె.వి.ఎన్ లావణ్య



ట్యాక్సేషన్ నిపుణులు

మీ ట్యాక్సబుల్ ఆదాయాన్ని నిర్ధారించేవి ముఖ్యంగా మూడు అంశాలు. అవేంటంటే..

1. రెసిడెన్షియల్ స్టేటస్
2. ఆదాయం వచ్చే సమయం
3. ఆదాయానికి మూలం (సోర్స్)

ఇక వివరాల్లోకి వెళ్దాం.

1. రెసిడెన్షియల్ స్టేటస్ ..

ఆదాయపు పన్ను చట్టంలో పన్ను భారాన్ని నిర్ధారించేది మీ రెసిడెన్షియల్ స్టేటస్ .. అంటే మీరు భారత్‌లో ఒక ఆర్థిక సంవత్సర కాలంలో ఎన్ని రోజులు ఉన్నారనే విషయం. పౌరసత్వానికి, పన్ను భారానికి ఎటువంటి సంబంధం లేదు. పౌరుడైనా, పౌరుడు కాకపోయినా ఆ వ్యక్తి స్టేటస్ .. అంటే ఇండియాలో ఎన్ని రోజులున్నాడనే అంశంపై ఆధారపడి ఉంటుంది. ఆదాయానికి మూలం కింద .. జీతం, ఇంటి మీద అద్దె, వ్యాపారం మీద ఆదాయం .. మొదలైనవి ఉంటాయి. ఈ స్టేటస్ ప్రతి సంవత్సరం మారొచ్చు. మారకపోవచ్చు. అందుకని ప్రతి సంవత్సరం ఈ షరతుని లేదా పరిస్థితిని లేదా కొలబద్దని కొలవాలి. లెక్కించాలి. వ్యక్తి విషయానికొస్తే.. 182 రోజులు లేదా అంతకన్నా ఎక్కువ రోజులుంటే, అటువంటి వ్యక్తిని రెసిడెంట్ అంటారు. సాధారణంగా మనందరం రెసిడెంట్లమే. మరో ప్రాతిపదిక ఏమిటంటే, గడిచిన నాలుగు సంవత్సరాల్లో 365 రోజులు లేదా పైగా ఉంటూ, ఆ ఆర్థిక సంవత్సరంలో 60 రోజులు ఉండాలి. ఇలాంటి వ్యక్తిని రెసిడెంట్ అంటారు. ఈ లెక్కింపులకు మీ పాస్‌పోర్ట్‌లలో ఎంట్రీలు ముఖ్యం. రెసిడెంటుకు, నాన్–రెసిడెంటుకు ఎన్నో విషయాల్లో భేదాలు ఉన్నాయి. మిగతా వారి విషయంలో ఇండియాలో ఉంటూ ''నిర్వహణ, నియంత్రణ'' చేసే వ్యవధి మీద స్టేటస్ ఆధారపడి ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

2. ఆదాయం ఏర్పడే సమయం

సాధారణంగా ఆ ఆర్థిక సంవత్సరంలో మీ చేతికి వచ్చినది, మీరు పుచ్చుకున్నది, మీ ఖాతాలో జమ అయినదాన్ని మీ ఆదాయం అంటారు. దీన్నే రావడం ... అంటే ARISE అంటారు. కానీ చట్టంలో ఒక చిన్న ఇంగ్లీష్ పదం 'ACCRUE' మరో అర్థాన్ని సూచిస్తుంది. ''ఆదాయాన్ని'' నిర్వచించే విధానం చూస్తే, వాడే భాష చూస్తే, ఆదాయ పరిధిని ''వామన అవతారం''లో ''మూడు అడుగుల''ను స్ఫురింపచేస్తుంది. ఎన్నో వివరణలు, తీర్పులు, పరిధులు ఉంటాయి. ''ఇందుగలడందు కలడు'' అనే నరసింహావతారం గుర్తుకు రాక తప్పదు. స్థూలంగా చెప్పడం అంటే మేము 'సాహసం' చేయడమే! పాతాళభైరవిలో నేపాల మాంత్రికుడి మాటల్ని స్ఫూర్తిగా తీసుకుంటూ, చేతికొచ్చింది .. చేతికి రావాల్సినది, హక్కు ఏర్పడి రానిది, హక్కు ఉండి అందనిది, ఆదాయంలా భావించేది, భావించతగ్గది, భావించినది, ఆదాయం కాకపోయినా తీసుకోక తప్పనిది (Deemed), కొన్ని సందర్భాల్లో మీకు కలిపేది (Included) అని చెప్పొచ్చు.

3. ముచ్చటగా మూడోది..

మూలం. అంటే ``ఊటబావి. చట్టప్రకారం మనకు ఏర్పడే ఆదాయాల్ని ఐదు రకాలుగా, 5 శీర్షికల కింద వర్గీకరించారు.

a) జీతాలు, వేతనాలు
b) ఇంటి మీద ఆదాయం
c) వ్యాపారం/వృత్తి మీద లాభనష్టాలు
d) క్యాపిటల్ గెయిన్స్
e) పై నాలుగింటిలోకి విభజించలేక మిగిలినవి .. ఏ మూలమైనా, ఏ మూల నుంచి వచ్చినా ఈ శీర్షిక కింద పరిగణనలోకి తీసుకుంటారు. అవశేష ఆదాయం అని అనొచ్చు.


ఈ మూడింటిని దృష్టిలో పెట్టుకుని ట్యాక్స్ ప్లానింగ్‌కి శ్రీకారం చుడదాం.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

పెట్టుబడులకు స్థిరత్వం ఎక్కువ

పరాగ్ పారిఖ్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్



స్టాక్ మార్కెట్ ఇటీవలే దిద్దుబాటును చూసింది. గరిష్టాల నుంచి ఎన్ఎస్ఈ నిఫ్టీ, బీఎస్ఈ సెన్సెక్స్ 10 శాతానికి పైగా నష్టపోయి, అక్కడి నుంచి కోలుకున్నాయి. ఇప్పటికీ స్టాక్స్ వ్యాల్యూషన్లను ఖరీదుగానే ఉన్నాయని ఎక్కువ మంది నిపుణులు చెబుతున్నారు. ఈ తరుణంలో నేరుగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం కంటే, ఉద్దాన పతనాల్లో బలమైన ట్రాక్ రికార్డు కలిగిన మ్యూచువల్ ఫండ్స్ పథకాలను ఎంపిక చేసుకుని పెట్టుబడులు పెట్టడం మెరుగైన నిర్ణయం అవుతుంది. ఇలా చూస్తే పరాగ్ పారిక్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ మంచి ఎంపికే అవుతుంది. ఇప్పుడనే కాదు, దీర్ఘకాల లక్ష్యాల కోసం ఎప్పుడైనా ఇన్వెస్ట్ చేసుకోవడానికి అనుకూలమైన పథకం ఇది.

పెట్టుబడుల విధానం..

ఈ పథకం పరిమిత రిస్క్‌నే తీసుకుంటుంది. అది కూడా లోతైన విశ్లేషణ తర్వాతే. కేవలం రాబడులకే ప్రాధాన్యం ఇవ్వదు. స్టాక్స్ విలువలకూ ఎంతో ప్రాధాన్యం ఇస్తుంది. వ్యాల్యూ ఇన్వెస్టింగ్ విధానానికి పెద్దపీట వేస్తుంది. విలువల పరంగా ఆకర్షణీయంగా ఉన్న, దీర్ఘకాలంలో బలమైన పనితీరుతో అదరగొట్టే అవకాశాలున్న కంపెనీలను ముందే గుర్తించి ఇన్వెస్ట్ చేయడంలో మంచి అనుభవం ఈ పథకం మేనేజర్లకు ఉంది. కేవలం దేశీ స్టాక్స్‌కే కాకుండా అమెరికా, జపాన్ తదితర దేశాలకు చెందిన బహుళజాతి దిగ్గజ కంపెనీలకూ కొంత పెట్టుబడులు కేటాయించడం ఈ పథకం పెట్టుబడుల విధానంలో భాగంగా చూడొచ్చు. ఫ్లెక్సీక్యాప్ కావడంతో ఫలానా విభాగంలోనే ఇన్వెస్ట్ చేయాలన్న ప్రతిబంధకాలేమీ లేవు. మార్కెట్ పరిస్థితులు, ఆకర్షణీయమైన అవకాశాలు ఏ విభాగంలో ఉన్నా స్వేచ్ఛగా వాటిల్లో ఇన్వెస్ట్ చేయగలదు.



రాబడులు

ఈ పథకం ఏడాది కాలంలో 29.68 శాతం రాబడులు అందించింది. మూడేళ్లలో ఏటా 19 శాతం రాబడిని తెచ్చిపెట్టింది. ఐదేళ్లలో 26.68 శాతం, ఏడేళ్లలో 21 శాతం, పదేళ్లలో 18.77 శాతం చొప్పున వార్షిక రాబడులు చరిత్ర ఈ పథకానికి ఉంది. ఫ్లెక్సీక్యాప్ విభాగం సగటు రాబడి కంటే ఈ పథకమే 6 శాతం వరకు అధిక రాబడిని పలు సందర్భాల్లో అందించింది. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఇన్వెస్ట్ చేసుకుంటే అదనంగా మరో 1–2 శాతం రాబడులు దీర్ఘకాలంలో సొంతం చేసుకోవచ్చు.

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.81,919 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 79.51 శాతం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. 19.88 శాతం డెట్ సాధనాలకు కేటాయించింది. 0.61 శాతం మేర నగదు రూపంలో కలిగి ఉంది. ఈక్విటీ పెట్టుబడులు గమనిస్తే.. 90 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 8.70 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో 0.58 శాతం మేర ఇన్వెస్ట్ చేసింది. పథకం ఎక్స్‌పెన్స్ రేషియో తక్కువగా 0.63 శాతంగా ఉంది. ఇది ఎంత తక్కువగా ఉంటే, ఇన్వెస్టర్‌కు చార్జీల రూపంలో అంత మేర ఆదా అవుతుంది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 54 స్టాక్స్ ఉన్నాయి. ఇందులో టాప్ 10 కంపెనీల్లోనే 54 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. అత్యధికంగా 31.88 శాతం మేర బ్యాంకింగ్, ఫైనాన్షియల్ కంపెనీలకు కేటాయించింది. ఆ తర్వాత టెక్నాలజీ కంపెనీల్లో 15.83 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషినరీ కంపెనీల్లో 8.29 శాతం చొప్పున పెట్టుబడులు కలిగి ఉంది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	8.41
పవర్‌గ్రిడ్	7.08
బజాజ్ హోల్డింగ్స్	6.67
కోల్‌ఇండియా	6.49
ఐటీసీ	5.64
ఐసీఐసీఐ బ్యాంక్	5.32
మారుతి సుజుకీ	4.11
హెచ్‌సీఎల్ టెక్	4.03
యాక్సిస్ బ్యాంక్	3.52
మెటా ప్లాట్‌ఫామ్స్	3.44

అశ్విని-తనీషాలకు డబుల్స్ టైటిల్

పురుషుల సింగిల్స్ చాంప్ సతీశ్ ● మహిళల సింగిల్స్‌లో రన్నరప్ అన్‌మోల్


సతీశ్


అశ్విని పొన్నప్ప తనీషా క్రాస్టో


గువాహటి: సొంతగడ్డపై జరిగిన గువాహటి మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-100 బ్యాడ్మింటన్ టోర్నీలో చివరిరోజు భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మూడు విభాగాల్లో భారత ప్లేయర్లు ఫైనల్ చేరుకోగా... రెండు విభాగాల్లో టైటిల్స్ లభించాయి. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) ద్వయం టైటిల్ దక్కించుకోగా... పురుషుల సింగిల్స్‌లో సతీశ్ కరుణాకరన్ విజేతగా అవతరించాడు. మహిళల సింగిల్స్ ఫైనల్లో భారత రైజింగ్ స్టార్ అన్‌మోల్ ఖరబ్ తీవ్రంగా పోరాడినా చివరకు రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. పురుషుల సింగిల్స్ తుదిపోరులో సతీశ్ 21-17, 21-14తో చైనీస్ క్వాలిఫయర్ జు జువన్ చెన్‌పై అలవోకగా గెలిచాడు. 44 నిమిషాల్లోనే ప్రత్యర్థి ఆటకట్టించి విజేతగా నిలిచాడు. సతీశ్‌కు 7500 డాలర్ల (రూ. 6 లక్షల 35 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 5500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. మహిళల డబుల్స్ టైటిల్ పోరులో ప్రపంచ 16వ ర్యాంక్ జోడీ అశ్విని పొన్నప్ప-తనీషా (భారత్) ద్వయం 21-18, 21-12తో లి హువా జౌ-వాంగ్ జి మెంగ్ (చైనా) జంటను కంగుతినిపించింది. తొలి గేమ్‌లో చైనా జోడీ నుంచి కాస్త పోటీ ఎదురైనప్పటికీ... రెండో గేమ్‌లో ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశమివ్వకుండా అశ్విని-తనీషా 43 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించారు. అశ్విని-తనీషా జోడీకి 7900 డాలర్ల (రూ. 6 లక్షల 68 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 5500 ర్యాంకింగ్ పాయింట్లు దక్కాయి. మహిళల సింగిల్స్ ఫైనల్లో అన్‌మోల్ 21-14, 13-21, 19-21తో కాయ్ యన్ యన్ (చైనా) చేతిలో ఓడింది. తొలి గేమ్‌ను అవలీలగా గెలుచుకున్న భారత షట్లర్‌కు రెండో గేమ్ నుంచి సవాల్ ఎదురైంది. చైనా క్రీడాకారిణి పుంజుకొని రెండో గేమ్ గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడోగేమ్ హోరాహోరీగా జరిగింది. ఇద్దరు ప్రతీ పాయింట్ కోసం దీటుగా పోరాడారు. అయితే కీలకదశలో చైనీస్ ప్లేయర్ పాయింట్లు నెగ్గి విన్నర్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. రన్నరప్ అన్‌మోల్‌కు 3800 డాలర్ల (రూ. 3 లక్షల 21 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 4680 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



జ్యోతి సురేఖ 'పసిడి' గురి

తైపీ ఓపెన్ ఇండోర్ సిరీస్ టోర్నీలో స్వర్ణం నెగ్గిన ఆంధ్రప్రదేశ్ ఆర్చర్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయస్థాయిలో ఈ ఏడాది తన నిలకడైన ప్రదర్శనను కొనసాగిస్తూ భారత స్టార్ ఆర్చర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ తన ఖాతాలో మరో స్వర్ణ పతకాన్ని జమ చేసుకుంది. వరల్డ్ ఇండోర్ సిరీస్ ఆర్చరీ టోర్నీలలో భాగంగా... ఆదివారం జరిగిన తైపీ ఓపెన్‌లో జ్యోతి సురేఖ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో చాంపియన్‌గా నిలిచింది. చైనీస్ తైపీ ఆర్చర్ చెన్ యు జుతో జరిగిన ఫైనల్లో విజయవాడకు చెందిన జ్యోతి సురేఖ 144-140 పాయింట్ల తేడాతో గెలిచింది. ర్యాంకింగ్ రౌండ్‌లో సురేఖ 600 పాయింట్లకుగాను 592 పాయింట్లు స్కోరు చేసి టాప్ సీడ్‌ను దక్కించుకుంది. తొలి రౌండ్‌లో సురేఖ 145-142తో సువాన్ టింగ్ సియావో (చైనీస్ తైపీ)పై, రెండో రౌండ్‌లో 148-144తో యెన్‌యు కువో (చైనీస్ తైపీ)పై, క్వార్టర్ ఫైనల్లో 148-146తో పర్ణీత్ కౌర్ (భారత్)పై, సెమీఫైనల్లో 148-146తో చెన్ యి సువాన్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. గత ఏడాది కూడా సురేఖ తైపీ ఓపెన్‌లో పసిడి పతకాన్ని సాధించడం విశేషం.



చివరి రేసులో నోరిస్ విజయం

అబుదాబి: ఫార్ములావన్ 2024 సీజన్ ఆదివారంతో ముగిసింది. 24 రేసుల ఈ సీజన్‌లో చివరిదైన అబుదాబి గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్‌కు చెందిన 26 ఏళ్ల లాండో నోరిస్ విజేతగా నిలిచాడు. నిర్ణీత 58 ల్యాప్‌లను నోరిస్ అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 26 నిమిషాల 33.291 సెకన్లలో ముగించి ఈ సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదు చేసుకున్నాడు. ఫెరారీ డ్రైవర్లు కార్లోస్ సెయింజ్, చార్లెస్ లెక్‌లెర్క్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. వరుసగా నాలుగో ఏడాది ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను దక్కించుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ రేసులో ఆరో స్థానాన్ని సంపాదించాడు. చివరిసారి మెర్సిడెస్ జట్టు తరఫున బరిలోకి దిగిన బ్రిటన్ డ్రైవర్, మాజీ విశ్వవిజేత లూయిస్ హామిల్టన్ నాలుగో స్థానంలో నిలిచాడు. 26 ఏళ్ల విరామం తర్వాత మెక్‌లారెన్ జట్టు మళ్లీ 'కన్‌స్ట్రక్టర్స్ టైటిల్'ను దక్కించుకుంది.



100 మీటర్ల విజేత జయరాం

భువనేశ్వర్: జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ దొండపాటి మృత్యం జయరాం స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఆదివారం జరిగిన అండర్-18 పురుషుల 100 మీటర్ల విభాగంలో కాకినాడకు చెందిన జయరాం చాంపియన్‌గా అవతరించాడు. ప్రస్తుతం జయరాం ఒడిశాలోని రిలయెన్స్ ఫౌండేషన్ అథ్లెటిక్స్ హై పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్నాడు. ఫైనల్లో 100 మీటర్ల దూరాన్ని జయరాం అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 10.50 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు.



దేవాంక్ ధమాకా

జైపూర్ పింక్ పాంథర్స్‌పై పట్నా పైరేట్స్ విజయం

పుణే: స్టార్ రెయిడర్ దేవాంక్ దలాల్ 14 పాయింట్లతో సత్తా చాటడంతో ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో పట్నా పైరేట్స్ పదో విజయం ఖాతాలో వేసుకుంది. ఆదివారం జరిగిన పోరులో మాజీ చాంపియన్ పట్నా పైరేట్స్ 38-28 పాయింట్ల తేడాతో మాజీ విజేత జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలుపొందింది. మ్యాచ్ ఆరంభం నుంచే దేవాంక్ తన రెయిడింగ్‌తో వరుస పాయింట్లు కొల్లగొట్టగా... అతడికి అయాన్ (6 పాయింట్లు), దీపక్ (5 పాయింట్లు), అంకిత్ (5 పాయింట్లు) సహకరించారు. పింక్ పాంథర్స్ తరఫున అర్జున్ దేశ్వాల్ 7 పాయింట్లతో పోరాడాడు. తాజా సీజన్‌లో 17 మ్యాచ్‌లాడిన పట్నా పైరేట్స్ 10 విజయాలు, 6 పరాజయాలు, ఒక 'టై'తో 58 పాయింట్లు సాధించింది. పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. 17 మ్యాచ్‌ల్లో 8 విజయాలు, 7 పరాజయాలు, 2 'టై'లతో 49 పాయింట్లు సాధించిన పింక్ పాంథర్స్ ఏడో స్థానంలో ఉంది. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 34-33 పాయింట్ల తేడాతో యు ముంబాపై విజయం సాధించింది. గుజరాత్ జెయింట్స్ తరఫున గుమాన్ సింగ్, రాకేశ్ సుంగ్రోయా చెరో 10 పాయింట్లతో సత్తాచాటారు. యు ముంబా జట్టు తరఫున అజిత్ చవాన్ 14 పాయింట్లతో ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో హరియాణా స్టీలర్స్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి 8 గంటలకు), పుణేరి పల్టన్‌తో దబంగ్ ఢిల్లీ (రాత్రి 9 గంటలకు) తలపడనున్నాయి.

మిగతా వాళ్లూ బాధ్యత తీసుకోవాలి

ప్రతిసారీ ఒక్కరిపై భారం వేస్తే ఎలా? ● సహచరులకు కెప్టెన్ రోహిత్ శర్మ చురకలు



అడిలైడ్: ప్రతీసారి ప్రత్యర్థిని ఆలౌట్ చేసే బాధ్యత బుమ్రా ఒక్కడే తీసుకోలేడని... తక్కిన వాళ్లు కూడా పంచుకోవాలని భారత కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో పరాజయం అనంతరం రోహిత్ మాట్లాడుతూ... రెండు ఎండ్‌ల నుంచి బుమ్రాతోనే బౌలింగ్ చేయించలేము కదా అని అసహనం వ్యక్తం చేశాడు. 'మేము ఒక్క బౌలర్‌తోనే మ్యాచ్ ఆడటం లేదు. ఇతరులు కూడా జట్టును గెలిపించే బాధ్యత తీసుకోవాలి. సిరాజ్, హర్షిత్, నితీశ్, ఆకాశ్‌దీప్, ప్రసిధ్ కృష్ణ ఇది అందరికీ వర్తిస్తుంది. కొందరు బౌలర్లు టెస్టు క్రికెట్‌లో ఇటీవలే అరంగేట్రం చేశారు. అలాంటి వారికి ఆత్మవిశ్వాసాన్నివ్వడం చాలా ముఖ్యం. వారు ఎప్పుడు మ్యాచ్ ఆడిన అండగా ఉంటాం. కానీ మ్యాచ్ మొత్తం ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు వైపుల నుంచి బుమ్రా ఒక్కడే బౌలింగ్ చేయలేడు కదా. బౌలర్లను వాడుకోవడంపై చర్చించుకుంటాం. స్పెల్ పూర్తి చేసిన ప్రతి సారి బుమ్రాతో మాట్లాడతా. ఉల్లాసంగా ఉన్నాడా లేదా అని అడిగి తెలుసుకుంటా. ఎందుకంటే ఇది ఐదు మ్యాచ్‌ల సిరీస్... అతడు అన్ని మ్యాచ్‌లు ఇదే ఉత్సాహంతో ఆడాలని కోరుకుంటున్నాం. తొలి టెస్టులో హర్షిత్ రాణా జట్టుకు అవసరమైన కీలక సందర్భాల్లో వికెట్ తీశాడు. కొన్నిసార్లు నాణ్యమైన బ్యాటర్లు ఒత్తిడిలో పడేస్తారు. రెండో టెస్టులో అదే జరిగింది. అంత మాత్రాన హర్షిత్‌ను నిందించడానికి అతడిలో తపన ఉంది. దాన్ని ప్రోత్సహిస్తాం. రెండు మ్యాచ్‌ల్లోనే ఒక ప్లేయర్‌పై అంచనాకు రాలేము. భారత్, ఆస్ట్రేలియా మధ్య సిరీస్ అంటే ఉద్వేగాలు ఎక్కువ. ఇందులో భాగంగానే సిరాజ్, హెడ్ మధ్య మాటల యుద్ధం సాగింది. దీన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఆసీస్ గడ్డపై టెస్టు మ్యాచ్ నెగ్గాలంటే ప్రధానంగా చేయాల్సిందే స్కోరు బోర్డుపై వీలైనన్ని ఎక్కువ పరుగులు నమోదు చేయాలి. దురదృష్టవశాత్తు ఈ మ్యాచ్‌లో అది చేయలేకపోయాం. తొలి ఇన్నింగ్స్‌లో మరిన్ని పరుగులు చేసి ఉండాల్సింది. అక్కడే పొరబాటు జరిగింది' అని రోహిత్‌శర్మ వెల్లడించాడు.


జో రూట్

15 ఏళ్ల తర్వాత...

- న్యూజిలాండ్‌లో ఇంగ్లండ్ టెస్టు సిరీస్ సొంతం
- రెండో మ్యాచ్‌లో 323 పరుగులతో గెలుపు
- జో రూట్ ఖాతాలో 36వ శతకం
- కివీస్ బ్యాటర్ బ్లండెల్ సెంచరీ వృథా

వెల్లింగ్టన్: ఇటీవల భారత్‌ను భారత్‌లో టెస్టు సిరీస్‌లో క్లీన్‌స్వీప్ చేసిన న్యూజిలాండ్ జట్టు సొంతగడ్డపై మాత్రం ఇంగ్లండ్ చేతిలో టెస్టు సిరీస్ కోల్పోయి ఆశ్చర్యపరిచింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇంగ్లండ్ జట్టు రెండో టెస్టులో 323 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో టెస్టు మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. న్యూజిలాండ్ గడ్డపై 15 ఏళ్ల తర్వాత ఇంగ్లండ్ జట్టుకిదే తొలి టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 378/5తో ఆదివారం మూడోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ జట్టు 427/6 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. మాజీ కెప్టెన్ జో రూట్ (130 బంతుల్లో 106; 11 ఫోర్లు) మరో సెంచరీతో ఆకట్టుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో రూట్‌కు ఇది 36వ శతకం కాగా... టెస్టు క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో రాహుల్ ద్రవిడ్‌ను సమం చేసి సంయుక్తంగా ఐదో స్థానంలో ఉన్నాడు. రూట్ అవుట్ కాగానే కెప్టెన్ బెన్ స్టోక్స్ (49 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఇన్నింగ్స్ డిక్లేర్ చేశాడు. దీంతో న్యూజిలాండ్ ఎదుట 583 పరుగుల విజయ లక్ష్యం నిలవగా... కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో 54.2 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌటైంది. టామ్ బ్లండెల్ (102 బంతుల్లో 115; 13 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీతో పోరాడాడు. నాథన్ స్మిత్ (42; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. విలియమ్సన్ (4), కాన్వే (0), రచిన్ రవీంద్ర (6), గ్లెన్ ఫిలిప్స్ (16), కెప్టెన్ లాథమ్ (24) విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో బెన్ స్టోక్స్ 3... వోక్స్, కార్స్, బషీర్ తలా రెండు వికెట్లు తీశారు. ఇంగ్లండ్ బ్యాటర్ బ్రూక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శనివారం నుంచి హామిల్టన్ వేదికగా నామమాత్రమైన మూడో టెస్టు జరుగుతుంది.


బ్లండెల్

5 టెస్టు క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో జో రూట్ (36) రాహుల్ ద్రవిడ్‌తో కలిసి సంయుక్తంగా ఐదో స్థానానికి చేరుకున్నాడు. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్ (51), కలిస్ (45), పాంటింగ్ (41), సంగక్కర (38) వరుసగా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నారు.

మెరిసిన ముంతాజ్

భారత్ శుభారంభం ● బంగ్లాదేశ్‌పై 13-1 గోల్స్‌తో విజయం



మస్కట్ (ఒమన్): జూనియర్ మహిళల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు భారీ విజయంతో బోణీ కొట్టింది. బంగ్లాదేశ్‌తో ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' తొలి లీగ్ మ్యాచ్‌లో జ్యోతి సింగ్ నాయకత్వంలోని భారత జట్టు 13-1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ముంతాజ్ ఖాన్ (27వ, 32వ, 53వ, 58వ నిమిషాల్లో) అత్యధికంగా నాలుగు గోల్స్ సాధించింది. కనిక (12వ, 51వ, 52వ నిమిషాల్లో), దీపిక (7వ, 20వ, 55వ నిమిషాల్లో) మూడు గోల్స్ చొప్పున చేశారు. బ్యూటీ డుంగ్‌డుంగ్ (33వ నిమిషంలో), మనీషా (10వ నిమిషంలో), వైస్ కెప్టెన్ సాక్షి రాణా (43వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. బంగ్లాదేశ్ జట్టుకు ఒర్పితా పాల్ (12వ నిమిషంలో) ఏకైక గోల్ అందించింది. మ్యాచ్ మొత్తంలో భారత జట్టుకు 12 పెనాల్టీ కార్నర్‌లు లభించగా... నాలుగింటిని గోల్స్‌గా మలిచింది. ఒక పెనాల్టీ స్ట్రోక్‌ను వృథా చేసింది. అన్ని పెనాల్టీ కార్నర్‌లను టీమిండియా సద్వినియోగం చేసుకొనిఉంటే విజయం తేడా మరింత భారీగా ఉండేది. నేడు జరిగే తమ రెండో లీగ్ మ్యాచ్‌లో మలేసియాతో భారత్ తలపడుతుంది.

రసకందాయంలో...

- దక్షిణాఫ్రికా, శ్రీలంక రెండో టెస్టు
- లంక విజయానికి 143 పరుగులు
- సఫారీల గెలుపునకు 5 వికెట్లు

పోర్ట్ ఎలిజబెత్: ఆధిక్యం చేతులు మారుతూ సాగుతున్న దక్షిణాఫ్రికా, శ్రీలంక టెస్టు రెండో మ్యాచ్‌లో విజయం ఇరు జట్లతో దోబూచులాడుతోంది. ఆదివారం ఆట ముగిసే సమయానికి శ్రీలంక లక్ష్యానికి 143 పరుగుల దూరంలో నిలవగా... దక్షిణాఫ్రికా గెలుపునకు 5 వికెట్లు కావాల్సి ఉంది. ఓవర్‌నైట్ స్కోరు 191/3తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా చివరకు 86 ఓవర్లలో 317 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ తెంబా బవుమా (116 బంతుల్లో 66; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకంతో మెరవగా... ట్రిస్టన్ స్టబ్స్ (47; 2 ఫోర్లు), బెడింగ్‌హామ్ (35; 3 ఫోర్లు) రాణించారు. లంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 348 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక ఆదివారం ఆట ముగిసే సమయానికి 52 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. కమిందు మెండిస్ (35; 4 ఫోర్లు, 1 సిక్స్), ఏంజెలో మాథ్యూస్ (32; 4 ఫోర్లు, 1 సిక్స్), దినేశ్ చండీమల్ (29; 5 ఫోర్లు) రాణించారు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా (64 బంతుల్లో 39 బ్యాటింగ్? 7 ఫోర్లు), కుశాల్ మెండిస్ (56 బంతుల్లో 39 బ్యాటింగ్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడుతున్నారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కేశవ్ మహరాజ్, ప్యాటర్సన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. సోమవారం ఆటకు చివరి రోజు కాగా... చేతిలో ఐదు వికెట్లు ఉన్న శ్రీలంక విజయానికి 143 పరుగుల దూరంలో ఉంది.



రాష్ట్ర స్క్వాష్ టోర్నీ విజేత తనూజ్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'గేమ్ పాయింట్' తెలంగాణ రాష్ట్ర స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో అండర్-13 బాలుర సింగిల్స్ విభాగంలో పులి తనూజ్ రెడ్డి చాంపియన్‌గా అవతరించాడు. ఫైనల్లో కొండపర్తి ప్రభాస్‌పై తనూజ్ రెడ్డి విజయం సాధించాడు. తెలంగాణ స్క్వాష్ రాకెట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన ఈ టోర్నీలో ఎనిమిది విభాగాల్లో కలిపి మొత్తం 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణ బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు బాబూరావు ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్క్వాష్ రాకెట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీశైలం, గేమ్ పాయింట్ తెలంగాణ స్క్వాష్ చాంపియన్‌షిప్ చైర్మన్ ఆదిత్య రెడ్డి పాల్గొన్నారు.

అండర్-13 బాలుర సింగిల్స్: 1. పులి తనూజ్ రెడ్డి, 2. కొండపర్తి ప్రభాస్. **అండర్-15 బాలికల సింగిల్స్:** 1. అర్నా ద్వివేది, 2. గంజి ధృతి. **అండర్-17 బాలుర సింగిల్స్:** 1. రాజ్‌వీర్ గ్రోవర్, 2. రోహన్ అరిగల. **పురుషుల సింగిల్స్:** 1. కరణ్ వశిష్ట్, 2. రణ్‌వీర్ గ్రోవర్. **మహిళల సింగిల్స్:** 1. ఆర్యా ద్వివేది, 2. శాన్వీ శ్రీ. **పురుషుల సింగిల్స్ (ప్లస్ 35):** 1. సర్వేశ్ చౌహాన్, 2. సోలీ కొలా. **పురుషుల సింగిల్స్ (ప్లస్ 40):** 1. ప్రియతోశ్ దూబే, 2. మయాంక్ మల్హాన్. **పురుషుల సింగిల్స్ (ప్లస్ 45:** 1. దానం భరత్, 2. బత్తుల రామ్.



రిషిత 'హ్యాట్రిక్'

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జూనియర్ సర్క్యూట్‌లో తెలంగాణ అమ్మాయి బసిరెడ్డి రిషితా రెడ్డి తన జోరు కొనసాగిస్తోంది. మూడు వారాల వ్యవధిలో ఆమె తన ఖాతాలో మూడో టైటిల్‌ను జమ చేసుకొని 'హ్యాట్రిక్' సాధించింది. పుణేలో జరిగిన ఐటీఎఫ్ జే100 టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన రిషితా రెడ్డి చాంపియన్‌గా నిలిచింది. అండర్-18 సింగిల్స్ ఫైనల్లో రెండో సీడ్ రిషిత 6-2, 7-5తో టాప్ సీడ్ అయోా వతనాబె (జపాన్)పై విజయం సాధించింది. గత రెండు వారాల్లో రిషిత గువాహటిలో జరిగిన జే60 ఐటీఎఫ్ టోర్నీలో, న్యూఢిల్లీలో జరిగిన జే100 టోర్నీలోనూ సింగిల్స్ విభాగంలో టైటిల్స్ గెలుచుకుంది.




ఇది 1928 నాటి ఆస్టిన్ 7 రకం చిన్న కారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఆదివారం జరిగిన వింటేజ్ కార్ల ర్యాలీలో ప్రత్యక్షమైన ఈ కారును అందరూ ఆసక్తిగా తిలకించారు.



సిరియాలో బషర్ అల్ అస్సద్ పాలన ముగియడంతో రాజధాని డమాస్కస్‌లోని అధ్యక్ష భవనం హాల్‌లో ఆదివారం ఏకే-47 తపాకీ చేబూని ఫొటోలకు పోజిస్తున్న ఓ వ్యక్తి

కోటా జోరుకు కళ్లెం

- ఈ ఏడాది సగానికి తగ్గిన విద్యార్థులు
- విద్యార్థుల బలవన్మరణాలతో ప్రతికూల ప్రభావం
- తోడైన ప్రభుత్వ మార్గదర్శకాలు
- కోచింగ్, హాస్టళ్ల పరిశ్రమలపై తీవ్ర ప్రభావం
- తాత్కాలికమేనంటున్న కోచింగ్ సెంటర్లు, హాస్టళ్ల నిర్వాహకులు



కోటా: రాజస్తాన్‌లోని కోటా. పోటీ పరీక్షలకు శిక్షణ కేంద్రంగా దేశంలోనే అగ్రగామిగా పేరున్న నగరం. విద్యార్థులతో కళకళలాడుతూ కోచింగ్ సెంటర్లు, హాస్టళ్ల నిర్వాహకులకు కాసులు కురిపించే ఈ నగరం కళ తప్పుతోందా? అంటే, అవుననే సమాధానం వస్తోంది. ఇటీవలి కాలంలో కోటాకు శిక్షణ కోసం వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. ఎందుకు? శిక్షణ కోసం వచ్చే విద్యార్థులు వివిధ కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు, కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాలు, కోచింగ్ సెంటర్లను వేరే ప్రాంతాలకు విస్తరించడం వంటి కారణాలూ దీని వెనుక ఉన్నాయని చెబుతున్నారు. కోచింగ్ సెంటర్లు 16 ఏళ్ల లోపు వారిని చేర్చుకోరాదనే నిబంధన వల్ల ఈ ప్రభావం మరీ ఎక్కువగా ఉందని పేర్కొంటున్నారు.

వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ కోసం కోటాకు ఏటా 2 లక్షల నుంచి 2.5 లక్షల వరకు విద్యార్థులు వస్తుంటారు. వీరి వల్ల నగరంలోని అన్ని రంగాలకు కలిపి ఏటా సుమారు రూ.7 వేల కోట్ల వరకు ఆదాయం ఉండేది. అయితే, ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య 85 వేల నుంచి లక్ష వరకు తగ్గిపోయింది. ఫలితంగా ఆదాయం కూడా ఈసారి ఒక్కసారిగా సగానికి సగం, రూ.3,500 కోట్లకు పడిపోయింది.

నిర్వాహకుల ధీమా

అత్యుత్తమ శిక్షణకు కోటాకు ఉన్న విశ్వసనీయత ఏమాత్రం చెక్కుచెదరలేదని, విద్యార్థులకు ఇతర నగరాల్లో లేనటువంటి అనుకూల వాతావరణం ఇక్కడ ఉన్నందున ఈ తగ్గుదల ప్రభావం స్వల్పకాలమే ఉంటుందని, మున్ముందు తిరిగి పుంజుకుంటామని కోచింగ్ సెంటర్లు, హాస్టళ్ల నిర్వాహకులు ధీమాతో ఉన్నారు. వచ్చే ఏడాదిలో తమ నష్టాలు పూడ్చుకుంటామని రాజస్తాన్ ఇండస్ట్రీస్ యునైటెడ్ కౌన్సిల్ జోనల్ చైర్ పర్సన్ గోవిందరామ్ మిట్టల్ బల్లగుద్ది చెబుతున్నారు. బెంగళూరులో మాదిరిగా కోటాలోనూ ఐటీ హబ్‌లు ఏర్పాటు చేసేందుకు గల ప్రత్యామ్నాయ అవకాశాలనూ పారిశ్రామికవేత్తలు పరిశీలిస్తున్నారని వివరించారు. ప్రైవేట్ కంపెనీల్లో మేనేజ్‌మెంట్ పోస్టుల్లో సగానికి సగం, నాన్ మేనేజ్‌మెంట్ పోస్టుల్లో 75 శాతం స్థానికులకే ఇవ్వాలంటూ కర్ణాటక ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే రాజస్తాన్ పారిశ్రామికవేత్తలు..ఐటీ హబ్‌లను కోటాకు మార్చాలంటూ బెంగళూరులోని ఐటీ కంపెనీల అధిప తులను కోరడం, కొందరు ఓకే అనడం జరిగిపోయాయని ఆయన అన్నారు. లోక్‌సభ స్పీకర్, కోటా-బుండి ఎంపీ ఓం బిర్లా ఆదేశాల మేరకు కోటాలో ఐటీ హబ్‌ల ఏర్పాటుకు అవసరమైన భూముల కేటాయింపుల ప్రక్రియ మొదలైందని ఆయన వివరించారు.

ఇబ్బందుల్లో హాస్టళ్ల యజమానులు

కోచింగ్ సెంటర్లు, హాస్టళ్ల పరిశ్రమ సంక్షోభంలో పడిన మాట నిజమేనని కోటా హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ మిట్టల్ ఒప్పుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కోటాకు వచ్చే విద్యార్థుల సంఖ్య ఒక్కసారిగా 30 శాతం నుంచి 40 శాతం మేర పడిపోవడం కొన్ని దశాబ్దాల్లో ఇదే మొదటిసారని ఆయన చెప్పారు. బ్యాంకుల్లో రుణాలు తెచ్చి పలు హాస్టళ్లను ఏర్పాటు చేసుకున్న కొందరు యజమానులు వాయిదాలు చెల్లించలేక ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు. నగరంలో ఉన్న 4,500 హోటళ్లలో చాలా చోట్ల విద్యార్థుల ఆక్యుపెన్సీ రేటు 40-50 శాతానికి మధ్య పడిపోయిందన్నారు. 'నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో(ఎన్సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం ఆత్మహత్యల పరంగా చూసే దేశంలోని 50 నగరాల తర్వాత దిగువన కోటా ఉంది. అయితే, ఆత్మహత్య ఘటనల ప్రచారంతో ప్రతికూల ప్రభావం పడింది'అని నవీన్ అన్నారు. హాస్టళ్లలో రూం అద్దెలు నెలకు రూ.15వేలుండగా ఇప్పుడది రూ.9 వేలకు తగ్గిందని, చాలా హాస్టళ్లు ఖాళీగానే ఉన్నాయని స్థానిక కోరల్‌పార్క్ ప్రాంతంలోని హాస్టల్ యజమాని ఒకరన్నారు.

వాయిదాలకు సైతం కష్టంగా ఉంది

'గతేడాది వరకు రోజులో 60 మంది వరకు విద్యార్థులు నా ఆటోలో ప్రయాణించే వారు. మంచి ఆదాయం ఉండటంతో కుటుంబ పోషణ ఏమాత్రం ఇబ్బందిలేకుండా ఉండేది. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 20కి తగ్గింది. ఆదాయం కూడా పడిపోయింది. రుణంపై కొనుగోలు చేసిన వాహనానికి కిస్తీలు చెల్లించేందుకు సైతం ఇబ్బందవుతోంది'అని స్థానిక ఆటో డ్రైవర్ ఒకరు చెప్పారు.

హర్షణీయం.. దేశానికి గర్వకారణం..!

జార్జి కూవకడ్‌కు కార్డినల్ హోదాపై ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన క్రైస్తవ మతాధికారి జార్జి జాకబ్ కూవకడ్(51)కు రోమన్ కేథలిక్ చర్చి కార్డినల్‌గా పోప్ ఫ్రాన్సిస్ పదోన్నతి కల్పించడం హర్షణీయమని, దేశానికి గర్వకారణమని ప్రధాని మోదీ ఆదివారం పేర్కొన్నారు. కార్డినల్ కూవకడ్ మరెన్నో ఉన్నత శిఖరాలని అధిరోహించాలని మోదీ ఆదివారం 'ఎక్స్'లో ఆకాంక్షించారు. శనివారం వాటికన్‌లోని ప్రఖ్యాత సెయింట్ పీటర్స్ బసిలికాలో జరిగిన కార్యక్రమంలో పోప్ ఫ్రాన్సిస్ కూవకడ్‌కు కార్డినల్ హోదా కల్పిస్తున్నట్లు ప్రకటించారు. కూవకడ్‌తోపాటు వివిధ దేశాలకు చెందిన 21 మందికి కొత్తగా కార్డినల్ హోదా ప్రకటించారు. సర్టిఫికెట్‌తోపాటు కార్డినల్ క్యాప్, రింగ్‌ను పోప్ ప్రదానం చేశారు. దీంతో, వాటికన్‌లో భారత కార్డినల్స్ సంఖ్య ఆరుకు చేరినట్లయింది. కేథలిక్ చర్చిలో పోప్ తర్వాత స్థానంలో కార్డినల్స్ ఉంటారు.

ఢిల్లీలో క్షీణించిన శాంతి భద్రతలు.. కేంద్రానిదే బాధ్యత: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో శాంతిభద్ర తల పరిస్థితి ఆందోళనకరంగా తయారైందని ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఇందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మే కారణమన్నారు. ఢిల్లీ పోలీసు విభాగంపై అజమాయిషీని ఆప్ ప్రభుత్వానికిస్తే పరిస్థితి వేరుగా ఉండేదని చెప్పారు. స్కూళ్లు, ఆస్ప త్రులు, విద్యుత్ విభాగాలను చక్కదిద్దినట్లే శాంతిభద్రతలను గాడిలో పెట్టి ఉండేవాడి నని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ప్రచారంలో భాగంగా ఆదివారం కరోల్ బాగ్‌లో చేపట్టిన పాదయాత్రలో మాట్లా డారు.

మా పథకాలకు 99% మంది మద్దతు: ఆప్

తమ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న విద్యుత్, విద్య, వైద్యం వంటి సంక్షేమ పథకాలకు ఢిల్లీలోని 99 శాతం మంది మద్దతునిస్తున్నారని ఆప్ తెలిపింది. వచ్చే ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీలో ఉచిత పథకాలపై పార్టీ వలంటీర్లు చేపట్టిన ప్రచార కార్యక్రమాల్లో ఈ విషయం వెల్లడైందంది.

14 యుద్ధ నౌకలు.. 7 విమానాలు..!

చైనా తమ సమీపంలోకి పంపించిందన్న తైవాన్

తైపీ: తైవాన్ తమదేనంటున్న చైనా ఆ దేశంపై మరింతగా ఒత్తిడిని పెంచుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. చైనా శని, ఆదివారాల్లో తమ దేశానికి అత్యంత సమీపంలోకి 14 యుద్ధ నౌకలు, ఏడు యుద్ధ విమానాలతోపాటు 4 బెలూన్లను పంపించిందని తైవాన్ ఆరోపించింది. యుద్ధ విమానాలు తైవాన్, చైనాల మధ్య ఉన్న అనధికార విభజన రేఖను సైతం దాటి లోపలికి వచ్చాయని తెలిపింది. ఇటువంటి చర్యలు ఏమాత్రం గౌరవప్రదం కావని స్పష్టం చేసింది. తైవాన్ అధ్యక్షుడు లాయ్ చింగ్-టె ఇటీవల అమెరికాలోని హవాయితోపాటు పసిఫిక్ ద్వీప దేశాలైనా మార్షల్ ఐల్యాండ్స్, టువాలు, పలౌల్లో పర్యటించారు. దీనిపై డ్రాగన్ దేశం గుర్రుగా ఉంది.

'నాసా' చందమామ యాత్ర మరింత ఆలస్యం

2027 జూలై తర్వాతే ఆర్టిమిస్-1 ప్రయోగం

వాషింగ్టన్: అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఆర్టిమిస్-1 ప్రయోగం మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. చంద్రుడిపైకి వ్యోమగాములకు పంపించడానికి ఈ ప్రయోగాన్ని నాసా ప్రారంభించింది. వాస్తవానికి 2026లో ఒరియాన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో వ్యోమగాములు చందమామ ఉపరితలంపైకి చేరుకోవాల్సి ఉంది. కానీ, అనివార్య కారణాలతో ప్రయోగం కొంత జాప్యమయ్యే అవకాశం ఉందని నాసా వర్గాలు చెబుతున్నాయి. 2027 జూలై కంటే ముందు ప్రయోగం చేపట్టే అవకాశం లేదని వెల్లడించాయి. అంటే ఏడాదికిపైగా ఆలస్యంగా ఆర్టిమిస్-1 పట్టాలెక్కే పరిస్థితి కనిపిస్తోంది. అలాగే వ్యోమగాములు చంద్రుడిని చుట్టివచ్చే పాథ్‌ఫైండర్ మిషన్ సైతం ఆలస్యం కానుంది. 2025 సెప్టెంబర్‌లో జరగాల్సిన ఈ ప్రయోగం 2026 ఏప్రిల్ కంటే ముందు జరిగే అవకాశం లేదని అంటున్నారు.

దక్షిణ కొరియాలో 'మార్షల్ లా' అంశం
మాజీ రక్షణ మంత్రి అరెస్ట్



సియోల్: దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు దేశంలో ఎమర్జెన్సీ విధించాలంటూ సిఫారసు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ రక్షణ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఆయన్ను ప్రశ్నించిన అధికారులు గుర్తు తెలియని ప్రాంతానికి తరలించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అయితే, కిమ్ తనకుతానుగానే సియోల్ విచారణాధికారి కార్యాలయానికి వెళ్లారని, ఆయన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు అరెస్ట్ చేశారని మీడియా అంటోంది. కిమ్ కార్యాలయంతోపాటు నివాసంలోనూ తనిఖీలు చేపట్టారని చెబుతున్నారు. ఎమర్జెన్సీ విధింపునకు దారి తీసిన పరిస్థితులపై కిమ్‌పై విచారణ కోసం 62 మంది సభ్యుల దర్యాప్తు బృందం ఏర్పాటైందని సీనియర్ ప్రాసిక్యూటర్ పార్క్ సె-హ్యూన్ వెల్లడించారు. గత వారం స్వల్ప కాల ఎమర్జెన్సీని, ఆ తర్వాత పార్లమెంట్ తొలగించడం తెలిసిందే. ఈ పరిణామానికి సంబంధించిన తొలి అరెస్ట్ ఇది. అధ్యక్షుడు యూన్‌పై శనివారం ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం అధికార పక్ష సభ్యుల గైర్హాజరుతో వీగిపోయింది. అయినప్పటికీ, త్వరలోనే మరోసారి అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని ప్రతిపక్షాలు అంటున్నాయి. మొత్తం పరిణామాలకు కేంద్ర బిందువుగా భావిస్తున్న కిమ్ మంత్రి పదవికి గురువారమే రాజీనామా చేశారు.

అంబులెన్సు భరించే స్తోమత లేక..
ట్యాక్సీ టాప్‌పై సోదరుడి మృతదేహాన్ని కట్టి..

- 200 కిలోమీటర్ల దూరంలోని సొంతూరుకు తీసుకెళ్లిన మహిళ
- ఉత్తరాఖండ్ రాష్ట్రం పితోర్‌గఢ్‌లో ఘటన



హల్ద్వానీ: ప్రైవేట్ అంబులెన్సు నిర్వాహకులు అడిగినంత ఇచ్చుకోలేని ఓ పేద మహిళ..తన సోదరుడి మృతదేహాన్ని ట్యాక్సీ పైన కట్టుకుని 200 కిలోమీటర్ల దూరంలోని తమ గ్రామానికి తీసుకెళ్లాల్సి వచ్చింది. ఉత్తరాఖండ్ రాష్ట్రం పితోర్‌గఢ్ జిల్లాలో ఈ ఘోరం చోటుచేసుకుంది. విషయం తెలిసిన సీఎం పుష్కర్‌సింగ్ ధామి ఘటనపై దర్యాప్తు జరిపి, బాధ్యులపై చర్య తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పితోర్‌గఢ్ జిల్లా బెరినాగ్ గ్రామంలో శివానీ(22) అనే మహిళ సోదరుడు అభిషేక్(20) కలిసి ఉంటోంది. శుక్రవారం అభిషేక్ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యాడు. రైలు పట్టాల పక్కన అపస్మారక స్థితిలో పడిపోయిన అతడిని శివానీ చికిత్స కోసం హల్ద్వానీలోని సుశీలా తివారీ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తీసుకొచ్చింది. అప్పటికే అతడు చనిపోయినట్లు పరీక్షించిన వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు శనివారం అభిషేక్ మృతదేహాన్ని శివానీకి అప్పగించారు. సొంతూరుకు తీసుకెళ్లేందుకు ఆస్పత్రి పక్కనే ఉన్న అంబులెన్సుల నిర్వాహకులను ప్రాధేయపడగా రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చవుతుందని వారు చెప్పారు. అంత డబ్బులేకపోవడంతో ఆమె తమ గ్రామానికి చెందిన ట్యాక్సీ డ్రైవర్‌ను బతిమాలుకుంది. అతడు సరే అనడంతో సోదరుడి మృతదేహాన్ని ట్యాక్సీపైన ఉంచి, తాడుతో కట్టేసింది. అక్కడి నుంచి సుమారు 200 కిలోమీటర్ల దూరంలోని తమ గ్రామానికి చేరుకుంది. ఈ విషయం సీఎం పుష్కర్ సింగ్ ధామి దృష్టికి రావడంతో ఆయన దర్యాప్తునకు ఆదేశించారు. అయితే, ఆస్పత్రి ఆవరణ వెలుపల జరిగిన ఘటనతో తమకు తెలియలేదని సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ జోషి చెప్పారు. తెలిసినట్లయితే సాయం చేసి ఉండేవారమన్నారు.

కానిస్టేబుల్‌ను కాల్చి చంపి.. తనూ కాల్చుకున్న హెడ్ కానిస్టేబుల్

జమ్మూ: కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం చివరికి రెండు ప్రాణాలను బలికొంది. జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్‌లో ఆదివారం ఉదయం ఘటన చోటుచేసుకుంది. ఓ హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు సాపోర్ నుంచి రియాసి జిల్లా తల్వారాలోని పోలీస్ ట్రెయినింగ్ సెంటర్‌కు పోలీస్ వ్యానులో వెళ్తున్నారు. వీరిలో వాహనం నడిపే కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ మధ్య ఓ విషయమై తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ తీవ్ర ఆగ్రహంతో తన వద్ద ఉన్న ఏకే-47 అస్సాల్ట్ రైఫిల్‌తో కానిస్టేబుల్‌పై కాల్పులు జరిపాడు. అదే తుపాకీతో తనను తాను కాల్చుకున్నాడు. ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. ఉధంపూర్ జిల్లా రెహెంబాల్‌లోని కాళీమాత ఆలయం సమీపంలో ఘటన చోటుచేసుకుంది. వాహనంలో ఉన్న మరో కానిస్టేబుల్ సురక్షితంగా బయటపడ్డారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీనియర్ ఎస్పీ అమోద్ అశోక్ చెప్పారు.

కేజ్రీవాల్ తలవంచడు..!

- వైరల్ అవుతున్న కేజ్రీవాల్ పుష్ప-2 అవతార్
- 'కేజ్రీవాల్ కుంభకోణాల సాలీడు గూడు'అంటూ బీజేపీ పోస్టర్
- హీట్ పెంచుతున్న కమలం వర్సెస్ చీపురు పోస్టర్ వార్



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పుష్ప-2 సినిమా మేనియా నడుస్తోంది. అదిప్పుడు రాజకీయాలనూ ప్రభావితం చేస్తోంది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా ఇప్పుడు 'తగ్గేదే లే'అంటున్నారు. తాజాగా ఆయన పుష్ప అవతారమెత్తారు. 'కేజ్రీవాల్.. ఝుకేగా నహీ'అనే ట్యాగ్ లైన్‌తో ఆప్ రిలీజ్ చేసిన పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'కేజ్రీవాల్ కుంభకోణాల సాలీడు గూడు'అంటూ బీజేపీ రిలీజ్ చేసిన పోస్టర్‌కు ఆప్ ఇచ్చిన కౌంటర్ 'టాక్ ఆఫ్ ద టౌన్'గా మారింది. ఎన్నికలకు రెండు నెలల ముందే బీజేపీ వర్సెస్ ఆప్ పోస్టర్ వార్ చలి కాలంలోనూ పొలిటికల్ హీట్ పెంచుతోంది.

బీజేపీ పోస్టర్‌లో ఏముంది?

ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం మోసాలకు పాల్పడుతోందంటూ బీజేపీ శనివారం పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్‌ను హైలైట్ చేసింది. మద్యం విధానంలో కుంభకోణం ఆరోపణలు, మొహల్లా క్లినిక్, హవాలా, భద్రత, రేషన్, పానిక్ బటన్, శీష్ మహల్, మందులు, ఢిల్లీ జల్ బోర్డ్, క్లాస్‌రూమ్, సీసీటీవీ స్కామ్‌లను ప్రస్తావిస్తూ. 'కేజ్రీవాల్ కుంభకోణాల సాలెగూడు'అని ట్యాగ్‌లైన్ పెట్టింది.

కేజ్రీవాల్ పుష్ప అవతార్

బీజేపీ పోస్టర్‌కు ఆదివారం ఆమ్ ఆద్మీ పార్టీ.. పాన్ ఇండియా సినిమా పుష్ప రేంజ్‌లో కౌంటర్ ఇచ్చింది. పుష్ప పోస్టర్‌లో హీరో అల్లు అర్జున్ ముఖాన్ని తీసేసి ఆ స్థానంలో కేజ్రీవాల్ ఫేస్ పెట్టారు. ఒక చేతిలో ఆ పార్టీ గుర్తు చీపురు పట్టుకున్నట్లు చూపించారు. 'కేజ్రీవాల్ ఝుకేగా నహీ (కేజ్రీవాల్ తలవంచడు)' టైటిల్ పెట్టారు. పోస్టర్ కింద 'కేజ్రీవాల్ ఫోర్త్ టర్మ్ కమింగ్ సూన్'అంటూ ట్యాగ్‌లైన్ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఆప్ ఇదే పోస్టర్‌ను ప్రచార అస్త్రంగా మార్చుకునే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్నాయి. 1998 నుంచి బీజేపీ ఢిల్లీలో అధికారానికి దూరంగా ఉంది. 2015 నుంచి ఇక్కడ ఆప్ సొంతంగా అధికారంలో ఉంది.

మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా నర్వేకర్

- ఏకగ్రీవం కానున్న బీజేపీ నేత ఎన్నిక
- డిప్యూటీ స్పీకర్ పదవిని తమకివ్వాలంటున్న ఎంవీఏ

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా బీజేపీకి చెందిన రాహుల్ నర్వేకర్ ఏకగ్రీవ ఎన్నికకు రంగం సిద్ధమైంది. నర్వేకర్ ఆదివారం సీఎం ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు షిండే, అజిత్‌లతో కలిసి అసెంబ్లీ కార్యదర్శి జితేంద్ర భోలెకు నామినేషన్ పత్రాలను అందజేశారు. స్పీకర్ పదవికి పోటీ పడరాదన్న ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) నిర్ణయంతో నర్వేకర్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. సోమవారం అసెంబ్లీలో బలపరీక్ష అనంతరం స్పీకర్ ఎన్నికపై నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశముంది. అనంతరం గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శాసనసభ, శాసనమండలి సభ్యులతో జరిగే ఉమ్మడి సమావేశంలో ప్రసంగిస్తారు. అదేవిధంగా, ప్రొటోకాల్ ప్రకారం డిప్యూటీ స్పీకర్ పదవిని తమ కూటమిలోని పార్టీలకు వదిలేయాలని ఎంవీఏ నేతలు ఆదివారం సీఎం ఫడ్నవీస్‌ను కలిసి కోరారు. ప్రతిపక్ష నేత పదవిని కూడా ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇటీవలి ఎన్నికల్లో అసెంబ్లీలోని 288 సీట్లకుగాను మహాయుతి 230 స్థానాలను గెల్చుకోవడం తెల్సిందే. ముంబైలోని కొలాబా నుంచి మళ్లీ ఎన్నికైన రాహుల్ నర్వేకర్ గత 14వ అసెంబ్లీ స్పీకర్‌గా రెండున్నరేళ్లపాటు కొనసాగారు. ఆ సమయంలో శివసేన, ఎన్సీపీ చీలిక వర్గాల వ్యవహారంపై మహాయుతి ప్రభుత్వానికి అనుకూలంగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

శివసేన(షిండే)కు 11 మంత్రి పదవులు!

మహారాష్ట్రలో మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమైంది. అతిత్వరలో విస్తరణ ఉంటుందని మహాయుతి ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కూటమిలో కీలక భగస్వామి అయిన శివసేన(షిండే)కు 11 మంత్రి పదవులు దక్కనున్నట్లు సమాచారం. ఆ పార్టీ నేత ఏక్‌నాథ్ షిండే ఇప్పటికే ఉపముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. కీలక శాఖలు ఇవ్వాలని ఆయన పట్టుబడుతున్నారు. శివసేన(షిండే) నుంచి మంత్రులుగా ప్రమాణం చేసేవారిలో ఆరుగురు మాజీ మంత్రులే ఉంటారని సమాచారం. కొత్తగా ఐదుగురికి మంత్రి యోగం పట్టబోతున్నట్లు తెలుస్తోంది. కనీసం 13 మంత్రి పదవులు కావాలని శివసేన(షిండే) డిమాండ్ చేయగా 11 పదవులకు బీజేపీ అంగీకరించినట్లు సమాచారం.

రోడ్లపై అడ్డంకులు తొలగించండి

- పంజాబ్ రైతులతో ఆందోళన విరమింపజేయాలి
- సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ: పంజాబ్‌లో రైతులు రహదారులపైనే ఆందోళనలు, నిరసనల కార్యక్రమాలు చేపడుతున్నారని, దీనివల్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పంజాబ్‌కు చెందిన ఓ సామాజిక కార్యకర్త ఆక్షేపించారు. రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రజలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో తాజాగా పిటిషన్ దాఖలు చేశారు. పంజాబ్, హరియాణా సరిహద్దులోని శంభు వద్ద గత ఏడాదిన్నర కాలంగా రోడ్లను రైతులు దిగ్బంధిస్తున్నారని పేర్కొన్నారు. రహదారులపై ఎటువంటి ఆంక్షలు లేకుండా ప్రయాణించడం ప్రజల ప్రాథమిక హక్కు అని పిటిషన్‌లో ఉద్ఘాటించారు. రైతులతో ఆందోళన విరమింపజేస్తే రోడ్లపై అడ్డంకులు చాలా వరకు తొలగిపోతాయని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం త్వరలో విచారణ చేపట్టనుంది.

ఆదేశిక సూత్రాలు ఎక్కడ ఆవిర్భవించాయి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

ఆదేశిక సూత్రాలు

భారత రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను 4వ భాగంలో చేర్చారు. వీటి గురించి ఆర్టికల్ 36 నుంచి 51 వరకు తెలియజేస్తాయి. ఇవి మధ్యయుగ కాలంలో రోమ్‌లో ఆవిర్భవించాయి. రోమ్ నుంచి స్పెయిన్ అక్కడి నుంచి ఐర్లాండ్, అక్కడి నుంచి ఇండియా, ఇండియా నుంచి చైనా గ్రహించాయి. ఆదేశిక సూత్రాలను అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలను రాజ్యాంగం ఆదేశిస్తుంది. వీటి అమలు ద్వారా సంక్షేమ రాజ్యాన్ని నిర్మించడం తోపాటు ఆర్థిక న్యాయాన్ని, ఆర్థిక సమానత్వాన్ని సాధించొచ్చు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ పార్టీ సిద్ధాంతాలకు అతీతంగా వీటిని అమలు చేయాలి.

ఆదేశిక సూత్రాలను రూపొందించడంలో 1928 నెహ్రూ కమిటీ రిపోర్టు, 1931 కరాచీ కాంగ్రెస్ తీర్మానం, 1945 సప్రూ కమిటీ రిపోర్టు బాగా తోడ్పడ్డాయి. అధికంగా కరాచీ తీర్మానం తోడ్పడింది. కానీ సప్రూ కమిటీ నివేదిక ఆధారంగా వీటిని చేర్చారు.

ఆదేశిక సూత్రాలు - లక్షణాలు

- ఆదేశిక సూత్రాలకు న్యాయస్థానాల ద్వారా రక్షణ లేదు. వీటిని అమలు చేయాలని ప్రభుత్వాలను న్యాయస్థానాలు ఆజ్ఞాపించే అవకాశం లేదు.
- ఇవి శ్రేయోరాజ్య స్థాపనకు తోడ్పడతాయి.
- వీటి అమలు ద్వారా ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించొచ్చు.
- ఇవి ప్రభుత్వ విధులు, బాధ్యతలను తెలుపుతాయి. కాబట్టి సకారాత్మకమైనవి.
- రాజ్య కార్యకలాపాల పరిధిని విస్తృతం చేస్తాయి.

రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలకు సంబంధించిన ప్రకరణలు

ప్రకరణ-36- రాజ్య నిర్వచనం: రాజ్యం అంటే కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు, వివిధ సంస్థలు.

ప్రకరణ-37-ఆదేశిక సూత్రాల అమలు: వీటిని అమలు చేసే బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అమలులో వైఫల్యం చెందితే న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం లేదు. కానీ అమలు కోసం న్యాయస్థానాలు సూచనలు, సలహాలు మాత్రం ఇవ్వగలవు. వీటి అమలు.. ఆర్థిక వనరుల లభ్యత, ప్రభుత్వ అంకితభావం, సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది.



ఆదేశిక సూత్రాల స్వభావాన్ని బట్టి ప్రముఖ పరిపాలనా శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎంపీ శర్మ వాటిని మూడు రకాలుగా విభజించారు. అవి..

1) సామ్యవాద 2) గాంధేయ 3) ఉదారవాద సూత్రాలు

సామ్యవాద సూత్రాలు

ఆర్టికల్ 38, 39, 41, 42, 43(ఎ).

ఆర్టికల్ 38: భారతదేశం ఒక సంక్షేమ రాజ్యం కాబట్టి ప్రజలందరికీ ఆర్థిక, సాంఘిక, రాజకీయ న్యాయాన్ని అందించాలి.

ఆర్టికల్ 39: ప్రభుత్వ విధాన రూపకల్పనలో ఆదేశిక సూత్రాలను దృష్టిలో ఉంచుకోవాలి.

39(ఎ): స్త్రీ, పురుషులకు సమాన జీవనోపాధి కల్పించాలి.

39(బి): భౌతిక సంపదను అందరికీ సమానంగా పంపిణీ చేయాలి.

39(సి): సంపదను వికేంద్రీకరించాలి.

39(డి): స్త్రీ, పురుషులకు సమాన జీత భత్యాలను చెల్లించాలి.

39(ఇ): శ్రామికులకు పనికి తగిన వేతనాన్ని చెల్లించాలి. శ్రమ దోపిడీకి గురి చేయకూడదు.

39(ఎఫ్): బాలబాలికల అభివృద్ధికి కృషి చేయాలి.

స్త్రీ, పురుషుల సమానత్వానికి 1955లో హిందూ వివాహ చట్టం, 1961లో వరకట్న నిషేధ చట్టం రూపొందించారు. సంపద వికేంద్రీకరణకు 1950లో ప్రణాళికా సంఘం ఏర్పాటు, 1951లో భూసంస్కరణల చట్టం, 1969లో బ్యాంకుల జాతీయీకరణ మొదలైనవి చేపట్టారు.

ఆర్టికల్ 41: పనిహక్కు.. అందరికీ ఉపాధి కల్పించాలి. ఉపాధి లేనివారికి నిరుద్యోగ భృతి చెల్లించాలి. యువతను దుర్వ్యసనాలకు లోను కాకుండా నియంత్రించాలి. వృద్ధులకు, అనాథలకు చేయూతనివ్వాలి. వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

ఇందులో భాగంగా 2006లో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు.

ఆర్టికల్ 42: కార్మికులు పనిచేసేందుకు మానవీయ పరిస్థితులు, స్త్రీలకు ప్రసూతి సౌకర్యాలు కల్పించాలి.

1961లో మాతృత్వ ప్రయోజన చట్టం, 2007లో పితృత్వ ప్రయోజన చట్టాన్ని రూపొందించారు.

ఆర్టికల్ 43(ఎ): పారిశ్రామిక యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించాలి.

గాంధేయ సూత్రాలు

ఆర్టికల్ 40, 43, 43(బి), 46, 47, 48, 48(ఎ), 49.

ఆర్టికల్ 40: రామరాజ్య ఏర్పాటుకు, గ్రామ స్వరాజ్యానికి స్థానిక ప్రభుత్వాలను స్థాపించాలి. 1952 అక్టోబర్ 2న సమాజ అభివృద్ధి పథకాన్ని, 1953 అక్టోబర్ 2న జాతీయ విస్తరణ పథకాన్ని ప్రవేశపెట్టారు. బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫార్సు మేరకు స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేశారు. ఎల్ఎం సింఘ్వీ కమిటీ సిఫార్సు మేరకు 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా వీటికి రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించారు.

ఆర్టికల్ 43: గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలను అభివృద్ధి చేయాలి. వీటి అభివృద్ధికి అఖిల భారత హ్యాండ్లూమ్ బోర్డు, అఖిల భారత ఖాదీ కమిషన్, అఖిల భారత సిల్క్ బోర్డ్ మొదలైనవి ఏర్పాటయ్యాయి.

ఆర్టికల్ 43(బి): సహకార సంఘాలకు రాజ్యాంగ హోదా కల్పించాలి. దీన్ని 2011లో 97వ సవరణ ద్వారా చేర్చి, 12 జనవరి 2012న అమల్లోకి తీసుకొచ్చారు.

ఆర్టికల్ 46: బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. వీరికోసం ఉద్యోగాలు, చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలి.

ఆర్టికల్ 47: ప్రజారోగ్యాన్ని సంరక్షించాలి. మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలను నిషేధించాలి. మద్య నిషేధాన్ని గుజరాత్, బిహార్‌లు అమలు చేస్తున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో 1954లో, ఆంధ్రప్రదేశ్‌లో 1994లో మద్యపాన నిషేధం విధించారు.

ఆర్టికల్ 48: వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడాలి. పశుపోషణను పెంపొందించాలి. గోవధను నిషేధించాలి. ఉత్పాదకతను పెంచేందుకు రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి. ఎరువులు, విత్తనాలను పంపిణీ చేయాలి.

ఆర్టికల్ 48(ఎ): వన్యమృగాలను, అడవులను సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షించాలి. 1974లో కాలుష్య నియంత్రణ చట్టాన్ని, 1980లో అడవుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు.

ఆర్టికల్ 49: భారతదేశ ఉన్నత సంస్కృతిని, వారసత్వాన్ని, చారిత్రక ప్రదేశాలను సంరక్షించాలి. చారిత్రక ప్రదేశాల పరిరక్షణ చట్టాన్ని 1958లో రూపొందించారు. కేంద్ర సంగీత, సాహిత్య అకాడమీలను ఏర్పాటు చేశారు.

ఉదారవాద సూత్రాలు

ఆర్టికల్ 44, 45, 50, 51

ఆర్టికల్ 44: భారతదేశంలో హిందూ, ముస్లిం, క్రైస్తవులందరికీ ఒకే రకమైన.. అంటే ఉమ్మడి పౌరస్మృతిని ఏర్పాటు చేయాలి. దీన్ని అమలు చేయాలని 1952, 1985, 1995, 1997, 2004లో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆజ్ఞాపించింది. కానీ అమలు జరగలేదు. దీన్ని అమలు పరుస్తున్న ఏకైక రాష్ట్రం గోవా. సరళాముద్గల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1995) కేసులో ఉమ్మడి పౌరస్మృతి అమలుకు తీసుకున్న చర్యలకు సంబంధించి 'అఫిడవిట్' దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆజ్ఞాపించింది.

ఆర్టికల్ 45: ఆరేళ్లలోపు బాలబాలికలకు పౌష్టికాహారం అందించాలి. శిశు, పూర్వ శిశు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. దీన్ని 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

ఆర్టికల్ 50: న్యాయశాఖ ప్రతిపత్తిని కాపాడేందుకు కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయశాఖను వేరు చేయాలి.

ఆర్టికల్ 51: అంతర్జాతీయ శాంతి సంరక్షణకు కృషి చేయాలి.

51(ఎ): అంతర్జాతీయ శాంతి భద్రతలను పెంపొందించాలి.

51(బి): ఇతర దేశాలతో గౌరవప్రదమైన సత్సంబంధాలను కొనసాగించాలి.

51(సి): అంతర్జాతీయ న్యాయసూత్రాలను, అంతర్జాతీయ ఒప్పందాలను గౌరవించేలా చూడాలి.

51(డి): అంతర్జాతీయ వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయాలి.

ప్రపంచ శాంతి స్థాపనకు 30-10-1945న ఐక్య రాజ్య సమితిలో 52వ సభ్యదేశంగా, 1949లో కామన్వెల్త్‌లో భారత్ చేరింది. ప్రచ్ఛన్న యుద్ధం నుంచి ప్రపంచాన్ని విముక్తం చేసేందుకు 1961 అలీన విధానంలో కీలకపాత్ర పోషించింది. దక్షిణ మధ్య ఆసియా దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించేందుకు 1985లో సార్క్ ఏర్పాటుకు చొరవ చూపింది.

ఆదేశిక సూత్రాల్లో చేర్చిన అదనపు అంశాలు

1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 39(ఎ), 43(ఎ), 48(ఎ) చేర్చారు.

2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉచిత నిర్బంధ విద్యను తొలగించి, ఆర్టికల్ 45లో ఆరేళ్లలోపు బాల బాలికలకు పౌష్టికాహారాన్ని అందించాలి అనే అంశాన్ని చేర్చారు. 2011లో 97వ రాజ్యాంగ సవరణ ద్వారా 43(బి) చేర్చి సహకార సంఘాలకు రాజ్యాంగ హోదా కల్పించారు.

రాజ్యాంగంలోని ఇతర భాగాల్లో గల ఆదేశిక సూత్రాలు

4వ భాగంలోనే కాకుండా ఇతర భాగాల్లో మరికొన్ని ఆదేశిక సూత్రాలను చేర్చారు. 16వ భాగంలోని ఆర్టికల్ 335 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించాలి. 17వ భాగంలోని ఆర్టికల్ 350(ఎ) ప్రకారం మాతృభాషలోనే ప్రాథమిక విద్యను అందించాలి. 17వ భాగంలోని ఆర్టికల్ 351 ప్రకారం హిందీని జాతీయభాషగా గుర్తించి అమలు చేయాలి.

ఆదేశిక సూత్రాలపై ప్రముఖుల వ్యాఖ్యలు

- ఆదేశిక సూత్రాలు సక్రమంగా అమలైతే భారతదేశం అనతి కాలంలోనే భూతలస్వర్గం అవుతుంది. - ఎంసీ చాగ్లా
- ఆదేశిక సూత్రాలు ఒక బ్యాంకు తనకు అనుగుణంగా చెల్లించే చెక్కు వంటివి. - ప్రొ. కేటీ షా
- అజ్ఞానం, దౌర్జన్యాల నుంచి భారత ప్రజల్ని విముక్తి చేయడమే ఆదేశిక సూత్రాల అంతిమ లక్ష్యం. - పీబీ గజేంద్ర గడ్కర్
- ఆదేశిక సూత్రాలు వైవిధ్య సెంటిమెంట్లతో కూడి న ఒక చెత్తబుట్ట వంటివి. - టీటీ కృష్ణమాచారి
- ఆదేశిక సూత్రాలు ఆర్థిక ప్రజాస్వామ్యానికి మంచి మార్గం. - డాక్టర్ బీఆర్ అంబేద్కర్
- నిర్దేశిక నియమాలు ప్రతి కొత్త సంవత్సరం ప్రారంభం రోజున చేసుకునే తీర్మానాల వంటివి. అవి జనవరి 2వ తేదీనే భంగమవుతాయి. - నసీరుద్దీన్ షా
- నిర్దేశిక నియమాలు నైతిక ప్రవచనాలు. అధికారులు, ప్రభుత్వం వీటిని గౌరవించాలి. - బీఎన్ రావు

వేగంగా ఎగిరే పక్షి ఏది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. బొద్దింకలో శ్వాసక్రియ దేని ద్వారా జరుగుతుంది?
ఎ) ట్రాఖియా బి) గిల్స్
సి) లంగ్స్ డి) చర్మం
2. మానవుడిలో మాస్టర్‌గ్లాండ్ అని దేన్ని పిలుస్తారు?
ఎ) థైరాయిడ్ బి) పిట్యూటరీ
సి) పాంక్రియాస్ డి) గోనాడ్స్
3. విటమిన్లు అన్నీ కిందివాటిలో ఏ రకానికి చెందుతాయి?
ఎ) కార్బొహైడ్రేట్లు బి) కొవ్వులు
సి) ప్రొటీన్లు డి) పాలిశాఖరైడ్లు
4. పాలలో ఉండే చక్కెర ఏది?
ఎ) సుక్రోస్ బి) ఫ్రక్టోస్
సి) లాక్టోస్ డి) గాలక్టోస్
5. కొవ్వులను కొవ్వు ఆమ్లాలుగా మార్చే ఎంజైమ్ ఏది?
ఎ) లైపేజ్ బి) అమిలాప్సిన్
సి) ఇరిప్సిన్ డి) ట్రిప్సిన్
6. 'మార్సూపియం' ఏ జీవిలో కనిపిస్తుంది?
ఎ) చింపాంజి బి) జింక
సి) ప్లాటిపస్ డి) కంగారు
7. వానపాములు ఏ వర్గానికి చెందుతాయి?
ఎ) ఆర్థ్రోపొడా బి) అనిలిడా
సి) మొలస్కా డి) ఎఖైనోడెర్మెట
8. గర్భావధి కాలం వేటిలో ఉంటుంది?
ఎ) చేపలు బి) క్షీరదాలు
సి) ఉభయచరాలు డి) పక్షులు
9. పుట్టగొడుగులు అనేవి ....?
ఎ) శైవలాలు బి) శిలీంధ్రాలు
సి) లైకేన్లు డి) ఏదీకాదు
10. కిణ్వన ప్రక్రియలో తోడ్పడే శిలీంధ్రం ఏది?
ఎ) రైజోపస్ బి) అల్బుగో
సి) శాఖరోమైసిస్ డి) పక్సీనియా
11. మొక్కల్లో ఫలం దేని నుంచి ఏర్పడుతుంది?
ఎ) అండం బి) అండాశయం
సి) కీలాగ్రం డి) కేసరావళి
12. పుష్పాల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
ఎ) జెరంటాలజీ బి) స్పెర్మటాలజీ
సి) ఆంథాలజీ డి) సిరాలజీ
13. వేరుశనగలో ఫలం ఏ రకానికి చెందింది?
ఎ) కార్సురూలస్ బి) జియోకార్ప్
సి) హెస్పరీడియం డి) పోమ్
14. అతిపెద్ద పుష్పం ఏది?
ఎ) లిమ్నా బి) లొడేసియా
సి) రఫ్లీషియా డి) అరటి
15. సారవంతమైన నేలలేవి?
ఎ) ఇసుక నేలలు బి) నల్లటి నేలలు
సి) లోమ్ నేలలు డి) ఎర్ర నేలలు
16. కిందివాటిలో మొక్కలకు ఆవశ్యకమైన మూలకం కానిది ఏది?
ఎ) Na బి) N సి) Mg డి) K
17. కిందివాటిలో వేటిని ఇసుక మొక్కలు అంటారు?
ఎ) క్రయోఫైట్స్ బి) సమోఫైట్స్
సి) జీరోఫైట్స్ డి) హాలోఫైట్స్
18. గొర్రెల్లో స్క్రేపీ వ్యాధి వేటి వల్ల కలుగుతుంది?
ఎ) వైరాయిడ్స్ బి) ప్రియాన్స్
సి) వైరస్ డి) బ్యాక్టీరియా
19. వేరుశనగలో టిక్కా తెగులును కలిగించేది?
ఎ) కొలిటోట్రైఖం బి) పైరిక్యులేరియా
సి) సెర్కోస్పొరా డి) పైటాప్‌థొరా
20. పత్ర సంబంధ మొగ్గలు వేటిలో కనిపిస్తాయి?
ఎ) బ్రయోఫిల్లం బి) కరివేపాకు
సి) పిస్టియా డి) గన్నేరు
21. 'మలకబలం' ఏ జీవిలో కనిపిస్తుంది?
ఎ) ఏనుగు బి) కంగారు
సి) కుందేలు డి) ఎలుగుబంటి
22. మానవుడి దంతాల్లో అగ్రచర్వణకాలు ఎన్ని ఉంటాయి?
ఎ) 4 బి) 8 సి) 12 డి) 2
23. హెర్మాఫ్రొడైట్ (ఉభయలైంగికత) దేనిలో కనిపిస్తుంది?
ఎ) ఏనుగు బి) బల్లి
సి) వానపాము డి) పిల్లి
24. తులసి మొక్కలో లభ్యమయ్యే ఔషధం?
ఎ) కాంపర్ బి) క్వినైన్
సి) ఓపియం డి) ఏదీకాదు
25. 'కటిల్ ఫిష్' ఏ వర్గానికి చెందుతుంది?
ఎ) పొరిఫెరా బి) సీలెంటరేటా
సి) మొలస్కా డి) ఎఖైనోడెర్మెట
26. చేపల్లో శ్వాసక్రియ వేటి ద్వారా జరుగుతుంది?
ఎ) ఊపిరితిత్తులు బి) మొప్పలు
సి) చర్మం డి) పైవన్నీ
27. సాలీడులో ఎన్ని జతల కాళ్లు ఉంటాయి?
ఎ) 4 బి) 3 సి) 8 డి) 16
28. ఊపిరితిత్తుల చుట్టూ ఉండే పొర ఏది?
ఎ) పెరికార్డియం బి) ప్లూరా
సి) మెనింజస్ డి) ఏదీకాదు
29. 'పైరిత్రిన్'ను దేని నుంచి తయారుచేస్తారు?
ఎ) అలోవెరా బి) క్రిపాంథియం
సి) అకేసియా డి) కేసియా
30. తెలంగాణ రాష్ట్ర పుష్పం ఏది?
ఎ) తామర బి) జమ్మి
సి) తంగేడు డి) వేప
31. వానపాముల పెంపకాన్ని ఏమంటారు?
ఎ) సెరికల్చర్ బి) పిసికల్చర్
సి) వర్మికల్చర్ డి) ఆక్వాకల్చర్
32. వేగంగా ఎగిరే పక్షి ఏది?
ఎ) కివీ బి) పెంగ్విన్
సి) హమ్మింగ్ బర్డ్ డి) స్విఫ్ట్
33. స్కేబిస్ అనే చర్మ వ్యాధి ముఖ్య లక్షణం?
ఎ) చర్మం పొరలు, పొరలుగా రాలిపోవడం
బి) చర్మంలో బొరియలు పడటం
సి) చర్మంలోని స్వేదగ్రంథులు పనిచేయక పోవడం
డి) చర్మం నల్లబారడం
34. గజ్జి దేని వల్ల వస్తుంది?
ఎ) కీటకాలు బి) ఫంగస్
సి) బ్యాక్టీరియా డి) వైరస్
35. గజికర్ణ (తామర వ్యాధి)కి కారణం ఏది?
ఎ) బ్యాక్టీరియా బి) వైరస్
సి) ఫంగస్ డి) ప్రోటోజోవా
36. చర్మంపై ఉండే వెంట్రుకలు నల్లగా ఉండటానికి కారణమేమిటి?
ఎ) అధిక కెరాటిన్ బి) అధిక మెలనిన్
సి) తక్కువ మెలనిన్ డి) ఏదీకాదు
37. వెంట్రుకల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
ఎ) ట్రైకాలజీ బి) డెర్మటాలజీ
సి) హెమటాలజీ డి) జెరంటాలజీ
38. 'ఎఖిని' ఏ రకమైన వ్యాధి?
ఎ) కాలేయ సంబంధ వ్యాధి
బి) గుండె సంబంధ వ్యాధి
సి) చర్మ సంబంధ వ్యాధి
డి) ఎముకల సంబంధ వ్యాధి
39. వ్యాధులు-వాటి వల్ల ప్రభావితమయ్యే అవయవాలను సరైన క్రమంలో జతపరచండి.

1. డెర్మటైటిస్	A. కండరాలు
2. టెటానస్	B. కన్ను
3. పయోరియా	C. పన్ను
4. గ్లుకోమా	D. చెవి
	E. చర్మం

ఎ) 1-E, 2-B, 3-C, 4-A
బి) 1-E, 2-A, 3-C, 4-B
సి) 1-E, 2-A, 3-B, 4-C
డి) 1-E, 2-A, 3-C, 4-B
40. 'కీళ్లవాతం'ను నయం చేయడానికి దేని విషాన్ని ఔషధంగా తయారుచేస్తారు?
ఎ) పాము బి) తేలు
సి) తేనెటీగలు డి) కందిరీగ
41. ఏ మొక్క నుంచి లభించే ఔషధాన్ని గుండె జబ్బులను నయం చేయడానికి ఉపయోగిస్తారు?
ఎ) యూకలిప్టస్ బి) సింకోనా
సి) వేప డి) డిజిటాలిస్
42. లావెండర్ మొక్కకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
ఎ) సుగంధ ద్రవ్యాన్ని ఇస్తుంది
బి) సువాసన ఇస్తుంది
సి) ఔషధ మొక్క
డి) వంటనూనెను ఇచ్చే మొక్క
43. ప్రపంచంలో అతి పురాతనమైన నార ఏది?
ఎ) జనుము బి) గోగునార
సి) కిత్తనార డి) పత్తి
44. ఏ జాతి గొర్రెల నుంచి శ్రేష్ఠమైన తోలు లభిస్తుంది?
ఎ) కోరిడేల్ బి) మెరినో
సి) కారాకుల్
డి) దక్కను జాతి గొర్రెలు
45. ఇండియన్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఎక్కడ ఉంది?
ఎ) హైదరాబాద్ బి) కోల్‌కతా
సి) కటక్ డి) పుణే
46. కిందివాటిలో కూరగాయలను నిల్వ ఉంచే పద్ధతి ఏది?
ఎ) వడబోయడం బి) నిర్జలీకరణం
సి) పొగబెట్టడం డి) ఘనీభవించడం
47. బోల్‌గార్డ్ పత్తి విత్తనాల తయారీలో ఉపయోగించే బ్యాక్టీరియా ఏది?
ఎ) బాసిల్లస్ బి) కోకస్
సి) స్పైరిల్లం డి) విబ్రియో
48. అమీబియాసిస్ వ్యాధిని కలిగించేది ఏది?
ఎ) అస్కారిస్ లుంబ్రికాయిడిస్
బి) పెంటిమా పోస్టుమా
సి) ఎంటమీబా హిస్టొలిటికా
డి) ఉచరేరియా బ్రాంకాఫ్టి
49. O.R.S. ద్రావణంలో చక్కెర, ఉప్పు మిశ్రమాల నిష్పత్తి?
ఎ) 3 : 1 బి) 1 : 3
సి) 1 : 1 డి) 3 : 3
50. టెటానస్ (ధనుర్వాతం) ఏ రకమైన వ్యాధి?
ఎ) ఎయిర్ బోర్న్ బి) వాటర్ బోర్న్
సి) సాయిల్ బోర్న్ డి) ఏదీకాదు
51. డిఫ్తీరియా వ్యాధి పొదిగే కాలం ఎంత?
ఎ) 2-10 రోజులు బి) 2-5 రోజులు
సి) 5-15 రోజులు డి) 11-20 రోజులు
52. కిందివాటిలో వైరస్ వ్యాధి కానిది ఏది?
ఎ) పోలియో బి) జలుబు
సి) కోరింతదగ్గు డి) హైడ్రోఫోబియా

సమాధానాలు

1) ఎ	2) బి	3) సి	4) సి	5) ఎ
6) డి	7) బి	8) బి	9) బి	10) సి
11) బి	12) సి	13) బి	14) సి	15) సి
16) ఎ	17) బి	18) బి	19) సి	20) ఎ
21) సి	22) బి	23) సి	24) ఎ	25) సి
26) బి	27) ఎ	28) బి	29) బి	30) సి
31) సి	32) డి	33) బి	34) ఎ	35) సి
36) బి	37) ఎ	38) సి	39) డి	40) సి
41) డి	42) బి	43) డి	44) సి	45) సి
46) బి	47) ఎ	48) సి	49) ఎ	50) సి
51) బి	52) సి			

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఎంపీఏ, మంగళూరులో 33 పోస్టులు

మంగళూరులోని న్యూ మంగళూరు పోర్ట్ అథారిటీ(ఎన్ఎంపీఏ) డైరెక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 33.
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ డైరెక్టర్-01, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్-01, అకౌంట్స్ ఆఫీసర్(గ్రేడ్-1)-01, లా ఆఫీసర్(గ్రేడ్-1)-01, డిప్యూటీ డైరెక్టర్(రీసెర్చ్)-01, సీనియర్ మెడికల్ ఆఫీసర్-01, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్-01, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్-02, అసిస్టెంట్ ఇంజనీర్-14, ఇంజనీర్(గ్రేడ్-1)-04, జూనియర్ డైరెక్టర్-01, మాస్టర్(గ్రేడ్-2)-01, పీఏ టూ హెచ్ఓడీ-01, డిప్యూటీ డైరెక్టర్(ఈడీపీ)-01, అసిస్టెంట్ సెక్రటరీ(గ్రేడ్-1)-01, స్పోర్ట్స్ ఆఫీసర్-01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ(లా), బీఈ/బీటెక్(సివిల్/మెకానికల్/ఎలక్ట్రికల్), ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» వేతనం: నెలకు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజనీర్, స్పోర్ట్స్ ఆఫీసర్ పోస్టులకు రూ.40,000 నుంచి రూ.1,40,000, మిగతా పోస్టులకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షలు, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 27.12.2024
» వెబ్‌సైట్: https://newmangaloreport.gov.in

ఎన్ఐఓటీ, చెన్నైలో 152 పోస్టులు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషియన్ టెక్నాలజీ(ఎన్ఐఓటీ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 152.
» పోస్టుల వివరాలు: ప్రాజెక్ట్ సైంటిస్ట్-1/2/3-42, ప్రాజెక్ట్ సైంటిఫిక్ అసిస్టెంట్-45, ప్రాజెక్ట్ టెక్నీషియన్-19, ప్రాజెక్ట్ ఫీల్డ్ అసిస్టెంట్-10, ప్రాజెక్ట్ జూనియర్ అసిస్టెంట్-12, రీసెర్చ్ అసోసియేట్(ఆర్ఏ)-06, సీనియర్ రీసెర్చ్ ఫెలో-13, జూనియర్ రీసెర్చ్ ఫెలో-05.
» అర్హత: పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 50 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.12.2024
» వెబ్‌సైట్: https://www.niot.res.in

ఐఐఎఫ్‌సీఎల్, న్యూఢిల్లీలో 40 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్(ఐఐఎఫ్‌సీఎల్) అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 40.
» విభాగాలు: ప్రాజెక్ట్ ఫైనాన్సింగ్, స్ట్రెస్‌డ్ అసెట్ మేనేజ్‌మెంట్, అకౌంట్స్, రిసోర్స్ అండ్ ట్రెజరీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, లీగల్, సెక్రటేరియల్ ఫంక్షన్స్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, ఇన్విరాన్‌మెంట్ అండ్ సోషల్ సేఫ్ గార్డ్, రిస్క్ మేనేజ్‌మెంట్, ప్రొక్యూర్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్, రీసెర్చ్ అండ్ అనాలసిస్, రాజభాష, కంప్లైన్స్ అండ్ ఆడిట్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్, జనరల్.
» అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, బీఏ, సీఏ, సీఎంఏ/ఐసీడబ్ల్యూఏ, సీఎఫ్ఏ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» బేసిక్ పే స్కేల్: నెలకు రూ.44,500.
» వయసు: 30.11.2024 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.12.2024
» ఆన్‌లైన్ పరీక్షతేది: జనవరి 2025.
» ఇంటర్వ్యూ తేది: జనవరి/ఫిబ్రవరి.
» వెబ్‌సైట్: https://www.iifcl.in

ఎస్‌టీపీఐలో వివిధ ఉద్యోగాలు

సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా(ఎస్‌టీపీఐ).. టెక్నికల్ స్టాఫ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 06.
» పోస్టుల వివరాలు: మెంబర్ టెక్నికల్ స్టాఫ్ ఈ-5, (సైంటిస్ట్ ఎఫ్)-03, మెంబర్ టెక్నికల్ స్టాఫ్ ఈ-4, (సైంటిస్ట్ 2)-01, మెంబర్ టెక్నికల్ స్టాఫ్ ఈ-2(సైంటిస్ట్ సి)-01, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏ-7)-01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: అభ్యర్థుల స్క్రీనింగ్, షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తులకు చివరితేది: నోటిఫికేషన్ వెలువడిన 45 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
» నోటిఫికేషన్ వెలువడిన తేది: 16.11.2024.
» వెబ్‌సైట్: https://stpi.in/en

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

దేశంలోని ప్రధాన పారిశ్రామిక మండలాలు

పారిశ్రామిక కార్యకలాపాలు భారీగా కేంద్రీకృతమైన భౌగోళిక ప్రాంతాన్నే పారిశ్రామిక మండలంగా వ్యవహరిస్తారు. పారిశ్రామిక ముడి సరకులు, మార్కెట్లు, అవస్థాపనా సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో పారిశ్రామిక కార్యకలాపాలు కొన్ని ప్రాంతాల్లో కేంద్రీకృతమై పారిశ్రామిక మండలాలు ఏర్పడతాయి. ఐరోపా, ఉత్తర అమెరికా, జపాన్‌లలో పారిశ్రామిక మండలాలు విశేషంగా అభివృద్ధి చెందాయి. ఉదాహరణకు యూఎస్‌ఏలోని ఈశాన్య ప్రాంతం, మహా సరస్సుల ప్రాంతాల్లో విస్తారమైన పారిశ్రామిక మండలాలు రూపొందాయి. అదేవిధంగా అభివృద్ధి చెందుతోన్న చైనా, ఇండియా, బ్రెజిల్ దేశాల్లోనూ ఇటీవల పారిశ్రామిక మండలాల అభివృద్ధిని గమనించవచ్చు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం

పారిశ్రామిక మండలాలు

ఒక భౌగోళిక ప్రాంతంలో ఉత్పత్తి అవుతున్న పారిశ్రామిక వస్తువుల విలువ, వసూలవుతున్న కార్పొరేట్ సుంకాల విలువ, వినియోగమవుతున్న విద్యుచ్ఛక్తి, పారిశ్రామిక ఉపాధి పరిమాణం మొదలైన సూచికల ఆధారంగా పారిశ్రామిక మండలాలను గుర్తించవచ్చు. భారతదేశంలో ఆరు ప్రధాన పారిశ్రామిక మండలాలు ఉన్నాయి. అవి:

- ముంబై-పుణె మండలం
- హుగ్లీ బేసిన్ మండలం
- చోటా నాగపూర్ మండలం
- ఢిల్లీ-ఆగ్రా-మధుర మండలం
- అహ్మదాబాద్-వడోదర మండలం
- చెన్నై-మధురై-కోయంబత్తూరు మండలం

ముంబై-పుణె మండలం

ముంబై-పుణె, హుగ్లీ బేసిన్ మండలాలు స్వాతంత్ర్యానికి ముందే అభివృద్ధి చెందాయి. మిగతా నాలుగు మండలాలు ప్రధానంగా స్వాతంత్ర్యానంతరం అభివృద్ధి చెందాయి. మహారాష్ట్రలో విస్తరించిన ముంబై-పుణె మండలం దేశంలోకెల్లా అతిపెద్ద, అత్యాధునిక పారిశ్రామిక మండలం. స్వాతంత్ర్యానికి పూర్వమే నూలు వస్త్ర పరిశ్రమ స్థాపనతో ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి అంకురార్పణ జరిగింది. ఇప్పటికీ నూలు వస్త్ర పరిశ్రమను ఈ మండలానికి వెన్నుముకగా పేర్కొనవచ్చు. స్వాతంత్ర్యం తర్వాత ఈ మండలంలో పారిశ్రామిక వైవిధ్యం సంభవించింది. ఆటోమొబైల్, చమురు శుద్ధి, కాగితం, ఇంజనీరింగ్, రసాయనాలు తదితర పరిశ్రమలు ఇక్కడ అభివృద్ధి చెందాయి. ముంబై మెట్రోపాలిటన్ నగరం ఈ పారిశ్రామిక మండల కేంద్రం. కళ్యాణ్, పుణె, కొల్హాపూర్, ఉలాస్‌పూర్, థానే, నాగాథానే, ట్రాంబే మొదలైన పారిశ్రామిక పట్టణాలు ఈ మండలం కిందకు వస్తాయి.

ముంబై రేవుపట్టణం, సహ్యాద్రి కొండల్లోని జలవిద్యుచ్ఛక్తి సామర్థ్యం, పటిష్ఠమైన రవాణా వ్యవస్థ, బ్యాంకింగ్ రంగం, స్థానిక పెట్టుబడి సామర్థ్యత, రాష్ట్ర ప్రభుత్వ ఉదారవాద విధానాలు ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి దోహదం చేస్తున్న అనుకూలాంశాలు. విపరీతంగా పెరుగుతున్న భూమి ధరలు, కాలుష్యం ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి.

హుగ్లీ బేసిన్ మండలం

స్వాతంత్ర్యానికి పూర్వమే కలకత్తా నగర పరిసర ప్రాంతాల్లో హుగ్లీ బేసిన్ పారిశ్రామిక మండలం అభివృద్ధి చెందడం ప్రారంభమైంది. కలకత్తా నదీరేవు పట్టణం కావడం ఈ పారిశ్రామిక మండల అభివృద్ధి ప్రాథమిక దశలో కీలక పాత్ర పోషించింది. మొదట జనపనార పరిశ్రమ అభివృద్ధితో ప్రారంభమై క్రమంగా ఆటోమొబైల్, భారీ యంత్ర పరికరాలు, వినిమయ వస్తువులు, రసాయనాలు, కాగితం, పెట్రో రసాయన పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. హౌరా, డమ్‌డమ్, సాల్ట్ లేక్ సిటీ, రిష్రా, ఆగర్‌పారా, సెరామ్‌పూర్, చందర్ నాగోర్, ఫోర్ట్‌గ్లాస్టర్, లీలూ, బడ్జ్ బడ్జ్ ఆసన్‌సోల్, హల్దియా మొదలైనవి ఈ బేసిన్‌లో ముఖ్య పారిశ్రామిక పట్టణాలు.

దేశంలో మొదటి జనపనార కర్మాగారాన్ని రిష్రాలో స్థాపించారు. సమీపంలోని ఝరియా, రాణిగంజ్ బొగ్గు క్షేత్రాలు, జల రవాణా వ్యవస్థలు, అధిక జనసాంద్రత, కలకత్తా రేవుపట్టణం ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి దోహదం చేశాయి. రేవులో పూడిక సమస్య, తీవ్రమైన పారిశ్రామిక వివాదాలు, అతివాద ట్రేడ్ యూనియన్ ధోరణులు ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి ఇటీవల ప్రధాన అడ్డంకులుగా మారాయి. దీంతో ఈ పారిశ్రామిక మండల అభివృద్ధి కుంటుపడింది.

చోటానాగపూర్ మండలం

ఇది దేశంలోని ఏకైక ఖనిజాధారిత పారిశ్రామిక మండలం. చోటానాగపూర్ పీఠభూమిలో పరిశ్రమలకు అవసరమైన ఖనిజ నిల్వలు విస్తారంగా ఉన్నాయి. దామోదర్ నదీలోయలోని బొగ్గు క్షేత్రాలు (బొకారో, గిర్డి, ఝరియా), హజారీ బాగ్-సింగ్‌భమ్ ప్రాంతాల్లోని ఇనుము, బాక్సైట్, రాగి మొదలైన లోహ ఖనిజాలు పరిశ్రమలను ఆకర్షించాయి. గనుల తవ్వకం ఈ మండలంలో పెద్ద పరిశ్రమగా రూపొందింది. భారత ప్రభుత్వం స్థాపించిన వివిధ భారీ ప్రభుత్వ రంగ కర్మాగారాలు ఈ పారిశ్రామిక మండల అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించాయి. రాంచీలోని హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ (HEC), సింద్రీలోని ఎరువుల కర్మాగారం (FCI), బరేనీలోని చమురు శుద్ధి కర్మాగారాలను ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఇవేకాకుండా సిమెంట్ కర్మాగారాలు (చేబాసా), ఇనుము- ఉక్కు కర్మాగారాలు (బొకారో, జంషెడ్‌పూర్) ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందాయి. పటిష్ఠమైన రోడ్డు, రైలు రవాణా వ్యవస్థలు లేకపోవడం ఈ మండలం అభివృద్ధికి ప్రధాన ఆటంకం. ఈ పారిశ్రామిక మండలంలోని భారీ ప్రభుత్వ రంగ సంస్థలకు అనుసంధానాలు లేకపోవడం వల్ల స్థానిక పారిశ్రామిక పట్టణాలు సమగ్ర ప్రాంతీయాభివృద్ధికి ఉపకరించడంలో విఫలమయ్యాయి. పారిశ్రామికాభివృద్ధి స్థానికులకు ఉపాధి చూపలేకపోయింది.

ఢిల్లీ-ఆగ్రా-మధుర మండలం

ఢిల్లీ మెట్రోపాలిటన్ నగరం కేంద్రంగా 1970వ దశకం నుంచి పారిశ్రామికాభివృద్ధి ప్రారంభమైందని చెప్పవచ్చు. ప్రధాన రైలు మార్గాలు, జాతీయ రహదారులు ఢిల్లీ నగరంలో అభిసరణం చెందడం, విస్తార స్థానిక మార్కెట్, సమీపంలోని సారవంతమైన వ్యవసాయ ప్రాంతం ఈ మండల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయి. వ్యవసాయాధార పరిశ్రమలైన చక్కెర, నూలు వస్త్రాల తయారీతో ప్రారంభమై క్రమంగా పారిశ్రామిక వైవిధ్యం ఏర్పడింది. ఢిల్లీ మెట్రోపాలిటన్ నగరంలో కాల్కా, షాదారా, నోయిడా, గుర్గావ్ ప్రాంతాల్లో ఆటోమొబైల్, ఇంజనీరింగ్, వినిమయ వస్తువుల తయారీ కేంద్రీకృతమైంది. ఆగ్రా, మధుర, ఘజియాబాద్, యమునానగర్ మొదలైనవి ఇతర పారిశ్రామిక కేంద్రాలు.

అహ్మదాబాద్-వడోదర మండలం

గుజరాత్‌లోని అహ్మదాబాద్-వడోదర మండలంలో పారిశ్రామికాభివృద్ధి 1970వ దశకం నుంచి వేగం పుంజుకుంది. అహ్మదాబాద్, వడోదర, సూరత్, రాజ్‌కోట్, జామ్‌నగర్, వల్సాస్, ఆనంద్, భరోచ్ ఈ ప్రాంతంలోని పారిశ్రామిక పట్టణాలు. నూలు వస్త్రాలు, చమురు శుద్ధి, పెట్రో రసాయనాలు, ఇంజనీరింగ్, సిమెంట్ మొదలైన పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయి. 'వడోదర'ను భారతదేశ పెట్రో రసాయనాల రాజధానిగా అభివర్ణిస్తారు. కంబత్ సింధు శాఖలో బయల్పడిన చమురు, సహజ వాయు నిక్షేపాలు, సారవంతమైన కథియావాడ్ వ్యవసాయ ప్రాంతం, రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఈ మండల అభివృద్ధికి దోహదం చేశాయి.

చెన్నై - మధురై - కోయంబత్తూరు మండలం

తమిళనాడులో పారిశ్రామికాభివృద్ధి మొదట చెన్నై పరిసర ప్రాంతాల్లో ప్రారంభమైంది. దీనికి చెన్నై రేవుపట్టణం ఉపయోగపడింది. మెట్టూరు, శివ సముద్రాల్లో జలవిద్యుచ్ఛక్తి, రవాణా సౌకర్యాల అభివృద్ధి, నైపుణ్యం ఉన్న శ్రామికుల లభ్యత ఈ మండలానికి అనుకూలించే అంశాలు. కోయంబత్తూరులో నూలు వస్త్ర పరిశ్రమలు కేంద్రీకృతమవడంతో ఈ నగరం 'దక్షిణ భారత మాంచెస్టర్'గా అవతరించింది. ఇక్కడ ఇంజనీరింగ్, సిమెంటు పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందాయి. మధురై, ఈరోడ్, తిరుప్పూర్, సేలం మొదలైనవి ఇతర పారిశ్రామిక పట్టణాలు

దేశంలో దుర్భిక్షానికి 3 కారణాలు!

దేశంలో ప్రధానంగా ముడు రకాల కారణాల వల్ల దుర్భిక్షం ఏర్పడే అవకాశాలున్నాయి.

అవి

1. శీతోష్ణస్థితి సంబంధ కారణాలు
2. హైడ్రోలాజికల్ కారణాలు
3. మానవ జోక్యం

శీతోష్ణస్థితి సంబంధ కారణాలు

శీతోష్ణస్థితి పరంగా దుర్భిక్షానికి కారణాలు..

ఎ) నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా దేశంలోకి ప్రవేశించడం

బి) నైరుతి రుతుపవనాలు నిర్దేశిత సమయం కంటే ముందే తిరోగమించడం

సి) నైరుతి రుతుపవనాల్లో అంతరాయం

సాధారణంగా జూన్ ఒకటో తేదీకల్లా నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకి జూలై 15కల్లా దేశమంతటా విస్తరిస్తాయి. కానీ కొన్నిసార్లు రుతుపవనాలు ఆలస్యంగా రావడం, నెమ్మదిగా విస్తరించడం వల్ల వర్షపాత పరిమాణం తగ్గి దుర్భిక్షం ఏర్పడుతుంది. కొన్ని సందర్భాల్లో నైరుతి రుతుపవనాలు నిర్దేశిత సమయానికే చేరినప్పటికీ, మధ్యలో అంతరాయం ఏర్పడుతుంది. రుతుపవనాలు క్రియాశీలకంగా ఉండని దశ 15-20 రోజుల కంటే ఎక్కువగా ఉంటే దుర్భిక్షానికి దారితీస్తుంది. ముఖ్యంగా జూలైలో రుతుపవనాలు క్రియాశీలకంగా లేకపోవడం లేదా అంతరాయం సంభవిస్తే ఖరీఫ్‌లో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఇది 'వ్యవసాయ దుర్భిక్షానికి' దారి తీస్తుంది.

సాధారణంగా అక్టోబర్ రెండో వారంకల్లా నైరుతి రుతుపవనాలు దేశం నుంచి తిరోగమిస్తాయి. కానీ కొన్ని సందర్భాల్లో ఇవి సెప్టెంబర్ మొదటి వారానికే తిరోగమిస్తాయి. దీంతో వర్షపాత పరిమాణం తగ్గి దుర్భిక్షం సంభవిస్తుంది. అనేక సంక్లిష్ట అంశాల వల్ల రుతుపవనాల్లో అనిశ్చితి ఏర్పడుతుంది. ఎల్‌నినో, ఈక్వినూ లాంటి దృగ్విషయాలతో పాటు అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో స్థానికంగా ఏర్పడే అధిక పీడన మండలాలు, హిమాలయాల్లోని మంచు, గ్లోబల్ వార్మింగ్ లాంటి అంశాలు నైరుతి రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తుండటంతో దుర్భిక్షం తలెత్తుతోంది.

హైడ్రోలాజికల్ కారణాలు

కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం సరిపడా ఉన్నప్పటికీ హైడ్రోలాజికల్ కారణాల వల్ల అనావృష్టి ఏర్పడవచ్చు. ఉదాహరణకు చోటా నాగపూర్ పీఠభూమికి చెందిన జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లో 100 సెం.మీ.కు పైగా వర్షం కురుస్తుంది. కానీ పురూలియా, పలమావు, బొలంగీర్, కాళహండి ప్రాంతాల్లో తరచుగా దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కురిసిన వర్షపు నీటిని ఉపరితలంపై నిల్వ ఉంచే భూస్వరూపాలు లేకపోవడంతో వర్షపు నీరు వృథాగా సముద్రంలోకి చేరుతోంది. నైసర్గిక స్వరూపం కఠిన శిలలతో కూడి ఉండటం వల్ల వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకిపోవడం చాలా తక్కువ. దీంతో భూగర్భ జలాలు కూడా ఎక్కువ లోతులో ఉండి అనావృష్టి ప్రభావం తీవ్రమవుతోంది.

మానవ జోక్యం

ఇటీవల దుర్భిక్ష ప్రాంతాల సంఖ్య మరింతగా పెరుగుతోంది. దుర్భిక్షం తరచుగా సంభవిస్తోంది. కరవు తీవ్రత కూడా అధికమవుతోంది. పర్యావరణంలో మానవ జోక్యమే దీనికి కారణమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అధునాతన పద్ధతిలో భారీ యంత్రాలను విరివిగా ఉపయోగించి వ్యవసాయ, నిర్మాణ కార్యకలాపాలను చేపడుతుండటం వల్ల ఉపరితల ప్రవాహ వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతోంది. దీంతో ఉపరితల జలవనరులు కుచించుకుపోయి అనావృష్టి సమస్య అధికమవుతోంది. అడవులను విచక్షణారహితంగా నరికివేయడంతో జలాలు ఇంకిపోయే రేటు తగ్గి భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. కరవు పీడిత ప్రాంతాల్లో అధిక నీటి వసతి అవసరమయ్యే పంటల సాగు వల్ల కూడా అనావృష్టి సంభవిస్తోంది. గత రెండు దశాబ్దాల నుంచి సంభవిస్తోన్న దుర్భిక్షం ప్రధానంగా మానవ ప్రేరేపితమైందని శాస్త్రవేత్తల అభిప్రాయం.

దేశంలో సుమారు 40 శాతం భౌగోళిక ప్రాంతాన్ని దుర్భిక్ష పీడిత ప్రాంతంగా వర్గీకరించారు. ఇరిగేషన్ కమిషన్ మొదటిసారిగా దుర్భిక్షాన్ని నిర్వచించి, దుర్భిక్ష పీడిత ప్రాంతాలను గుర్తించింది. 50 సెం.మీ. కంటే తక్కువ సగటు వార్షిక వర్షపాతాన్ని పొందుతూ వర్షపాత పరిమాణంలో 50 శాతం కంటే ఎక్కువ విచలనం ఉన్న ప్రాంతాలను కరవు పీడిత ప్రాంతాలుగా గుర్తించారు. అయితే ఇటీవల దుర్భిక్ష పీడిత ప్రాంతాలను గుర్తించడానికి పంటల దిగుబడుల్లో క్షీణత, సాగు భూమి విస్తీర్ణంలో క్షీణతలనూ ప్రాతిపదికగా తీసుకుంటున్నారు.

పశ్చిమ రాజస్థాన్, ఉత్తర గుజరాత్‌లోని కచ్ ప్రాంతాలను నిరంతర అనావృష్టి పీడిత ప్రాంతాలుగా పరిగణిస్తారు. ఈ ప్రాంతాల్లో సగటు వార్షిక వర్షపాతం 30 సెం.మీ. కంటే తక్కువగా ఉంటుంది. విచలనం 70 శాతం కంటే ఎక్కువగా ఉంటుంది. సహ్యాద్రి పర్వత వర్షచ్ఛాయా ప్రాంతం తీవ్ర దుర్భిక్ష పీడిత మండలం కిందకు వస్తుంది. మరాట్వాడా, విదర్భ(మహారాష్ట్ర), ఉత్తర కర్ణాటక, పశ్చిమ తెలంగాణ, రాయలసీమలు ఈ మండలం కిందకు వస్తాయి. జార్ఖండ్‌లోని పలమావు, పశ్చిమ బెంగాల్‌లోని పురూలియా, ఒడిశాలోని బొలంగీర్, కాళహండి, మధ్యప్రదేశ్‌లోని జబువా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన బుందేల్‌ఖండ్ ప్రాంతాలను ఓ మోస్తరు అనావృష్టి పీడిత ప్రాంతాలుగా గుర్తించారు.

Rising rental rates force the middle class..



BANK EXAMS

GENERAL ENGLISH

Model Questions

Directions (Q. No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. As more and much people invest their money in savings certificates or money-market funds (1)/ in order to earn higher interest, (2)/ they are abandoning traditional low-interest investment havens (3)/ such as passbook accounts and life insurance policies. (4)/ No error. (5)
2. Rising rental rates force the middle class to use (1)/ far more than the standard 25 percent of their incomes (2)/ for housing, leaving them with know equity (3)/ or tax write-offs to offset the expenditures. (4)/ No error. (5)
3. Astronomers studying(1)/ the newly discovered star (2)/ said that it provides clues about (3)/ our galaxy's origin. (4)/ No error. (5)
4. According to some economists, (1)/ the June decrease in unemployment suggest (2)/ that the gradual improvement (3)/ in the job market is continuing. (4)/ No error (5)
5. The qualities of a great leader are (1)/ coolness in the face of danger, (2)/ an excellent sense of strategy, (3)/ and a ability to plan in minute detail. (4)/ No error. (5)

Directions: (Q. No. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase given **bold** in the sentence to make it grammatically correct? Mark (5) "No correction required" as your answer, If there is no error.

6. Aging **is a property** of all animals that reach a fixed size at maturity.
   1) was a property
   2) had been a property
   3) was being a property
   4) is being a property
   5) No correction required
7. All-terrain vehicles have allowed vacationers to reach many previously inaccessible areas, but they **have been blamed** for causing hundreds of deaths.
   1) have also been blamed
   2) have been also blamed
   3) have been blamed also
   4) have been blaming
   5) No correction required
8. Although fruit can no longer grow once it is picked, it continues for some time to respire, **taking in oxygen and giving often** carbon dioxide.
   1) taking in oxygen and giving of
   2) taking in oxygen and giving always
   3) taking in oxygen and giving off
   4) taking out oxygen and giving off
   5) No correction required
9. Amateur astronomers with good telescopes **should been able** to see the comet within the next few weeks.
   1) should be able
   2) would be abled
   3) should being able
   4) should belonging
   5) No correction required
10. As the price of oil rises, the prices of bread and livestock feed **sure to increases**.
    1) are sure to increased
    2) are sure to increasing
    3) are sure to be increase
    4) are sure to increase
    5) No correction required

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The coordination of monetary policy can help ____ the orderly financing of _____imbalances.
    1) facilitate; existing
    2) felicitate; exciting
    3) fend; many
    4) fetch; permanent
    5) promote; promotional
12. __ the objects found in the excavated temple ___ small terra-cotta effigies left by supplicants.
    1) Below; wear
    2) Amongst; where
    3) Between; below
    4) Among; were
    5) Above; was
13. An array of tax incentives ___ to a boom in the construction of new buildings.
    1) have lead 2) has led
    3) have been lead
    4) has been leading 5) had leads
14. The yellow jacket can sting ____ without dying and ___ potent venom that can cause intense pain.
    1) repeatedly; carries
    2) repetition; carried
    3) repeat; carry
    4) repeats; carrier
    5) repeating; career
15. As envisioned by researchers, commercial farming ____ lobsters will enable fisheries to sell the shellfish year ____.
    1) from; threw 2) of; round
    3) off; through 4) with; around
    5) among; always

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. The purpose was twofold: political control and religious communication. Experts believe that there were three types of human sacrifice practiced by the Shang.

B. Finally, in internment sacrifices, young girls were sacrificed. Unlike the first two, they were buried in the standard burial position and their bodies were kept intact.

C. In pit sacrifices, young men were sacrificed. Their bodies were dismembered and they were buried without their personal possessions. In foundation sacrifices, children and babies were used.

D. The practice of human sacrifice was very common in ancient China, particularly during the Shang Dynasty-the first Chinese dynasty with written records.

E. Archaeological evidences show that these human sacrifices experienced violent deaths, and they too were buried without possessions.

F. In fact, archaeological evidence suggests that human sacrifice was practiced on a grand scale during the Shang dynasty.

16. What is the FIRST sentence after rearrangement?
    1) C 2) B 3) D 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) C
18. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIFTH sentence after rearrangement?
    1) B 2) C 3) D 4) E 5) F
20. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. No. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Dwarf planet Ceres continues to ___ (21) scientists as NASA's Dawn spacecraft gets closer to being captured into orbit around the object. The ___ (22) images from Dawn, taken nearly 29,000 miles (46,000 kilometers) from Ceres, reveal that a bright spot that stands out in previous images ____ (23) close to yet another bright area. As scientists receive better and _____ (24) views of the dwarf planet over the next 16 months, they hope to gain a deeper understanding of its origin and evolution _____ (25) studying its surface. The intriguing bright spots and other _____ (26) features of this captivating world will come into ____ (27) focus. Dawn visited the giant asteroid Vesta _____ (28) 2011 to 2012, delivering more than 30,000 images of the body along with many other measurements, and providing insights about its composition and geological history. Vesta has an average diameter of 326 miles (525 kilometers), while Ceres has an average diameter of 590 miles (950 kilometers). Vesta and Ceres are the ___ (29) most massive bodies in the asteroid belt, located _____ (30) Mars and Jupiter.

21. 1) puzzle 2) question 3) answer
    4) doubt 5) propose
22. 1) later 2) latest 3) recently
    4) frequently 5) presently
23. 1) lay 2) lain 3) lies
    4) lays 5) laid
24. 1) batter 2) good 3) best
    4) better 5) bought
25. 1) for 2) from 3) with
    4) among 5) by
26. 1) interesting 2) annoying
    3) disturbing 4) distributing
    5) presently
27. 1) sharer 2) sharper 3) shaver
    4) sharp 5) severe
28. 1) with 2) by 3) from
    4) for 5) above
29. 1) to 2) too 3) toe
    4) two 5) type
30. 1) beyond 2) besides
    3) in front of 4) in addition to
    5) between

Directions (Q. No. 31-35): Choose the word which is wrongly spelt from the five options given.

31. 1) misanthrope 2) misogynism
    3) misappropriation
    4) mismatch 5) mistake
32. 1) commission 2) apportion
    3) succesion 4) concession
    5) profession
33. 1) adjudicte 2) judicious
    3) combat 4) demur 5) elope
34. 1) flamboyant 2) genuine
    3) hinderance 4) innocuous
    5) germane
35. 1) kiosk 2) lacerate 3) mirege
    4) nocturnal 5) opulent

Directions (Q. No. 36-37): From the five options given in each question a set of words are either synonyms or antonyms, choose that set as your option and mark your answer.

36. 1) promiscuous; preposterous
    2) oblivious; unaware
    3) procrastinate; prominent
    4) ponder; pamper
    5) None of these
37. 1) drunk; sober
    2) freeze; full
    3) transparent; triumph
    4) wax; vague 5) wealth; defeat

Directions (Q. No. 38-40): Each sentence given below has four parts, certain words in each part are given in bold to identify the mistake, and the mistake can be in the spelling or in usage. Identify the mistake and mark your answer. Mark (5) as your answer, if there is 'No error'.

38. **Alright** the stunt man (1)/ **had broken** both his legs, (2)/ he refused to **abandon his** ambulatory manner, (3)/ even if it meant he **had to crawl**. (4)
39. Nuclear power plants **have been knowing** (1)/ to emit **noxious** gases into the atmosphere; (2)/ those living in close **proximity** (3)/ may exhibit deleterious side-effects in **later** life. (4)
40. She **was amazed** to see (1)/ the hectic **hustle and bustle** (2)/ of the day **fade into** the dormant (3)/ **quite of** the night. (4)

Answers

1) 1; 2) 3; 3) 3; 4) 2; 5) 4;
6) 5; 7) 1; 8) 3; 9) 1; 10) 4;
11) 1; 12) 4; 13) 2; 14) 1; 15) 2;
16) 3; 17) 1; 18) 2; 19) 4; 20) 5;
21) 1; 22) 2; 23) 3; 24) 4; 25) 5;
26) 1; 27) 2; 28) 3; 29) 4; 30) 5;
31) 2; 32) 3; 33) 1; 34) 3; 35) 3;
36) 2; 37) 1; 38) 1; 39) 1; 40) 4.